సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 41
శుక్రవారం 3-5-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



గట్టెక్కిన హైదరాబాద్

ఆఖరి బంతిదాకా ఇరు జట్లతో విజయం దోబూచులాడిన ఉత్కంఠపోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ పరుగు తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచి ఊపిరిపీల్చుకుంది. సొంతగడ్డపై నితీశ్ కుమార్ రెడ్డి సిక్సర్లతో చెలరేగగా... బౌలింగ్‌లో భువనేశ్వర్ కీలకపాత్ర పోషించాడు. - 19లో



400 మంది మహిళలపై అఘాయిత్యం

కర్ణాటకలో 400 మంది మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన మాస్ రేపిస్ట్ ప్రజ్వల్ అని జేడీ(ఎస్) ఎంపీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.
- వివరాలు 6లో



యువరాజు కోసం పాక్ ఆరాటం..

కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ)ను మన దేశ తదుపరి ప్రధానమంత్రిని చేసేందుకు పాకిస్తాన్ తహతహలాడుతోందని ప్రధాని మోదీ అన్నారు.
- వివరాలు 6లో

బీజేపీ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్



- మోదీ, అమిత్ షా విద్వేష ప్రసంగాలపై చర్యలు తీసుకునే ధైర్యం లేదు: కేటీఆర్
- వారు ప్రచారంలో దేవుడిని, మతాన్ని ప్రస్తావించడం నేరమే అయినా నోటీసులేవి?
- రేవంత్‌రెడ్డి ప్రసంగాలేమైనా ప్రవచనాలు, సుభాషితాలు, సూక్తులా?
- మేం 27 ఫిర్యాదులు చేసినా ఈసీ స్పందించలేదు
- రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ఎన్నికల కమిషన్ వైఖరి
- కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీలకు దడ పుట్టిందని వ్యాఖ్య
- ఓయూ సర్క్యులర్ ఫోర్జరీ చేసిన రేవంత్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపు

8లో



నేటి నుంచి మళ్లీ కేసీఆర్ ప్రచారం..

- రాత్రి 8 తర్వాత రామగుండంలో రోడ్ షో
- రేపు మంచిర్యాలలో, ఆదివారం జగిత్యాలలో..
- 10న సిద్దిపేట సభతో బస్సు యాత్ర ముగింపు
- 10 నుంచి 12 స్థానాల్లో గెలిచే చాన్స్ ఉందని వెల్లడి

8లో

హస్తిన 'దండు'యాత్ర

తెలంగాణకు జాతీయ పార్టీల అగ్రనేతల క్యూ



- 8, 10 తేదీల్లో ప్రధాని మోదీ బహిరంగ సభలు
- 5న అమిత్ షా, 6న జేపీ నడ్డా రాక
- 5, 9 తేదీల్లో రాహుల్ గాంధీ పర్యటన
- 6, 7 తేదీల్లో ప్రియాంకా గాంధీ నేతృత్వంలో సభలు
- దూకుడుగా ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక
- ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ వ్యూహాలు
- ఐదో తేదీ నుంచి దద్దరిల్లనున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో అన్ని పార్టీల ప్రచారం జోరందుకుంది. జాతీయ పార్టీల ఢిల్లీ నేతలు తెలంగాణ గల్లీలకు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ సీట్లు సాధించాలన్న లక్ష్యంతో దూకుడుగా ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్రంలో పర్యటించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ఆదివారం నుంచి విస్తృతంగా పర్యటించేలా ప్రణాళికలు ఖరారయ్యాయి. బీజేపీ తరఫున ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా.. కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు వరుసగా రాష్ట్రంలో పర్యటిస్తారని ఆయా పార్టీల నేతలు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కీలకమైన బీఆర్‌ఎస్ తరఫున ఆ పార్టీ అధినేత కేసీఆర్ కూడా ప్రచారాన్ని కొనసాగించనున్నారు.

ఆదివారం నుంచి మొదలు..

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయస్థాయిలో 400 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. అందుకు తగినట్టుగా తెలంగాణలో మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని భావిస్తోంది. బీజేపీ తరఫున ఆ పార్టీ జాతీయ నేతలు గత నెల రోజులుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఇతర అగ్రనేతలు పలుమార్లు రాష్ట్రానికి వచ్చారు. పోలింగ్‌కు ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు మరోమారు ముందుకు వస్తున్నారు. ప్రధాని మోదీ 8, 10 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించి.. బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఈ నెల 5న అమిత్‌షా, ఆరో తేదీన జేపీ నడ్డా వస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజ్‌గిరిలలో అమిత్ షా... పెద్దపల్లి, భువనగిరి, నల్లగొండల్లో నడ్డా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ నుంచీ అతిరథ మహారథులు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ప్రచార బరిలోకి దిగుతున్నారు. నిజానికి
మిగతా 8వ పేజీలో ▶

ఢిల్లీ సుల్తాన్లను ఎదిరిస్తాం

అక్రమ కేసులకు భయపడబోం.. బీజేపీ ఆటలిక సాగవు

ఆసిఫాబాద్ 'జన జాతర' సభ, సిద్దిపేట, కుత్బుల్లాపూర్ రోడ్ షోలలో సీఎం రేవంత్‌రెడ్డి

- దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు
- అందుకే 400 సీట్లు.. 15 రాష్ట్రాల్లో అధికారం కోసం యత్నాలు
- కులగణన చేయాలని అడిగితే.. జనగణననే పక్కనపెట్టారు
- బలహీన వర్గాలకు న్యాయం చేసినదీ, చేయబోయేదీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని వ్యాఖ్య
- పదేళ్లలో తెలంగాణకు బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు
- పంద్రాగస్టులోపు రుణమాఫీ.. రాజీనామా లేఖ రాసిపెట్టుకో హరీశ్!.. 45 ఏళ్లుగా సిద్దిపేటలో పాపాల భైరవుల్లా మామ, అల్లుళ్ల పాలన..



సిద్దిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, దయాకర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/ సాక్షి, సిద్దిపేట/ కుత్బుల్లాపూర్: దేశంలో రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలసి కుట్ర చేస్తున్నాయని టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మరోసారి ఆరోపించారు. తాను పది రోజులుగా ఈ విషయంపై మాట్లాడుతున్నందుకు ఢిల్లీ పోలీసులతో కేసు పెట్టించారని మండిపడ్డారు. ఇలాంటి అక్రమ కేసులకు తాను భయపడబోనన్నారు. ఢిల్లీ సుల్తానులను సైతం ఎదిరించే శక్తి తనకు ఉందని, ఇకపై బీజేపీ ఆటలు సాగబోవని వ్యాఖ్యానించారు. తెలంగాణను అభివృద్ధి చేయకుండా ప్రధాని మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'జనజాతర సభ', సిద్దిపేటలో రోడ్ షో, కార్నర్ మీటింగ్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో రోడ్ షోలలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెల్లదొరల కాలం 1881 నుంచీ ప్రతీ పదేళ్లకోసారి దేశ జనాభాను లెక్కించారు. 2021 వరకు కొనసాగింది. కానీ బీజేపీ జనాభా లెక్కలను పక్కనపెట్టింది. రాహుల్ గాంధీ బలహీన వర్గాలకు రిజర్వేషన్లు పెంచుతామని చెబుతోంటే.. రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోంది. అందుకే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా జనాభా గణన చేపట్టలేదు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని
మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్ 'సోషల్' టీంలో ఐదుగురు అరెస్ట్..

- అమిత్ షా ప్రసంగం డీప్ ఫేక్ కేసులో తొలుత అదుపులోకి..
- సాయంత్రానికి అరెస్టు చూపిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు

- వివరాలు 2లో

నేడు టీ కాంగ్రెస్ మేనిఫెస్టో

- లోక్‌సభ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కాంగ్రెస్
- గాంధీభవన్‌లో విడుదల చేయనున్న టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి
- ఐటీఐఆర్, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పాలమూరుకు జాతీయ హోదా సహా 23కుపైగా హామీలు

-13లో

ఏపీలో జగన్‌తోనే ముస్లిం రిజర్వేషన్లు

- చంద్రబాబు గెలిస్తే మోదీ చేతిలో కీలుబొమ్మ..: అసదుద్దీన్ ఒవైసీ
- పవన్ నటుడు.. మోదీ మహానటుడు
- ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతిస్తున్నాం
- దమ్మున్న నాయకుడు జగన్‌ను మరోసారి గెలిపించి సీఎం చేయాలి



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిస్తేనే ముస్లిం రిజర్వేషన్ల అమలు కొనసాగుతుందని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తేల్చి చెప్పారు. జగన్ రిజర్వేషన్లకే కాదు.. రాజ్యాంగ పరిరక్షణ కోసం కూడా పాటుపడతారన్న నమ్మకం తనకుందని చెప్పారు. బుధవారం రాత్రి
మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



వేడుకునేది ఓటర్లని కాదు! సూర్యుడ్ని!!

కూటమి కక్కిన విషం

విలవిల్లాడిన జనం.. ఏపీలో బ్యాంకుల ముందు క్యూ లైన్లలో నరకయాతన

- ఐదేళ్ల తర్వాత అవ్వాతాతలకు చంద్రబాబు మార్కు దురవస్థ
- ఊళ్లకు ఊళ్లే తరలి రావడంతో కిక్కిరిసిన బ్యాంకులు
- డబ్బులు పడ్డా.. ఇన్‌యాక్టివ్ ఖాతాలతో పెద్ద ప్రాణాలకు మరో కష్టం
- ఈ కష్టాల పాపం బాబు బృందానిదే
- బ్యాంకుల్లోనే పింఛను జమ చేయాలన్న నిమ్మగడ్డ
- 20 రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి ఈసీకి ఫిర్యాదు
- కేంద్రం అన్నీ డీబీటీతో ఇస్తుంటే పింఛన్లు మాత్రం ఎందుకివ్వరంటూ పురందేశ్వరి డిమాండ్ -16లో

దొరుకుతున్నవన్నీ 'పచ్చ'నోట్లే!

- కదిరి టీడీపీ అభ్యర్థి వాహనంలో రూ.2 కోట్ల సీజ్.. తూర్పుగోదావరిలో దొరికిన కట్టల మూలాలూ టీడీపీలోనే
- లెక్కలు చెప్పలేని డబ్బుతో దొరికిపోయిన మార్గదర్శి.. బాపట్ల దేశం అభ్యర్థి కంటైనర్లలో భారీగా నగదు పట్టివేత
- తిరుపతిలో చీరలతో పాటు నోట్లు పంచుతూ దొరికిన ఎల్లో ముఠా
- బరితెగించి మరీ డబ్బును వరదలా పారిస్తున్న చంద్రబాబు

16లో

ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించండి

- వెలిచాల రాజేందర్‌కు ఎంపీ టికెట్ రావడానికి ప్రభాకర్‌రావే కారకుడు
- ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ఇచ్చిన డబ్బు కరీంనగర్ మంత్రి ద్వారా ఢిల్లీకి ముట్టాయి
- దేశభద్రతకు సంబంధించిన అంశం కాబట్టి అవసరమైతే ఎన్‌ఐఏకు అప్పగించాలి
- బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి ఎంపీ బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌కు ఎంపీ టికెట్ రావడానికి ప్రధాన కారకుడు ప్రభాకర్‌రావు.. రాజేందర్‌కు కాంగ్రెస్‌కు సంబంధం లేదు. ఆయన కార్యకర్త కానేకాదు..ఏనాడూ ఉద్యమాల్లో పాల్గొనలేదు' అని బీజేపీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే... 'అసెంబ్లీ ఎన్నికల నుంచే రాజేందర్‌రావును ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు తెర ముందుకు తీసుకొచ్చారు. కోట్ల రూపాయలు రాజేందర్‌రావు ద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు ఇప్పించారు. రాష్ట్ర వ్యవహారాలు చూసే కాంగ్రెస్ నేతలకు కూడా కోట్ల రూపాయలు ముట్టజెప్పించారు. కరీంనగర్ ఎంపీ టికెట్ వేరొకరు ఆశించినా, ఆయనకు సీఎం పూర్తి మద్దతు ఇచ్చినా, ఈ తతంగం
మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీసీ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ కుట్ర

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



కవాడిగూడ (హైదరాబాద్): దేశవ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసిందని, అందులో భాగంగానే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలకు ఇవ్వలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కల్పించకుండా, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వకుండా చేయడమే బీజేపీ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు చేస్తున్న చర్యలకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డాలు 60 శాతం జనాభా ఉన్న ఓబీసీలకు భరోసా ఎందుకు కల్పించలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. కులగణన చేయాలని బీసీలు డిమాండ్ చేస్తున్నా, ఆ అంశాన్ని కనుమరుగు చేయడానికి కుట్ర చేస్తున్నారని అన్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీలపై క్రీమీలేయర్ నిబంధన విధించి ఓబీసీలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కాకుండా కుట్రచేశారని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. బీసీల ఓట్లు కావాలంటే తెలంగాణ పర్యటనలో ప్రధాని మోదీ బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని, కేంద్రంలో ప్రత్యేక శాఖ ఏర్పాటు చేస్తామని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పిస్తామని గ్యారంటీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పుస్తకాల ముద్రణకు తెలుగు వర్సిటీ ఆర్థిక సాయం

నాంపల్లి: తెలంగాణ తెలుగు రచయితలకు తమ రచనలను ముద్రించుకోవడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం అందజేస్తోంది. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించి సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనల ముద్రణ నిమిత్తం ఆర్థిక సహాయం కోసం తమ రచనలను పంపుకోవచ్చు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను విశ్వవిద్యాలయంలోని విస్తరణ సేవా విభాగం నుంచి పొందవచ్చు. లేదా తెలుగు వర్సిటీ వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదేనీ ముద్రణా సంస్థ నుంచి పొందిన ఒక కొటేషన్‌ను తీసుకుని దరఖాస్తుకు జతపరచాలి. ఈ నెల 31వ తేదీలోగా ఇన్‌చార్జి, విస్తరణ సేవా విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పరిపాలన భవనం, సాయినగర్, బాచుపల్లి ప్రాంగణం, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా–500118 చిరునామకు పంపాలని రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.



సిద్దిపేటలోని పాత బస్టాండ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

ఢిల్లీ సుల్తాన్లను ఎదిరిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

మార్చి రిజర్వేషన్లు తొలగించాలని చూస్తున్నారు. ఆ మార్పును దేశంలోని 15 రాష్ట్రాలు ఆమోదించాల్సి వస్తుంది. అందుకే ఎక్కువ రాష్ట్రాల్లో అధికారం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే 8 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టారు. బీజేపీకి ఓటు వేస్తే, అది రిజర్వేషన్లపై పోటు పొడవబోతోంది.

తిరగబడి కొట్లాడుతా..

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలసి రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తున్న విషయంపై పది రోజులుగా నేను మాట్లాడుతుంటే.. ఢిల్లీ పోలీసులతో నాపై కేసు పెట్టించారు. నాపై గత పదేళ్లలో 200 కేసులు పెట్టారు. చంచల్‌గూడ జైలుకు పంపారు. అలాంటి అక్రమ కేసులకు భయపడబోం. ఢిల్లీ సుల్తానులను సైతం ఎదిరించే శక్తి మాకు ఉంది. ఇకపై బీజేపీ ఆటలు సాగవు. తిరగబడి కొట్లాడుతా. తెలంగాణకు మోదీ ఏం ఇచ్చారు? బీజేపీ ఏం తెచ్చింది? 'గాడిద గుడ్డు' ఇచ్చింది. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ కారిడార్, ఐఐటీ, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయహోదా కావాలని కేంద్రాన్ని కోరితే గాడిద గుడ్డు ఇచ్చింది. 2014 ఎన్నికల సమయంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ.. ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారు. రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని చెప్పి.. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు చేశారు. 700 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారు. గత డిసెంబర్‌లో కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు బాయ్ బాయ్ చెప్పారు. మేలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి బాయ్ బాయ్ చెప్పాలి.



ఆసిఫాబాద్ సభలో 'బీజేపీ తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు' అంటూ చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌ను ఎవరూ పట్టించుకోలేదు

గత పదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి ఆదిలాబాద్‌ను పట్టించుకోలేదు. 1.5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాణహిత, కుమురంభీం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదు. సోయం బాపురావును ఎంపీగా గెలిపిస్తే.. ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వం. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదింటిని ఇప్పటికే అమలు చేశాం. పదేళ్ల పాటు తెలంగాణను దోచుకున్న కేసీఆర్ పాలనను ప్రజలు బండకేసి కొట్టి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. గతంలో కేసీఆర్ పేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని చెప్పి వ్యాపారం చేశారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుని దివాలా తీయించిన కేసీఆర్ కుటుంబానికి చర్లపల్లి జైలులో డబుల్ బెడ్రూం ఇంటిని సిద్ధం చేస్తున్నాం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్, మెదక్, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థులు ఆత్రం సుగుణ, నీలం మధు, సునీతా మహేందర్‌రెడ్డిలను లక్ష ఓట్లకుపైగా మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆసిఫాబాద్ సభలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్.. సిద్దిపేట కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం.. కుత్బుల్లాపూర్ రోడ్ షోలో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మామాఅల్లుళ్ల నుంచి సిద్దిపేటకు విముక్తి

''మెదక్‌లో దొరల గడీలను బద్దలుకొడతాం. మామ కేసీఆర్, అల్లుడు హరీశ్‌రావు సిద్దిపేటను 45 ఏళ్లుగా పాపాల భైరవుల్లా పట్టిపీడిస్తున్నారు. వారి నుంచి సిద్దిపేటకు విముక్తి కల్పించేందుకే వచ్చా. హరీశ్‌రావు రాజీనామా లేఖ రాసిపెట్టుకో.. ఆగస్టు 15లోగా పక్కాగా రుణమాఫీ చేస్తాం.. సిద్దిపేటకు కొత్త ఎమ్మెల్యేను తెస్తా. ఇక్కడ లక్ష మంది రైతులతో సభ ఏర్పాటు చేస్తా. ఆగస్టు 15న సిద్దిపేటకు స్వాతంత్ర్యం రాబోతోంది. ఈసారి ఆరునూరైనా మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి. రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకుని అక్రమంగా ఫాంహౌస్‌లు కట్టుకున్నోళ్లు కావాలా? మంచి చేసేవాళ్లు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలి. ఈసారి కాంగ్రెస్ గెలవకపోతే ఉమ్మడి మెదక్ జిల్లాలో శాశ్వత బానిసత్వం వస్తుంది. ఇక్కడ పోటీ చేయకుండా పోలీసులతో కేసులు పెట్టించే పరిస్థితి వస్తుంది. కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి వందల ఎకరాలు కొల్లగొట్టారు. నిజాం వద్ద ఖాసీం రిజ్వీ ఎలాగో, కేసీఆర్ హయాంలో వెంకట్రామిరెడ్డి అలాగే. కరీంనగర్‌కు చెందిన వెంకట్రామిరెడ్డిని మెదక్ అభ్యర్థిగా నిలబెట్టారు.''

కాంగ్రెస్ 'సోషల్' టీంలో ఐదుగురు అరెస్ట్

అమిత్ షా ప్రసంగం డీప్ ఫేక్ కేసులో తొలుత అదుపులోకి..

- సాయంత్రానికి అరెస్టు చూపిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు
- ఢిల్లీలో నమోదైన కేసులో నిందితుల అరెస్టు కోసం వచ్చిన అక్కడి పోలీసులు
- అప్పటికే ఐదుగురిని సీసీఎస్ అదుపులోకి తీసుకోవడంతో స్టేషన్ వద్దే నిరీక్షణ
- తాము అరెస్టు చేయకుండా చూసేందుకే వారిని ముందే అదుపులోకి తీసుకున్నారని అనుమానం
- ఎట్టకేలకు అరెస్టు చూపడంతో తిరుగుముఖం.. పీటీ వారెంట్‌పై తరలించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగం వీడియో డీప్ ఫేక్ కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గురువారం ఉదయమే కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా టీం ఇన్‌చార్జి సతీశ్‌తోపాటు యాక్టివిస్ట్‌లు నవీన్, తస్లీమా, గీత, వంశీలను అదుపులోకి తీసుకున్నారు. వారిని బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో ఉన్న సైబర్ క్రైమ్ ఠాణాకు తరలించారు. సాయంత్రానికి వారి అరెస్టును ప్రకటించారు. అయితే ఈ కేసులో ఢిల్లీ పోలీసులు హైదరాబాద్ రావడంతో రోజంతా కాస్త హైడ్రామా నడిచింది.

రోజంతా హైడ్రామా.. ఢిల్లీ పోలీసుల నిరీక్షణ..

అమిత్ షా ప్రసంగం వీడియో డీప్ ఫేక్ కేసులో ఇవే ఆరోపణలకు సంబంధించి ఢిల్లీలో మరో కేసు నమోదు కావడంతో రాష్ట్రానికి చెందిన ఆ ఐదుగురు నిందితులను అరెస్టు చేసేందుకు ఢిల్లీ పోలీసులు గురువారం హైదరాబాద్ వచ్చారు. అయితే అప్పటికే సీసీఎస్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోవడంతో ఢిల్లీ పోలీసులు సైబర్ క్రైం ఠాణా వద్దకు చేరుకున్నారు. కానీ ఠాణా లోపలకు మీడియా సహా ఎవరినీ సైబర్ క్రైం పోలీసులు అనుమతించలేదు. దీంతో కాంగ్రెస్ సోషల్ మీడియా టీంను తాము అరెస్టు చేయకుండా అడ్డుకోవడానికే సైబర్ క్రైం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని స్పెషల్ సెల్ అధికారులు భావించారు. నిందితులను ప్రశ్నించాక నోటీసులు ఇచ్చి పంపిస్తారనే ఉద్దేశంతో సాయంత్రం వరకు బషీర్‌బాగ్ ప్రాంతంలోనే కాపు కాశారు. అయితే సీసీఎస్ పోలీసులు ఐదుగురి అరెస్టును సాయంత్రం ప్రకటించడంతో స్పెషల్ సెల్ పోలీసులు ఆ ప్రాంతం విడిచి వెళ్లారు. నిందితులకు కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తే ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్‌పై ఢిల్లీ తరలించాలని స్పెషల్ సెల్ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.



సీసీఎస్‌లో కాంగ్రెస్ సోషల్‌మీడియా సభ్యులు

ఇదీ కేసు..

గత నెల 25న సిద్దిపేటలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తానని మాట్లాడినట్లు ఓ డీప్‌ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు అన్ని హ్యాండిల్స్ దీన్ని పోస్టు చేయడమో లేదా షేర్ చేయడమో చేశాయి. ఈ వీడియోపై బీజేపీ తెలంగాణ జనరల్ సెక్రటరీ జి.ప్రేమేందర్‌రెడ్డి గత నెల 27న హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అధికారులు ఐపీసీతోపాటు ఐటీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అందులో టీపీసీసీ 'ఎక్స్' ఖాతాను నిందితుల జాబితాలో చూపారు. మరోవైపు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కూడా ఈ అంశంపై గత నెల 28న కేసు నమోదు చేశారు. దీని దర్యాప్తులో భాగంగా సీఎం ఎ.రేవంత్‌రెడ్డి సహా పలువురికి నోటీసులు జారీ చేశారు. ఉత్తరాదిలోని అనేక రాష్ట్రాల్లో కొందరు కాంగ్రెస్ నేతల వ్యక్తిగత సహాయకులు, సోషల్ మీడియా టీం సభ్యులను అరెస్టు చేశారు. ఇందులో భాగంగా టీకాంగ్రెస్ సోషల్ మీడియా సభ్యులను అరెస్టు చేసేందుకు ఓ ప్రత్యేక బృందం గురువారం హైదరాబాద్ వచ్చింది.

అభ్యర్థుల పేర్ల స్థానాలను మార్చలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఒకసారి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి.. ప్రక్రియ ప్రారంభమయ్యాక బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్ల స్థానాలను మార్చాలని ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం వద్దే తేల్చుకోవాలని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి హైకోర్టు చెప్పింది. ఒకే తరహా పేరు ఉన్న వ్యక్తులుంటే 10 నంబర్ల వ్యత్యాసం ఉండేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ విశ్వేశ్వర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు తన పేరుకు సమీప పేరున్న వ్యక్తి చేవెళ్లలో పోటీలో ఉన్నారని, తనది రెండో స్థానమైతే అతనిది ఐదో స్థానమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. చేవెళ్ల సెగ్మెంట్ నుంచి 46 మంది పోటీలో ఉన్నారని, వీరిలో పిటిషనర్ పేరున్న వ్యక్తి మరొకరు ఉన్నారని విశ్వేశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. ఎన్నికల ప్రచారంలో ఐదో నంబర్ అభ్యర్థికి ఓటు వేయాలా అని జనం అడుగుతున్నారని చెప్పారు. ఇద్దరి మధ్య సీరియల్ నంబర్లలో 10 నంబర్ల గ్యాప్ ఉండేలా చూడాలని ఈసీని కలసి గత నెల 30న వినతిపత్రం ఇచ్చామన్నారు. దీనిపై ఈసీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. మరోవైపు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలైందని ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది దేశాయ్ అవినాష్ వాదనలు వినిపించారు. వాదనల విన్న ధర్మాసనం.. బ్యాలెట్ పేపర్ మార్పులో జోక్యానికి నిరాకరించింది. ఈసీ తగిన నిర్ణయం తీసుకోవాలంటూ విచారణను ముగించింది.

అలా విమర్శించిన.. కాంగ్రెస్, బీజేపీపై చర్యలు

- కేటీఆర్‌పై ఫోన్ ట్యాపింగ్ విమర్శలు
- చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హైకోర్టుకు తెలిపిన ఈసీ
- విచారణ ముగింపు

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును టార్గెట్ చేస్తూ కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమిషన్ హైకోర్టుకు తెలియజేసింది. దీంతో బీఆర్‌ఎస్ పిటిషన్‌లో విచారణను న్యాయస్థానం ముగించింది. ఎలాంటి ఆధారాలు లేకున్నా ఫోన్ ట్యాపింగ్ కేసును తమ పార్టీకి, నాయకులకు అంటగట్టాలని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు చూస్తూ.. రెచ్చగొట్టేలా, పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసి అలాంటి వ్యాఖ్యలను అడ్డుకోవాలని కోరినా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మార్చి 29న సీఎం రేవంత్‌రెడ్డి, ఏప్రిల్ 1న మంత్రి కొండా సురేఖ, ఏప్రిల్ 6న తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీ, మరో సందర్భంలో బీజేపీ నాయకుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు కేటీఆర్‌కు సంబంధం ఉందని నిరాధార విమర్శలు చేశారన్నారు.

ఈసీకి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. బీఆర్‌ఎస్ ఇచ్చిన ఫిర్యాదును 3వ తేదీ(శుక్రవారం) పరిష్కరించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. దీంతో ఈ పిటిషన్‌లో విచారణను ముగిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.



దౌల్తాబాద్‌లో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తదితరులు

బీజేపీతో జోడీ లేకపోతే ఈడీ

కేసులకు భయపడం: మాజీ మంత్రి హరీశ్‌రావు

హత్నూర(సంగారెడ్డి) /జిన్నారం (పటాన్‌చెరు): బీజేపీతో జోడి లేకపోతే ఈడీ కేసులు బనాయిస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం రాత్రి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్, గుమ్మడిదల, జిన్నారం మండలం బొల్లారం మునిసిపాలిటీలో మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రసంగిస్తూ బీజేపీతో తాము కలవకపోవడంతోనే ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసులు బనాయించి జైల్లో పెట్టారని, కేసులకు భయపడేది లేదన్నారు. పదేళ్ల మోదీ పాలనలో తెలంగాణకు నిధులు రాలేదని విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవడం కోసమే బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఏకంగా భార్యాభర్తలను విడదీసి ఓట్లు వేయించుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీకి ఓటు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రిజెక్ట్ అయిన బాండ్ పేపర్‌లాంటిదని, బాండ్ పేపర్ రిజెక్ట్ అయితే కేసులు ఎలా నమోదు చేస్తారో ప్రజలు కూడా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో ఏ ఒక్కరోజు పాల్గొనని రేవంత్‌రెడ్డి తెలంగాణ కోసం మాట్లాడే నైతిక హక్కు లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. జై తెలంగాణ అన్న ఉద్యమకారులపై రైఫిల్ పట్టుకొని దాడి చేసిన రేవంత్‌రెడ్డికి ఈరోజు తెలంగాణ గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు.

ఏపీలో జగన్‌తోనే ముస్లిం రిజర్వేషన్లు

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. ''ప్రధాని మోదీ మాట వినను.. ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తానని నిలబడి చెప్పే దమ్ము టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఉందా? ఏపీలో చంద్రబాబు గెలిస్తే ప్రధాని మోదీకి కీలుబొమ్మగా మారుతారు''అని స్పష్టం చేశారు. బీజేపీతో చేతులు కలిపిన చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. బాబు కూటమిలోని పవన్ కల్యాణ్ ఒక నటుడని, మోదీ మహా నటుడని అసదుద్దీన్ ఎద్దేవా చేశారు. మోదీ సినీ ప్రపంచంలో ఉండి ఉంటే సినిమా రంగాన్ని కూడా భ్రష్టు పట్టించేవారని విమర్శించారు.

వైఎస్సార్ సీపీకే మా సంపూర్ణ మద్దతు

ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్ మళ్లీ గెలుస్తారని, ముస్లిం రిజర్వేషన్లను ఆయనే పరిరక్షిస్తారని అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దమ్మున్న నాయకుడని కొనియాడారు. ప్రధాని మోదీని ప్రశ్నించే సత్తా ఆయనకే ఉందన్నారు. వైఎస్సార్ సీపీకే తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా కలసికట్టుగా జగన్‌ను మరోసారి గెలిపించి, ముఖ్యమంత్రిని చేయాలని అసదుద్దీన్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్ ప్రజలపై ద్వేషం ఎందుకు?

40 ఏళ్లుగా రజాకార్లు కబ్జా పెట్టిన హైదరాబాద్‌కు విముక్తి కల్పించాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై అసదుద్దీన్ మండిపడ్డారు. హైదరాబాద్ ఎంపీ స్థానంలోని యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ''రజాకార్లు అంటూ.. ఐఎస్ఐ, రోహింగ్యాలకు అడ్డాగా మారిందంటూ.. హైదరాబాద్ ప్రజలపై ద్వేషం ఎందుకు చూపుతున్నారు? రజాకార్లు ఎప్పుడో పాకిస్తాన్‌కు పారిపోయారు. ఇక్కడ ముస్లింలు, దళితులు, ఎస్టీలు, బీసీలు, రాజస్తానీలు, మరాఠీలు అందరూ ఉంటారు. హైదరాబాదీలను దేశద్రోహులుగా చిత్రీకరిస్తే సహించేది లేదు. మోదీ, అమిత్ షాలకు బుద్ధి చెప్పడం ఖాయం..'' అని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ఓయూలో విద్యుత్ కొరత నిరూపిస్తారా?

• టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యుత్ కొరత ఉందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను నిరూపించగలరా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ సవాల్ చేశారు. ఓయూ అధికారులిచ్చిన ఓ లేఖను మార్ఫింగ్ చేసి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బ తీయాలని బీఆర్ఎస్ ప్రయత్నించి విఫలమైందని గురువారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. లేఖను మార్ఫింగ్ చేసిన బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేస్తే.. తప్పును ఒప్పుకోకుండా కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అధికారంలో ఉండగా ఒక్క రోజైనా కేటీఆర్ ఓయూకు వచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల అబద్ధాలు విని ఓయూ విద్యార్థి లోకం సిగ్గు పడుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇలాంటి అబద్ధాలు మానుకోవాలని బీఆర్ఎస్ నేతలను దయాకర్ హెచ్చరించారు.

ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువు మే 6



నల్లగొండ రూరల్: తెలంగాణ ఎడ్‌సెట్–2024 దరఖాస్తులకు ఈ నెల 6 చివరి తేదీ అని ఎడ్‌సెట్ చైర్మన్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, గోపాల్‌రెడ్డి, కన్వీనర్ మృణాళిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 జరిమానాతో ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అది వడదెబ్బ మరణం కాదు

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల ఐలమ్మ (63) గుండె సంబంధిత వ్యాధితో చనిపోయినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఏప్రిల్ 30న జమ్మికుంటలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభలో అంబాల ఐలమ్మ వడదెబ్బతో మృతి చెందినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణలో ఆర్టీసీకి సహకరిస్తాం

• బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకుగాను యూకే తరఫున ఆర్థికంగా, సాంకేతికంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ప్రకటించారు. గురువారం ఆయన బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. గతేడాది గోవాలో జరిగిన జీ–20 దేశాల మంత్రుల సమావేశం సందర్భంగా భారత్‌లో పర్యావరణహిత బస్సుల నిర్వహణకు సహకరించేందుకు యూకే, యూఎస్‌లు ముందుకొచ్చి భారత్‌తో ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జీరో ఎమిషన్ వెహికిల్ పైలట్ ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా ఆర్టీసీ అధికారులతో చర్చించేందుకు బస్‌భవన్‌కు వచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ అభినందనీయమని, వాటి సంఖ్య మరింత పెరగాల్సి ఉందని, ఈ విషయంలో ఆర్థిక, సాంకేతిక తోడ్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహిస్తున్న తీరును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో బ్రిటిష్ హైకమిషనర్ సీనియర్ అడ్వయిజర్ జావైద్ మల్లా, తెలంగాణ ప్రభుత్వ ఆటోమోటివ్ అండ్ ఈవీ సెక్టార్ డైరెక్టర్ గోపాలకృష్ణ, టీఎస్ఆర్టీసీ సీటీఓ డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, డబ్ల్యూఆర్ఐ ఇండియా ప్రతినిధి చైతన్య కనూరి, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన అనన్య బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర అధికారులతో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్

కాళేశ్వరానికి 'అత్యవసర' గడువు మించిపోతోంది!

• బ్యారేజీలకు మరమ్మతులపై తక్షణమే సిఫారసులు చేయండి
• చంద్రశేఖర్ అయ్యర్ కమిటీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ లేఖ



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరింత నష్టం జరగకుండా వానాకాలానికి ముందే తీసుకోవాల్సిన నివారణ చర్యలపై సత్వరమే సిఫారసు చేయాలని చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ విజ్ఞప్తి చేసింది. వర్షాకాలం ప్రారంభానికి ముందు చేపట్టాల్సిన పనులకు చాలా తక్కువ సమయం మిగిలి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ ఇటీవల అయ్యర్ కమిటీకి లేఖ రాశారు. ఈ నెల ముగిశాక ఎప్పుడైనా వానాకాలం ప్రారంభం కావచ్చని, ఆలోగా అత్యవసర మరమ్మతులు నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. నిపుణుల కమిటీ విజ్ఞప్తి మేరకు ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన ప్రాథమిక సమాచారంతోపాటు మేడిగడ్డ బ్యారేజీలోని 6, 7, 8వ బ్లాకులకు నిర్వహించిన ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ఈఆర్టీ), గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షల నివేదికలను సమర్పించామని ఈ లేఖలో గుర్తుచేశారు. బ్యారేజీల డిజైన్లు, నిర్మాణంలో లోపాలపై అధ్యయనం చేసి వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడానికి కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఒక కమిటీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏర్పాటు చేయడం తెలిసిందే. ఆ కమిటీ ఇప్పటికే రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించి వివరాలు సేకరించింది. కమిటీ మధ్యంతర నివేదిక కోసం గత నెల రోజులుగా నీటిపారుదల శాఖ నిరీక్షిస్తోంది.

ఎన్నికల ఫలితాలొచ్చాకే మధ్యంతర నివేదిక?

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చాకే అయ్యర్ కమిటీ మరమ్మతులపై మధ్యంతర నివేదిక ఇచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖలో ఉన్నత స్థాయి అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఆలోగా వర్షాకాలం మొదలవుతుందని.. దీనివల్ల బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు చేపట్టడానికి వీలుండదని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే బ్యారేజీలకు అత్యవసరంగా గ్రౌంటింగ్ వంటి పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు అయ్యర్ సిఫారసులు వచ్చాకే మరమ్మతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో నీటిపారుదల శాఖలో ఆందోళన వ్యక్తమవుతోంది.

'కవ్వాల్' పునరావాసం పూర్తి

• పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన 94 కుటుంబాలకు పునరావాసం, తరలింపు ప్రక్రియ పూర్తయిందని పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్ తెలిపారు. అటవీ జంతువుల సంరక్షణ, వాటి పునరుత్పత్తి కోసం అక్కడున్న గ్రామాలను ఖాళీ చేసి పునరావాసం కల్పించడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షించి పునరావాస ప్రక్రియ పూర్తికి సహకరించిదన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ. 15 లక్షల ప్యాకేజీ

కేంద్రం నిబంధనల ప్రకారం రెండు ప్రతిపాదనలతో అటవీశాఖ పునరావాల ప్రక్రియ చేపట్టింది. గ్రామాల తరలింపులో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏకమొత్తంగా రూ. 15 లక్షల పరిహారం అందిచాలని నిర్ణయించింది. దీనికి 48 కుటుంబాలు అంగీకరించి ఆ మేరకు పరిహారం స్వీకరిస్తున్నాయి. ఇక రెండో ప్రతిపాదనకు అంగీకరించిన 94 కుటుంబాలకు కూడా రూ. 15 లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇంటి నిర్మాణంతోపాటు వ్యవసాయ భూమి అందిస్తోంది. రెండు గ్రామాలకు చెందిన 142 కుటుంబాలను పునరావాసం కోసం ఎంపిక చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 14.2 కోట్లు మంజూరు చేసింది. కవ్వాల్‌కు సమీపంలోనే అటవీ ప్రాంతం బయట కొత్త మద్దిపడగలో అన్ని వసతులతో పునరావాస కాలనీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. మొత్తం 12.36 ఎకరాల్లో కాలనీ నిర్మితమవుతోంది. ఒక్కో కుటుంబానికి 333 చదరపు గజాల్లో ఇల్లు, 2.81 ఎకరాల సాగు భూమిని అందిస్తున్నారు. కాలనీలో సామాజిక ఏర్పాట్లు, పనుల తీరుగా లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లో కవ్వాల్ అభయారణ్యంలోని మిగతా గ్రామాలు, అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని నాలుగు పునరావాస గ్రామాల ప్రక్రియ కూడా పూర్తవుతుందని డోబ్రియెల్ తెలిపారు.

నిజాం చక్కెర ఫ్యాక్టరీలకు రూ.43 కోట్లు

బ్యాంకర్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూతపడిన నిజాం చక్కెర కర్మాగారాలను తిరిగి తెరుస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా చక్కెర కర్మాగారాల పాత బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు బ్యాంకర్లతో సంప్రదింపులు జరిపింది. బ్యాంకర్లు కూడా అంగీకరించడంతో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.43 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపిస్తామని సీఎం రేవంత్ ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూతపడిన చక్కెర పరిశ్రమల పునరుద్ధరణకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో జనవరిలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. బోధన్, ముత్యంపేటలో మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీల పాత బకాయిలు, ఆర్థిక ఇబ్బందులపై ఈ కమిటీ పలు దఫాలుగా చర్చలు జరిపింది. బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్మెంట్ అవకాశం ఇవ్వాలని బ్యాంకర్లతో సంప్రదింపులు జరిపింది. సెప్టెంబర్ 17లోపు చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తామని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

భానుకిరణ్‌కు.. యావజ్జీవ శిక్ష సరైందే

• సూరి హత్య కేసులో ట్రయల్ కోర్టు శిక్షను సమర్థించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అనంతపురం జిల్లాకు చెందిన మద్దెలచెరువు సూరి హత్య కేసు నిందితుడు మలిశెట్టి భానుకిరణ్‌కు ట్రయల్(నాంపల్లి) కోర్టు విధించిన యావజ్జీవ శిక్ష సరైందేనని తెలంగాణ హైకోర్టు తేల్చిచెప్పింది. నాంపల్లి కోర్టు తీర్పును సవాల్ చేస్తూ భాను వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. యావజ్జీవ శిక్షను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2005లో జరిగిన టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పరిటాల రవి హత్య కేసులో సూరి ప్రధాన నిందితుడు. 2011 జనవరిలో సూరిని హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో భానుకిరణ్ కాల్చి చంపాడు. ఈ కేసు విచారించిన నాంపల్లి కోర్టు 2018 డిసెంబర్‌లో భానుకిరణ్‌కు జీవితఖైదు, రూ.20 వేల జరిమానా విధించింది. నాంపల్లి కోర్టు తీర్పును సవాల్ చేస్తూ భాను అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం విచారణ చేపట్టి.. గురువారం తీర్పు వెలువరించింది.

మీ సంపద గానీ మరియు మీ సంతానం గానీ మిమ్మల్ని మా దగ్గరికి తేలేవు: కాని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు తప్ప! కావున అలాంటి వారికి తాము చేసిన దానికి రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది.

– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 3 మే 2024

కొంచెం ఇష్టం... కొంచెం కష్టం...

రానున్న టీ20 వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమైంది. భారత క్రికెట్ జట్టు ఎంపిక జరిగింది. అమెరికా, వెస్టిండీస్‌లు వేదికగా జూన్ 2 నుంచి జరిగే పోటీలకు రోహిత్ శర్మ సారథిగా 15 మంది సభ్యులతో కూడిన ప్రాథమిక జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం ప్రకటించింది. మరో నలుగురు ఆటగాళ్ళను రిజర్వ్‌లుగా ఎంపిక చేసింది. భారత మాజీ ఫాస్ట్ బౌలర్ అజిత్ అగర్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ ప్యానెల్ చేసిన ఎంపికలో కొందరు స్టార్ ఆటగాళ్ళకు చోటు దక్కలేదు. అలాగని, ఆశ్చర్యకరమైన, అనూహ్యమైన ఎంపికలూ లేవు. విధ్వంసకర బ్యాట్స్‌మన్ రింకూ సింగ్‌కు చోటివ్వకపోవడం, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ముంబయ్ ఇండియన్స్ (ఎంఐ) జట్టు సారథిగా విఫలమైనా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను వైస్ కెప్టెన్‌ను చేయడం విమర్శలకు తావిచ్చాయి. అలాగే, స్పిన్నర్లనేమో నలుగురిని తీసుకొని, జస్ప్రీత్ బుమ్రా నేతృత్వంలో ముగ్గురు పేసర్ల బృందానికే పరిమితం కావడమూ ప్రశ్నార్థమైంది. కొంత ఇష్టం, కొంత కష్టం, మరికొంత నష్టాల మేళవింపుగా సాగిన ఈ ఎంపికపై సహజంగానే చర్చ జరుగుతోంది.

గత ఏడాదంతా టీ20లలో పాల్గొనకపోయినా సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లీలకు సెలక్షన్ ప్యానెల్ పెద్దపీట వేసింది. నాలుగు గ్రూపుల్లో 20 జట్లతో, మొత్తం 55 మ్యాచ్‌లు సాగే ఈ స్థాయి భారీ పోటీలో, అమెరికాలోని అలవాటు లేని పిచ్‌లలో సీనియర్ల అనుభవం అక్కరకొస్తుందని భావన. ప్రమాదం నుంచి కోలుకున్న తర్వాత అబ్బురపరిచేలా ఆడుతున్న వికెట్‌కీపర్ – బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ ఎంపికతో గత రెండు వరల్డ్‌కప్‌లలో లేని విధంగా మిడిల్ ఆర్డర్‌లో లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ ఆప్షన్ జట్టుకు దక్కింది. ఈసారి ఐపీఎల్‌లో పరుగుల వరద పారిస్తూ, రాజస్థాన్ రాయల్స్‌ను అగ్రపీఠంలో నిలిపిన సంజూ శామ్సన్‌కు జట్టులో స్థానం దక్కింది. వెరపెరుగని బ్యాటింగ్‌తో, అలవోకగా సిక్స్‌లు కొట్టే అతడి సత్తాకు వరల్డ్ కప్ పిలుపొచ్చింది. మిడిల్ ఆర్డర్‌లో అతడు జట్టుకు పెట్టని కోట. స్పెషలిస్ట్ వికెట్ కీపర్లుగా శామ్సన్, పంత్‌లను తీసుకోవడంతో కె.ఎల్. రాహుల్‌కు మొండి చేయి చూపక తప్పలేదు. ఒకప్పుడు ఎగతాళికి గురైన ముంబయ్ కుర్రాడు శివమ్ దూబే చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టులో మిడిల్ ఆర్డర్‌లో సిక్సర్ల వీరుడిగా, ప్రస్తుతం భారత వరల్డ్ కప్ టీమ్‌లో కీలక భాగస్వామిగా ఎదగడం గమనార్హం.

క్లిష్టమైన వేళల్లో సైతం బ్యాటింగ్ సత్తాతో జట్టును విజయతీరాలకు చేర్చే సత్తా, స్వభావం ఉన్న ఆటగాడిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాతికేళ్ళ రింకూ సింగ్‌కు పేరు. అయితే, ఏ స్థానంలో ఆడించాలని మల్లగుల్లాలు పడి, చివరకు ఈ విధ్వంసక బ్యాట్స్‌మన్‌కు జట్టులో చోటే ఇవ్వలేదు. రిజర్వ్ ఆటగాడిగా మాత్రం జట్టు వెంట అమెరికా, వెస్టిండీస్‌లకు వెళతాడు. పరుగుల సగటు 89, స్ట్రయిక్‌రేట్ 176 ఉన్న రింకూ లాంటి వారికి తుది జట్టులో స్థానం లేకపోవడం తప్పే. ఈ ఏడాది ఐపీఎల్‌లో బాగా ఆడుతున్న స్పిన్నర్ యజువేంద్ర చాహల్‌కు జట్టులోకి మళ్ళీ పిలుపు వచ్చింది. అయితే, నలుగురు స్పిన్నర్లతోటి, అందులోనూ ఇద్దరు ముంజేతితో బంతిని తిప్పే రిస్ట్ స్పిన్నర్లతోటి బరిలోకి దిగడంతో మన బౌలింగ్ దాడిలో సమతూకం తప్పినట్టుంది. ప్రధాన పేసర్లు ముగ్గురే కావడం, బౌలింగ్‌లో హార్దిక్ ఫామ్‌లో లేకపోవడం, సీఎస్‌కేలో శివమ్‌కు గతంలో బౌలింగ్ ఛాన్స్ ఆట్టే రాకపోవడంతో టీ20 వరల్డ్ కప్‌లో మన పేసర్ల విభాగం బలహీనంగా కనిపిస్తోంది.

వివరణలేమీ ఇవ్వకుండానే మే 23 వరకు ఈ ప్రాథమిక జట్టులో మార్పులు చేసుకొనే అవకాశం సెలక్టర్లకుంది. కానీ, ఫైనల్ 15 మందిని మార్చడానికి అగర్కర్ బృందం ఇష్టపడుతుందా అన్నది అనుమానమే. అది అటుంచితే, 2007 తర్వాత భారత్ టీ20 టైటిల్స్ ఏవీ గెలవలేదు. నిజానికి, ధోనీ సారథ్యంలోని యువకుల జట్టు 2007లో తొలి టీ20 వరల్డ్‌కప్‌లో గెలిచిన తీరు మన క్రికెట్‌లో కొత్త మలుపు. టీ20లకు భారత్ అడ్డాగా మారిందంటే దాని చలవే. ఆ వెంటనే 2008లో ఐపీఎల్ ఆరంభంతో కథే మారిపోయింది. ఇవాళ ప్రతి వేసవిలో పేరున్న అంతర్జాతీయ ఆటగాళ్ళు భారత్‌కు క్యూ కడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్స్ వచ్చినా, ఐపీఎల్‌దే హవా. ఇంతవున్నా 2014లో ఒక్కసారి శ్రీలంకతో ఫైనల్స్‌లో ఓడినప్పుడు మినహా ఎన్నడూ విజయం అంచుల దాకా మనం చేరింది లేదని గమనించాలి. ఇది ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. యువ ప్రతిభను ప్రోత్సహించడం, ఆటకు తగ్గ ఆటగాళ్ళను ఎంచుకోవడమనే ప్రాథమిక సూత్రాన్ని మర్చిపోతే కష్టం. ఆ సూత్రాన్ని పాటించడం వల్లే 2007లో మనకు కప్పు దక్కిందని గుర్తుంచుకోవాలి.

గమనిస్తే, దశాబ్దిన్నర పైగా క్రికెట్ స్వరూప స్వభావాలే మారిపోయాయి. మిగతావాటి కన్నా టీ20లు పాపులరయ్యాయి. బంతిని మైదానం దాటించే బ్యాటింగ్ విధ్వంసాలు, స్కోర్ బోర్డ్‌ను పరిగెత్తించే పరుగుల వరదలు, మైదానంలో మెరుపు లాంటి ఫీల్డింగ్ ప్రతిభలు సాధారణమై పోయాయి. టెస్ట్, వన్డే క్రికెట్‌లు సైతం తమ పూర్వశైలిని మార్చుకోవాల్సి వచ్చింది. ఆర్థికంగానే కాక అనేక విధాలుగా వాటిని టీ20 మింగేసే పరిస్థితి వచ్చింది. బ్యాట్స్‌మన్ల వైపు మొగ్గుతో ఈ పొట్టి క్రికెట్ పోటీలు బౌలర్లకు నరకంగా మారి, ఆటకు ప్రాణమైన పోటీతత్వాన్ని హరిస్తున్నాయి. అందుకే, 2008లో ఆరంభమైన ఐపీఎల్ ఏటికేడు క్రమంగా మునుపటి ఆసక్తినీ, ఆదరణనూ కోల్పోతోంది. దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది. బౌలర్లకు అనుకూలించే పిచ్‌ల తయారీ మొదలు టీ20 ఫార్మాట్‌లో, ఐపీఎల్‌లో కొన్ని నియమ నిబంధనల సవరణ దాకా అవసరమైన చర్యలు చేపట్టాలి. తద్వారా పొట్టి క్రికెట్‌కు కొత్త ఊపిరులూదాలి. టీ20 వరల్డ్ కప్‌లో విజయం సాధించాలంటే ఆటలోనే కాదు... ఎంపికలోనూ దూకుడు అవసరం. రిస్క్ లేని సేఫ్ గేమ్‌తోనే పొట్టి క్రికెట్‌లో కప్పు కొట్టగలిగితే అది ఓ కొత్త చరిత్ర!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి: బ.దశమి రా.8.25 వరకు, తదుపరి ఏకాదశి,
నక్షత్రం: శతభిషం రా.9.32 వరకు, తదుపరి పూర్వాభాద్ర.
వర్జ్యం: ఉ.5.51 నుండి 7.19 వరకు, తదుపరి రా.3.30 నుండి 4.58 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.08 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.11 వరకు, అమృతఘడియలు: ప.3.24 నుండి 4.56 వరకు.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

గెలవలేని యుద్ధం చేసిన పాక్

విశ్లేషణ



లెఫ్ట్‌నెంట్ జనరల్ డీఎస్ హుడా (రిటైర్డ్)

కార్గిల్ యుద్ధం జరిగి పాతికేళ్లవుతోంది. మే 3న పాక్ చొరబాట్లను మొదటిసారి కనుగొన్న తర్వాత, జూలై 26న భారత్ తన విజయాన్ని ప్రకటించడానికి ముందు దాదాపు మూడు నెలలు నెత్తుటి యుద్ధం కొనసాగింది. 18,000 అడుగుల ఎత్తులో, ఎన్నో సవాళ్లతో కూడిన ఈ ప్రాంతంలో యుద్ధం అనేది సైన్యం లాఘవానికి నిజమైన పరీక్ష. అధికారులు, సైనికులు మానవాతీత దృఢత్వాన్ని ప్రదర్శించడం, దేశం కోసం ప్రాణాలు ధారపోయడానికి కూడా సిద్ధమైనందునే విజయం సాధ్యపడింది. భారత్‌కు వ్యతిరేకంగా పాక్ సైనిక పంథాను అనుసరించడం వల్ల ఎటువంటి లాభం లేదని కార్గిల్ విధ్వంసం గట్టిగా బయటపెట్టింది. స్థాయిలోనూ, విస్తృతిలోనూ పరిమితమే అయినప్పటికీ, కార్గిల్ రెండు దేశాలలో లోతైన విశ్లేషణను ప్రేరేపించింది.

1999 ఫిబ్రవరి 20న, నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆహ్వానం మేరకు పాకిస్తాన్‌లో చరిత్రాత్మక దౌత్య పర్యటనకు బయలుదేరారు. మరుసటి రోజు, ఇద్దరు ప్రధానులు లాహోర్ డిక్లరేషన్‌పై సంతకం చేశారు. రెండు దేశాల మధ్య శాంతి, స్థిరత్వం, తమ ప్రజల పురోగతి, శ్రేయస్సు గురించిన భాగస్వామ్య దార్శనికతను ఇరువురు నేతలూ ప్రతిబింబించారు.

ఉద్రిక్తతలను పెంచిన 1998 అణు పరీక్షల ఛాయల నుండి ఉద్భవించిన ఈ ప్రకటన, సరిహద్దుకు ఇరువైపులా చక్కటి ప్రశంసలు పొందింది. అయితే విచారకరంగా, ఈ ఆశావాదం భ్రమగా మారింది. వాఘా సరిహద్దులో వాజ్‌పేయికి షరీఫ్ అభివాదం చేస్తున్నప్పుడే, పాకిస్తాన్ సైనికులు కార్గిల్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ను దాటి ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోయిన టోలోలింగ్, టైగర్ హిల్ వంటి పర్వత శిఖరాల్లో కందకాలు తవ్వుతున్నారు.

18,000 అడుగుల ఎత్తులో ఉన్న కార్గిల్ భౌగోళికపరంగా అసాధారణమైన సవాళ్లతో కూడినది. అటువంటి విపరీతమైన పరిస్థితులలో యుద్ధం అనేది సైన్యం లాఘవానికి నిజమైన పరీక్ష. అయితే అధికారులు, సైనికులు మానవాతీత దృఢత్వాన్ని ప్రదర్శించడం, దేశం కోసం ప్రాణాలు ధారపోయడానికి కూడా సిద్ధమైనందునే విజయం సాధ్యపడింది.

మే 3న పాక్ చొరబాట్లను ప్రాథమికంగా కనుగొన్న తర్వాత, జూలై 26న భారతదేశం విజయాన్ని ప్రకటించడానికి ముందు దాదాపు మూడు నెలల కాలం కార్గిల్‌లో నెత్తుటి యుద్ధం కొనసాగింది. పాకిస్తాన్ సైన్యం ఈ పోరాటంలో తన ప్రమేయాన్ని నిరాకరించింది, నేలకొరిగిన తన సైనికులను గుర్తించడానికి నిరాకరించింది. ఇది వారి త్యాగానికి అంతిమ అవమానం అని చెప్పాలి.

స్థాయిలోనూ, భౌగోళిక విస్తృతిలోనూ పరిమితమే అయినప్పటికీ, కార్గిల్ యుద్ధం రెండు దేశాలలో లోతైన వ్యూహాత్మక విశ్లేషణను ప్రేరేపించింది. వేసుకున్న లెక్కలు తప్పడంపై పాక్‌లోనూ; నిఘా వైఫల్యం కారణంగా చొరబాట్లను గుర్తించలేక పోవడంతో సహా, జాతీయ భద్రతా అంతరాలపై భారత్‌లోనూ పెద్ద చర్చ జరిగింది.

యుద్ధం ముగిసిన మూడు రోజుల తర్వాత, పాకిస్తాన్ దురాక్రమణకు దారితీసిన సంఘటనలను సమీక్షించడానికీ, సాయుధ చొరబాట్లకు వ్యతిరేకంగా జాతీయ భద్రతను కాపాడే చర్యలను సిఫార్సు చేయడానికి భారత ప్రభుత్వం కార్గిల్ సమీక్షా కమిటీ (కేఆర్‌సీ)ని ఏర్పాటు చేసింది. రాజకీయ, అధికార, సైనిక, నిఘా సంస్థలు యథాతథ స్థితిపై స్వార్థ ఆసక్తిని పెంచుకున్నాయని ఈ కమిటీ పేర్కొంది. కార్గిల్ అనుభవం, కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం, అణుబాంబుతో కూడిన భద్రతా వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని జాతీయ భద్రతా వ్యవస్థపై సమగ్ర సమీక్ష అవసరమని కమిటీ నొక్కి చెప్పింది.



కార్గిల్ యుద్ధానికి నేటితో 25 ఏళ్లు

కేఆర్‌సీని అనుసరించి వచ్చిన మంత్రుల బృందం నివేదిక, జాతీయ భద్రతా సమస్యలపై స్వతంత్ర భారతదేశంలో చేపట్టిన అత్యంత సమగ్ర పరిశీలన అని చెప్పవచ్చు. గూఢచార యంత్రాంగం, అంతర్గత భద్రత, సరిహద్దు నిర్వహణ, రక్షణ నిర్వహణను అంచనా వేయడానికి నాలుగు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.

ఈ రెండు నివేదికలు జాతీయ భద్రతా నిర్వహణలో అనేక మార్పులకు దారితీశాయి. కేంద్రీకృత కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్‌ను నిర్వహించడానికి 2004లో జాతీయ సాంకేతిక పరిశోధనా సంస్థను ఏర్పర్చారు. సైన్యం నిర్దిష్ట గూఢచార అవసరాలను తీర్చడానికి రక్షణ నిఘా సంస్థ ఏర్పడింది. మెరుగైన ఇంటర్–ఏజెన్సీ సమాచారం భాగస్వామ్యాన్ని, సమన్వయాన్ని పెంపొందించడానికి బహుళ ఏజెన్సీ కేంద్రం కూడా ఏర్పాటయింది. రక్షణ వ్యవస్థ కొంత పునర్నిర్మాణానికి గురైంది. ఇందులో సమీకృత రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయడం, వ్యూహాత్మక బలగాలు, అండమాన్ నికోబార్ కమాండ్‌ల స్థాపన, త్రివిధ బలగాలకు ఆర్థిక, పరిపాలనా అధికారాలు పంపిణీ చేయడం వంటివి ఉన్నాయి. మంత్రుల బృందం సిఫార్సు చేసిన విధంగా 2020లో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం జరిగింది.

కొన్ని సిఫార్సులు పాక్షికంగా మాత్రమే అమలైనాయి. 'ఒకే సరిహద్దులో అనేక బలగాలు ఉండటం కూడా బలగాల జవాబుదారీతనం లోపానికి దారితీసిం'దని మంత్రుల బృందం నివేదిక పేర్కొంది. 'జవాబుదారీతనాన్ని తేవడానికి, సరిహద్దు వద్ద బలగాల మోహరింపును పరిగణనలోకి తీసుకునేటప్పుడు 'ఒక సరిహద్దు, ఒక బలగం' సూత్రాన్ని అవలంబించవచ్చు' అని సూచించింది. ఈ సూత్రాన్ని ఇంకా చైనాతో వాస్తవ నియంత్రణ రేఖ దగ్గర వర్తింపజేయాల్సి ఉంది. ఇక్కడ భారత సైన్యం, ఇండో–టిబెటన్ సరిహద్దు పోలీసులు వేర్వేరు కమాండ్ ఏర్పాట్లలో మోహరించారు.

జాతీయ భద్రతా సిద్ధాంతం లేకపోవడం, ఆర్థిక సంవత్సరానికి మించి సైన్యానికి నిధుల నిబద్ధత లేకపోవడం వంటి బలహీనతలను మంత్రుల బృందం ఎత్తి చూపింది. పరిష్కరించాల్సిన ఇతర సమస్యలు ఏవంటే, త్రివిధ బలగాల హెడ్‌క్వార్టర్స్‌ను ప్రభుత్వంలో మరింతగా ఏకీకృతం చేయడం, సాయుధ దళాలు ఉమ్మడిగా ఉండటం. ఇప్పటికీ ఈ లోటుపాట్లు కొనసాగుతున్నాయి.

పాకిస్తాన్ వైపు కూడా, కార్గిల్ పరాజయంపై చాలా బహిరంగ చర్చ జరిగింది. ఆ యుద్ధం పౌర–సైనిక సంబంధాల వక్ర స్వభావాన్ని బహిర్గతం చేసింది. సైనిక లక్ష్యాలను రాజకీయ, దౌత్యపరమైన పరిశీలనలు లేకుండా రూపొందించారు. నసీమ్ జెహ్రా రాసిన 'ఫ్రమ్ కార్గిల్ టు ది కూ' పుస్తకంలో, మే 17న సైన్యం అప్పటి ప్రధాని షరీఫ్‌కు కార్గిల్ సైనిక చర్యపై తొలి వివరణాత్మక సమాచారాన్ని అందించిందని రాశారు. ఆ సమయానికి, సైనికులు అప్పటికే నియంత్రణ రేఖ వెంబడి స్థానాలను ఆక్రమించారు.

యుద్ధం తరువాత, దానికి పన్నాగం పన్నిన జనరల్స్ పాత్ర పరిశీలనలోకి రావాలి. దీనికి బదులుగా, పాకిస్తాన్ సైన్యం రాజకీయ నాయకత్వానికి నిందను ఆపాదించడానికి ప్రయత్నించింది. పెరుగుతున్న ఈ అపనమ్మకం చివరకు 1999 అక్టోబర్‌లో షరీఫ్‌ను అధికారం నుండి తొలగించిన సైనిక కుట్రకు దారితీసింది.

భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్ సైనిక పంథాను ఉపయోగించడం వల్ల ఎటువంటి లాభం లేదని కార్గిల్ విధ్వంసం గట్టిగా బయటపెట్టింది. భారత్‌తో ఉద్రిక్తతలను తగ్గించడానికి మార్గాలను కనుగొనే బదులు, పాకిస్తాన్ సైన్యం వెనక్కితగ్గి ఉగ్రవాదులను ఉపయోగించింది. యుద్ధం తర్వాత జమ్మూకశ్మీర్‌లో హింస పెరిగింది. కశ్మీర్‌పై మక్కువ పెంచుకోవడం మానుకోవాలనీ, బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంపై పాకిస్తాన్ దృష్టి పెట్టాలనీ పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. దేశం తన పరిమితులు, ప్రాధాన్యతల గురించి నిర్దాక్షిణ్యంగా వాస్తవికంగా మారాలని పాకిస్తాన్ మాజీ దౌత్యవేత్త షాహిద్ అమీన్ రాశారు. ఏమైనప్పటికీ, పాకిస్తాన్‌ను గెలవలేని సంఘర్షణలోకి నెట్టిన ప్రధాన సమస్యలు పెద్దగా పరిష్కారం కాలేదు. సైన్యం ఇప్పటికీ దేశ పగ్గాలను నియంత్రిస్తోంది. కశ్మీర్‌పై వాగాడంబరం కొనసాగుతోంది. ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. పైగా, ఉగ్రవాద సంస్థలకు పాక్ ప్రభుత్వ మద్దతు కొనసాగుతోంది.

నేడు, భారతదేశం చాలా శక్తిమంతమైన దేశం. ఇప్పుడు కార్గిల్ తరహా ఘటన అసంభవంగా కనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ, 1999 సంఘర్షణ పాకిస్తాన్ రాజ్యయంత్రాంగపు నిర్లక్ష్య స్థాయిని వెల్లడి చేసింది. ఆ దేశంలోని ప్రస్తుత పరిస్థితులు ఆ ముద్రను తొలగించడానికి పెద్దగా అనుకూలించవు.

వ్యాసకర్త మాజీ నార్తర్న్ ఆర్మీ కమాండర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అసలైన సమస్యలు



శుభ్రమైన నీళ్లు, స్వచ్ఛమైన గాలి ఎన్నికల అంశాలు కావాలి; అంతేగానీ కులం, మతం కాదు. ప్రపంచవ్యాప్తంగా మంచి నాయకులు ఎవరైనా సాధారణ నీటిని తాగేట్టుగానూ, సాధారణ గాలిని పీల్చేట్టుగానూ ఉంచుతారు.

– సోనమ్ వాంగ్‌చుక్, యాక్టివిస్ట్

మీదైతే రాయరా?



ఒకవేళ ఇండియా, టర్కీ, రష్యా విశ్వవిద్యాలయాల్లో గనక నిరసన ప్రదర్శనలు, వారిమీద పోలీసుల దౌర్జన్యం జరిగివుంటే, అమెరికా పత్రికల్లో స్వతంత్ర జర్నలిజం చూసేవాళ్లం.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఎడారిలో ఉన్నట్టుంది...



బెంగళూరులో ఉన్న ఈ 20 ఏళ్లలో ఎన్నడూ ఏసీ కావాలని అనిపించలేదు. ఇంతకుముందు ఈ నగరాన్ని ఏమైనా అంటే, ఇక్కడిది మంచి వాతావరణం అని జనాలు వెనకేసుకొచ్చేవారు. కానీ ఇక బెంగళూరువాసులు ఈ వాతావరణ కార్డును వాడలేరు. అసలు ఈ ఎండలేమిటి? నేనేదో రాజస్థాన్‌లో ఉన్నట్టుంది.

– ప్రేరణ నిరీక్షా అమ్మణ్ణ, ఇన్వెస్టర్

కొత్త వృత్తి



ఓ, అంటే ఇప్పుడు ప్రొఫెషనల్ ఆందోళనకారులు ఉన్నారైతే! వీళ్లు నిరసన ప్రదర్శనల్లో చేరి, హింసనూ, అశాంతినీ ప్రేరేపిస్తారన్నమాట! ఇది తెలియడం బాగుంది.

– టామ్ ఫిట్టన్, యూఎస్ ఫ్యాక్ట్ చెకర్

అనుకున్నట్టు రాక...



ఢిల్లీ మీడియా గాసిప్: ముంబయి లోని ఒక 'గౌరవనీయ' ఎన్జీవో ఎల్జీబీటీక్యూ+ సమాజం మీద జాతీయస్థాయి రాజకీయ సర్వే నిర్వహించింది. వాళ్లలో 37 శాతం బీజేపీకీ, 13 శాతం కాంగ్రెస్‌కూ మద్దతిచ్చారు. బీజేపీకి ఇంత మద్దతు రావడంతో హడలిన ఆ ఎన్జీవో ఫలితాలను ప్రచురించకుండా ఆపింది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

అవి సహజం



ప్రియమైన అమ్మాయిలూ, మొటిమతో బయటికి వెళ్లడం అనేది పరాక్రమమో, సాహసోపేత చర్యో కాదు. అదేసమయంలో మీరు సంతోషకరమైన, పరిపూర్ణమైన జీవితాన్ని గడపటానికి 'మచ్చలేని' చర్మం ఏమీ అక్కర్లేదు. ట్రెండింగ్ రీల్స్‌లో చూసేవన్నీ నమ్మొద్దు.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

మీరు మీరే!



ఇవాళ ఈ ప్రపంచంలో మీరు ఎదుర్కొనే అత్యంత గొప్ప ప్రమాదం ఏమిటంటే, మీకు బదులుగా ఇంకొకరు రాగలగడం. మీ వయసు పెరుగుతున్నకొద్దీ, యువకులు, తక్కువకు పనిచేయగలిగినవారు, ట్రెండ్‌కు అనుగుణంగా ఉన్నవారు మీ స్థానాన్ని లాక్కోగలరు. మీ అద్వితీయతను కాపాడుకుంటూ, మీవైన నైపుణ్యాలను గుర్తించడమే మీకు మోక్షం. అదే మీ చివరి ఆట.

– రాబర్ట్ గ్రీన్, రచయిత

ఇన్ బాక్స్

ప్రమాదంలో పత్రికాస్వేచ్ఛ

పత్రికా స్వేచ్ఛకు సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో నేడు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రాముఖ్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి సెక్రటరీ–జనరల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలాధారమైన పత్రికా స్వేచ్ఛను సమర్థించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 'శాంతి, న్యాయం, సుస్థిర అభివృద్ధి, మానవ హక్కుల కోసం పత్రికా స్వేచ్ఛ చాలా అవసరం... పారదర్శకమైన, నమ్మదగిన సమాచారాన్ని పొందకుండా ప్రజాస్వామ్యం పరిపూర్ణం కాదు' అని ఆయన పేర్కొన్నారు. 'రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్' ప్రకారం... 2023లో ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో జర్నలిస్టులపై దాడులూ, సమాచార ప్రవాహాన్ని నియంత్రించే ప్రయత్నాలూ పెరిగాయి.

తూర్పు యూరప్, మధ్య ఆసియా వంటి ప్రాంతాలలో పాత్రికేయులు నిరంతర నిఘాలో పనిచేస్తారు. రష్యా, బెలారస్ వంటి దేశాల్లో స్వతంత్ర మీడియా సంస్థలపై ఇటీవలి అణచివేతలు పత్రికా స్వాతంత్ర్యానికి సవాలుగా మారాయి. అదేవిధంగా, ఆసియా, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో జర్నలిస్టులు తమ సత్యాన్వేషణలో నిర్బంధాలు, ఏకపక్ష అరెస్టులు ఎదుర్కొంటున్నారు. మాల్టాలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ డాఫ్నే కరువానా గలిజియా విషాద హత్య, మయన్మార్‌లో వా లోన్, క్యావ్ సో ఓ వంటి జర్నలిస్టులను జైలులో పెట్టడం, అవినీతి, అన్యాయాన్ని బహిర్గతం చేయడానికి ధైర్యం చేసే జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రమాదాలను ఎత్తి చూపుతున్నాయి. జూన్‌లో ఓక్సాకా (మెక్సికో)లో జర్నలిస్ట్ గుస్తావో సాంచెజ్ కాబ్రేరాను కాల్చి చంపడాన్నీ గమనించాలి.

భారతదేశంలో కూడా జర్నలిస్టులు ప్రమాదాలను ఎదుర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జర్నలిస్ట్ రాకేష్ సింగ్‌పై 2023 సెప్టెంబర్‌లో దారుణంగా దాడి జరిగింది. జమ్మూ కాశ్మీర్‌లో జర్నలిస్టులు ఏడాది పొడవునా భద్రతా బలగాల బెదిరింపులు, వేధింపులను భరించారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం ఈ సమస్యలపై అవగాహన పెంచడానికీ, స్వేచ్ఛగా, ప్రతీకార భయం లేకుండా రిపోర్టు చేయడానికీ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం వాదించడానికీ ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

– డా॥ తారకేశ్వరరావు ఇప్పిలి
అసిస్టెంట్ ప్రొఫెసర్, జర్నలిజం విభాగం, ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం
(నేడు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం)

ముస్లిమ్‌లను పట్టించుకోరా?

అభిప్రాయం



మన్నారం నాగరాజు

భారతీయ రాజకీయ ప్రక్రియలో ముస్లిమ్‌లు, ఇతర మైనారిటీ సమూహాల లక్ష్యాలు, ప్రత్యామ్నాయ వ్యూహాలు గత దశాబ్ద కాలంగా చతికిల పడ్డాయి. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం 1901లో చేపట్టిన జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలోని ముస్లిమ్‌లను 133 కులాలుగా గుర్తించారు. వీరిలో అపరిశుభ్రమైన వృత్తుల్లో ఉన్న వారిని దళిత ముస్లిమ్‌లుగా గుర్తించడం జరిగింది. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన జనగణన తరువాత 96 కులాలను దళిత ముస్లిమ్‌లుగా షెడ్యూల్డ్ చేసి, వీరికి 1936 నుండి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కల్పించారు. తమ జీవనోపాధికి అపరిశుభ్రమైన వృత్తుల్లో ఉన్న సుమారు 60 ముస్లిమ్ కులాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళిత ముస్లిమ్‌లుగా గుర్తించారు.

అయితే స్వాతంత్ర్యానంతరం ఎస్సీ రిజర్వేషన్‌కు కేవలం హిందూ మతంలో ఉన్న దళిత కులాలను మాత్రమే పరిమితం చేసి హిందూమతేతర దళిత ముస్లింలు, దళిత క్రిష్టియన్లు, దళిత సిక్కులు, దళిత బౌద్ధ కులాలను ఎస్సీ రిజర్వేషన్ జాబితా నుండి తొలగించారు. యూపీఏ గవర్నమెంట్ హయాంలో ముస్లిమ్‌ల స్థితిగతులను అధ్యయనం చేయడానికి నియమించిన 'జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ' నివేదిక అపరిశుభ్రమైన వృత్తుల ద్వారా జీవనాన్ని గడుపుతున్న దళిత ముస్లిమ్‌లు ఎస్సీ, ఎస్టీల కన్నా అన్ని రంగాలలో దారుణంగా వెనుకబడి ఉన్నారని పేర్కొంది.

ఇక స్వరాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయన్న ముస్లిమ్‌ల కల కల్లయ్యింది. జనాభా దామాషా ప్రకారం తమకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, రాజకీయ ప్రాతినిధ్యం దక్కుతాయని వారు ఆశపడ్డారు. కానీ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ఆశలన్నీ అడియాసలయ్యాయి.



గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ మాత్రమే ముస్లిమ్ సమాజం నుంచి ఉన్నారు. 33 జిల్లాలలో ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యం క్రమంగా తగ్గిపోయిందనేది నగ్నసత్యం. అందుకే హైదరాబాదు పాతబస్తీ మినహాయించి, జిల్లాలలో ముస్లిమ్ ఓట్ల శాతం ఎక్కువగా ఉన్న కనీసం 10 నియోజకవర్గాలలో ముస్లిమ్ అభ్యర్థులకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వాలని పలు సంఘాలు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశాయి.


తెలంగాణలో ముస్లింలకు నామినేటేడ్ పదవులలో కూడా అన్యాయమే జరుగుతోంది. అప్పట్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నామినేటెడ్ పదవుల్లో దాదాపు 5 శాతం ముస్లిమ్‌లకు ఇవ్వడం మాత్రమే కొంత ఉపశమనం కలిగించిన చర్య అని భావించాలి. గత పదేళ్లలో తెలంగాణలో బీఆర్ఎస్ ఒక్క ముస్లిమ్ అభ్యర్థికి కూడా రాజ్యసభ సీటు ఇవ్వలేదు. ఇక రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో మైనారిటీ బడ్జెట్ వాటా విషయానికి వస్తే కేటాయింపులు చాలా తక్కువ. అయినా ఆ కేటాయించిన నిధులనూ పూర్తిగా ఖర్చు చేయకపోవడం శోచనీయం.

రాష్ట్రంలోని ముస్లిమ్‌లలో 75 శాతం మంది స్వయం ఉపాధి రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 2 లక్షలతో కూడిన పూర్తి సబ్సిడీ లోన్ ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 43 శాతం ముస్లిం కుటుంబాలకు సొంత ఇండ్లు లేవు. కిరాయి ఇండ్లలోనే జీవనం గడుపుతున్నారు. అందుకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం 12 శాతం ప్రత్యేక కోటా ఇవ్వాలని ముస్లిమ్‌లు డిమాండ్ చేశారు. ముస్లిమ్‌లను ప్రస్తుత దయనీయ పరిస్థితుల నుంచి బయటపడవేసే పార్టీనే ఈ పార్లమెంటు ఎన్నికలలో ఆ యా మైనారిటీ ఓటర్లు ఎన్నుకుంటారని ఆశిద్దాం.

వ్యాసకర్త తెలంగాణ లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు
మొబైల్: 95508 44433

ఆధ్యాత్మిక జ్ఞానం

ఈ శరీరం నాది కాదు, అలాగే ఈ భూమిపై కంటికి కనిపించే సమస్తమూ నాది కాదు. ఇక్కడ కళ్లకు కనబడే వస్తు సముదాయం ఎలాగైతే నాదో, అలాగే మిగతా అందరికి కూడా చెందుతుంది. ఇలా ఆలోచించడం వలన ఈ వస్తు సముదాయాన్ని గురించిన ఎలాంటి దిగులు నా మనసును బాధించదు. నేను ఒంటరిని. నాకు ఎవరూ సొంతమైనవారు లేరు. నేను వేరెవరికీ సొంతం కాను. నన్ను తమ సొంతం అనుకునే వారి వైపు నేను చూడను.



నాపై ఎవరికీ మమకారం కలగనివ్వను. అలాగే నేనూ ఎవరిపైనా మమకారం కలిగి లేను. ఎలాగైతే ఒక నదిలో తేలియాడుతూన్న రెండు కట్టెముక్కలు ఒక దానితో ఒకటి కొంత కాలం కలిసి ఉండి అంతలోనే ప్రవాహ గమనానికి విడిపోతాయో, అలాగే ఈ మానవ లోకంలోనూ మనుషులు కొంత కాలం కలిసి ఉండి ఆ తరువాత వీడిపోతూ ఉంటారు... ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికంగా తెలుసుకోవాల్సిన సమగ్రమైన జ్ఞానం ఇది!

భార్యాపిల్లల మీదనున్న అంతులేని అనురాగంతో, వారి సుఖం కోసం, మనిషి కొన్ని సందర్భాలలో పాప కర్మలను తెలిసి ఆచరిస్తాడు. అయితే, ఈ లోకంలోనైనా పర లోకంలోనైనా, ఆ కర్మల వలన కలిగే కష్టమైన ఫలితాలను తానొక్కడుగానే అనుభవించవలసి ఉంటుందన్నది గుర్తించాల్సిన సత్యం. ఈ లోకంలో సంగతుల మీది కాంక్ష వలన కలిగే వ్యాకులత పేరు దుఃఖం. ఆ దుఃఖాన్ని నిర్మూలించడం వలన కలిగేది సుఖం. సుఖానికైనా, దుఃఖానికైనా ఈ శరీరమే ఆధారం. కనుక, ఈ దేహం మీద మమకారం కలిగిన మనిషి ఈ శరీరంతో ఏఏ కర్మలు చేస్తాడో, ఆ పనుల ఆధారంగానే అంతిమంగా దొరికేది సుఖమో లేక దుఃఖమో నిర్ణయింపబడుతుంది.

రాహుగ్రస్తస్య సోమస్య యథా జ్యోత్స్నా న భాసతే।
తథా తమోభి భూతానాం భూతానాం నశ్యతే సుఖమ్॥

(వ్యాసభారతం, శాంతిపర్వం, 190వ అధ్యాయం, 8వ శ్లోకం)

రాహువు నోటిలో చిక్కుకున్న చంద్రుని వెన్నెల ఎలాగైతే ప్రకాశవంతమైనదిగా ఉండదో, అలాగే అజ్ఞానమనే తమస్సుచే పీడింపబడే మనుషుల జీవితాలలోని సౌఖ్యం నష్టమైపోతూ ఉంటుంది – అని పై శ్లోకం భావం.

– భట్టు వెంకటరావు

అవ్వాల్ డెస్క్ పేరిట నయా మోసం

- రిమోట్ యాక్సెస్ యాప్‌ల విషయంలో జరభద్రం
- ఏమార్చి మోసగిస్తున్న సైబర్ నేరగాళ్లు

సాక్షి, హైదరాబాద్: రిమోట్ యాక్సెస్ యాప్‌లతో సైబర్ నేరగాళ్ల మోసాలు పెరుగుతున్నాయని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఎనీ డెస్క్, టీం వ్యూవర్ వంటి రిమోట్ యాక్సెస్ యాప్‌లతో మోసాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ నేరగాళ్లు కొత్త దారులు వెతుకుతున్నట్టు పోలీసులు తెలిపారు. తాజాగా అవ్వాల్ డెస్క్ (AwalDesk) అనే యాప్‌తో మోసాలకు పాల్పడినట్టు గుర్తించామని పోలీస్ అధికారులు వెల్లడించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.2 లక్షలు కొట్టేసినట్టు తెలిపారు. ఈ తరహా కొత్త రిమోట్ యాక్సెస్ యాప్‌ల సంఖ్య క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ జాగ్రత్తలు మరవొద్దు..

- ఆన్‌లైన్ సమాచారం కోసం సెర్చ్ చేసే సమయంలో అందులోని ఫోన్ నంబర్లు సరైనవా లేదా అని నిర్ధారించుకోవాలి.
- కస్టమర్ కేర్ పేరిట, కంపెనీ ప్రతినిధుల పేరిట మాట్లాడుతూ, మిమ్మల్ని ఏవైనా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తే వెంటనే అనుమానించాలి.
- రిమోట్ యాక్సెస్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, మీకు వచ్చిన నంబర్‌ను చెప్పాలని సూచించినా అది సైబర్ నేరగాళ్ల పనే అని గుర్తించాలి.

సైబర్ భద్రతపై పోలీసు సిబ్బందికి శిక్షణ

- సైబర్ హైజిన్ సర్క్యులర్ జారీ

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల బారినపడకుండా పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా సైబర్ హైజిన్ నిబంధనలతో సర్క్యులర్‌ను టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో జారీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రధానంగా రోజువారీ వృత్తిగతంగా కంప్యూటర్లతో చేసే ప్రతి పనిలోనూ జాగ్రత్తలు వహించేలా అందులో కొన్ని సూచనలు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఈ సైబర్ హైజిన్ సర్క్యులర్‌ను పంపినట్టు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసుల సమాచారాన్ని భద్రపరచడం, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఈ–మెయిల్ లింక్‌లు తెరవకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను అందులో పేర్కొన్నట్టు పేర్కొన్నారు. సైబర్‌భద్రతపై పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కొందరు అధికారులను గుర్తించి వారికి సైబర్ భద్రత నిపుణులతో టీవోటీ (ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్)ను నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ శిక్షణ నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ నెల 17-19 తేదీల్లో ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో

- ఐజీబీసీ జాతీయ వైస్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి వెల్లడి



ప్రాపర్టీ షో వివరాలు వెల్లడిస్తున్న సి.శేఖర్‌రెడ్డి తదితరులు

సాక్షి,హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణ, వనరుల సంరక్షణపై ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన చేపట్టాల్సిన అవసరం ఉందని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) నేషనల్ వైస్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రీన్ బిల్డింగ్ పద్ధతులను అనుసరించే వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ నెల 17–19 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఐజీబీసీ రెండో ప్రాపర్టీ షో జరగనుంది. ఈ మేరకు ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో శేఖర్‌రెడ్డి మాట్లాడారు...హరిత భవనాలతో 30% వరకు ఇంధనం, 20% వరకు నీటి వినియోగం తగ్గుతుందని చెప్పారు. ఈ హరిత భవన నిర్మాణ వ్యయం కూడా తక్కువే ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో 825కు పైగా హరిత భవనాలున్నాయన్నారు. మూడు రోజుల ఈ ప్రాపర్టీ షోలో నగరంలో ఐజీబీసీ గుర్తించిన గ్రీన్ భవనాల సమాచారంతో పాటు వ్యర్థాల నిర్వహణ, టెర్రస్ గార్డెనింగ్ వంటి పలు అంశాలపై సెషన్స్ ఉంటాయని వివరించారు. విద్యార్థులకు 'డ్రీమ్ యువర్ ఫ్యూచర్ ఇన్ గ్రీన్ హోమ్'అంశంపై డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో కో–చైర్మన్ జి.శ్రీనివాస మూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఆనంద్, సీనియర్ కౌన్సిలర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపు భారత రాజ్యాంగ రక్షణ దీక్ష

- టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్ మాదిగ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం, రిజర్వేషన్లు లేకుండా ఈ దేశాన్ని పాలించాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల లక్ష్యమని అందుకే బీఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్‌మాదిగలు విమర్శించారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే బీజేపీ కుట్రకు నిరసనగా ఈ నెల 4న భారత రాజ్యాంగ రక్షణ దీక్ష చేయనున్నట్లు వారు వెల్లడించారు. గురువారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా, దేశంలో రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీ ప్రయత్నిస్తున్నా మంద కృష్ణ మాదిగ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 14 స్థానాల్లో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సీబీఐ కేసులో కవిత బెయిల్‌పై తీర్పు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి సీబీఐ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పును వాయిదా వేసింది. ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా.. ఏప్రిల్ 22న తీర్పు రిజర్వు చేసి మే 2న వెలువరిస్తామని తొలుత పేర్కొన్నారు. అయితే, ఈ నెల 6న ఈడీ కేసులోనూ తీర్పు వెలువరించాల్సిన నేపథ్యంలో అదే రోజు సీబీఐ కేసులోనూ తీర్పు ఇస్తామని గురువారం న్యాయమూర్తి తెలిపారు. బీఆర్‌ఎస్ తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా ఎన్నికల ప్రచారం చేయాల్సి ఉండడం, అలాగే ఆరోగ్య సమస్యల కారణంగా తనకు బెయిల్ మంజూరు చేయాలని కవిత కోర్టును అభ్యర్థించిన విషయం విదితమే.

ఉద్యోగులకు 40% ఫిట్‌మెంట్ వర్తింపజేయండి

- వేతన సవరణ కమిటీకి ట్రెసా బృందం విజ్ఞప్తి



పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను కలసిన ట్రెసా నేతలు రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీని ప్రతిపాదించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు 40% ఫిట్‌మెంట్ వర్తింపజేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కోరింది. అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ ప్రతినిధుల బృందం గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో వేతన సవరణ కమిటీ చైర్మన్ శివశంకర్ నేతృత్వంలోని పీఆర్సీని కలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి కీలక ప్రతిపాదనలు చేసింది. సచివాలయ ఉద్యోగులతో పోలిస్తే సమాన కేడర్ రెవెన్యూ ఉద్యోగులకు స్కేల్ తక్కువగా ఉన్న నేపథ్యంలో రానున్న పీఆర్సీలో సమాన స్కేల్ వర్తింపజేయాలని, సహకార శాఖలోని ఉద్యోగులకు సమానంగా పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ ట్రెసా బృందం శివశంకర్ బృందానికి వినతిపత్రం అందజేసింది. పీఆర్సీని కలిసిన వారిలో ట్రెసా ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, కె.నిరంజన్‌రావు తదితరులున్నారు.

ధరణి.. ఫుల్ చేంజ్!

పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిందేనని భావిస్తున్న పునర్నిర్మాణ కమిటీ

- మొత్తం 12 సెక్షన్లలో పెద్దఎత్తున సవరణలు
- అది జరిగితేనే అధికార వికేంద్రీకరణకు చట్టబద్ధత!
- రిజిస్ట్రేషన్లు ఎవరు చేయాలి? భూరికార్డులు ఎవరు నిర్వహించాలన్న దానితో పాటు పలు కీలక సిఫారసుల రూపకల్పనలో నిమగ్నం
- తహసీల్దార్లను ఈ అధికారాల నుంచి తప్పించాలనే యోచన
- ఎన్ఐసీ లేదా సీజీజీలకు పోర్టల్ నిర్వహణ బాధ్యత
- పార్ట్–బీలో చేర్చిన భూముల విషయంలోనూ ప్రత్యేక సిఫారసులు
- ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతున్న సభ్యులు
- చట్టాన్ని సవరిస్తారా? మార్చేస్తారా? నిర్ణయాధికారం ప్రభుత్వానికే..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో కీలకమైన 'ధరణి'పోర్టల్‌ను పునర్నిర్మించే ప్రక్రియలో భాగంగా పలు కీలక సిఫారసులు రూపొందుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో అమల్లో ఉన్న రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టం–2020ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిందేనని ధరణి పునర్నిర్మాణ కమిటీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చట్టంలో 12 సెక్షన్లు పొందుపరచగా దాదాపు అన్ని సెక్షన్లలో పెద్ద ఎత్తున సవరణలను ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈ మార్పులను ప్రస్తుత చట్టంలోనే చేస్తారా? లేక చట్టాన్నే మారుస్తారా? అనే దానిపై నిర్ణయాధికారం ప్రభుత్వానికే వదిలేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి, భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్, రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌ల నేతృత్వంలోని కమిటీ ఈ మేరకు నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమైంది. వాస్తవానికి క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తి చేసుకుని కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంది. అయితే భాగస్వామ్య పక్షాలతో చర్చలు ముగిసేలోపే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మధ్యంతర నివేదికను ఇవ్వాలని కమిటీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. కోడ్ ముగిసిన వెంటనే ఈ నివేదికలోని సిఫారసుల ఆధారంగా ప్రభుత్వం తాత్కాలిక చర్యలకు పూనుకుంటుందని, అనంతరం ధరణి కమిటీ ఇచ్చే పూర్తి స్థాయి నివేదికలోని సిఫారసుల మేరకు ధరణి పునర్నిర్మాణానికి అడుగులు పడతాయనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది.

సవరణ లేదా కొత్త చట్టం అనివార్యం!

ధరణి పోర్టల్ పేరు మారాలన్నా, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల నిర్వహణ, సమస్యల పరిష్కారంలో అధికార వికేంద్రీకరణ జరగాలన్నా చట్ట సవరణలు చేయడం లేదా కొత్త చట్టం అమల్లోకి తేవడం అనివార్యమని కమిటీ సిఫారసు చేయనుంది. అదే విధంగా ప్రస్తుతానికి ధరణి సమస్యల పరిష్కార ప్రక్రియ ఎక్కువగా కలెక్టర్ల చేతిలో ఉంది. తాజాగా జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఈ అధికారాలు కొన్ని అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు కట్టబెట్టినా వీటికి చట్టబద్ధత కలగాలంటే మాత్రం ఆర్‌వోఆర్ చట్టంలో మార్పులు తప్పనిసరిగా చేయాలని కమిటీ భావిస్తోంది. దీంతో పాటు రాష్ట్రంలో భూరికార్డుల నిర్వహణ ఎవరు చేపట్టాలి? రిజిస్ట్రేషన్లను ధరణి చట్టం ప్రకారం చేయాలా? స్టాంపుల చట్టం ప్రకారం చేయాలా? ఈ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అధికారం ఎమ్మార్వోలకే ఉంచాలా? మళ్లీ సబ్ రిజిస్ట్రార్లకు అప్పగించాలా? లేదా డిప్యూటీ తహసీల్దార్లకు కట్టబెట్టాలా? అన్న దానిపై కమిటీ నిశితంగా అధ్యయనం చేస్తున్నట్టు సమాచారం. కాగా తహసీల్దార్ల నుంచి ఈ అధికారాలను తప్పించాలనే యోచనలో కమిటీ ఉన్నట్టు తెలుస్తోంది. ఇక భూ రికార్డుల నిర్వహణ (ధరణి పోర్టల్) బాధ్యతలను ప్రైవేట్ కంపెనీకి కాకుండా నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) లేదా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లకు అప్పగించాలని కూడా కమిటీ సిఫారసు చేయనున్నట్టు సమాచారం.

పార్ట్–బీపై ప్రత్యేకంగా..

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రాష్ట్రంలోని దాదాపు 18 లక్షల ఎకరాల వ్యవసాయ భూములను పార్ట్–బీ (నిషేధిత జాబితా)లో చేర్చారు. వీటికి సంబంధించి ఇప్పటివరకు కొత్త పాసు పుస్తకాలు ఇవ్వలేదు. ఈ పాసు పుస్తకాల కోసం రైతులు కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతున్నారు. కాగా ఇందులో 5 లక్షల ఎకరాలకు కనీసం ఎటువంటి కారణాలు చూపెట్టకుండానే పార్ట్–బీ ఆపాదించినట్టు తెలుస్తోంది. మిగిలిన వాటిలో కొన్నిటికి కోర్టు కేసులుండగా, కొన్నింటిని చిన్నచిన్న ఫిర్యాదుల ఆధారంగా పార్ట్–బీలో చేర్చారు. ఈ నేపథ్యంలో పార్ట్–బీ భూముల పరిష్కారానికి సంబంధించి కూడా మధ్యంతర నివేదికలో పలు సిఫారసులు పొందుపర్చనున్నారు.

ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం ఓ నిరంతర ప్రక్రియ. అయితే అధికార వికేంద్రీకరణ లేని కారణంగా రాష్ట్రంలో 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోయాయి. వీటిని పరిష్కరించేందుకు పునర్నిర్మాణ కమిటీ చొరవతో ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది.

దరఖాస్తుల పరిష్కారం ఆగిందా?

గడువు ముగిసినా మరోమారు పొడిగించింది. కానీ ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో స్పెషల్ డ్రైవ్‌ను నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ సాకుతో ధరణి సాధారణ కార్యకలాపాలను కూడా నిలిపివేశారని, తహసీల్దార్ల స్థాయిలో తప్ప మిగిలిన ఏ స్థాయిలోనూ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా టీఎం–33 కింద పెండింగ్‌లో ఉన్న లక్షకు పైగా దరఖాస్తుల్లో స్పెషల్ డ్రైవ్‌లో 20 వేల వరకు పరిష్కరించినా మిగిలిన వాటి జోలికి వెళ్లడం లేదని సమాచారం. ఇక జిల్లాల కలెక్టర్లు, సీసీఎల్ఏ స్థాయిలో ఏ దరఖాస్తును పరిష్కరించడం లేదని తెలుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని చెప్పి తప్పించుకుంటున్నారని, వాస్తవానికి ధరణి పోర్టల్ ద్వారా దరఖాస్తులు పరిష్కరించడానికి కోడ్ అడ్డంకి కాదని, స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు మాత్రమే కోడ్ అడ్డంకి అని చెపుతున్నా ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. మొత్తం మీద స్పెషల్ డ్రైవ్ చేపట్టే నాటికి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన మరో 50 వేలకు పైగా దరఖాస్తులు కలిపి మొత్తం 3 లక్షల దరఖాస్తులకు గాను ఇప్పటివరకు లక్షకు పైగా దరఖాస్తులు మాత్రమే పరిష్కారమైనట్లు సమాచారం.

యువరాజు కోసం పాక్ ఆరాటం

కాంగ్రెస్ పతనం చూసి ఏడుస్తోంది ● ఇండియాలో బలహీన, అవినీతి ప్రభుత్వం రావాలన్నదే వారి కోరిక

- బలమైన మోదీ ప్రభుత్వం ఉన్నంత కాలం పాక్ ఆటలు సాగవు
- గుజరాత్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ



సురేంద్రనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఆనంద్: విపక్ష కాంగ్రెస్‌ను పాకిస్తాన్‌కు శిష్యరికం చేసే పార్టీగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ)ని మన దేశ తదుపరి ప్రధానమంత్రిని చేసేందుకు పాకిస్తాన్ తహతహలాడుతోందని అన్నారు. ఇండియాలో బలహీన, అవినీతి ప్రభుత్వం అధికారంలోకి రావాలని మన శత్రువులు కోరుకుంటున్నారని ఆరోపించారు. ఇండియాలో కాంగ్రెస్ పతనమవుతుండడం చూసి పాకిస్తాన్ నాయకులు కన్నీరు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ బాగు కోసం వారు ప్రార్థిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ముమ్మాటికీ పాకిస్తాన్‌ను అనుసరించే పార్టీయేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రశంసిస్తూ పాకిస్తాన్ మాజీ మంత్రి చౌదరీ ఫవాద్ హుస్సేన్ ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోను మోదీ ప్రస్తావించారు. పాకిస్తాన్, కాంగ్రెస్ మధ్య అనుబంధం ఇప్పుడు పూర్తిగా బయటపడిందని చెప్పారు. భారత్‌లో అత్యంత బలమైన మోదీ ప్రభుత్వం ఉన్నంతకాలం పాకిస్తాన్ ఆటలు సాగవని తేల్చిచెప్పారు. తాము ఎవరికీ తలవంచబోమని స్పష్టం చేశారు. తమ పాలనలో పాకిస్తాన్ ఉగ్రవాద టైర్లు పంక్చర్ అయ్యాయని అన్నారు. గతంలో ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసిన దేశం ఇప్పుడు గోధుమ పిండి కూడా దిగుమతి చేసుకోలేక తిప్పలు పడుతోందని, గతంలో బాంబులు విసిరిన చేతులు నేడు భిక్షపాత్ర పట్టుకొని యాచిస్తున్నాయని పేర్కొన్నారు. గురువారం గుజరాత్‌లోని ఆనంద్, సురేంద్రనగర్, జునాగఢ్, జామ్‌నగర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు కట్టబెట్టడానికి వీలుగా రాజ్యాంగాన్ని మార్చాలని కాంగ్రెస్ కుట్ర పన్నిందని మండిపడ్డారు. నరేంద్ర మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

ఓటు జిహాద్.. సిగ్గుచేటు

''భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదుగుతోంది. ప్రపంచదేశాలు భారత్‌ను విశ్వబంధుగా పరిగణిస్తున్నాయి. రెండు దేశాల మధ్య వివాదాలను పరిష్కరించే సత్తా భారత్‌కు ఉంది. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేసి ముస్లింలకు దొడ్డిదారిన రిజర్వేషన్లు ఇవ్వబోమంటూ కాంగ్రెస్, ఇండియా కూటమి పక్షాలు దేశ ప్రజలకు గ్యారంటీ ఇవ్వాలి. రాజ్యాంగం ప్రతిని నెత్తిన పెట్టుకొని డ్యాన్సులు చేయడం పిచ్చిపని. కాంగ్రెస్ యువరాజు ఇలాంటి పనులు మానుకోవాలి. రాజ్యాంగం కోసం ఎలా జీవించాలో, ఎలా మరణించాలో తెలుసుకోవాలంటే నా దగ్గరికి రండి.. నేర్పిస్తా. మనం ఇప్పటిదాకా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ గురించి విన్నాం . ఇప్పుడు విపక్ష ఇండియా కూటమి కొత్తగా ఓటు జిహాద్ అంటోంది. మతం ఆధారంగా బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలంటున్నారు. ఇలాంటి పిలుపులు ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని కించపర్చడమే. మదర్సాల్లో చదువుకున్నవారు కాదు, ఉన్నత చదువులు చదివినవారు ఓటు జిహాద్ అంటుండడం సిగ్గుచేటు. దీనిపై కాంగ్రెస్ ఎందుకు నోరుమెదపడం లేదు? ప్రతిపక్ష కూటమి ఉద్దేశాలు ప్రమాదకరంగా ఉన్నాయి.

కాంగ్రెస్ చిమ్ముతున్న విషం..

కులం పేరిట, మతం పేరిట సమాజాన్ని ముక్కలు చేసి, ఎన్నికల్లో లబ్ధి పొందాలని కాంగ్రెస్ కుతంత్రాలకు పాల్పడుతోంది. బుజ్జగింపు విధానాల ద్వారా ఓటు బ్యాంక్‌ను సంఘటితం చేసుకోవాలని చూస్తోంది. మతపరమైన రిజర్వేషన్లను ఎన్నికల అజెండాగా మార్చాలని ప్రయత్నిస్తోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీలకు చెందిన 27 శాతం కోటాను రాత్రికి రాత్రే లూటీ చేసింది. ముస్లింలకు కట్టబెట్టింది. రాజ్యాంగాన్ని రాసిన ముసాయిదా కమిటీలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులెవరూ లేరు. అంబేడ్కర్ లాంటి మేధావులు రాజ్యాంగాన్ని రాశారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొద్దని స్పష్టంగా చెప్పారు. కాంగ్రెస్ మాత్రం రాజ్యాంగాన్ని లెక్కచేయడం లేదు. కాంగ్రెస్ చిమ్ముతున్న విషం ఇంకా ఎక్కడిదాకా వెళ్తుందో నాకు అర్థం కావడంలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు ఉగ్రవాదులకు మద్దతిచ్చారు. కశ్మీర్‌లో వేర్పాటువాదుల ఎదుట సిగ్గులేకుండా మోకరిల్లారు. ఢిల్లీ బాట్లాహౌస్ ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతమైతే ఒక మేడమ్(సోనియా గాంధీ) బాధతో కన్నీరు ఆపులేకపోయారట! మన విశ్వాసాన్ని ఎగతాళి చేయడానికి కాంగ్రెస్ నేతలు వెనుకాడడం లేదు. సందర్భం వచ్చినప్పుడులా మన విశ్వాసాన్ని కించపరుస్తున్నారు. అదే ధైర్యం ఇతర మతాల విషయంలో ఆ నాయకులకు ఉందా? స్వార్థం కోసం, ఓట్ల కోసం సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తామంటే మేము చూస్తూ ఊరుకొనే ప్రసక్తే లేదు.

'మిషన్' పూర్తిచేయాలన్నదే లక్ష్యం

ఈ ఎన్నికలను నా వ్యక్తిగత ఆకాంక్షలను నెరవేర్చుకొనే ఎన్నికలుగా నేను భావించడం లేదు. నా ఆకాంక్షలను 2014లోనే ప్రజలు నెరవేర్చారు. 2024 ఎన్నికల తర్వాత నా 'మిషన్'ను పూర్తి చేయాలన్నదే లక్ష్యం. కేంద్రంలో బలమైన, స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు కావడం కేవలం మన దేశానికే కాదు, మొత్తం ప్రపంచానికి కూడా అవసరం . శ్రీరాముడిని శివుడు ఓడించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిలుపునిస్తున్నారు. ఇదెక్కడి వైపరీత్యం? మొఘల్ రాజులు అదే ఆలోచనా ధోరణి కలిగి ఉండేవారు. అయోధ్యలో రామ మందిరాన్ని, సోమనాథ్‌లో ఆలయాన్ని మొఘల్ రాజులు కూల్చేశారు. దేవుళ్ల మధ్య కూడా చిచ్చు పెట్టి, హిందువులను కులాల వారీగా విడదీయాలన్నదే కాంగ్రెస్ కుతంత్రం. అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ని, ట్రిపుల్ తలాక్‌ను మళ్లీ తీసుకొస్తామని చెప్పే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా? దుష్ట కాంగ్రెస్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి'' అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు.



ఎన్నికల విచిత్రం

కేంద్ర మంత్రి, యూపీలోని అమేథీ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ గురువారం అమేథీలో 'ఆవాసన్ మయ్యా పూజ'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళకు బొట్టు పెడుతున్న దృశ్యమిది.

ఎలక్షన్ బీట్

జూన్ 4 తర్వాత కాంగ్రెస్ అన్వేషణ యాత్ర: అమిత్ షా

బరేలీ: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం తప్పదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. ఆ పార్టీ ఇక కనిపించకుండా పోతుందని అన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాల తర్వాత యువరాజు రాహుల్ గాంధీ 'కాంగ్రెస్ అన్వేషణ యాత్ర' చేసుకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. దేశమంతటా తిరుగుతూ కాంగ్రెస్ ఎక్కడుందో వెతుక్కోవాల్సిందేనని అన్నారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ, బుదౌన్‌లో ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా ప్రసంగించారు. అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ వేడుకకు కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ హాజరు కాలేదని, ఓటు బ్యాంక్ దూరం అవుతుందన్న భయమే ఇందుకు కారణమని విమర్శించారు.

బీజేపీ అవినీతిపరులనే ప్రోత్సహిస్తుంది

కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ధ్వజం

చిర్‌మిరి: బీజేపీ అవినీతి పరులను, ప్రజాసంక్షేమం, సమస్యల గురించి మాట్లాడని రెండు వర్గాల వారిని మాత్రమే ప్రోత్సహిస్తుందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆరోపించారు. 'ఇతర పార్టీల్లో ఉన్న అవినీతి నేతలపై ముందుగా ఆరోపణలు గుప్పిస్తుంది. వారిపై ఒత్తిడి తెస్తుంది. అలా వారిని బీజేపీలో చేర్చుకుంటుంది. కాషాయ కండువా కప్పుకున్నాక వీరంతా మచ్చలేని నేతలుగా మారిపోతారు. వీరిపై ఎలాంటి కేసులూ ఉండవు. వీరు మొదటి రకం'అని ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు. 'ఇక రెండో రకం..ఈ నేతలు పెరుగుతున్న ధరల గురించిగానీ, పేదల సమస్యల గురించి గానీ మాట్లాడరు. ఇటువంటి వారికే కమలదళం ప్రోత్సాహం ఇస్తుంది' అని ఆమె అన్నారు.

ప్రతి భారతీయుడూ ఓటు బ్యాంకే: ఖర్గే

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకున్న రిజర్వేషన్లను లాగేసుకుని ఓటు బ్యాంకుకు ఇస్తుందంటూ ఎన్డీపే అభ్యర్థులకు ప్రధాని మోదీ రాసిన లేఖపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే స్పందించారు. ఆ లేఖలో వాడిన భాష ప్రధాని హోదాకు తగినట్లుగా లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి పేదలు, అణగారిన వర్గాలు, మహిళలు, యువత, కార్మికులు, దళితులు, ఆదివాసీలు.. ఇలా ప్రతి భారతీయుడూ ఓటు బ్యాంకేనన్నారు. విద్వేష ప్రసంగాలకు బదులు గత పదేళ్లలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని చూపించి ప్రజలను ఓట్లడగాలని మోదీని కోరారు.

బీజేపీ మద్దతుదార్లను గంగలో పడేస్తా

టీఎంసీ ఎమ్మెల్యే హుమాయూన్ వివాదాస్పద వ్యాఖ్యలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని అధికార టీఎంసీ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీ మద్దతుదారులను రెండు గంటల్లోనే గంగలో పడేస్తానంటూ ప్రకటించారు. గురువారం ఆయన ముస్లిం ప్రాబల్యముండే ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో 'బీజేపీ మద్దతుదారులను భాగీరథి (గంగ ఉపనది)లో రెండు గంటల్లోనే పడేయలేకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా. శక్తిపూర్‌లో వాళ్లను ఉండనివ్వను. ముర్షిదాబాద్‌లో 70 శాతం ముస్లింలుంటే హిందువుల జనాభా 30 శాతం మాత్రమేనని తెలుసుకోండి' అని పేర్కొన్నారు.

నోటా మీట నొక్కండి: ఇండోర్‌లో కాంగ్రెస్

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వింత పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇక్కడ పార్టీ అభ్యర్థి ప్లేటు ఫిరాయించడంతో నోటాకు ఓటేయాలంటూ ప్రచారం చేస్తోంది. ఈ నెల 13వ తేదీన ఇండోర్ సీటుకు పోలింగ్ జరగనుంది. అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ ఆ పార్టీకి షాకిచ్చారు. నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి రోజైన సోమవారం బరి నుంచి తప్పుకోవడంతోపాటు, ప్రత్యర్థి బీజేపీ పక్షంలో చేరుతున్నట్లు ప్రకటించారు. అభ్యర్థి లేని కాంగ్రెస్..తాము ఏపార్టీకీ మద్దతివ్వమని ప్రకటించింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, తమ అభ్యర్థిని అన్యాయంగా చేర్చుకున్న బీజేపీని శిక్షించాలంటే నోటా(నాన్ ఆఫ్ ది ఎబవ్) బటన్ నొక్కండంటూ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ జితూ పట్వారీ ఓటర్లను కోరుతున్నారు.

ఓటర్ల వివరాల సేకరణ ఆపండి: ఈసీ

న్యూఢిల్లీ: తమ పార్టీలు గెలిస్తే అమలుచేయబోయే సంక్షేమ పథకాల కోసమంటూ రాజకీయ పార్టీలు ఓటర్ల వివరాలను సేకరిస్తున్న వైనాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా తప్పుబట్టింది. సర్వేల మాటున పార్టీలు చేస్తున్న ఇలాంటి చట్టవ్యతిరేక విధానాలను తక్షణం ఆపేయాలని ఆదేశించింది. ఈ మేరకు జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలు, అభ్యర్థులకు ఈసీ అడ్వైజరీ జారీచేసింది.

బ్రిజ్ భూషణ్ కుమారుడికి బీజేపీ టికెట్



సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బదులుగా ఆయన చిన్న కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు బీజేపీ టికెట్టిచ్చింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్‌కు ఈ దఫా బీజేపీ అవకాశం ఇస్తుందా లేదా అన్న ఉత్కంఠ నడుమ ఈ పరిణామం చోటుచేసుకుంది. కరణ్ భూషణ్ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, గోండా జిల్లాలోని నవాబ్‌గంజ్ సహకార బ్యాంకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. డబుల్ ట్రాప్ షూటింగ్‌లో జాతీయస్థాయి క్రీడాకారుడు కూడా. బ్రిజ్ భూషణ్ పెద్ద కుమారుడు ప్రతీక్ భూషణ్ ఇదే లోక్‌సభ నియోజకవర్గంలోని గోండా స్థానం ఎమ్మెల్యేగా ఉన్నారు. క్షత్రియ వర్గానికి చెందిన బ్రిజ్ భూషణ్ 1991 నుంచి మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో చక్రం తిప్పుతున్నారు. 1991లో గోండా నుంచి తొలిసారి ఎంపీగా గెలిచిన ఆయన 2009 నుంచి కైసర్‌గంజ్ ఎంపీగా ఎన్నికవుతున్నారు. మొత్తంగా ఆరుసార్లు ఎంపీ అయిన ఆయన ఐదుసార్లు బీజేపీ నుంచి, ఒక పర్యాయం ఎస్పీ తరఫున గెలిచారు. మరోపక్క 2011 నుంచి 2023 వరకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా కొనసాగారు. 2023లో బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు గురి చేశారంటూ రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా సహా ఇతర ఒలంపియన్‌లు ఆందోళనలకు దిగడంతో ఆయన తప్పుకున్నారు. లైంగిక ఆరోపణల కేసు ఢిల్లీ హైకోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ బీజేపీ ఆయన అభ్యర్థిత్వాన్ని పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. నేటితో అక్కడ నామినేషన్ల పర్వం ముగుస్తున్న నేపథ్యంలో గురువారం బీజేపీ ఆయన కుమారుడు కరణ్ భూషణ్ పేరును ప్రకటించింది.

ఉగ్రవాది గోల్డీ బ్రార్ బతికే ఉన్నాడు

ప్రకటించిన కాలిఫోర్నియా పోలీసులు

వాషింగ్టన్: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో నిందితుడైన గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది గోల్డీ బ్రార్ మృతి చెందినట్లు వచ్చిన వార్తలను అమెరికాలోని కాలిఫోర్నియా పోలీసులు కొట్టిపారేశారు. గోల్డీబ్రార్ బతికే ఉన్నాడని చెప్పారు. ఫ్రెస్నో సిటీలో మంగళవారం సాయంత్రం రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగిన కాల్పుల్లో గోల్డీ బ్రార్ మరణించాడని స్థానిక మీడియా వెల్లడించింది. అయితే, హతుడిని 37 ఏళ్ల జేవియర్ గ్లాండీగా ఫ్రెస్నో పోలీసులు బుధవారం గుర్తించారు. గోల్డీ బ్రార్ హతమైనట్లు భారత మీడియాలోనూ ప్రసారమైంది.

సీబీఐ మా నియంత్రణలో లేదు

- సీబీఐ దర్యాప్తులో జోక్యం చేసుకొనే ప్రసక్తే లేదు
- సుప్రీంకు కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) తమ నియంత్రణలో లేదని కేంద్ర ప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. సీబీఐ ఒక కేసును నమోదు చేయడాన్ని గానీ, సీబీఐ దర్యాప్తును గానీ తాము పర్యవేక్షించలేమని వెల్లడించింది. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని, విపక్షాలను లక్ష్యంగా చేసుకొని వేధించడానికి వాడుకుంటోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తునకు ఇచ్చిన సాధారణ సమ్మతిని బెంగాల్ ప్రభుత్వం 2018 నవంబర్ 16న ఉపసంహరించుకుంది. దాంతో రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తు చేయలేదు. కొన్ని నెలల క్రితం బెంగాల్‌లో ఈడీ అధికారుల బృందంపై జరిగిన దాడిపై సీబీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది. సందేశ్‌ఖాలీ అక్రమాలపై దర్యాప్తు చేపట్టింది. దీనిపై బెంగాల్ సర్కారు అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ అనుమతి తీసుకోకుండానే సీబీఐ తమ రాష్ట్రంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసులు దర్యాప్తు చేస్తోందని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 కింద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. బెంగాల్‌లో కేసులను భారత ప్రభుత్వం నమోదు చేయలేదని, సీబీఐ నమోదు చేసిందని తెలిపారు. సీబీఐపై ప్రభుత్వ నియంత్రణ ఉండదన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ దర్యాప్తులో కేంద్రం జోక్యం చేసుకొనే ప్రసక్తే లేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

డీసీడబ్ల్యూలో 52 మంది తొలగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్(డీసీడబ్ల్యూ)లోని 52 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తూ ఢిల్లీ ప్రభుత్వ మహిళా శిశు అభివృద్ధి(డబ్ల్యూసీడీ) విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీరిని నియమించినట్లు పేర్కొంది. వాస్తవానికి కమిషన్‌లోని 223 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తూ డబ్ల్యూసీడీ గతంలో ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలపై తాజాగా వివరణ ఇస్తూ..223 మందికి గాను ప్రస్తుతం ఉన్న 52 మందిని తీసేస్తున్నట్లు తెలిపింది. ఈ ఆదేశాలపై ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ చీఫ్ స్వాతీ మలివాల్ స్పందిస్తూ..తుగ్లక్ ఫర్మానా అంటూ ఎద్దేవా చేశారు.

400.. జోక్
300.. అసాధ్యం
200.. ఒక సవాలే

కేరళ, తమిళనాడు, ఏపీలో బీజేపీ ఖాతా తెరవదు

బీజేపీకి రాబోయే సీట్లపై శశిథరూర్ వ్యాఖ్య

ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ: ఈసారి 400 సీట్లు సాధిస్తామంటూ బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ నేత, తిరువనంతపురం అభ్యర్థి శశిథరూర్ జోక్‌గా అభివర్ణించారు. పీటీఐతో ఇంటర్వ్యూ సందర్భంగా పలు అంశాలపై ఆయన వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

కేరళలో బీజేపీ బోణీపై..

'' దేశవ్యాప్తంగా 400 చోట్ల గెలుస్తానని బీజేపీ నిజంగా జోక్ చేస్తోంది. 300 సీట్లు అసాధ్యమనుకోండి. కనీసం 200 నియోజకవర్గాలను గెల్చుకోవడం కూడా ఆ పార్టీకి పెద్ద సవాలే. దిగువసభలో అధికారపార్టీ మెజారిటీ కోల్పోతుందనేది దాదాపు ఖరారైంది. కేరళలో ఈసారి కూడా బీజేపీ బోణీ కొట్టబోదు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే సీన్ రిపీట్ అవుద్ది. 2019నాటితో పోలిస్తే ఈసారి దక్షిణాదిన కమలం కమిలిపోవడం ఖాయం''

కాంగ్రెస్, 'ఇండియా' కూటమిపై..

''రెండు దశల్లో పోలింగ్ ముగిసిన 190 స్థానాల్లో విపక్షాల 'ఇండియా' కూటమికి అద్భుతమైన స్పందన వచ్చింది. 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ ఓటర్లు చూపిన ఎమోషన్స్, ఉత్సాహం ఈ సారి ఎన్నికల్లో కనిపించకపోవచ్చు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు సానుకూల పవనాలను బాగా నమ్ముతున్నారు. ఈసారి ఊహించిన దానికంటే ఎంతో ముందున్నాం''

విపక్షాల విక్టరీ స్థానాలపై..

ఈసారి విపక్షాల కూటమి ఎన్ని సీట్లు గెలుస్తుందన్న ప్రశ్నకు ఆయన సరదాగా '' క్రికెట్‌కు వీరాభిమానిని అయినాసరే ఎంత స్కోర్ కొడతారనేది ఊహించలేను. కానీ గెలుపును ఊహిస్తా. బీజేపీ–ఎన్డీఏ ప్రభుత్వం మెజారిటీని కోల్పోతుంది. కొన్ని రాష్ట్రాల్లో బీజేపీ హవా కొనసాగొచ్చు. ఇంకొన్ని రాష్ట్రాల్లో మా కూటమి సత్తా చాటొచ్చు. హరియాణాలో గతంలో కాంగ్రెస్ ఒక్కసీటు కూడా గెలవలేదు. కానీ ఒపీనియన్ పోల్స్ ప్రకారం ఈసారి మాకు అక్కడ 5–7 సీట్లు రావచ్చు. కర్ణాటకలో ఒక్కటే గెలిచాం. ఈసారి 10–17 గెలుస్తామంటున్నారు. కొందరైతే 20 మావే అంటున్నారు''

తెలంగాణలో బీజేపీ గెలుపుపై..

' తెలంగాణలో ఈసారి బీజేపీ గెలవడం కష్టమే. బీజేపీ, కాంగ్రెస్ వీళ్లలో ఎవరు జనాన్ని ఆకట్టుకున్నారనేది తేలాల్సి ఉంది. ఇంకా 353 స్థానాల్లో పోలింగ్ మిగిలే ఉంది. ఈ లెక్కన ఎన్నికల్లో ప్రధాన ఘట్టం ముందుంది. నాదో ప్రశ్న. ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో ఒక యువకుడు 2014లో బీజేపీకి ఓటేశాడు. అదే యువకుడు పదేళ్ల తర్వాత కూడా అదే బీజేపీకి ఎందుకు ఓటేయాలి? 2014లో బీజేపీ ఆర్థికవ్యవస్థను చక్కబెట్టేందుకు కృషిచేశామని చెప్పింది. అయినా ఎకానమీలో మార్పు తేలేకపోయింది. 2019లో పుల్వామా దాడులు బాలాకోట్ ఘటనతో దేశ జాతీయభద్రత ప్రశ్నార్థకమైంది. ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం బీజేపీకి చేతకాదు. ప్రజలకు ఉద్యోగాలు దక్కలేదు. అధిక ధరల వల్ల నచ్చినవి కొనలేకపోయారు. చైనాతో సరిహద్దు విషయంలోనూ బీజేపీ విఫలమైంది. సరిహద్దుల వెంట 65 పెట్రోలింగ్(గస్తీ) పాయింట్లలో 26 పాయింట్లను భారత్ కోల్పోయింది. ఛాతి విరిచి చెప్పుకునేంతగా మోదీ ఏం చేశారు?''



వర్సిటీలో నిరసనకారులు, పోలీసుల బాహాబాహీ

కాలిఫోర్నియా వర్సిటీలోకి పోలీసులు

పాలస్తీనా అనుకూల నిరసనకారుల శిబిరాలు ధ్వంసం

లాస్ ఏంజెలిస్: గాజాలో తక్షణ కాల్పుల విరమణ డిమాండ్‌తో లాస్ ఏంజెలిస్ నగరంలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో తిష్టవేసిన పాలస్తీనా అనుకూల విద్యార్థులు, నిరసనకారుల తాత్కాలిక శిబిరాలను పోలీసులు చెల్లాచెదురుచేశారు. పాలస్తీనా అనుకూల, ఇజ్రాయెల్ అనుకూల నిరసనకారులకు మధ్య ఘర్షణతో వర్సిటీలో బుధవారం ఉద్రిక్తత నెలకొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు వర్సిటీలోకి ప్రవేశించారు. టెంట్‌లను తొలగించి నిరసనకారులను చెదరగొట్టారు. దీంతో 1000 మందికిపైగా నిరసనకారులు పోలీసులను ప్రతిఘటించారు. '' జరిగింది చాలు శాంతించండి'' అని వర్సిటీ చాన్స్‌లర్ జీన్ బ్లాక్ వేడుకున్నారు. డార్ట్‌మౌత్ కాలేజీలో టెంట్లు కూల్చేసి 90 మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు. ఏప్రిల్ 17న కొలంబియాలో మొదలైన ఈ పాలస్తీనా అనుకూల నిరసన ఉదంతాల్లో అమెరికావ్యాప్తంగా 30 విద్యాలయాల్లో 2,000 మందికిపైగా అరెస్ట్‌చేసినట్లు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. 'అసమ్మతి ప్రజాస్వామ్యానికి కీలకం. అయితే శాంతిభద్రతలకు విఘాతం కల్గించేస్థాయికి అసమ్మతి పెరిగిపోకూడదు'' అని అమెరికా అధ్యక్షుడు బైడెన్ అన్నారు. బ్రిటన్‌లోని బ్రిస్టల్, లీడ్స్, మాంచెస్టర్, న్యూక్యాజిల్, షెఫీల్డ్ వర్సిటీల్లోనూ నిరసనకారుల శిబిరాలు వెలిశాయి. యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లలో ఇప్పటికే నిరసనకారులు ఆందోళనలు మొదలెట్టారు. ఫ్రాన్స్, లెబనాన్, ఆస్ట్రేలియాలకూ నిరసనలు విస్తరించాయి.

ప్రజ్వల్‌పై లుక్‌అవుట్ నోటీసు

కలబురిగి: పలువురు మహిళలపై లైంగిక వేధింపులు, దౌర్జన్యం కేసులో కర్ణాటక ప్రభుత్వం జేడీ(ఎస్) పార్టీ హసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లుక్‌అవుట్ నోటీసును జారీచేసింది. లుక్‌అవుట్ నోటీసు నేపథ్యంలో ప్రజ్వల్ జర్మనీ నుంచి వచ్చాక అరెస్ట్‌చేసే చేసే వీలుంది. విదేశాల్లో ఉండటంతో సిట్ దర్యాప్తు ఎదుట హాజరయ్యేందుకు ఏడు రోజుల సమయం కావాలన్న అభ్యర్థనను సిట్ నిరాకరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజ్వల్‌పై లుక్‌అవుట్ నోటీసు జారీచేసింది. ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా తాజాగా మరో బాధిత మహిళ ఫిర్యాదు చేసిందని, ఆమె వాంగ్మూలాన్ని రికార్డుచేశారని కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర గురువారం వెల్లడించారు. విదేశీ ప్రయాణానికి అనువుగా ప్రజ్వల్‌కు ప్రత్యేకంగా ఎలాంటి ప్రయాణ అనుమతులు మంజూరుచేయలేదని భారత విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. విదేశాలకు పారిపోవడంలో కేంద్ర ప్రభుత్వ హస్తం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో విదేశాంగ శాఖ స్పందించింది. ''దౌత్య పాస్‌పోర్ట్ ఉన్న ప్రజ్వల్‌కు ఎలాంటి వీసాతో పనిలేదు' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ ఢిల్లీలో చెప్పారు. ప్రజ్వల్ పాస్‌పోర్ట్ రద్దుపై మీడియా ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేదు.

400 మంది మహిళలపై అఘాయిత్యం

- ఇది సెక్స్ కుంభకోణం కాదు.. మాస్ రేప్ ఘటన
- ప్రజ్వల్ రేవణ్ణపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు



శివమొగ్గ/రాయ్‌చూర్: కర్ణాటకలో 400 మంది మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన మాస్ రేపిస్ట్ ప్రజ్వల్ అంటూ జేడీ(ఎస్) సిట్టింగ్ ఎంపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని శివమొగ్గ, రాయ్‌చూర్ జిల్లా కేంద్రాల్లో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. '' ఈ సెక్స్ కుంభకోణం గురించి మోదీకి ముందే తెలుసు. తలచుకుంటే సెకన్లలో ప్రజ్వల్‌ను అరెస్ట్‌చేసేవారు. సీబీఐ, కస్టమ్స్, ఇమిగ్రేషన్, ఈడీ అన్ని దర్యాప్తు సంస్థలు వాళ్ల చేతుల్లోనే ఉన్నాయి. అయినా కావాలనే పారిపోనిచ్చారు. ప్రజ్వల్‌ను మోదీ రక్షించాల్సిన అవసరమేంటి? ప్రజ్వల్ కోసం ప్రచారం చేస్తూ ఓట్లు అడగాల్సిన గత్యంతరమేంటి?'' అని మోదీని రాహుల్ నిలదీశారు.

కర్ణాటకను చూసి మోదీ భయపడుతున్నారు

''అధికారం, కూటమి కోసం ప్రజ్వల్‌ను కాపాడుతున్నారని కర్ణాటక మహిళలు గ్రహించారు. దేశాన్ని కాపాడాల్సిన ప్రధాని, హోం మంత్రి ప్రజ్వల్‌ను రక్షిస్తున్నారు. ఇదే మాకు, బీజేపీ సిద్ధాంతాలకు మధ్య ఉన్న తేడా. అధికారం కోసం వాళ్లు ఏదైనా చేస్తారు. ఘటన తర్వాత కర్ణాటకను చూసి మోదీ భయపడుతున్నారు. రాష్ట్రంలో పాల్గొనాల్సిన అన్ని సమావేశాలు, ర్యాలీలను మోదీ రద్దుచేసుకున్నారు'' అని అన్నారు. '' బాధితుల్లో మైనర్లూ ఉన్నారు. అంతా తెల్సి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మౌనంగా ఉన్నారు. నిజంగా ఇది నేరం. ఆయనపై కేసు నమోదుచేయాలి. రేపిస్ట్‌కు మద్దతుగా ఓట్లు అడిగినందుకు దేశంలోని తల్లులు, అక్కాచెల్లెళ్లకు మోదీ క్షమాపణలు చెప్పాలి. ప్రజ్వల్ చేసింది తెల్సి కూడా మీ ఓట్లను మోదీ అడిగారని కర్ణాటక మహిళలు గ్రహించాలి. బీజేపీ నేతలకు ప్రజ్వల్ రేపిస్ట్ అని ముందే తెలుసు. అయినాసరే ఆయనకు మద్దతు పలికి జేడీ(ఎస్)తో పొత్తు పెట్టుకున్నారు'' అని ఆరోపించారు.

సమానత్వం కోరితే నక్సలైట్లు అంటున్నారు

''సమానత్వం కోరితే వారిని బీజేపీ చీఫ్ నడ్డా నక్సలైట్ అంటున్నారు. దళితులు, వెనుకబడిన వాళ్లు, గిరిజనులు సమానత్వం కావాలంటున్నారు. అంతమాత్రాన వారంతా నక్సలైట్లు అయిపోతారా? ఇలా మాట్లాడిన నడ్డా వెంటనే తన పార్టీ చీఫ్ పదవికి రాజీనామాచేయాలి. నడ్డా వ్యాఖ్యలపై మోదీ వివరణ ఇవ్వాలి'' అని డిమాండ్‌చేశారు.

స్కూలు ఫీజులు తగ్గుతాయా?

ఫీజు నియంత్రణ చట్టంపై ఇప్పటికీ స్పష్టత కరువు

జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న 2024-25 విద్యా సంవత్సరం

జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆ తర్వాతే నిర్ణయం

వచ్చే ఏడాది నుంచి అమలయ్యే అవకాశం ఉందన్న విద్యాశాఖ వర్గాలు

క్లాస్-1 అడ్మిషన్ వయో పరిమితి అంశంలోనూ నిర్ణయం తీసుకోని సర్కారు



సాక్షి, హైదరాబాద్: పాఠశాలల్లో ఫీజు నియంత్రణకు మరికొంత సమయం వేచి చూడాల్సిందే. ప్రైవేటు స్కూళ్లలో ఫీజు దోపిడీకి చెక్ పెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందిస్తోంది. ఈమేరకు కసరత్తు వేగవంతం చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఇందుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు.

➤ 2024-25 విద్యా సంవత్సరం జూన్ 12నుంచి పునః ప్రారంభం కానుంది. ఆలోపు ఫీజు నియంత్రణకు సంబంధించి స్పష్టత, ఉత్తర్వులు వస్తే ఆ మేరకు తల్లిదండ్రులు పిల్లల స్కూల్ ఫీజుల చెల్లింపులపై అంచనాలు వేసుకునే పరిస్థితి ఉంటుంది. అయితే జూన్ 6వ తేదీ వరకు పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. దీంతో ఆలోపు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసే పరిస్థితి లేదు. ఆ తర్వాత కసరత్తు వేగవంతం చేసినప్పటికీ ఫీజు నియంత్రణ చట్టం ఖరారయ్యేందుకు మరికొంత సమయం పడుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఫీజు నియంత్రణ చట్టం అమలు అనుమానంగానే ఉంది. చట్టం రూపకల్పన, ఆ తర్వాత చట్టసభల్లో ఆమోదం తర్వాతే ఫీజు నియంత్రణకు లైన్ క్లియర్ కానుందని, దీంతో 2025-26 నుంచి ఈ చట్టం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

మరోవైపు ఒకటో తరగతిలో ప్రవేశానికి 6 సంవత్సరాల వయసు నిండి ఉండాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. ఈ నిబంధనల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కానీ ఈ అంశంపైనా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మన రాష్ట్రంతో పాటు ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, హర్యానా సహా చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వయస్సు

ఒకటో తరగతికి ఆరేళ్ల మాటేమిటి?

ప్రమాణాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోని నేపథ్యంలో 2025-26 విద్యా సంవత్సరం నాటికే ఈ అంశంపై స్పష్టత రానుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఒకటో తరగతి ప్రవేశానికి ఆరేళ్ల వయోపరిమితి నిబంధనతో జేఈఈ, నీట్ వంటి పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులకు నష్టం జరుగుతుందనే ప్రచారం ఉంది. కాగా, 2024-25 విద్యా సంవత్సరంలో ఐదేళ్ల వయోపరిమితి నిబంధనతోనే ప్రవేశాలు జరుగుతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



అగ్గిపెట్టెలో పట్టే చీరను అందజేస్తున్న హరిప్రసాద్ దంపతులు

సీతమ్మకు అరుదైన చీర

- అగ్గిపెట్టెలో పట్టేంత చీర
- తయారు చేసిన సిరిసిల్ల దంపతులు

దుమ్ముగూడెం: సీతమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టేంత చీరను నేసి కానుకగా సమర్పించారు సిరిసిల్లకు చెందిన చేనేత దంపతులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి సిరిసిల్లకు చెందిన ఎల్ది హరిప్రసాద్ దంపతులు మగ్గంపై నేసిన చేనేత వస్త్రాలను సమర్పించారు. శ్రీరాముడికి వస్త్రాలతో పాటు సీతమ్మకు అగ్గిపెట్టెలో పట్టేంత చీర నేసి గురువారం ఆలయ అధికారి అనిల్‌కుమార్‌కు అందజేశారు.

6, 8 తేదీల్లో ఏపీకి ప్రధాని మోదీ

- రాజమండ్రి, అనకాపల్లి, రాజంపేట, విజయవాడలో పర్యటన
- రెండు చోట్ల బహిరంగ సభల్లో పాల్గొనే అవకాశం



సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో రెండు రోజులు పర్యటించనున్నట్లు బీజేపీ రాష్ట్ర వర్గాలు తెలిపాయి. 6వ తేదీన బీజేపీ పోటీ చేస్తున్న రాజమండ్రి, అనకాపల్లి లోక్‌సభ నియోజక వర్గాల పరిధిలో, 8వ తేదీ రాజంపేట లోకసభ నియోజకవర్గ పరిధిలో, అదే రోజు సాయంత్రం విజయవాడ నగరంలో ప్రధాని పర్యటన ఉంటుందని పేర్కొన్నాయి. ఇప్పటికే విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు 8వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు రోడ్ షో నిర్వహణ షెడ్యూల్ ఖరారైందని.. మిగిలిన మూడు ప్రాంతాల్లో ప్రధాని పర్యటన షెడ్యూల్‌పై రాష్ట్ర పార్టీలో చర్చ సాగుతున్నట్లు తెలిపాయి. నాలుగు ప్రాంతాల్లో పర్యటించే మోదీ కనీసం రెండు చోట్ల బహిరంగ సభల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

అక్రమాలకు పాల్పడ్డ దేశద్రోహి రామోజీని అరెస్ట్ చేయాలి..

- ఆలిండియా బ్యాక్ వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ భూపాల్‌గౌడ్ డిమాండ్



పంజాగుట్ట(హైదరాబాద్): అనేక అక్రమాలకు, అక్రమార్జనకు, దేశద్రోహానికి పాల్పడ్డ రామోజీ రావును వెంటనే అరెస్టు చేయాలని ఆలిండియా బ్యాక్ వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ భూపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. మార్గదర్శి షేర్లలో సింహభాగం గాదిరెడ్డి జగన్నాథరెడ్డి(జీజేఆర్)వేనని తెలిపారు. జీజే రెడ్డి దేశద్రోహం నేరం కింద అరెస్టు కావల్సి ఉండగా.. అతనికి రామోజీరావు పాస్‌పోర్టు ఇప్పించి విదేశాలకు పారిపోయేలా చేశాడని, అతను విదేశాలకు వెళ్లగానే మార్గదర్శి షేర్లు మొత్తం రామోజీరావు తీసుకుని తానే యజమానిగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. దేశద్రోహం కేసు హైకోర్టులో నిర్ధారణ అయిన వ్యక్తిని దేశం దాటించిన రామోజీరావు కూడా దేశద్రోహినన్నారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో భూపాల్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దేశం వదిలి వెళ్లే సమయంలో జీజేఆర్ పెట్టిన పెట్టుబడులు ఎన్ని? ఇప్పుడు వాటి వాస్తవ విలువ ఎంత? అనే విషయం తేల్చాలని, అతని ఈనాడు, మార్గదర్శి, నవభారత్, రామోజీ ఫిల్మ్‌సిటీ అన్ని అటాచ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై త్వరలోనే రాష్ట్ర డీజీపీని కలుస్తానని భూపాల్‌గౌడ్ తెలిపారు.

గ్లాసు గుర్తుపై టీడీపీ వ్యాజ్యాన్ని వ్యతిరేకించిన ఈసీఐ

- ఇప్పటికే ఓటింగ్ ప్రక్రియ మొదలైంది
- ఈ తరుణంలో కోర్టుల జోక్యంపై నిషేధం ఉంది
- ఏపీ హైకోర్టుకు నివేదించిన భారత ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: గాజు గ్లాసు గుర్తు విషయంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) టీడీపీకి షాక్ ఇచ్చింది. టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో గాజు గ్లాసు గుర్తును అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో జనసేన పార్టీకే రిజర్వ్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఎన్నికల సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. టీడీపీ వ్యాజ్యానికి ఎంతమాత్రం విచారణార్హతే లేదని హైకోర్టుకు నివేదించింది. ఇప్పటికే ఓటింగ్ ప్రక్రియ మొదలైందని వివరించింది. బుధవారం సాయంత్రం నుంచే బ్యాలెట్ పేపర్ల ముద్రణ మొదలైందని తెలిపింది. ఎలక్ట్రానిక్ బ్యాలెట్లను ఇప్పటికే భద్రతా దళాలకు పంపామని కోర్టుకు వివరించింది. రాష్ట్రంలో 85 సంవత్సరాలు పైబడిన వారిలో కొందరు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ముందుకొచ్చారని.. వారి నుంచి గురువారం పోస్టల్ బ్యాలెట్ల సేకరణ ప్రక్రియ మొదలైందని తెలిపింది.

ఎన్నికల ప్రక్రియ మొదలైతే న్యాయస్థానాల జోక్యానికి అవకాశం లేదు

ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని, రాజ్యాంగంలోని అధికరణ 329(బీ) కింద నిషేధం ఉందని భారత ఎన్నికల సంఘం కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చినా అది ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించినట్టు అవుతుందని స్పష్టం చేసింది. టీడీపీ తరఫు న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. పిటిషనర్‌ను సంప్రదించి తదుపరి నిర్ణయం తెలియచేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు న్యాయస్థానం అంగీకరిస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక చౌకగా రొమ్ము కేన్సర్ కిట్ల తయారీ


- అమెరికా కంపెనీతో హెచ్‌సీయూకి చెందిన స్టార్టప్ సంస్థ ఒప్పందం



హెచ్‌సీయూలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, స్టార్టప్ ప్రతినిధులు

రాయదుర్గం: అత్యంత చౌకగా రొమ్ము కేన్సర్‌ను గుర్తించే డయాగ్నొస్టిక్ కిట్‌ల అభివృద్ధికి ముందడుగు పడింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లోని ఇంక్యుబేటర్ సంస్థ యాస్పైర్ బయోనెస్ట్ సహకారంతో కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్టప్ కంపెనీ ఎలిసిటన్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ దిశగా కసరత్తుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అమెరికాకు చెందిన 'వివి బయోలాజిక్స్'తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. కేన్సర్‌ను తొలినాళ్లలోనే గుర్తించే, అందరికీ అందుబాటు ధరల్లో లభించే సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో ఈ రెండు సంస్థలు ఇకపై కలసి పనిచేయనున్నాయి. ఎలిసిటన్ స్టార్టప్ సంస్థ సాధారణ పోషకాలకన్నా ఎక్కువగా ఆరోగ్య ప్రయోజనాలను అందించే సూక్ష్మ పోషక సప్లిమెంట్లను తయారు చేయడంలో ఇప్పటికే ప్రత్యేకత సంతరించుకుంది. అలాగే హైదరాబాద్ శివార్లలోని మెడికల్ డివైజెస్ పార్కులో డయాగ్నొస్టిక్ పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. మరోవైపు ప్రముఖ కేన్సర్ పరిశోధకుడు, వివి బయోలాజిక్స్ వ్యవస్థాపకుడైన డాక్టర్ కిరణ్ వేల్పుల హెచ్‌సీయూ పూర్వ విద్యార్థే. ప్రస్తుతం ఆయన యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయి కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే కేన్సర్‌కు కొత్త చికిత్సా పద్ధతులపై పరిశోధన చేస్తున్న వేల్పుల న్యూరో ఆంకాలజీ ల్యాబ్‌కు నేతృత్వం వహిస్తున్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు





నాకు టికెట్ ఇవ్వండి!

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం బీజేపీలో పోటాపోటీ
- నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల సీటు కోసం గట్టిగా ప్రయత్నాలు
- రేసులో ప్రేమేందర్ రెడ్డి, కాసం, ధర్మారావు, ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ కోసం బీజేపీలో గట్టి పోటీ నెలకొంది. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం ఈసీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో పోటీ ఊపందుకుంది. ఈ టికెట్ కోసం పలువురు నాయకులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. పార్టీ బీఫామ్ కోసం రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, రాష్ట్ర కార్యదర్శి డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి పోటీపడుతున్నారు. మే 2 నుంచి 9వ తేదీ మధ్య అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉండటంతో... రాష్ట్ర, జాతీయ నాయకత్వాన్ని మెప్పించేందుకు వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. విద్యార్థి రాజకీయాలతో విస్తృత సంబంధాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువు, విద్యారంగంలో పనిచేస్తూ టీచింగ్ కమ్యూనిటీతో పరిచయాలు, పెద్ద సంఖ్యలో డిగ్రీ, పీజీ విద్యార్థులతో అనుబంధం తదితర కారణాలతో తనకు టికెట్ ఇవ్వాలని కాసం వెంకటేశ్వర్లు నాయకత్వాన్ని కోరినట్లు సమాచారం.

టికెట్ కోరుతున్న మిగతా వారంతా గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా పోటీ చేసినందున ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర కార్యదర్శి డా. ప్రకాశ్‌రెడ్డి గట్టిగా కోరుతున్నారు. తాను ఇప్పటిదాకా పార్టీ తరఫున ఏ ఎన్నికల్లో పోటీచేయనందున ఓ విద్యావంతుడిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని ఆయన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పార్టీకి వివిధ రూపాల్లో సేవలందిస్తున్న తనకు అవకాశమిచ్చేలా జాతీయ నాయకత్వానికి సిఫార్సు చేయాలని ముఖ్యనేతలను కోరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయగా, ప్రేమేందర్‌రెడ్డి గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేశారు. కాసం వెంకటేశ్వర్లు గతంలో రెండు పర్యాయాలు అసెంబ్లీకి పోటీచేసిన విషయం తెలిసిందే.

బీజేపీ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్

మోదీ, అమిత్ షా విద్వేష ప్రసంగాలపై చర్యలు తీసుకునే ధైర్యం లేదు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను కూడా గుప్పిట పెట్టుకుని ఆడిస్తోందని.. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలతో పాటు ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై 48 గంటల నిషేధంతో ఎన్నికల కమిషన్ వైఖరి బయటపడిందని విమర్శించారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''జాతులు, మతాల ఆధారంగా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వైషమ్యాలు రెచ్చగొడుతూ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలను తిడుతూ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా బీజేపీ విషం చిమ్ముతోంది. బీజేపీ కాకుండా ఇతరులు అధికారంలోకి వస్తే.. సంపదను ఎక్కువ పిల్లలున్న ముస్లింలకు దోచిపెడతారంటూ వారు వ్యాఖ్యలు చేస్తున్నా ఈసీ నుంచి ఉలుకూపలుకూ లేదు. ఆ వ్యాఖ్యలపై 20వేల మందికిపైగా పౌరులు ఈసీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే ధైర్యం లేక.. మోదీకి బదులుగా బీజేపీ అధ్యక్షుడు నడ్డాకు నోటీసులు ఇచ్చింది. ఎన్నికల్లో దేవుడు, మతాన్ని ప్రస్తావించడం నేరమని తెలిసీ.. అమిత్ షా, పలువురు బీజేపీ నేతలు శ్రీరాముడి ఫొటో పట్టుకుని ఓట్లు అడుగుతున్నారు. అయినా వారికి నోటీసులు, చర్యలు లేవు. వ్యక్తిత్వ హననాలు, వ్యక్తిగత దూషణలు ఈసీకి కనిపించడం లేదు. కేసీఆర్‌పై రాకెట్ వేగంతో చర్యలు తీసుకున్న ఎన్నికల కమిషన్ నిజంగా స్వతంత్ర సంస్థ అయితే.. మోదీ, రేవంత్‌లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ఈసీ వైఖరి ఉంది. ఒక పార్టీ, కొందరు నాయకులు ఆధీనంలో ఉన్నట్టు కనిపిస్తోంది.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి

ఆ మాటలేమైనా ప్రవచనాలా?

'నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోండి..' అంటూ కాంగ్రెస్ నేత చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ కేసీఆర్ ఒక్క మాట మాట్లాడితే.. 48 గంటల పాటు మాట్లాడకుండా గొంతు నొక్కారు. బీఆర్‌ఎస్ నుంచి సీఎం రేవంత్‌పై ఎనిమిది ఫిర్యాదులు.. మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ తదితరుల వ్యాఖ్యలపై 27 ఫిర్యాదులు చేసినా ఈసీ స్పందించలేదు. ఏప్రిల్ 10న తుక్కుగూడ సభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈసీకి ప్రవచనాలు, సుభాషితాలు, సూక్తుల్లా కనిపించాయా? రేవంత్ మాటలను ఉటంకించడానికి సంస్కారం అడ్డువస్తోంది. అలాంటి వ్యాఖ్యలపై ఈసీ చర్యలేవి?

కూడబలుక్కుని నిషేధం పెట్టారు

కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీలకు దడ పుట్టింది. ప్రజలు కేసీఆర్‌కు బ్రహ్మరథం పడుతున్నారనే వార్తలు, నిఘా సంస్థల నివేదికలు వారికి కంటగింపుగా మారాయి. బీఆర్‌ఎస్‌కు 8 నుంచి 12 సీట్లు వస్తాయని సర్వేలు చెప్తుండటం, జన స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదు. దీంతో బడే భాయ్ మోదీ, చోటే భాయ్ రేవంత్ కూడబలుక్కుని కేసీఆర్ ప్రజల వద్దకు వెళ్లకుండా నిషేధం పెట్టారు. ఈ అప్రజాస్వామిక ప్రయత్నాలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్.. కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించింది. కొందరిని మాత్రం ప్రజలు, ప్రత్యర్థుల మీదకు అచ్చోసిన ఆంబోతుల్లా వదిలేసింది.

రేవంత్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి

హాస్టళ్ల మూసివేతపై ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ గతేడాది ఇచ్చిన సర్క్యులర్, స్టాంప్‌ను ఫోర్జరీ చేసి 'ఎక్స్'ఖాతాలో పోస్టు చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు పెట్టాలి. ఉస్మానియా వర్సిటీ చీఫ్ వార్డెన్ ఇచ్చిన సర్క్యులర్‌ను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. దాంతో ఓయూ చీఫ్ వార్డెన్‌కు రిజిస్ట్రార్, సదరన్ డిస్కం నుంచి నోటీసులు ఇప్పించారు. అంతటితో ఆగకుండా గత ఏడాది చీఫ్ వార్డెన్ ఇచ్చిన సర్క్యులర్‌ను రేవంత్ పోస్టు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. రేవంత్ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను 'ఎక్స్'లో పోస్టు చేసిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. క్రిశాంక్ పెట్టిన సర్క్యులర్ తప్పు అని ఓయూ అధికారులు నిరూపిస్తే.. చంచల్‌గూడ జైలుకు వెళ్లేందుకు నేను సిద్ధం. రేవంత్‌పై ఓయూ విద్యార్థులు చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయాలి. ఈసీ నిజంగా స్వతంత్ర సంస్థ అయితే రేవంత్‌పై చర్యలు తీసుకోవాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



సీఎం రేవంత్‌ను కలిసిన ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో రాజగోపాల్‌రెడ్డి తదితరులు

సీఎం రేవంత్‌ను కలిసిన ఇంద్రకరణ్‌రెడ్డి

పార్టీ నేతలతో కలిసి మర్యాదపూర్వక భేటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, రోహిత్‌చౌదరి, మన్సూర్‌అలీఖాన్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్‌చైర్మన్ జి. చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి రేవంత్‌రెడ్డితో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

ట్రిపుల్‌ఆర్ పేరిట బిల్డర్ల నుంచి వసూళ్లు



ట్రిపుల్‌ఆర్ అంటే రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, రియల్‌ఎస్టేట్ ట్యాక్స్: బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ట్రిపుల్‌ఆర్ ట్యాక్స్ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు బిల్డర్ల నుంచి వసూళ్లపర్వం మొదలుపెట్టిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ట్రిపుల్‌ఆర్ అంటే రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి. రియల్‌ఎస్టేట్ ట్యాక్స్ అని వివరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడున్నర నెలల తర్వాత హైదరాబాద్ పరిసరాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. సడన్‌గా సెటిల్‌మెంట్లు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను సెటిల్‌మెంట్ బ్రాండ్‌గా మార్చారని తీవ్ర ఆరోపణలు చేశారు. ట్యాక్స్‌లో భాగంగా గంట గంటకు ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓలు) మార్చారన్నారు. కొత్తగా రేవంత్ సర్కార్ సెటిల్‌మెంట్లు చేసుకొని 120 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. గతంలో మంత్రి కేటీఆర్ ఫ్లోర్ లెక్కన డబ్బులు తీసుకుంటే.. రేవంత్ మాత్రం నగదు కావాలని అడుగుతున్నాడంట అని ఆరోపించారు. వసూలు చేసిన దాంట్లో నాలుగోవంతు మాత్రమే ఢిల్లీకి పంపి, మూడొంతులు రేవంత్ పెట్టుకుంటున్నారని, ఎన్నికల ఖర్చు కోసమే డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు చదరపు అడుగు నిర్మాణానికి రూ. 68 ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ తీసుకుంటుంది నిజం కాదా? అని నిలదీశారు. ఇప్పటి దాకా ఈ ట్యాక్స్ పేరిట రూ. 6వేల కోట్లు వసూలు చేశారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మరో మూడు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ మరో అవినీతిని బయటపెడతానని చెప్పారు.

బీజేపీకే మా మద్దతు

1969 ఉద్యమకారుల సమితి

బంజారాహిల్స్ (హైదరాబాద్): పార్లమెంట్ ఎన్నికల్లో తాము బీజేపీకి మద్దతు ఇవ్వడమే కాకుండా సమీప పార్లమెంట్ స్థానాల్లో కార్లతో ర్యాలీగా వెళ్లి ప్రచారం నిర్వహించనున్నట్లు 1969 ఉద్యమకారుల సమితి ప్రకటించింది. సమితి అధ్యక్షుడు, మాజీ మంత్రి మెచినేని కిషన్‌రావు, సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావు, ఉద్యమకారుడు కె.ప్రభాకర్ ముత్యాలయాదవ్‌లు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ విమోచన దినోత్సవంగా గుర్తిస్తూ గెజిట్ విడుదల చేసిందని తెలిపారు. అలాగే ఉద్యమకారులను గుర్తించి, హైదరాబాద్‌లో దాదాపు 100 ఎకరాల్లో స్మృతి వనాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించిందని వెల్లడించారు. ఈ కారణంగానే తాము ఎన్నికల్లో సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల తదితర పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారానికి వెళ్లి బీజేపీకి మద్దతుగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి 250 గజాల స్థలం, నెలకు రూ.25 వేలు పింఛన్ ఇస్తామంటూ ప్రకటించినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. తెలంగాణలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విమోచన ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. 1969 తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే ఉద్యమకారులపై కేసులు కొట్టివేయాలని, మలిదశ ఉద్యమంలో బలిదానాలు చేసిన ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, మూడెకరాల వ్యవసాయ భూమి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఏడో తేదీ నుంచి సమితి ఆధ్వర్యంలో ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెచినేని కిషన్‌రావు, దుశర్ల సుదర్శన్‌రావు

ఓటుకు కోట్లు కేసులో రేవంత్‌కు జూలై 14 డెడ్‌లైన్

నిజామాబాద్ ఎంపీ అర్వింద్



మల్లాపూర్ (జగిత్యాల): ఓటుకు కోట్లు కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని, జూలై 14 ఆయనకు డెడ్‌లైన్ అని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలకేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ...రేవంత్‌రెడ్డిని ఓటుకు నోటు కేసు వెంటాడుతోందన్నారు. ఆ కేసులో రేవంత్ ఎప్పుడు జైలుకు వెళ్తారా అని ఆయన మంత్రివర్గ సహచరులు, కాంగ్రెస్ నాయకులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పదేళ్లలో ప్రజలకు కొన్నైనా పథకాలు అందించారని, రేవంత్ సర్కార్ పూర్తిగా అబద్ధాలతోనే ప్రజలను మోసం చేసి అధికారం చెలాయిస్తోందని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లు తప్ప మోదీ ఏమీ తీసేయబోరని...ఎవరూ భయపడొద్దని సూచించారు. రాష్ట్రంలో 12 పార్లమెంట్ స్థానాలు బీజేపీ గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు.

నేటి నుంచి మళ్లీ కేసీఆర్ ప్రచారం

- రాత్రి 8 తర్వాత రామగుండంలో రోడ్ షో
- రేపు మంచిర్యాలలో, ఆదివారం జగిత్యాలలో..
- 10న సిద్దిపేటలో సభతో బస్సు యాత్ర ముగింపు... ఫామ్‌హౌస్‌లో ప్రచార సరళిపై బీఆర్‌ఎస్ అధినేత సమీక్ష
- 10-12 స్థానాల్లో గెలిచే చాన్స్ ఉందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఎన్నికల ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం విధించిన 48 గంటల నిషేధం శుక్రవారం రాత్రి 8 గంటలకు ముగియనుంది. ఆ తర్వాత వెంటనే బస్సుయాత్ర తిరిగి ప్రారంభించాలని కేసీఆర్ నిర్ణయించారు. గతంలో బీఆర్‌ఎస్ రూపొందించిన షెడ్యూల్ మేరకు శుక్రవారం రాత్రి రామగుండంలో రోడ్ షోకు కేసీఆర్ హాజరవుతారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 8 గంటలకు ప్రచారం నిలిపివేసిన కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలోని తన నివాసానికి చేరుకున్న విషయం తెలిసిందే. కాగా ఎన్నికల ప్రచారాన్ని తిరిగి ప్రారంభించేందుకుగాను శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరనున్న కేసీఆర్ రాత్రికి రామగుండం చేరుకుని రోడ్ షోలో పాల్గొంటారు. రాత్రికి అక్కడే బస చేసి శనివారం సాయంత్రం మంచిర్యాలలో, ఆదివారం జగిత్యాలలో జరిగే రోడ్ షోల్లో పాల్గొంటారు. ఈ నెల 10వ తేదీ వరకు గతంలో నిర్ణయించిన షెడ్యూలుకు అనుగుణంగానే కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగుతుందని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 10న సిరిసిల్లలో రోడ్ షో, సిద్దిపేటలో బహిరంగ సభతో కేసీఆర్ పార్లమెంటు ఎన్నికల ప్రచారం ముగుస్తుంది. గురువారం జమ్మికుంట, వీణవంకలో రోడ్ షోలు నిర్వహించాల్సి ఉండగా, ఈసీ ఆదేశాలతో నిలిపివేసిన విషయం తెలిసిందే.

ప్రజా స్పందన ఎలా ఉంది?

బుధవారం రాత్రి ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కేసీఆర్ గురువారం పార్టీ అభ్యర్థులు, నేతలతో ఫోన్ ద్వారా మాట్లాడి పార్టీ ఎన్నికల ప్రచార సరళిని సమీక్షించారు. ఇప్పటివరకు బస్సుయాత్ర, రోడ్ షోలు జరిగిన ప్రాంతాల్లో ప్రజల నుంచి వస్తున్న స్పందనపై ఆరా తీశారు. రాబోయే వారం రోజుల పాటు చేయాల్సిన ప్రచారంపై దిశా నిర్దేశం చేశారు. ప్రచార లోపాలను సరిదిద్దుకుని పార్టీ యంత్రాంగంతో మరింత సమన్వయం చేసుకోవాలని సూచించారు. తాజా సర్వేల ప్రకారం బీఆర్‌ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు వచ్చే అవకాశముందని వెల్లడించారు. పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపాలని, కాంగ్రెస్, బీజేపీ విధానాలతో జరిగే నష్టాన్ని మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

కాంగ్రెస్‌ను నమ్మి గ్రామీణులు మోసపోయారు

- ఆరు గ్యారంటీల పేరుచెప్పి గద్దెనెక్కి వాటిని అమలు చేయట్లేదు
- హైదరాబాద్‌కు కేసీఆర్ తెచ్చిన కంపెనీలు రేవంత్ అసమర్థత వల్ల బయటకు పోతున్నాయి
- జూన్ 2న నగరాన్ని యూటీ చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది
- మూసాపేట, రహమత్‌నగర్ రోడ్ షోలలో మాజీ మంత్రి కేటీఆర్
- మల్కాజిగిరి, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థుల తరఫున ప్రచారం



మూసాపేట వద్ద రోడ్‌షోలో పాల్గొన్న కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

మూసాపేట/రహమత్‌నగర్: గ్రామాల్లోని ప్రజలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు చెప్పారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ సర్కారు ఇంకా ఆ హామీలను అమలు చేయట్లేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు 10-12 సీట్లు అందిస్తే బీజేపీ, కాంగ్రెస్‌లను కూకటివేళ్లతో పెకిలించి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ శాసిస్తారని చెప్పారు. పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ తరఫున గురువారం హైదరాబాద్‌లోని మూసాపేట, రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లలో నిర్వహించిన రోడ్‌షోలలో ఆయన పాల్గొన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పాటు నగర పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించినట్లుగానే నగరంలోని లోక్‌సభ స్థానాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలో కరెంటు కోత.. నీటి కొరత

కేసీఆర్ ఉన్నప్పుడు హైదరాబాద్ సహా తెలంగాణలో ఎక్కడా కరెంటు కోతలు లేవని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు రోజుకు 4-5 సార్లు కరెంటు పోతోందన్నారు. మంచినీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి తెచ్చిన కంపెనీలు గుజరాత్, తమిళనాడుకు వెళ్లిపోయాయని చెప్పారు. రాష్ట్రానికి ఉన్న అవకాశాలను పోగొట్టే అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి డమ్మీ అని, ఆమెను ఎక్కడి నుంచో ఇక్కడకు తీసుకొచ్చారని విమర్శించారు.

బీజేపీవి మత రాజకీయాలు..

ప్రధాని మోదీ తెలంగాణకు బుల్లెట్ ట్రెస్ తీసుకురాలేదని, మెట్రో రైలు ప్రాజెక్టుకు నిధులు, మూసీ సుందరీకరణకు నిధులు ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణతో పాటు పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌కు కూడా మోదీ ఏమి చేయలేదని విమర్శించారు. బీజేపీ అక్కరకు రాని చుట్టమంటూ ఎద్దేవా చేశారు. ఆయన కేవలం హిందూ ముస్లింల పేరుతో ఓట్లు దండుకొని మత రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని కేసీఆర్ పునర్నిర్మించినా ఎప్పుడూ ప్రచారం చేసుకోలేదని చెప్పారు. దేవుళ్లను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయవచ్చా? అని ప్రశ్నించారు.

మోదీ, రేవంత్‌లు బడే భాయ్, చోటే భాయ్

బడే భాయ్ మోదీ, చోటా భాయ్ రేవంత్‌రెడ్డి మాటలను నమ్మొద్దని కేటీఆర్ ప్రజలను హెచ్చరించారు. ఢిల్లీలో మోదీ, గల్లీలో కేడీ మాయల మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇష్టమొచ్చినట్లు హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి.. పేదవారిని ఆదుకొనే ఒక్క పథకమైనా చేశారా అని ప్రశ్నించారు. నాలుగున్నర నెలల్లో చిల్లర మాటలు, ఉద్దెర పనులు తప్ప రేవంత్ ఏమీ చేయలేదని విమర్శించారు. కేసీఆర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే రేవంత్ నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూన్ 2న హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని బీజేపీ కుట్రపన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. బీజేపీ ప్రయత్నాన్ని అడ్డుకోవాలంటే పార్లమెంటులో కేసీఆర్ పంపే గులాబీదళం ఉండాలన్నారు. అందుకోసం మల్కాజిగిరి ప్రజల తరఫున మాట్లాడే రాగిడి లక్ష్మారెడ్డి, పద్మారావులను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయా రోడ్ షోలలో కేటీఆర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, శంబీపూర్ రాజు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హస్తిన 'దండు'యాత్ర!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ ఎన్నికల్లో తెలంగాణలో ప్రియాంకా గాంధీ కేంద్రంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని.. వీలైనన్ని ఎక్కువసార్లు ఆమెను ప్రచారానికి తీసుకురావాలని టీపీసీసీ భావించింది. కానీ ఇతర రాష్ట్రాల ప్రచార షెడ్యూల్ కారణంగా సాధ్యం కాలేదు. అయితే పోలింగ్ సమీపిస్తున్న సమయంలో ఈ నెల 6, 7 తేదీల్లో ఆమె నేతృత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నెల 6న ఎల్లారెడ్డి, తాండూరు, సికింద్రాబాద్.. 7న నర్సాపూర్, కూకట్‌పల్లిలలో ప్రియాంక ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు. మరోవైపు 5వ తేదీన నిర్మల్, గద్వాలల్లో పర్యటించనున్న రాహుల్‌గాంధీ.. 9న కరీంనగర్, సరూర్‌నగర్ సభల్లో ప్రసంగించనున్నారు. వీరితోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఎన్నికల ప్రచారానికి హాజరవుతారని టీపీసీసీ వర్గాలు తెలిపాయి.

బీఆర్‌ఎస్ షెడ్యూల్ యథాతథం: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై ఈసీ విధించిన 48 గంటల నిషేధం శుక్రవారం రాత్రి 8 గంటలకు ముగియనుంది. దీంతో ఆయన శుక్రవారం రాత్రి నుంచే తిరిగి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టనున్నారు. గతంలో రూపొందించిన షెడ్యూల్‌కు అనుగుణంగానే ఈ నెల 10వ తేదీ వరకు కేసీఆర్ బస్సుయాత్ర ఉంటుందని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. ఈనెల 10న సిరిసిల్లలో రోడ్ షో, సిద్దిపేటలో బహిరంగ సభతో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగుస్తుందని వెల్లడించాయి.

ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించండి

▶ మొదటి పేజీ తరువాయి

నడపడం వల్లే ఆయనకు టికెట్ రాలేదు. ఇదంతా కేసీఆర్‌తో జిల్లా మంత్రి కుమ్మక్కై సాగించిన కుట్ర ఇది. అసలు కథ ఏంటంటే ప్రభాకర్‌రావు వియ్యంకుడు అశోక్‌రావు ద్వారానే పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్థిక లావాదేవీలు నడిపిస్తున్నారు. అమెరికాలోని అశోక్‌రావు కూతురు ఇంట్లోనే ప్రభాకర్‌రావు ఉంటున్నాడు. అమెరికా, దుబాయ్ వెళ్లొస్తున్నాడు. మరో 10 ఏళ్ల పాటు వీసా ఉంది. ప్రభాకర్‌రావు ఇండియాకు తిరిగొచ్చేలా చర్యలెందుకు తీసుకోవడం లేదు. అమెరికా నుంచి తిరిగి రావొద్దనే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారు. ప్రభాకర్‌రావు వస్తే సిరిసిల్లలో కేటీఆర్ కనుసన్నల్లో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారమంతా వెలుగులోకి వస్తుంది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటై నన్ను ఓడించే కుట్ర

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుమ్మక్కు అయ్యి ఫోన్‌ట్యాపింగ్ కేసును నీరుగార్చడంతోపాటు..ఈ రెండు పార్టీలు ఒక్కటై కరీంనగర్‌లో నన్ను ఓడించేందుకు కుట్ర చేస్తున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ కేసును సమగ్ర విచారణ నిమిత్తం సీబీఐకి, అవసరమైతే ఎన్‌ఐఏకు కూడా అప్పగించాలి. గతంలో డ్రగ్స్, మియాపూర్ భూములు, టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ కేసును మూసివేసే కుట్ర జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ తతంగమంతా సిరిసిల్ల కేంద్రంగా జరిగింది. ఇవన్నీ బయటకు రావడంతో కేసీఆర్ కుటుంబం కరీంనగర్‌లోని ఓ మంత్రితో చీకటి ఒప్పందం కుదుర్చుకుంది. వారిచ్చే సలహా, సూచనలకు అనుగుణంగా సదరు మంత్రి పని చేస్తున్నరు. ఒక అధికారి నా వద్దకు వచ్చి నాతో పాటు మా కుటుంబ సభ్యుల, సిబ్బంది ఫోన్లు ట్యాపింగ్ చేశారని చెప్పారు. నేను వాడే సిమ్ కార్డును డూప్ సిమ్ తీసుకొని నా ఫోన్లన్నీ ట్యాప్ చేశారు. మా ఇంటి వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో, టెంపుల్ సమీపంలో వాహనాలను ఉంచి ఫోన్ ట్యాప్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావు కరీంనగర్‌లో మకాం వేసి మా ఫోన్లు ట్యాప్ చేశారు రాధాకిషన్‌రావు ప్రతిమ హోటల్‌లోని 314 రూంలో ఉంటూ (బిల్లులు చెల్లించకుండా) నా ఫోన్ ట్యాప్ చేశారు. నాతోపాటు పెద్దపల్లి, రామగుండం కాంగ్రెస్ అభ్యర్థుల ఫోన్లు ట్యాప్ చేయడంతో వాళ్ల పైసలు పట్టుకున్నారు.

ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ అనుమానాలు

ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందనే అనుమానాలున్నాయి. అందుకే ఫేస్ టైమ్, సిగ్నల్ యాప్‌ల ద్వారా మాట్లాడుకునే దుస్థితి వచ్చింది. సీబీఐ విచారణకు అంగీకరిస్తే, నాదగ్గరున్న సమాచారమంతా అప్పగిస్తా. కరీంనగర్‌తో పాటు ఇతర లోక్‌సభ నియోజవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ డబ్బులు పంపినట్టు అనుమానం కలుగుతోంది' అని సంజయ్ అన్నారు. అనంతరం పార్టీకార్యాలయంలో సినీనటి శైలజ, టీవీ యాక్టర్లు టి.జ్యోతి, డి.రమేష్‌బాబు, మరికొందరు టీవీ సినీనటులు సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

బీజేపీ అగ్రనేతలతో ప్రచార దూకుడు!

- రాష్ట్రంలో వరుస పర్యటనలు.. సమావేశాలకు ప్రణాళిక
- 5న సిర్పూర్, నిజామాబాద్, మల్కాజిగిరి సభలలో పాల్గొననున్న అమిత్ షా
- 6వ తేదీన పెద్దపల్లి, భువనగిరి, నల్లగొండ సభలకు జేపీ నడ్డా..
- 8న వేములవాడ, వరంగల్.. 10న ఎల్‌బీ స్టేడియంలో ప్రధాని మోదీ సభలు
- మధ్యలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రుల పర్యటనలు కూడా..



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలుచుకోవడమే లక్ష్యంగా.. బీజేపీ అధినాయకత్వం దూకుడు పెంచుతోంది. పోలింగ్ దగ్గరపడుతుండటంతో.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా వరుసగా సభలు, సమావేశాల్లో పాల్గొననున్నారు.

ఒకే రోజున రెండు మూడు సభలతో..

1వ తేదీన హైదరాబాద్ ఎంపీ స్థానం పరిధిలో రోడ్ షో నిర్వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. మళ్లీ ఈ నెల 5న రాష్ట్రానికి వస్తున్నారు. ఒకేరోజు 3 బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఆ రోజు ఉదయం 11:30 గంటలకు ఆదిలాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో, మధ్యాహ్నం 1.30 గంటలకు నిజామాబాద్‌లో, సాయంత్రం 4 గంటలకు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో జరిగే బహిరంగ సభలలో పాల్గొని ప్రసంగిస్తారు. పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా.. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు పెద్దపల్లిలో, మధ్యాహ్నం ఒంటి గంటకు భువనగిరిలో, మధ్యాహ్నం 3.30 గంటలకు నల్లగొండలో జరిగే సభల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు.

మూడు నెలల్లో ఎనిమిది సార్లు మోదీ..


ప్రధాని మోదీ ఈ నెల 8, 10వ తేదీల్లో రాష్ట్రానికి వస్తున్నారు. ఈ పర్యటనతో కలిపితే.. మూడు నెలల్లోనే ఎనిమిది సార్లు ఆయన రాష్ట్ర పర్యటన చేసినట్టు అవుతుంది. మోదీ ఇంతకుముందే.. ఫిబ్రవరి మొదటివారంలో రెండు సార్లు, మార్చిలో మూడుసార్లు, ఏప్రిల్ చివరిలో ఒకసారి రాష్ట్రానికి వచ్చారు. ఇక ఈ నెల 8న వేములవాడ, వరంగల్‌లలో నిర్వహించే బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు. 10న హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ స్థానాలను కవర్ చేసేలా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే భారీ సభలో పాల్గొంటారు. అదేరోజున నారాయణపేటలో ప్రచారసభలోనూ మోదీ పాల్గొననున్నారు. మరోవైపు మధ్యప్రదేశ్, గుజరాత్, ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు కూడా రాష్ట్రంలో పర్యటించనున్నారు. అయితే వారికి సంబంధించిన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

పోలింగ్‌కు ముందు మరోసారి ఇంటింటి ప్రచారం

పార్టీ అగ్రనేతలు హాజరయ్యే సభలను మాత్రమే భారీగా నిర్వహించి.. మిగతా అంతా కూడా ఇంటింటి ప్రచారానికే ప్రాధాన్యత ఇవ్వాలని బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు నిర్ణయించాయి. అందులో భాగంగా ఇప్పటికే రెండు విడతల పాటు 'హర్‌ఘర్ బీజేపీ'కార్యక్రమాన్ని పూర్తి చేసిన బీజేపీ నేతలు.. పోలింగ్‌కు ముందు 9, 10, 11 తేదీల్లో తుది విడత ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. బుధవారం రాత్రి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల భేటీలో.. పోలింగ్ తేదీ వరకు వీలైనన్ని ఎక్కువ సార్లు ఓటర్లను కలుసుకోవడంపై దృష్టి పెట్టాలని అమిత్ షా సూచించారు.

సాక్షి
హైదరాబాద్

శుక్రవారం ၊ 3 ၊ మే ၊ 2024





గురువారం బోసిపోయిన ఎల్బీనగర్ చౌరస్తా..





సూరీడి 'సెగ' తరగ!

మహా నగరం నిప్పుల గుండం!! | పగటి పూట భానుడి ఉగ్రరూపం | రాత్రిపూటా రికార్డు కనిష్ట ఉష్ణోగ్రతలే

శివార్లలో 44 డిగ్రీలు దాటిన భగభగలు | మరోవైపు భయపెడుతున్న వడగాల్పులు

ఇళ్ల నుంచి బయటికి కదలని సిటీజనులు | మరో అయిదు రోజులు ఇదే పరిస్థితి





నగరంలో గురువారం ఉష్ణోగ్రతలు				
నాచారం 43.6	రాజేంద్రనగర్ 43.6	చిక్కడపల్లి 43.0	టౌలిచౌకి 42.9	
ఆర్‌కే భవన్ 42.9	మెట్టుగూడ 42.9	వెంగళరావునగర్ 42.8	విఠల్‌వాడి 42.7	సైఫాబాద్ 42.7
బన్సీలాల్‌పేట 42.6	దూద్‌బౌలి 42.6	ఐఎస్‌సదన్ 42.5	గచ్చిబౌలి 42.5	బాలానగర్ 42.1

సాక్షి, సిటీబ్యూరో: మహానగరం నిప్పుల గుండంగా మారుతోంది. భానుడి భగభగలతో ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అత్యధికంగా నమోదవుతున్నాయి. సూర్యుడు ఉదయం ఏడు గంటల నుంచే సెగలు కక్కుతున్నాడు. పది గంటల తర్వాత ఉగ్రరూపం దాల్చుతుండటంతో బయటికి వెళ్లాలంటేనే నగర వాసులు జంకుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోజువారీ పనులను సైతం సాయంత్రం వరకు వాయిదా వేసుకొని ఇంటికే పరిమితమవుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పగటి వడగాల్పులు.. రాత్రి పూట వేడిగాలులు నగర వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వారం రోజులుగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రత శివారులోని కీసరలో 44.3 మొయినాబాద్‌లో 44.0, నాచారంలో 43.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అత్యధికంగా నమోదైంది ఇదే. మరోవైపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం రికార్డు స్థాయిలో నమోదవుతోంది. మరో అయిదు రోజుల గరిష్ఠ ఉష్ణోగ్రతలు, వడగాల్పులు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. గత ఏడాదితో పోల్చితే ఈ నెలలో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని స్పష్టం చేయడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రోజువారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. శీతల పానీయాలు, మజ్జిగ, శీతల పానీయాల అమ్మకాలు జోరందుకున్నాయి.

మూడు నెలల నుంచే..

ఈ ఏడాది ఫిబ్రవరి నెల చివరి వారం నుండే ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవ్వుతూ వస్తోంది. ఫలితంగా సాధారణం కంటే 4 నుంచి 8 డిగ్రీల వరకు అత్యధిక రికార్డు అయింది. నగరంలో పెరుగుతున్న కాలుష్యంతో వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. గత అయిదున్నర దశాబ్దాల క్రితం నుంచే ఉష్ణోగ్రతలలో వచ్చిన మార్పులను అత్యాధునిక పద్ధతుల్లో విశ్లేషిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ – జూన్ మధ్య అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం సాధారణమే. అయితే ఈసారి వేసవి కంటే ముందు నుంచే నగరంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతూ రావడం ఆందోళన కలిగిసోంది. శరవేగంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న మెట్రో సిటీలో హైదరాబాద్ 28వ స్థానంలో ఉన్నట్లు వాతావరణ శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలూ అధికమే

మహానగర పరిధిలో పగటి ఉష్ణోగ్రలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. గురువారం కనిష్ఠ ఉష్ణోగత 29.2 డిగ్రీలు నమోదైంది. సాధారణ ఉష్ణోగ్రత కంటే 3.2 డిగ్రీలు అధికంగా నమోదు కావడం గమనార్హం.

ఉష్ణోగ్రత నమోదు ఇలా..

- ఫిబ్రవరి నెలలో 34.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది, పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే అత్యధికంగా ఉండగా.. రాత్రి సాధారణ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల వరకు నమోదు కావాల్సి ఉండగా.. సగటున 20 నుంచి 21.7 డిగ్రీల వరకు రికార్డు అయింది. ఇది సాధారణం కంటే అయిదు డిగ్రీలు అధికం.
- మార్చి నెలలో అత్యధికంగా ఉష్ణోగ్రత 39.6 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డు అయింది. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా 28 డిగ్రీలకు తగ్గలేదు. ఇది సాధారణం కంటే అయిదు నుంచి ఎనిమిది డిగ్రీలు సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి.
- ఏప్రిల్ నెలల పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 43.5 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి. గతేడాదితో పోల్చితే చివరి వారం నుంచి అత్యధికంగా రికార్డు అయింది. రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే అత్యధికంగా నమోదయ్యాయి.



ఉప్పల్ స్టేడియంలో మరోసారి సన్‌రైజర్స్ ఫ్యాన్స్‌కు ఫుల్ వినోదం లభించింది. గత గురువారం జరిగిన మ్యాచ్‌లో భారీ స్కోరును ఛేదించలేక నిరాశపర్చిన హైదరాబాద్ టీమ్ ఈసారి తమ స్థాయిని మళ్లీ ప్రదర్శించింది. రాజస్తాన్ రాయల్స్‌పై ఆఖరి బంతికి థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. రాజస్తాన్ విజయానికి చివరి బంతికి 2 పరుగులు అవసరం కాగా.. పావెల్‌ను భువనేశ్వర్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేయడంతో సన్‌రైజర్స్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.

– సాక్షి, హైదరాబాద్

'థ్రిల్' రైజర్స్



ఆశల పల్లకిలో..

మెరుగైన రోడ్లు, రైలు కనెక్టివిటీ, నిరంతరం నీటి సరఫరా, పటిష్టమైన మురుగునీటి పారుదల వ్యవస్థ, సుపరిపాలన, నీటి వనరుల సంరక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ.. ఇవీ గ్రేటర్ హైదరాబాద్ ఓటర్ల బ్లూ ప్రింట్. గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లోని 4 వేలకు పైగా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏ) సమగ్ర 'సిటిజన్స్ మేనిఫెస్టో'ను విడుదల చేశాయి. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా కీలక సమస్యలు, డిమాండ్లతో కూడిన ప్రత్యేక కథనం.

– సాక్షి, సిటీబ్యూరో

నివాసితుల డిమాండ్లతో 'సిటిజన్స్ మేనిఫెస్టో' రూపకల్పన

గెలిచేదెవరైనా.. గ్రేటర్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- మల్కాజిగిరిలో రోడ్ల విస్తరణ, కంటోన్మెంట్ విలీనం
- సికింద్రాబాద్‌లో కలుషిత నీరు, వరదలకు శాశ్వత పరిష్కారం
- చేవెళ్లలో 111 జీఓ అమలు, ప్రణాళికాబద్ధంగా రియల్ వృద్ధి
- హైదరాబాద్‌లో మురుగునీటి వ్యవస్థ, మెరుగైన ప్రజా రవాణా

మినీ ఇండియా మల్కాజిగిరి..

మొత్తం ఓటర్లు: 15,51,400

ఈ లోక్‌సభ పరిధిలో మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఓటర్ల పరంగా దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ ఇదే. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు నివసిస్తుండటంతో దీన్ని మినీ ఇండియాగా అభివర్ణిస్తుంటారు.

ఇవీ డిమాండ్లు

- ఎన్‌హెచ్–44లో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్, డెయిరీ ఫామ్ రోడ్ మధ్య 5.3 కి.మీ. డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణం.
- తాడ్‌బండ్ జంక్షన్, బోయిన్‌పల్లి మధ్య దశాబ్ద కాలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడం. రహదారుల విస్తరణతో పాటు రక్షణ శాఖ అధీనంలో ఉన్న రహదారులలో ట్రాఫిక్ కదలికలపై ప్రత్యేక శ్రద్ధ.
- శంషాబాద్ విమానాశ్రయంతో పాటు గ్రేటర్‌లోని కీలక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కోసం ఎంఎంటీఎస్ ఫేజ్–2, మెట్రో సేవలలో మెరుగుదల, లెవెల్ క్రాసింగ్‌ల వద్ద కొత్త రోడ్లు, అండర్ బ్రిడ్జీల నిర్మాణం
- ఆక్రమణకు గురవుతున్న చెరువులకు రక్షణ కల్పించడం, పునరుజ్జీవనం చేయడం.
- విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడటం, ఆస్తి పన్ను మదింపులను పరిష్కరించడం.
- జీహెచ్‌ఎంసీలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు (ఎస్‌సీబీ) విలీన అంశాన్ని పరిష్కరించడం.

లష్కర్.. కలుషిత నీరు, వరదల మయం

మొత్తం ఓటర్లు: 9,15,106

సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేట, నాంపల్లి, సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్లు దీని పరిధిలోకి వస్తాయి. వీటిలో చాలా సెగ్మెంట్లలో కలుషిత నీరు, వరదలు, ముంపు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

ఇవీ డిమాండ్లు:

- ముషీరాబాద్, అంబర్‌పేట, నాంపల్లి, సనత్ నగర్‌లోని నివాసితులు తరచూ కలుషిత నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపించి, నిరంతర నీటి సరఫరాను అందించాలి.
- దాదాపు ప్రతి వర్షాకాలంలో ఈ నియోజకవర్గంలోని ప్రధాన ప్రాంతాలు వరద, ముంపు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎన్నిక కాబోయే ఎంపీ.. ఈ సమస్యను పార్లమెంట్‌లో లేవనెత్తి, ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కారం చూపించాలి.
- ఐకానిక్ హుస్సేన్‌సాగర్‌ను రక్షించడంతో పాటు వరదల సమయంలో పొంగిపొర్లకుండా నిరోధించాలి. దీంతో చాలా కాలనీలు ముంపు తీవ్రతను ఎదుర్కొంటున్నాయి.
- త్వరగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను పూర్తి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో రద్దీ ఉండే రోడ్ల విస్తరణ, ఇతరత్రా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టాలి.
- దేవలపర్లు చెరువులను ఆక్రమించకుండా నిర్మూలించంతో పాటు బఫర్ జోన్‌లను గుర్తించి ప్రహరీ గోడలు నిర్మించాలి.



పబ్లిక్ డిమాండ్

హెరిటేజ్ సిటీ హైదరాబాద్..

మొత్తం ఓటర్లు: 8,17,267

మలక్‌పేట, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఈ లోక్‌సభ పరిధిలో ఉన్నాయి. వీటిలో మైనార్టీ జనాభానే ఎక్కువ. ఈ నియోజకవర్గం చారిత్రక, వారసత్వ కట్టడాలకు నిలయంగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది.

ఇవీ డిమాండ్లు

- సమగ్ర పట్టణ ప్రణాళికలతో వరదలకు శాశ్వత పరిష్కారం చూపించాలి.
- దశాబ్దాలుగా స్థానిక ఓటర్లు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు పటిష్టమైన మురుగునీటి పారుదల వ్యవస్థను నిర్మించాలి.
- 24/7 నీటి సరఫరాను అందించేందుకు సరఫరా నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలి.
- ట్రాఫిక్, నిర్మాణ పనుల కారణంగా పెరుగుతున్న శబ్ద, వాయు కాలుష్యాన్ని పరిష్కరించాలి.
- హైదరాబాద్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ ట్యాగ్ దక్కాలంటే మూసీ పునరుద్ధరణతో పాటు నిజాం కాలం నాటి సరస్సులను పునరుద్ధరించాలి.
- ఆధునిక కాలుష్య రహిత ఎంఎంటీఎస్, మెట్రో, టీఎస్‌ఆర్టీసీ వంటి ప్రజా రవాణాను పెంచాలి.
- కీలక జంక్షన్లలో మినీ స్కైవాక్‌లను నిర్మించాలి.

చేవెళ్ల.. ఐటీ, రియల్ బూమ్..

మొత్తం ఓటర్లు: 12,98,953

పట్టణ, గ్రామీణ ప్రాంతాల కలయిక చేవెళ్ల లోక్‌సభ. దీని పరిధిలో శేరిలింగంపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల (ఎస్సీ), పరిగి, వికారాబాద్ (ఎస్సీ), తాండూరు నియోజకవర్గాలున్నాయి. ఐటీ హబ్, రియల్ ఎస్టేట్ బూమ్‌లతో మొత్తం ఈ సెగ్మెంట్ రూపురేఖలే మారిపోయాయి.

ఇవీ డిమాండ్లు

- ఈ సెగ్మెంట్‌లో ఎక్కువ భాగం వ్యవసాయ ఉండటంతో నీటి పారుదల, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలి.
- మెరుగైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు శరవేగంగా దూసుకుపోతున్న రియల్ ఎస్టేట్ అభివృద్ధి ప్రణాళికబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.
- చిలుకూరు మీదుగా చేవెళ్ల, హైదరాబాద్ మధ్య ఆరు లైన్ల ప్రతిపాదిత రాష్ట్ర రహదారిని త్వరితగతిన పూర్తి చేయాలి.
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చుట్టూ 10 కిలో మీటర్ల జోన్‌లో కాలుష్యాన్ని, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను నిరోధించాలి.
- 111 జీవోను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.



షాపూర్‌నగర్‌లో..

హస్తం పార్టీని ఆదరించండి

లోక్‌సభ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్‌లో మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన ప్రసంగించారు. గతంలో తనను ఎంపీగా గెలిపించిన ఈ ప్రాంత ప్రజలు ఈసారి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. సీఎం రోడ్ షోతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది.

బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టండి



రహమత్‌నగర్‌లో..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి మూసాపేట, రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో నిర్వహించిన రోడ్ షో కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఆయా కార్యక్రమాల్లో మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, పద్మారావు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో..

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలివీ..

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు హోమ్ ఓటింగ్ ఈనెల 3 నుంచి 8 వరకు జరగనుంది. ఎన్నికల సిబ్బంది హోమ్ ఓటింగ్ వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారితో ఓట్లు వేయిస్తారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోలింగ్‌లో పాల్గొనేందుకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో గన్‌ఫౌండ్రిలోని ఆల్‌సెయింట్ స్కూల్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో పికెట్ కేంద్రీయ విద్యాలయ, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఈ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ వర్గాలు పేర్కొన్నాయి.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఎండల తీవ్రత దృష్ట్యా టెంట్లు, తాగునీరు, ఫ్యాన్ల ఏర్పాటు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్


మాట్లాడుతున్న రోనాల్డ్ రాస్, చిత్రంలో సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు

హిమాయత్‌నగర్: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్‌కు చెందిన సీనియర్ డిప్యూటీ సీఈఓ నితీష్ వ్యాస్ న్యూ ఢిల్లీ నుంచి రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ మాట్లాడుతూ... ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నామని, హోమ్ ఓటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగు నీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీ సెంటర్, పోలింగ్ అధికారులు ర్యాండమైజేషన్, సప్లిమెంటరీ బ్యాలెట్ యూనిట్, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి కావచ్చిందన్నారు. పోలింగ్ అధికారుల రెండో దశ ట్రైనింగ్, హోమ్ ఓటింగ్‌లో పాల్గొనే పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ హైదరాబాద్ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిని అనుసరించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా రోజు వారీగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా విచారణ చేసి నగదు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ సరోజ్ కుమార్, శ్రీవిద్య, పోలీస్ పరిశీలకులు శశాంక్ ఆనంద్, సికింద్రాబాద్, హైదరాబాద్ వ్యయ పరిశీలకులు అమిత్ శుక్లా, సెంతిల్ కుమార్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ల తనిఖీ

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం రాత్రి ఆయన ఆబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 3 శుక్రవారం నుండి మే 8 వరకు నిర్వహించనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్‌డీఓ మహిపాల్ రెడ్డి, నోడల్ అధికారి రమేష్, ఏఆర్వోలు ప్రేమ్ కుమార్, జయమ్మ, చంద్రశేఖర్, జయశ్రీ, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

సాక్షి,సిటీబ్యూరో: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. శుక్రవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం ఆయన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలింగ్ విధులు నిర్వహించనున్న సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పోలింగ్ నిర్వహించాలని, ఐడీ కార్డులు మరోసారి చెక్ చేయాలని సూచించారు. ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోలింగ్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు ప్రచారం చేయరాదని, పోలింగ్ కేంద్రంలోకి ఓటర్ల మొబైల్ ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు.హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ప్రతి ఫెసిలిటేషన్ సెంటర్‌లో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుండి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అంతకుముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ సంబంధించిన అంశాలను వివరించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

తెలుగు భాష గొప్పదనం అనంతం

- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- దాసరి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం


దాసరి జీవన సాఫల్య పురస్కారాలను అందజేస్తున్న వెంకయ్యనాయుడు

బంజారాహిల్స్: తెలుగు భాషా వైభవం, సంస్కృతి గొప్పతనం ఎనలేనిదని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. వివిధ రంగాల్లో వాసికెక్కిన ముగ్గురికి '2024 దాసరి జీవన సాఫల్య పురస్కారాలను' అందజేశారు. జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సూర్యారావు (వైద్య రంగం), శిరోమణి వంశీరామరాజు (దివ్యాంగుల సేవ), సంస్కృతి రత్న కే ధర్మారావు (తెలుగు సినిమాల చరిత్ర గ్రంథ రచయిత)లకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ అమ్మలాంటి తెలుగు భాషను ఎన్నటికీ మరిచిపోకూడదన్నారు. దేశానికే ఆదర్శంగా తెలుగు భాషా సంస్కృతులు నిలుస్తాయన్నారు. భవిష్యత్తు తరాలకు తెలుగు భాషా ఔన్నత్యాన్ని అందించేలా చూడాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. కార్యక్రమంలో అవార్డుల కమిటీ చైర్మన్ రేలంగి నరసింహారావు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ముడిపడి రాజు, కొత్త వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దారిదోపిడీ దొంగల ఆటకట్టు

ఎస్ఐని బెదిరించి చైన్, సెల్‌ఫోన్లు చోరీ

నలుగురు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తదితరులు

కాచిగూడ: చెడు వ్యసనాలకు, మద్యానికి బానిసై బెదిరింపులు, దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు యువకులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, కాచిగూడ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గోరఖ్‌నాథ్ మాల్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ గురువారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి, ప్రగతినగర్ కాలనీకి చెందిన డి.ప్రసాద్ డార్జిలింగ్‌లో సీఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 26న రాత్రి ఎంఎంటీఎస్ రైల్లో ఇంటికి వెళ్తుండగా నలుగురు గుర్తుతెలియని యువకులు అతడిపై కత్తులతో దాడిచేసి అతడి వద్ద ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.700 నగదు, 2 సెల్‌ఫోన్లు లాక్కుని ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో దిగి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు యువకులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం అలియాస్ ఇబ్రహీం పఠాన్, యాకత్‌పురకు చెందిన మహ్మద్ తౌహీద్, మాదన్నపేటకు చెందిన మహ్మద్ అనాసుద్దీన్, పిసల్‌బండకు చెందిన మహ్మద్ ముఖీత్ పాత నేరస్తులు. వీరు జులాయిగా తిరుగుతూ ముఠాగా ఏర్పడి రైల్వేస్టేషన్లలో, రైళ్లలో ప్రయాణికుల బ్యాగులోంచి నగదు, సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగలిస్తుంటారు. వీరిపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వారి నుంచి బంగారు చైన్, రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లు, రిస్ట్‌వాచ్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

'వాసవి' నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోం

- స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నాయని చెప్పిన ఏజీ
- అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు

సాక్షి, హైదరాబాద్: నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధి బాచుపల్లి గ్రామంలో వాసవి ఇన్‌ఫ్రా నిర్మించిన బ్లాక్‌లపై స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నందున ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టామని వాసవి తరఫు న్యాయవాది వాదించారు. నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని బాచుపల్లి గ్రామ పరిధి కోమటికుంట చెరువు శిఖం సర్వే నంబర్ 127/పార్టు, 128/పార్టు, 137/పార్టును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆకుల సతీశ్ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. బ్లాక్ నంబర్ 8, 9 అక్రమంటూ వాసవి ఇన్‌ఫ్రాను అనధికారిక ప్రతివాదిగా చేర్చారు. అలాగే ఇదే గ్రామం సర్వే నంబర్ 126/పీ, 137/పీలో తమ నిర్మాణాలను అడ్డుకుంటున్నారని పేర్కొంటూ వాసవి ఇన్‌ఫ్రా మరో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ నుంచి నిబంధనల మేరకు అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టామని వాసవి ఇన్‌ఫ్రా తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పాత నివేదికలతో ప్రజాప్రయోజన వ్యాజ్యంలోని పిటిషనర్ కోర్టుకు వచ్చారని చెప్పారు. వంద కోట్లకుపైగా ఖర్చుతో నిర్మించిన నిర్మాణాలు ఆగిపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలితే కూల్చివేతకు సిద్ధంగా ఉన్నామని.. నిర్మాణాల కొనసాగింపునకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే వాదనలు పూర్తయ్యాక నిర్ణయం తీసుకుంటామన్న ధర్మాసనం .. తదుపరి విచారణను జూన్ 4కు వాయిదా వేసింది.

మంటల్లో పడి వ్యక్తి సజీవ దహనం


బాబు(ఫైల్)

గచ్చిబౌలి: ప్రమాదవశాత్తు మంటల్లో పడి ఓ వ్యక్తి సజీవ దహనమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, నర్సంపేటకు చెందిన దుంపాక బాబు(33) నగరానికి వలస వచ్చాడు. హఫీజ్‌పేట్ మర్తాండనగర్‌లో నివాసం ఉంటూ కూలీగా పని చేసేవాడు. బుధవారం పనికి వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి చేరుకోలేదు. అంజయ్యనగర్‌లోని రాంకీ రోడ్డు మూల మలుపులో చెత్త డంప్ మంటల్లో పడి సజీవ దహనమైనట్లు గుర్తించిన స్థానికులు గురువారం ఉదయం రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. అతను తాగిన మైకంలో మంటల్లో పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. గురువారం ఉదయం అతను ఓ వ్యక్తితో కలిసి మద్యం సేవించినట్లుగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.73 కోట్ల విలువైన నల్లమందు పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రూ.1.73 కోట్ల విలువైన నల్లమందు తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ తెలిపారు. శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ బాబుల్‌రెడ్డి నగర్‌లో నిర్వహించిన సోదాల్లో బొలేరో వాహనంలో తరలిస్తున్న సుమారు 2.30 కిలోల నల్లమందు, 35 కిలోల ఓపీఎం పిప్పిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దల్‌రామ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బొలెరో పాటు, మొబైల్ ఫోన్ సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

చెస్ టోర్నీ విజేతలు సమర్థ్, శ్రేష్ట




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్-15 బాలబాలికల విభాగాల్లో పులిపాక శ్రీ సమర్థ్, గుకంటి శ్రేష్ట శ్రీ విజేతలుగా నిలిచారు. సమర్థ్ నాలుగు పాయింట్లు, శ్రేష్ట మూడు పాయింట్లు సాధించారు. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని ఐదు రౌండ్లపాటు నిర్వహించారు. విజేతలకు టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, సుజాత హైస్కూల్ డైరెక్టర్ జేపీ సింగ్, కొడాలి హరిత ట్రోఫీలు అందజేశారు. ఆయా వయో విభాగాల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. **బాలుర విభాగం:** అండర్-13: 1. సుహిత్ రావికంటి, 2. ప్రణవ్. అండర్-11: 1. మైలవరపు ధార్మిక విరాట్, 2. కృతిక్‌దేవ్. అండర్-9: 1. అభినవ్, 2. ఆత్రేయ జయరాజ్ రామ్‌కుమార్. అండర్-7: 1. ప్రక్రిత్ ఠాకూర్, 2. శ్రీరామ స్కంద. బాలికల విభాగం: అండర్-11: 1. హైమ సాన్విత, 2. రంగిశెట్టి నమస్వి లక్ష్మి. అండర్-9: 1. దియా పార్థసారథి, 2. త్రిషిక పట్నాయక్. అండర్-7: 1. సయ్యద్ రౌద్, 2. విషిత.

నిర్మాత బండ్ల గణేష్‌పై కేసు నమోదు

ఫిలింనగర్: తన ఇంట్లో అద్దెకు ఉంటున్న సినీ నిర్మాత బండ్ల గణేష్ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఇంటిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని హీరా గ్రూప్ ఛైర్మన్ నౌహీరా షేక్ ఇచ్చిన పిర్యాదు మేరకు సినీ నిర్మాత బండ్ల గణేష్‌పై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... నౌహీరా షేక్ ఫిలింనగర్‌లోని తన ఇంటిని నిర్మాత బండ్ల గణేష్‌కు నెలకు రూ. లక్ష అద్దె చొప్పున కిరాయికి ఇచ్చింది. అయితే గత కొంతకాలంగా గణేష్ అద్దె ఇవ్వకపోగా గుండాలతో తనను బెదిరిస్తున్నారని, తనను ఇంట్లోకి అనుమతించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. అతను ఇంట్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తనకు సమాచారం అందిందని, గుండాల సహాయంతో, రాజకీయ నాయకుల అండతో ఇంటిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. నౌహీరా ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు బండ్ల గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఆయుధం కలిగి ఉన్న యువకుడి అరెస్టు

కంట్రీమేడ్ పిస్టల్ స్వాధీనం



జీడిమెట్ల: అక్రమంగా ఆయుధం కలిగి ఉన్న ఓ యువకుడిని బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌కు చెందిన గడ్డి వంశీకృష్ణాగౌడ్‌కు మధ్యప్రదేశ్‌కు చెందిన విశాల్ యాదవ్ అనే వ్యక్తితో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల్లోనే వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ నేపథ్యంలో విశాల్‌యాదవ్ తాను పిస్టల్స్ విక్రయిస్తానని, ఒక్కో తుపాకీ విలువ రూ.50వేలు ఉంటుందని చెప్పాడు. ఆయుధాల వ్యాపారం చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని చెప్పడంతో వంశీ కృష్ణా అతడికి ఫోన్‌పే ద్వారా రూ.19వేలు చెల్లించాడు. మార్చి 6న విశాల్ ఖాజీపేటకు వచ్చి వంశీకృష్ణాగౌడ్‌కు ఫోన్ చేయడంతో అతను అక్కడికి వెళ్లి రూ.30వేలు చెల్లించి కంట్రీమేడ్ పిస్టల్ మూడు రౌండ్స్ బుల్లెట్స్ తెచ్చుకున్నాడు.

రూ. 2 లక్షలకు బేరం

అప్పటి నుంచి వంశీకృష్ణ తన వద్ద ఉన్న పిస్టల్‌ను రూ.2లక్షలకు విక్రయించేందుకు బేరం పెట్టాడు. బుధవారం రాత్రి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు చింతల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో యాక్టీవాపై వెళుతున్న అతడిపై అనుమానంతో పోలీసులు బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఒక కంట్రీమేడ్ పిస్టల్‌తో పాటు మూడు రౌండ్ల బుల్లెట్లు లభ్యమయ్యాయి. వంశీకృష్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్‌గా నగరవాసి...

- వైద్య వృత్తితో పాటు అందాల పోటీల్లో రాణింపు..
- మిసెస్ ఇండియా తెలంగాణ 2023 విజేతగానూ డాక్టర్ స్రవంతి



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన డాక్టర్ స్రవంతి గాధిరాజు ప్రతిష్టాత్మక మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్‌గా ఎంపికై ప్రత్యేకతను చాటుకుంది. మిసెస్ ఇండియా తెలంగాణ 2023 విజేతగా నిలిచిన డాక్టర్ స్రవంతి జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల న్యూ ఢిల్లీలోని గురుగ్రామ్ వేదికగా అందాల కిరీటం అందుకున్నారు. ప్రముఖ గైనిక్ అంకాలజిస్టు, సామాజిక సేవకురాలైన డాక్టర్ స్రవంతి ఈ సందర్భంగా మాట్లాడుతూ., ప్రపంచ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించడం సంతోషంగా ఉందని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ప్రచారం చేసే అవకాశం దక్కిందన్నారు. భారతదేశాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి, ప్రేమ, శాంతికి నిర్వచనమని చెబుతూ..తన వంతు ప్రతిభాపాటవాలను ప్రదర్శించడానికి కృషి చేస్తానని అన్నారు. డాక్టర్ స్రవంతి గైనక్ ఆంకాలజీలో అంతర్జాతీయ ఫెలోషిప్‌తో పాటు గతంలో వైద్య సేవారత్న అవార్డు, డా. ఏపీజే అబ్దుల్ కలాం మెడికల్ ఎక్సలెన్స్ అవార్డ్, డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డు, హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డులను అందుకున్నారు.

7న ఖైరతాబాద్‌లో కేటీఆర్ రోడ్ షో

బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి శ్రీనివాసరావు, మన్నె, విప్లవ్

బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 7వ తేదీన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లో జహీరానగర్ చౌరస్తా, ఖైరతాబాద్‌లో రెండు చోట్ల ఉంటుందని ఖైరతాబాద్ అసెంబ్లీ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఎ.విప్లవ్‌కుమార్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రెండు చోట్ల జరిగే కేటీఆర్ రోడ్ షోలతో ఖైరతాబాద్‌లో తమ బలం ఏమిటో నిరూపిస్తామన్నారు. ఈ నెల 3వ తేదీన బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల బూత్ కమిటీ సభ్యుల సమావేశం బీఆర్ఎస్ భవన్‌లో జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉద్యమకారులు, కేసీఆర్‌ను నమ్మినవారు నడుం బిగించి పార్టీకి ద్రోహం చేసిన వారికి ఈ ఎన్నికల్లో వాతలు పెట్టాలన్నారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఖైరతాబాద్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీని ఇచ్చి చూపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కుతంత్రాలు తప్పితే సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా అమలుకావడం లేదని, కరెంటు, నీళ్ల సమస్యలతో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీ పట్ల ఆగ్రహంతో ఊగిపోతున్నారన్నారు. కార్యకర్తలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని, నాయకులు మాత్రం వారి మనోభావాలను దెబ్బకొట్టి ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యారన్నారు. కేసీఆర్ ప్రచార నిషేధాన్ని తీవ్రంగా ఖండించారు. రేవంత్ ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయారని ఆరోపించారు.

ఖైరతాబాద్ నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలి: దానం



ఇందిరానగర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: తనకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందంటే ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదమేనని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... గతంలో తాను గ్రేటర్ హైదరాబాద్ స్థాయిలో ప్రభావితం చేసిన రాజకీయ నాయకుడినని దాన్ని గుర్తించే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చిందని నియోజకవర్గ ప్రజలు సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనే అత్యధిక మెజార్టీ తనకు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్నరాజకీయ పరిస్థితుల వల్ల ఎక్కువ మందికి పథకాలు, సహాయ సహకారాలు అందించలేకపోయానని అన్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత సంక్షేమ పథకాల పంపిణీకి ఇందిరమ్మ కమిటీలు వేస్తామని ఉత్సాహంగా పని చేసే నేతలకు, కార్యకర్తలకు అందులో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, స్వామిగౌడ్, మల్లేష్‌యాదవ్, కిరణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ హఠావో ఓబీసీ బచావో' నినాదంతో సాగుతాం



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్

పంజగుట్ట: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హఠావో ఓబీసీ బచావో అనే నినాదంతో ముందుకు సాగుతామని బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుల గణన చేసే ప్రసక్తే లేదని కేంద్ర హోం సహాయ శాఖామంత్రి హోదాలో కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో ప్రకటించి బీసీల వ్యతిరేకిగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ బీసీ అభ్యర్థులైన బండి సంజయ్, బూర నర్సయ్య గౌడ్, ధర్మపురి అరవింద్‌ను కిషన్‌రెడ్డి ఓడించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కిషన్‌రెడ్డిని చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. బీసీ కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే కుల గణన సాధ్యం అవుతుందని అందుకే సికింద్రాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించుకుందామని బీసీలకు పిలుపునిచ్చారు. సంఘం గ్రేటర్ అధ్యక్షుడు గిరగాని క్రాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణ, బీసీ న్యాయవాదుల ఫోరం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జై గౌడ జాతీయ అధ్యక్షుడు పట్టికూటి రామారావు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మాలి సత్యం గౌడ్, రేవతి గౌడ్, లక్ష్మణ్ యాదవ్, బెక్కం వెంకట్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దళిత, బహుజనుల అభ్యున్నతి



అభివాదం చేస్తున్న చెన్నయ్య తదితరులు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

పంజగుట్ట: రాజ్యాంగం ఉంటేనే దళితుల పరిస్థితి దేశంలో దారుణంగా ఉందని బీజేపీ అధికారంలోకి వచ్చి రాజ్యాంగం తీసేస్తే మా పరిస్థితి ఏమిటని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నాడు. దళితుల అభ్యున్నతికి సాధికారతకు గతంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేసిందని రాష్ట్రంతో పాటు దేశంలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే దళితులు, ఆదివాసీలు, బలహీనవర్గాలు మరింత మేలు జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నాడు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావుతో కలిసి చెన్నయ్య మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తెచ్చి చట్టబద్ధత కల్పించారని, ఆహార భద్రత చట్టం, భూ పంపిణీ, బ్యాంకుల జాతీయ కరణ, పబ్లిక్ రంగ సంస్థల ఏర్పాటు లాంటి చట్టాల ద్వారా దళిత, గిరిజన, బలహీనవర్గాలకు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. బీజేపీ కేవలం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాయడం, వారికి దేశసంపద దోచిపెట్టడం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 సంవత్సరాల్లో దళితులను కేసీఆర్ వంచించాడని కేవలం ప్రకటనలకే మూడు ఎకరాల భూమి, బీఆర్ఎస్ వారికే దళితబంధు ఇచ్చాడన్నారు. నేతలు పుణ్య భానుప్రకాష్, బైండ్ల శ్రీనివాస్, ఎల్లస్వామి, చేపూరి శంకర్, కమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి కట్టుబడే బీజేపీని గెలిపించండి



మాట్లాడుతున్న బీజేపీ నేత లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ప్రపంచ దేశాలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని కీర్తిస్తున్నాయని, నీతి, నిజాయితీకి కట్టుబడే బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇంచార్జ్ లంకల దీపక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. గత పదేళ్లలో దేశం ప్రగతిపథంలో దూసుకెళ్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడిన బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో నిబద్ధతతో పనిచేసే కిషన్‌రెడ్డిని మరోమారు గెలిపించాలని కోరారు. నేతలు కొత్త వెంకటేష్, కృష్ణమోహన్, పాల్ సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో...

స్పెషల్ ఫోర్స్..!

ఖైరతాబాద్‌లో 47.. జూబ్లీహిల్స్‌లో 151...

కేంద్ర బలగాల మోహరింపు

అదనపు భద్రత.. పోలీస్ పికెట్‌లు

అనుమానిత కదలికలపై నిఘా



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని డీఏవీ స్కూల్ పోలింగ్ స్టేషన్

బంజారాహిల్స్: ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. పక్కా ప్రణాళికతో ఈ ఎన్నికలు సజావుగా సాగేందుకు రెండు వారాల నుంచే కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో అల్లర్లకు ఆస్కారం ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇటు లా అండ్ ఆర్డర్ పోలీసులు, అటు జీహెచ్ఎంసీ ఎన్నికల అధికారులు వేర్వేరుగా ఇచ్చిన నివేదికలను క్రోడీకరించి ఈ రెండు నియోజకవర్గాల్లోనూ క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించి ఆ మేరకు బందోబస్తు ప్రణాళికలు రూపొందించారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 245 పోలింగ్ బూత్‌లకు గాను లా అండ్ ఆర్డర్ పోలీసులు 16, జీహెచ్ఎంసీ 31 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకంగా గుర్తించాయి.
- ఈ మేరకు మొత్తం 47 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకంగా గుర్తించి బందోబస్తు రూపకల్పన చేశారు. ప్రతి క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లో సెంట్రల్ ఫోర్స్ బందోబస్తులో ఏర్పాటు చేయనున్నారు. ఖచ్చితంగా ఆ పోలింగ్ లొకేషన్‌లో కేంద్ర బలగాలు ఉండేలా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 151 పోలింగ్‌బూత్‌లను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు 74 బూత్‌లను, జీహెచ్ఎంసీ 77 పోలింగ్ బూత్‌లను క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించింది. దీంతో మొత్తం 151 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవి కాగా ఇక్కడ బందోబస్తులో భాగంగా అదనపు బలగాలను మోహరించనున్నారు. ఆయా పోలింగ్ బూత్‌లకు వెళ్లే మార్గాల్లో పికెట్‌లు, కేంద్ర సాయుధ బలగాలు బందోబస్తులో ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 151 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 74 పోలింగ్ లొకేషన్లలో ఉండగా ప్రతి లొకేషన్‌లోనూ కేంద్ర సాయుధ బలగాలు పహారాలో ఉండనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా ఇప్పటికే పోలీసులు అదనపు బలగాలను కోరారు.
- ప్రతి పోలింగ్ లొకేషన్ పరిధిలోనూ అనుమానితుల కదలికలపై ఇప్పటికే దృష్టి సారించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేసే దిశగా నిత్యం నిఘా కొనసాగుతున్నది.
- మరోవైపు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు అందుకు బాధ్యులను గుర్తించేందుకు వీలుగా సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయి.
- దీనికి అదనంగా రూట్‌మ్యాప్‌ను కూడా రూపొందిస్తున్నారు. ఏదైనా క్రిటికల్ పోలింగ్‌బూత్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసు ఫోర్స్ అక్కడకు చేరుకునేలా ఈ రూట్‌మ్యాప్‌ను సిద్ధంగా ఉంచుతారు.

దానం గెలుపు ఖాయం



పంజగుట్ట: సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం ఈసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పేర్కొన్నారు. గురువారం చింతల్‌బస్తీ, బీస్తీవాడలో దానంకు మద్దతుగా వారు ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలు ఇచ్చి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

బీజేపీ అధికారంలోకొస్తే రిజర్వేషన్లు రద్దే: దానం



హిమాయత్‌నగర్: బీజేపీ రాజ్యాంగాన్ని కాలరాసే ప్రమాదం ఉందని, 400 సీట్లు గెలిస్తే రిజర్వేషన్లు సైతం రద్దు చేసే ప్రమాదం ఉందని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నపుడు తాను ఏడేళ్ల నరకయాతన అనుభవించానని, కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయానని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాను స్వేచ్ఛగా పనిచేశానని, అందుకే మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ, డివిజన్ అధ్యక్షుడు నయీమ్, నాయకులు రామస్ గౌడ్, సంతోష్ గుప్తా, జ్యోతి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాన్ షాపుల నిర్వాహకులకు జైలు శిక్ష

హిమాయత్‌నగర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు పాన్‌షాపులను ఓపెన్ చేస్తున్న ఆయా దుకాణాల నిర్వాహకులకు కోర్టు జైలు శిక్ష విధించింది. నారాయణగూడ పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌గూడ, దత్తానగర్ ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు పాన్ షాపులను తెరిచి ఉంచారు. వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న మహమ్మద్ అతీక్(21), మహమ్మద్ సల్మాన్(21), మహమ్మద్ అర్షద్(32)లపై కేసులు నమోదు చేశారు. వారికి ఐదవ స్పెషల్ ఎంఎం కోర్ట్ జడ్జీ ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

5న మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం

కాచిగూడ: సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఈ నెల 5న మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో జరిగే కార్యక్రమానికి మున్నూరుకాపులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

కాంగ్రెస్ గెలుపే ప్ర'దానం'గా పనిచేయాలి



రోడ్ షోలో పాల్గొన్న దానం నాగేందర్, అజహరుద్దీన్



బోరబండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

దానం నాగేందర్, మహమ్మద్ అజహరుద్దీన్

రహమత్‌నగర్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పనిచేయాలని సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి దానం నాగేందర్ పిలుపునిచ్చారు. రహమత్‌నగర్ డివిజన్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. తాను గెలిస్తే హైదరాబాద్ నగరం రూపు రేఖలను మారుస్తానని హామీ ఇచ్చారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజహరుద్దీన్, స్పోర్ట్స్ విభాగం కన్వీనర్ అసదొద్దీన్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్, నవ్‌యుగ్ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాకుడు నవీన్‌యాదవ్, టీ హోప్ సంస్థ ఫౌండర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో దానం నాగేందర్ గెలిపించాలని స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, ఖయ్యూ, సరళ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌తో పారిపోయిన వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్: అర్జెంట్‌గా ఫోన్ మాట్లాడి ఇస్తానని నమ్మబలికి ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ఉడాయించిన వ్యక్తిని ఖైరతాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... గత నెల 14వ తేదీ అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో చింతలబస్తీలో నివాసముండే రవికుమార్‌గుప్తా డ్యూటీ నుంచి ఇంటికి వెళ్తుండగా ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్దకు రాగానే బైక్‌పై వచ్చిన వ్యక్తి అర్జెంట్‌గా ఫోన్ మాట్లాడాలని చెప్పి ఫోన్ మాట్లాడుతూ బైక్ స్టార్ట్ చేసుకొని ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఫోన్ ట్రాకింగ్ ద్వారా సూరారం కాలనీలో ఉండే మేడిశెట్టి కిషోర్‌కుమార్(31)ని అదుపులోకి తీసుకొని విచారించగా తానే ఫోన్ చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతని నుంచి నోట్-1 ప్లస్ ఫోన్‌ను రికవరీ చేశారు.

హెచ్‌కేఎంసీఎఫ్‌కు జనరేటర్ విరాళం



జనరేటర్‌ను అందజేసిన దృశ్యం

బంజారాహిల్స్: ప్రముఖ కంపెనీ బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేద వర్గాలకు సేవ చేయడం కోసం హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్‌కేఎంసీఎఫ్)కు విరాళం అందజేసింది. ఫౌండేషన్ ద్వారా కొనసాగుతున్న అన్నపూర్ణ, భోజనామృత, సద్దిమూట, స్వాస్థ్య ఆహార వంటి నిరుపేదల ఆకలిని తీర్చే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, వంట గది సామర్థ్యాలను పెంపొందింపజేయడానికి రూ. 54 లక్షల విలువైన 625 కేవీఏ డీజిల్ జనరేటర్‌ను స్పాన్సర్ చేశారు. ఈ ఉదార విరాళ కార్యక్రమానికి హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస, బీఎస్‌సీపీఎల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య, సెక్రటరీ రాఘవలతో పాటు బీఎస్‌సీపీఎల్, హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యగౌర చంద్రదాస మాట్లాడుతూ... ఇలాంటి వేడుకలు తరచు కృతజ్ఞతా ఘట్టాలుగా మాత్రమే కాకుండా కార్పొరేట్ కంపెనీలు మరింత దాతృత్వానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ... హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ మానవాళికి చేసే సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. బీఎస్‌సీపీఎల్ సమాజానికి తిరిగి ఇవ్వడం ద్వారా సమాజావృద్ధికి కృషి చేస్తోందన్నారు.

ఫిలింనగర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది: దానం నాగేందర్



ఫిలింనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దానం నాగేందర్

ఫిలింనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ 18 బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా ఏ హోదాలో పోటీ చేసినా ఫిలింనగర్ ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారని, వారి రుణం తీర్చుకోలేదన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత ఫిలింనగర్ 18 బస్తీలను అద్భుతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశు మరణాలు తగ్గించాలి

లక్డీకాపూల్: నవ జాత శిశు మరణాలను తగ్గించాల్సిన అవసరం ఉందని విరించి హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ వన్నాల రాజు తెలిపారు. బంజారాహిల్స్‌లోని విరించి హాస్పిటల్లో నర్సింగ్ సిబ్బంది కోసం నియోనాటల్ రిససిటేషన్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుట్టిన వెంటనే ఆక్సిజన్ లేకపోవడం వల్ల (హైపోక్సిక్ ఇస్కీమిక్ ఎన్‌సెఫలోపతి–హెచ్ఐఈ) మెదడు దెబ్బతింటుందన్నారు. ఇది సాధారణమైనా నివారించవచ్చన్నారు. దేశంలో ప్రస్తుతం నవ జాత శిశు మరణాల రేటు ప్రతి వెయ్యి జననాలకు సుమారు 20 మరణాలు ఉన్నాయన్నారు. హైపోక్సిక్ ఇస్కీమిక్ ఎన్సెఫలోపతి (హెచ్ఐఈ) వంటి పరిస్థితులు కారణంగా శిశువు పుట్టిన వెంటనే ఊపిరి పీల్చుకోలేక పోవటం వల్ల నియోనాటల్ మరణాలకు దోహదం చేస్తుందన్నారు. దేశంలో ప్రతి వెయ్యి సజీవ జననాలకు 1.5 మంది పిల్లలు హెచ్ఐఈ ద్వారా ప్రభావితం అవుతున్నారని చెప్పారు. నవ జాత శిశువుల సంరక్షణకు నర్సింగ్ సిబ్బందికి జ్ఞానంతో పాటు సాంకేతికతను సమకూర్చాల్సి ఉందన్నారు. డాక్టర్ పూర్ణ గుగ్గిలం, కిమ్స్ కడిల్స్, డాక్టర్ వద్ది వంశీ కృష్ణ, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు వినూత్నంగా...



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నోడల్ అధికారి ఆశా విరోనిక



బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ అధికారులు వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ గవర్నమెంట్ స్కూల్‌లో ఎస్ఎల్ఎఫ్–5 ఆధ్వర్యంలో మహిళా గ్రూపు సభ్యులకు మెహిందీ, ముగ్గుల పోటీలు, ఫ్యాషన్ షో నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ ఈ పోటీలు జరిగాయి. 150 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన మహిళలకు నోడల్ అధికారి, యూసీడీ డీపీఓ ఆశా విరోనిక బహుమతులను ప్రదానం చేశారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 55, గోకర కాయ 28, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 28, చామగడ్డ 35, మొరంగడ్డ 25, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4.

డ్రగ్స్ విక్రయిస్తున్నారంటూ రిటైర్డ్ ఉద్యోగికి టోకరా

రూ. 20 లక్షల కాజేసిన సైబర్ నేరగాళ్లు

హిమాయత్‌నగర్: థైవాన్ నుంచి కొరియర్ ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నారంటూ రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన 66 ఏళ్ల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగికి ముంబై ఫెడెక్స్ కొరియర్ కార్యాలయం నుండి అంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. బాధితుడి ఆధార్ కార్డ్ ఉపయోగించి, థైవాన్ నుండి డగ్స్ పార్సెల్ బుక్ అయినట్లు తెలిపారు. అనంతరం ముంబై సైబర్ క్రై మ్ బ్రాంచ్ నుండి స్కైప్ ద్వారా వీడియో కాల్ చేశారు. పోలీస్ అధికారులమని చెప్పి, ఐడి కార్డులు చూపించి, ఆధార్ కార్డ్ ఉపయోగించి వెస్ట్ బెంగాల్, కోల్ కతా, గోవా,బెంగళూర్, ముంబైలలో మనీలాండరింగ్ పాల్పడినట్లు తెలిపారు. అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చెయ్యాల్సి ఉందని బాధితుడి ఆధార్ కార్డు ఉపయోగించి ఈ మనీలాండరింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆధార్ కార్డ్ దుర్వినియోగం చేసిన వ్యక్తిని రెండేళ్ల క్రితం అరెస్ట్ చేశామని అతను ఇప్పటికి జైల్ లొనే ఉంటూ అతని ముఠా సభ్యులతో ఈ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పుడు ఆ ముఠా సభ్యుల నుండి బాధితుడికి అతని కుటుంబ సభ్యులకు ప్రాణ హాని ఉందని బెదిరించారు. స్కైప్ కాల్ కొనసాగుతుండగానే బాధితుడి మొబైల్‌కు ముంబై పోలీస్ ఆర్థిక విభాగం నుండి అంటూ మరో కాల్ వచ్చింది. ఈ దర్యాప్తు పూర్తెయ్యే వరకు బాధితుడి అకౌంట్‌లలో ఉన్న నగదును ఆర్బీఐ ఖాతాకు ట్రాన్సుర్ చేయాలని సూచించారు. దర్యాప్తు పూర్తయిన 7 రోజుల్లో తిరిగి అతని ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేస్తామని నమ్మించారు. నిజమే అని నమ్మిన బాధితుడు వారు చెప్పిన అకౌంట్‌కు రూ.20లక్షల 20 వేలు బదిలీ చేశాడు. అనంతరం వారి నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయానని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు. డ్రగ్స్ పార్సిల్, కొరియర్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.

6 వరకు మంటలే

తీవ్రం నుంచి అతి తీవ్ర వడగాడ్పులు.. వాతావరణ శాఖ హెచ్చరిక

గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా మండిపోతున్న ఎండలతో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కొద్దిరోజుల నుంచి సాధారణం కంటే 4 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలాచోట్ల వడగాడ్పులు వీస్తున్నాయి. వచ్చే మూడురోజుల్లో ఇవి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. 11 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెల్సియస్ దాటింది. నల్లగొండ జిల్లా ఇబ్రహీంపేటలో అత్యధికంగా 46.6 డిగ్రీల సెల్సియస్, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.4 డిగ్రీల సెల్సియస్, జగిత్యాల జిల్లా నేరెళ్లలో 46.4 డిగ్రీల సెల్సియస్, నల్లగొండ జిల్లా నాంపల్లిలో 46.2 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఇక ప్రధాన నగరాలను పరిశీలిస్తే.. ఖమ్మంలో 44.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, ఆదిలాబాద్‌లో 23.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మంలో సాధారణం కంటే 4.5 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. మహబూబ్‌నగర్, నల్లగొండలో 3.5 డిగ్రీల సెల్సియస్, హైదరాబాద్, భద్రాచలం, రామగుండంలో 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సాక్షి, హైదరాబాద్

- వృద్ధులు, పిల్లలు బయటకు రాకపోవడమే మంచిది
- ఇబ్రహీంపేట @ 46.6
- పలు ప్రాంతాల్లో 45కు మించి ఉష్ణోగ్రతలు నమోదు
- మండిపోతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

అక్కడక్కడా వానలకు చాన్స్

రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పెద్దలు, పిల్లలు, దీర్ఘకాలిక సమస్యలున్న వారు ఇళ్లల్లోనే ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. ఈ నెల 6వ తేదీ వరకు పలు జిల్లాల్లో తీవ్రం నుంచి అతి తీవ్ర వడగాడ్పులు ఉంటాయని హెచ్చరించింది. అయితే అక్కడక్కడా తేలికపాటి వానలు నమోదయ్యే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలిపింది.



గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	43.0
భద్రాచలం	42.8
హనుమకొండ	42.0
హైదరాబాద్	42.3
ఖమ్మం	44.4
మహబూబ్‌నగర్	43.9
మెదక్	42.3
నల్లగొండ	44.0
నిజామాబాద్	43.3
రామగుండం	44.2
విజయవాడ	41.0
విశాఖపట్నం	36.2

11 జిల్లాలకు రెడ్ అలర్ట్

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో తీవ్రం నుంచి అతి తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో 11 జిల్లాలకు రెడ్ అలర్ట్, మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది.

అంగన్ ‘వేడి’

ఉక్కపోతతో అల్లాడుతున్న చిన్నారులు

- పౌష్టికాహారం తీసుకునేందుకు గర్భిణుల అవస్థలు
- చాలా చోట్ల ఫ్యాన్లు లేవు... కొన్ని చోట్ల కరెంటు కనెక్షనూ లేదు
- మండుటెండలతో అవస్థలు పడుతున్న సిబ్బంది

సాక్షి, కామారెడ్డి: తొలిపొద్దుతోనే సూరీడు సుర్రుమంటున్నాడు. ఉదయం పది గంటలకే గడప దాటలేని పరిస్థితి. రాష్ట్రమంతటా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, తల్లులు వారికి సేవలందించే సిబ్బంది అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేంద్రాలు నిర్వహించాలి. చిన్నారులతో పాటు గర్భిణులు, తల్లులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి. చాలా కేంద్రాల్లో కరెంటు సౌకర్యం లేదు. ఉన్న చోట ఫ్యాన్లు తిరిగే పరిస్థితి లేదు. దీంతో ఈ రోజు గడిస్తే చాలు అన్నట్టుగా అంగన్‌వాడీ సిబ్బంది నరకం చూస్తున్నారు. మరోవైపు గట్టి ఎండ తగులుతుండడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని కేంద్రాలకు పంపడానికి ఇష్టపడటం లేదు. గర్భిణులు ఎండలో కేంద్రానికి వెళ్లి భోజనం చేయాలంటే జంకుతున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి....

రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడి కేంద్రాలు ఉండగా, 23,385 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 12,315 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు ఉన్నా చాలా స్కూళ్లలో విద్యుత్ కనెక్షన్ లేదు. విద్యుత్తు కనెక్షన్ ఉన్న చోట కనీసం ఫ్యాన్లు కూడా లేవు. దీంతో చాలా కేంద్రాల్లో చిన్నారులు, టీచర్లు, ఆయాలతో పాటు ఆరోగ్యలక్ష్మి కింద భోజనం చేయడానికి వచ్చే గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఎండలతో తగ్గుతున్న హాజరు....

అంగన్ వాడీ కేంద్రాలకు సెలవులు ఉండవు. ఏడాదంతా నడవాల్సిందే. గర్భిణులు, తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం నెలలో కచ్చితంగా 25 రోజులు సమకూర్చాల్సిందే. ఈ నేపథ్యంలో కేంద్రాలు తెరిచి ఉంచుతారు. అయితే ఈ సారి ఎన్నడూ లేనంతగా ఎండలు ఉండడం సమస్యగా మారింది. అన్ని జిల్లాల్లో 40 డిగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో చాలా చోట్ల పిల్లలు, తల్లులు, గర్భిణులు కేంద్రాలకు రావడం తగ్గుతోంది. మండే ఎండల్లో డ్యూటీ చేయడం కూడా టీచర్లు, ఆయాలకు సమస్యగా మారింది. ఒకవేళ టీచర్ సెలవులో ఉంటే ‘ఆయా’ పిల్లల ఆలన, పాలన చూడడంతో పాటు వంట చేసి భోజనం పెట్టాలి. ఆయా సెలవులో ఉంటే టీచరే వంట చేయాలి, పిల్లల్ని చూసుకోవాలి. ఈ పరిస్థితుల్లో పనిభారం కూడా ఎక్కువై సిబ్బంది అల్లాడిపోతున్నారు.



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్ లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తల్లులు, పిల్లలు

ఇంటికే అందిస్తే మేలు..

వేసవి గండం గట్టెక్కాలంటే పిల్లలు, పాలిచ్చే తల్లులు, గర్భిణులకు ఎండలు తగ్గేదాకా పౌష్టికాహారాన్ని ఇంటికే ఇవ్వడం సబబుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మండే ఎండలు తగ్గేవరకు కనీసం నెల రోజుల పాటు పౌష్టికాహారాన్ని ముందుగానే అందించాల్సిన అవసరం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉక్కపోతతో, తరువాత ఇంటికి ఎండలో వెళ్లే సమయంలో చాలా మంది నీరసించిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	149
అంగన్‌వాడీ కేంద్రాలు	35,700
గర్భిణులు, పాలిచ్చే తల్లులు	4,57,643
ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు	10,34,562
మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు	6,67,783

ఆదరించడం లేదు.. ఆత్మహత్యే గతి

సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన వృద్ధుడు సుర్వి మల్లయ్య



ట్రిబ్యునల్ కార్యాలయానికి వెళ్తున్న వృద్ధుడు మల్లయ్యగౌడ్

ఈ ఫొటోలో దీనంగా ఉన్న పెద్దాయన పేరు మల్లయ్యగౌడ్. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన ఈయన వయస్సు ఎనభై ఏళ్లు, ఈయన భార్య లక్ష్మమ్మ వయస్సు 71. వీరికి ముగ్గురు కుమారులు రవీందర్, గణేష్, విష్ణు, ఒక కుమార్తె సువర్ణ ఉన్నారు. అందరికీ వివాహాలై ఉన్నంతలో మంచిగానే జీవనం సాగిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల సంరక్షణ, పోషణను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. పెద్ద కుమారుడైతే మూడు నెలల క్రితం తల్లిదండ్రులను ఇంటి నుంచి బయటకు గెంటేశాడు. విషయం తెలిసినా మిగిలిన పిల్లలూ పట్టించుకోలేదు. దీంతో గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయ నిర్వాహకుల ఔదార్యంతో ప్రస్తుతానికి ఆలయ సత్రంలో తలదాచుకుంటున్నారు. నలుగురు పిల్లలుండి కూడా.. ఏమిటీ దుస్థితి అని తల్లడిల్లిన వృద్ధుడు మల్లయ్యగౌడ్ గురువారం చౌటుప్పల్‌లోని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ చైర్మన్ అందుబాటులో లేకపోవడంతో ఆర్డీఓ కార్యాలయ డీఏఓ శ్రీనివాస్‌కుమార్‌కు తన కుమారులపై ఫిర్యాదు చేశారు. సంరక్షణ, పోషణ కోసం కుమారులకు ఆదేశాలివ్వాలని కోరారు. లేనిపక్షంలో తమ దంపతులకు ఆత్మహత్య చేసుకునేలా అనుమతించాలని వేడుకున్నారు. కాగా, ఎన్నికలు ముగిశాకే ఈ కేసు ట్రిబ్యునల్ చైర్మన్ బెంచిపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. - చౌటుప్పల్



రోడ్లు ఖాళీ.. ఎండ తీవ్రతకు నిదర్శనమిది

వడదెబ్బకు ఎనిమిది మంది బలి

మృతుల్లో 83 ఏళ్ల వృద్ధుడు.. 17 ఏళ్ల బాలుడు

సాక్షి నెట్‌వర్క్: ఎండదెబ్బకు తాళలేక గురువారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏడుగురు మృత్యువాత పడ్డారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లికి చెందిన పూనాటి రామయ్య(83), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం చింతగుప్పకు చెందిన తొడం వెంకటేశ్(28), పాల్వంచ మండలం జగన్నాధపురం వాసి తోట భూలక్ష్మి(67), ములకలపల్లి మండలం చౌటిగూడెంకు చెందిన గడ్డం ప్రసాద్(57), నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం తిప్పలమ్మగూడేనికి చెందిన తోట జాన్‌రెడ్డి(60) పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఒడ్డెర (బీసీ) కాలనీకి చెందిన కోట సాయివిష్ణు(17), యాదాద్రి జిల్లా మోత్కూరులో ఆత్మకూరు(ఎం) మండలం టి. రేపాకకు చెందిన గుంటోజు మణెమ్మ(75) వడదెబ్బకు గురై మృతి చెందారు. హైదరాబాద్‌లోని మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో 45 ఏళ్ల వయసున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

నగర వార్తలు

విజయేందర్‌కుమార్ జైస్వాల్‌కు జాతీయ అవార్డు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అంబేద్కర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ విజయేందర్‌కుమార్ జైస్వాల్‌కు జాతీయ ప్రతిభ అవార్డు లభించింది. ఏప్రిల్ 28న ఢిల్లీలోని తీన్ మూర్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. విద్యారంగానికి ఆయన చేసిన కృషికి పురస్కారం లభించింది.

ఆరేళ్లలో మెట్రో ప్రయాణికులు 50 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో ప్రయాణికుల సంఖ్య 50 కోట్లకు చేరింది. గతేడాది జూలై నాటికి 40 కోట్ల మంది మెట్రో సేవలను వినియోగించుకోగా, ఈ ఏడాది కాలంలోనే మరో 10 కోట్ల మంది ప్రయాణికులు పెరిగారు. నగరంలోని మూడు కారిడార్‌లలో ప్రతి రోజు సుమారు వెయ్యికిపైగా మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. 2017 నవంబర్‌లో మెట్రో సేవలను ప్రారంభించినప్పటి నుంచి క్రమంగా ప్రయాణికుల ఆదరణ పెరుగుతూనే ఉంది. ఈ ఆరేళ్లలో మెట్రో సేవలను వినియోగించుకున్న వారి సంఖ్య 50 కోట్లకు చేరిన నేపథ్యంలో హైదరాబాద్ మెట్రోరైల్, ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో సంస్థలు శుక్రవారం అమీర్‌పేట్ స్టేషన్‌లో ప్రత్యేక వేడుకలను నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలను కల్పించే కస్టమర్ లాయల్టీ స్టాల్, గ్రీన్‌మైల్స్ లాయల్టీ క్లబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్‌అండ్‌టీమెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి తదితరులు పాల్గొంటారు.

‘మాస్టర్ చెఫ్ ఇండియా’ న్యాయనిర్ణేతగా ఆశ్రిత

సాక్షి, సిటీబ్యూరో: హోమ్‌కుక్స్‌లో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించే నిమిత్తం నగరానికి చెందిన చెఫ్‌లు సంజయ్ తుమ్మా, నికితా ఉమేష్, చలపతి రావుల సారథ్యంలోని మాస్టర్ చెఫ్ ఇండియా పోటీ న్యాయ నిర్ణేతల ప్యానెల్‌లో సినీనటుడు దగ్గుబాటి రానా కజిన్ ఆశ్రిత దగ్గుబాటి భాగం పంచుకుంటున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ సోనీలివ్ ప్రతినిధులు తెలిపారు. పానీయాలను రుచికరమైన డెజర్ట్‌లుగా మార్చే ‘లిక్విడ్ టు డెజర్ట్’ చాలెంజ్‌కు చెఫ్ ఆశ్రిత దగ్గుబాటి న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తారన్నారు. బార్సిలోనాలో ఉన్న ఆశ్రిత బేకింగ్, ఫుడ్ బ్లాగింగ్, ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో టాలెంట్ ఉన్న మహిళగా పేర్కొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పెంచాలి

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వేసవిలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పెంచాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... మేలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. ట్యాంకర్ బుకింగ్‌లు సైతం అధికంగా ఉండే అవకాశముందన్నారు.

- అందుకు అనుగుణంగా ట్యాంకర్ల సంఖ్య, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లను పెంచుకోవాలన్నారు. ట్యాంకర్ డెలివరీ సమయాన్ని సాధ్యమైనంత తగ్గించాలని సూచించారు. ప్రత్యేక ప్రణాళిక ద్వారా వినియోగదారులకు త్వరగా ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయవచ్చన్నారు.
- గత నెలలో మొత్తం 2,37,570 ట్యాంకర్ ట్రిప్పులను డెలివరీ చేశామన్నారు. ట్యాంకర్ల సంఖ్యను కూడా 613 ట్యాంకర్ల నుంచి 840 వరకు పెంచుకున్నట్లు తెలిపారు. వినియోగదారులు వివిధ మార్గాల ద్వారా ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారన్నారు. అందులో మొబైల్ యాప్ ద్వారా 48.96, ఐవీఆర్ఎస్ (కస్టమర్ కేర్)–36.78, జలమండలి అధికారిక వెబ్ సైట్ ద్వారా 14.16, ఇతర మార్గాల్లో 0.10 శాతం మంది ట్యాంకర్లు బుక్ చేసుకున్నారని వివరించారు. సమీక్షలో డైరెక్టర్ ఆపరేషన్స్–1, అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్.ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

ట్యాంకర్ బుకింగ్, డెలివరీ సరళి ఇలా...

	మార్చి 31 నాటికి	ఏప్రిల్ 30 నాటికి
మొత్తం ట్యాంకర్లు	613	840
ఫిల్లింగ్ స్టేషన్లు	70	88
ఫిల్లింగ్ పాయింట్స్	108	162
రోజువారీ బుకింగ్స్	4,945	7,193
రోజువారీ డెలివరీ	6,579	9,275
సరాఫరా చేసిన ట్రిప్పులు	1,69,452	2,37,570

జూన్‌లోగా అందుబాటులోకి రిజర్వాయర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్–2 లోని ప్యాకేజీ–1లో ఉన్న తుక్కుగూడ, పహాడీషరీఫ్, సుల్తాన్ పూర్, కాషాన్ గుట్ట, గుర్రంగూడ, కమ్మగూడ, తిరుమల నగర్, నంది హిల్స్ రిజర్వాయర్లను జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి గురువారం సందర్శించారు. అనంతరం సాహెబ్ నగర్ డివిజన్ ఆఫీసులను సందర్శించి అక్కడి ఫిల్లింగ్ స్టేషన్లో ట్యాంకర్ల వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్యాకేజీలో నిర్మిస్తున్న 33 రిజర్వాయర్లకు గానూ ఇప్పటికే 22 పూర్తయి అందుబాటులోకి వచ్చాయన్నారు. మిగిలిన 11 రిజర్వాయర్ల నిర్మాణ పనులు సైతం 90 శాతం పూర్తయినట్లు తెలిపారు. వాటి పనులను త్వరితగతిన పూర్తి చేసి జూన్‌లోగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇందులో కొత్తగా 1522.27 కిలో మీటర్ల మేర కొత్త పైప్‌లైన్ వేస్తున్నామన్నారు. ఇది దాదాపు పూర్తి కావచ్చినట్లు తెలిపారు. ఇన్ లెట్, అవుట్ లెట్ పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్ల ప్రాంగణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్–2 సుదర్శన్, సీజీఎం అమరేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరామ్

హిమాయత్‌నగర్: రాజ్యాంగాన్ని పాలకులు మార్చే కుట్రలు చేస్తున్నారని, మానవ విలువలు విధ్వంసం అవుతాయని వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) రాష్ట్ర కన్వీనర్ పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. పదేళ్లుగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం సాగించిన నిరంకుశ పాలనను, ఆర్థిక విధానాలను, అవినీతిని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రజలు ప్రశ్నించాలన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న 10 రోజుల ప్రచార కార్యక్రమాన్ని గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ప్రొఫెసర్ కోదండరామ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రచార వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ... బీజేపీ నాయకులు, ప్రధాని మోదీ ముస్లింలు, మంగళసూత్రాలు లాంటి అంశాలను ప్రస్తావిస్తూ చర్చను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ... మోదీ ఆర్థిక విధానాల వల్ల దేశంలో కొంతమంది బిలియనీర్లుగా మారారని. మిగిలిన ప్రజలు పేదరికంలో కూరుకుపోయారన్నారు. ప్రొఫెసర్ రమా మెల్కొటే, ప్రముఖ విద్యా వేత్తలు డాక్టర్ వనమాల, ప్రొఫెసర్ సుకుమార్, అనిశెట్టి శంకర్, మహిళా రైతుల హక్కుల వేదిక నాయకులు డాక్టర్ రుక్మిణీ రావు, విరసం నాయకులు రాము, టీపీజేఏసీ కో కన్వీనర్‌లు కన్నెగంటి రవి, రవిచందర్, మైసా శ్రీనివాస్, జ్యోతి, నాయకులు ముత్తయ్య, రామగిరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ టోర్నీ



సనత్‌నగర్: అంధుల చెస్ టోర్నమెంట్ గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. బేగంపేట మయూరి మార్గ్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్‌లో ఫిడే రేటింగ్ నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 245 మంది అంధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సాయిబాబాగౌడ్, కో–వ్యవస్థాపకురాలు జ్యోతిగౌడ్‌లు మాట్లాడుతూ.. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అంతర్జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆదివారం పోటీలు ముగుస్తాయని, ఆ తర్వాత విజేతలకు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. అంధుల చెస్ టోర్నమెంట్‌ను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య వీక్షించి అభినందించారు.

రైల్వే జనరల్ టికెట్లు మరింత ఈజీ

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ టికెట్‌ల కొనుగోలును దక్షిణమధ్య రైల్వే మరింత సులభం చేసింది. ప్రయాణికులు తాము బయలుదేరే స్టేషన్‌కు కేవలం 5 మీటర్‌ల పరిధిలో కూడా ప్రస్తుతం సబర్బన్, నాన్‌సబర్బన్ టికెట్‌లను కొనుగోలు చేయవచ్చు. గతంలో యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా టికెట్‌లను బుక్ చేసుకొనేందుకు 20 కిలోమీటర్‌ల నుంచి 50 కిలోమీటర్‌ల పరిధిలో మాత్రమే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ పరిమితిని తొలగించినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు తాము బయలుదేరే స్టేషన్ నుంచి అప్పటికప్పుడు యూటీఎస్ యాప్ ద్వారా టికెట్‌లను పొందే అవకాశం ఉంది. వివిధ మార్గాల్లో నడిచే రైళ్లలో అన్‌రిజర్వ్‌డ్ టికెట్‌లను కొనుగోలు చేసేందుకు అన్‌రిజర్వ్‌డ్ టికెట్ సిస్టమ్ (యూటీఎస్) మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. యూటీఎస్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభిస్తోంది. లక్షలాది మంది ప్రయాణికులు ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. ప్లాట్‌ఫామ్ టికెట్‌లు, ఎంఎంటీఎస్ టికెట్‌లు, సాధారణ బోగీల్లో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. ప్రయాణికులు బుకింగ్ కౌంటర్ల వద్ద క్యూలో నిల్చుని టికెట్‌ల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా మొబైల్ ద్వారా పేపర్‌లెస్ అన్‌రిజర్వ్‌డ్ టికెట్‌లను పొందవచ్చు. టిక్కెట్ చార్జీలను ఆర్–వాలెట్,ఇతర వాలెట్లు లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి వాలెట్ల ద్వారా చెల్లించవచ్చు.అన్‌రిజర్వ్‌డ్ టికెట్‌ల కోసం ప్రయాణికులు ఈ యాప్ సేవలను వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు.

ప్రభుత్వ మాజీ ప్లీడర్‌పై లైంగిక వేధింపుల కేసు



నిందితుడు సంజయ్‌కుమార్

హిమాయత్‌నగర్: ప్రభుత్వ మాజీ ప్లీడర్, న్యాయవాది ఎ.సంజయ్‌కుమార్ తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ నగర షీటీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో కోర్టు ఆవరణలో సంజయ్‌కుమార్‌కు చెందిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నగర ఉమెన్ సెఫ్టీ వింగ్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం... తనపై కోర్టు ఆవరణలో సంజయ్ కుమార్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. తన పలుకుబడితో బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. వెంటనే షీ టీమ్స్ విచారణ చేపట్టి, చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 354, 354డి, 506 కింద సంజయ్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ఆధారాలు సేకరించి బాధితురాలికి న్యాయం చేస్తామని తెలిపారు.

బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



నాగోలు: రాష్ట్రంలో బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ కోరారు. గురువారం తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలో సేవలందిస్తున్న బ్రాహ్మణ అభ్యర్థులకు, వివిధ కార్పొరేషన్‌లలో నామినేటెడ్ పదవులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ తెలిపారు. సంఘం నాయకులు రఘునందన్, నాగరాజు, భాస్కరమూర్తి, సుబ్బారావు, మంగు రాఘవరావు, శ్రీనివాస్‌రావు, విజయలక్ష్మి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మహిళ మృతి

జగద్గిరిగుట్ట: కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌కు చెందిన అల్లి యాదవరెడ్డి, పుష్పలత(29) భార్యాభర్తలు. వీరికి కుమార్తె అద్వితారెడ్డి(7), కుమారుడు నిత్వేష్‌రెడ్డి(5) ఉన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ విషయమై భార్యాభర్తలిద్దరూ చర్చించుకుని స్థానికంగా ఉండే చైతన్య నర్సింగ్ హోమ్‌కు వెళ్లారు.

- ఆస్పత్రి నిర్వాహకుడు సోమేష్‌ను కలవగా తక్కువ డబ్బులకు వేరే డాక్టర్‌తో ఆపరేషన్ చేయిస్తానని, స్కానింగ్ రిపోర్ట్ తీసుకురావాలని చెప్పాడు. దీంతో అతను చెప్పిన విధంగా స్కానింగ్ చేయించగా ఏప్రిల్ 30న ఉదయం 11 గంటలకు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రారంభించగా 12.40 గంటలకు పూర్తి చేశారు. కడుపులో పేగులు వడితిరగడం వల్ల ఆపరేషన్ ఆలస్యమైందని... నీ భార్య ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని.. మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ. 18 వేలు తీసుకున్నారు...
- మే 2వ తేదీన పుష్పలత ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆక్సిజన్ సరిగా అందడం లేదని.. వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సోమేష్ చెప్పడంతో యాదవరెడ్డి తన భార్య పుష్పలతను ఆల్విన్‌కాలనీలోని పద్మజ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు.
- ఈ విషయమై సోమేష్‌ను అడగటానికి క్లినిక్‌కు వెళ్లగా తాళం వేసి ఉందని.. అతని మొబైల్ సైతం స్విచ్ ఆఫ్ రావడంతో తన భార్య మృతిపై అనుమానం ఉందని.. ఆపరేషన్ చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతురాలి బంధువులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

భువనగిరి ఖిలాపై ఏ జెండా ఎగిరేనో?

సాక్షి, యాదాద్రి: ఈసారి భువనగిరి ఎంపీ సెగ్మెంట్‌లో త్రిముఖ పోరు నెలకొంది. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతుండగా, తొలిసారి పాగా వేయాలని బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఒకసారి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్ మరోసారి గెలుపు కోసం పోరాడుతోంది. సీపీఎం మాత్రం లక్ష ఓట్ల సాధన లక్ష్యంతో ప్రచారంలో దూసుకుపోతోంది. అయితే ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యేరసవత్తర పోరు సాగుతోంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంగా ఏర్పాటైంది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్, 2019లో ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. ఈ ఎన్నికల్లో బీజేపీ నుంచి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ తరఫున చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్, సీపీఎం అభ్యర్థిగా ఎండీ జహంగీర్ పోటీలో ఉన్నారు.

ఎంపీ సెగ్మెంట్‌లో ఈసారి త్రిముఖ పోటీ | లక్ష ఓట్ల సాధన లక్ష్యంతో బరిలో సీపీఎం

బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలోకి బూర



బూర నర్సయ్యగౌడ్
బీజేపీ

భువనగిరిలో టీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా 2022లో బీజేపీలో చేరారు. తొలి విడతలోనే బీజేపీ టికెట్ సంపాదించారు. ప్రధాని మోదీ చరిష్మాతోపాటు తనకున్న వ్యక్తిగత పరిచయాలు, తాను ఎంపీగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేసుకొని ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. చెప్పుకోదగ్గ ఓట్లు కూడా ఆ ఎన్నికల్లో రాబట్టుకోలేకపోయింది. గౌడ సామాజికవర్గ ఓట్లు అత్యధికంగా ఉండడం, బీసీ నినాదం, బీఆర్ఎస్ లోని పాత పరిచయాలతో క్రాస్ ఓటింగ్, మాదిగ ఓట్లు బీజేపీకి కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు.

సామాజికవర్గ సమీకరణలో క్యామ మల్లేష్



క్యామ మల్లేష్
బీఆర్ఎస్

రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన క్యామ మల్లేష్ బీఆర్ఎస్‌లో చేరారు. క్యామ మల్లేష్‌ది గొల్లకుర్మ సామాజికవర్గం. కేసీఆర్ చరిష్మా, బీఆర్ఎస్ పార్టీని నమ్ముకొని ప్రచారాన్ని సాగిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక జనగామలో తప్ప, ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే గెలిచారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అంశాలను ఎండగడుతూ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తన సామాజిక వర్గానికి చెందిన ఓట్లపై అధికంగా ఆధారపడ్డారు. దీనికితోడు బీఆర్ఎస్ ఓటు బ్యాంకు కలిసివస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. బీసీ నినాదం కూడా వినిపిస్తున్నారు. గులాబీ ద్వితీయ శ్రేణి నాయకత్వం మాత్రం మొక్కుబడిగా ప్రచారాన్ని నిర్వహిస్తోంది.

పోటీలో సీపీఎం

రాష్ట్రం మొత్తంలో సీపీఎం పోటీ చేస్తున్న ఏకైక లోక్‌సభ నియోజకవర్గం భువనగిరి. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్‌ను అభ్యర్థిగా పోటీలో నిలిపింది. లక్ష ఓట్లు సాధించడమే లక్ష్యంగా ప్రచారాన్ని నిర్వహిస్తోంది. వివిధ వర్గాల కార్మికుల ఓట్లపై కన్నేసింది.

సెమీ అర్బన్ నియోజకవర్గం

భువనగిరి లోక్‌సభ స్థానం పరిధి సెమీ అర్బన్‌గా ఉంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు, ఆలేరులోని కొంతప్రాంతం హెచ్‌ఎండీఏలో ఉంది. జనగామ, తుంగతుర్తి, నకిరేకల్, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాలు పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ప్రజలు జీవిస్తున్నారు. పారిశ్రామిక ప్రగతి అంతంగా మాత్రంగానే ఉంది. హైదరాబాద్‌కు ఈస్ట్‌కు శివారులో ఉన్నా, ప్రగతి మాత్రం వెనుకబడి ఉంది.

ప్రభావితం చేసే అంశాలు

- పెండింగ్ రైల్వే, సాగునీటి ప్రాజెక్టులు
- జాతీయ రహదారుల విస్తరణ జాప్యం
- కాళేశ్వరం భూసేకరణలో కోల్పోయిన భూములకు పరిహారం
- చేనేత కార్మికుల, ఐటీ కారిడార్, పారిశ్రామిక కారిడార్‌ల ఏర్పాటు
- టూరిజం, డ్రైపోర్టు, ఎయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్యం
- గౌడ, గొల్లకుర్మ, ఎస్సీ, ఎస్టీ, ముదిరాజ్, పద్మశాలి, మున్నూరు కాపు, రెడ్డి సామాజికవర్గ ఓటర్లు

కోమటిరెడ్డి ఆధ్వర్యంలో చామల



కిరణ్‌కుమార్‌రెడ్డి
కాంగ్రెస్


కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపు బాధ్యతలను భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీసుకున్నారు. నియోజకవర్గ కేంద్రాలు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో కోమటిరెడ్డి స్థానిక ఎమ్మెల్యేలు, అభ్యర్థితో కలిసి ప్రచారం చేశారు. కోమటిరెడ్డి సోదరులను గెలిపించిన భువనగిరి ప్రజలు తన సోదరుడులాంటి చామలను గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజలను కోరుతున్నారు. తన సామాజికవర్గ ఓట్లు, మైనార్టీ ఓట్లపై ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు ఇస్తోంది.

ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఓటర్ల వివరాలు ఇలా...

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు
ఇబ్రహీంపట్నం	1,70,807	1,68,499
మునుగోడు	1,28,233	1,29,321
భువనగిరి	1,0,8801	1,11,794
నకిరేకల్(ఎస్సీ)	1,25,451	1,28,330
తుంగతుర్తి(ఎస్సీ)	1,28,719	1,30,539
ఆలేరు	1,16,914	1,18,337
జనగాం	1,19,491	1,23,270
మొత్తం	8,98,416	9,10,090

2019 లోక్‌సభ ఎన్నికల ప్రధానపార్టీల అభ్యర్థుల ఓట్లు ఇలా...

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్) 5,32,795 (44.37 శాతం)
- బూరనర్సయ్యగౌడ్ (టీఆర్ఎస్) 5,27,576 (43.94 శాతం)
- పీవీ శ్యాంసుందర్‌రావు (బీజేపీ) 65,451 (5.45 శాతం)



ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారానికి డిప్యూటీ సీఎం భట్టి


రాయగఢ్‌లో కళింగ వైశ్యుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శుక్రవారం రాయగఢ్ లోక్‌సభ పరిధిలో రాహుల్‌గాంధీ సభ నేపథ్యంలో ఆ సభ ఏర్పాట్లను ఆయన పర్య వేక్షించారు. అనంతరం స్థానిక పీసీసీ నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలుగు కళింగ వైశ్య సంఘం ఆహ్వానం మేరకు రాయగఢ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

'నామినేషన్'పై జోక్యం చేసుకోలేం: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక అందులో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి తాను వేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది కేపీ గీతాకుమారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ నిర్వహించింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల ఖర్చుల కోసం పిటిషనర్ ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించలేదన్నారు. ఫొటో, ఫారం ఏ వంటివి పిటిషనర్ పూర్తి చేయలేదని, అందుకే నామినేషన్ తిరస్కరణకు గురైందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్‌పై విచారణను ముగించింది.

మోదీ మళ్లీ వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు ఖాయం

మధుయాష్కీ



మన్సూరాబాద్ (హైదరాబాద్): మోదీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లను రద్దు చేయడం ఖాయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ చెప్పే గ్యారంటీ అంటే మరోసారి దేశ ప్రజలను మోసం చేయడమే అన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు చేసింది ఏమీలేదని, కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి చేసింది శూన్యమని విమర్శించారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను మోదీ విస్మరించారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రజా పాలన మెచ్చి ఇతర పార్టీల నేతలు భారీస్థాయిలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి వస్తున్నాయని, వాటికి ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

కోడ్‌ను ఉల్లంఘించిన స్పీకర్‌పై చర్యలు తీసుకోవాలి

సీఈవోకు బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌పార్టీ తరఫున ప్రచారం చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చర్య తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీజేపీ గురువారం ఫిర్యాదు చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పక్షాన స్పీకర్ ప్రచారం చేస్తున్న విషయాన్ని అంతకుముందు సీఈవో దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, స్పీకర్ కూడా తమ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొంది. గతంలో రాజకీయపరమైన ప్రసంగం చేసినందుకు గుజరాత్ స్పీకర్ శంకర్‌చౌదరిపై, ఒడిశా స్పీకర్‌పై ఈసీ చర్యలు తీసుకున్నట్లు ఓ పత్రికలో వచ్చిన వ్యాసాన్ని కూడా తమ ఫిర్యాదుతో జతచేసినట్లు తెలిపింది. దీంతోపాటు హైదరాబాద్‌లోని పలుచోట్ల బీజేపీకి సంబంధించి హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, పోస్టర్లను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

దేశ ప్రజల భవిష్యత్ కోసమే ఇండియా కూటమి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నడిగూడెంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

నడిగూడెం: దేశ ప్రజల భవిష్యత్ కోసమే ఇండియా కూటమి ఏర్పాటు అయిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఈ లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని, బీజేపీ ప్రభుత్వం గడిచిన 10 ఏళ్లలో దేశ ప్రజల కోసం చేసిందేమీ లేదని అన్నారు. బీజేపీ సర్కార్ మతపరంగా ప్రజలను విభజించి పాలిస్తోందన్నారు. మోదీ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పాటు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచారన్నారు. దీంతో ప్రజలకు భారంగా మారిందన్నారు. దేశంలో మెజారిటీ లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని, రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈ పదేళ్లలో బీఆర్ఎస్ కూడా చేసిందేమీ లేదని, లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆ పార్టీ మనుగడలేకుండా పోతుందని అన్నారు. కేసీఆర్ పాలనలో అధికార దుర్వినియోగం జరిగిందని, అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, పోలీసు శాఖను ఇష్టారాజ్యంగా వాడుకున్నారని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం అర్హులైన పేదలందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ఈ సభలో పాల్గొన్నారు.

'ఢిల్లీ దర్బార్.. కాంగ్రెస్ హుషార్'

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ దర్బార్ పేరుతో కాంగ్రెస్ పార్టీ.. బీజేపీకి వ్యతిరేకంగా వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. నిధుల పంపిణీలో తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఎత్తిచూపుతూ టీపీసీసీ ఓ వీడియోను రూపొందించింది. మోదీ రాజుగా, అమిత్‌షా, నిర్మలా సీతారామన్ మంత్రులుగా ఉన్న దర్బార్‌లో గుజరాత్ నుంచి వచ్చిన జీఎస్టీకి ప్రతిఫలంగా మణులు, మణిహారాలు ఇచ్చినట్టు, తెలంగాణ జీఎస్టీకి ప్రతిఫలంగా గాడిద గుడ్డు ఇచ్చినట్టు ఈ వీడియోలో చిత్రీకరించారు. మోదీ, షా, సీతారామన్ వేషధారులు ఉత్తరాది రాష్ట్రాల పట్ల ఆప్యాయంగా, తెలంగాణ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్టు ఈ వీడియోను రూపొందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాల మూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, సమ్మక్క జాతరకు జాతీయహోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తూ.. మార్పు మొదలైంది నినాదంతో ఈ వీడియోను ముగుస్తుంది.

నేడు టీ కాంగ్రెస్ మేనిఫెస్టో!

లోక్‌సభ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కాంగ్రెస్

- గాంధీభవన్‌లో విడుదల చేయనున్న టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి
- ఐటీఐఆర్, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పాలమూరుకు జాతీయ హోదా సహా 23కుపైగా హామీలు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను టీపీసీసీ శుక్రవారం విడుదల చేయనుంది. ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి ఈ 'తెలంగాణ మేనిఫెస్టో'ను విడుదల చేయనున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. నిజానికి గత నెల 6వ తేదీన కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభలోనే తెలంగాణ ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేయాలని టీపీసీసీ నేతలు భావించారు. 23కుపైగా హామీలతో దానిని సిద్ధం చేశారు. కానీ చివరి నిమిషంలో వాయిదా వేశారు. తాజాగా శుక్రవారం విడుదల చేయనున్నారు.

టీపీసీసీ తెలంగాణ మేనిఫెస్టోలో హామీలివే!

ఐటీఐఆర్ ఏర్పాటు; ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ; బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ; హైదరాబాద్‌లో ఐఐఎం; హైదరాబాద్, విజయవాడ హైవేలో ర్యాపిడ్ రైల్వే సిస్టం; మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు; భద్రాచలం సమీపంలోని ఏటపాక, గుండాల, పురుషోత్తమ పట్నం, కన్నాయిగూడెం, పిచుకలపాడు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం; పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా; హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం; కొత్త ఎయిర్‌పోర్టులు; రామగుండం-మణుగూరు రైల్వే లైన్; కొత్తగా నాలుగు సైనిక్ స్కూళ్లు; కేంద్రీయ విశ్వ విద్యాలయాల పెంపు; నవోదయ విద్యాలయాల సంఖ్య రెట్టింపు; నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు; ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఎస్ఈఆర్) ఏర్పాటు; ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్; నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ; ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఏఆర్ఐ) క్యాంపస్ ఏర్పాటు; అధునాతన వైద్య, ఆరోగ్య పరిశోధన కేంద్రం; 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు కేటాయింపు; ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ యూనిట్; ఐదు పారిశ్రామిక కారిడార్‌ల నిర్మాణం (హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్- నాగ్‌పూర్, హైదరాబాద్- వరంగల్, హైదరాబాద్-నల్లగొండ-మిర్యాలగూడ, సింగరేణి పారిశ్రామిక కారిడార్); ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ కల్చరల్ అండ్ ఎంటర్టైన్‌మెంట్ హబ్; మేడారం జాతరకు జాతీయ హోదా; న్యూ డ్రైపోర్టు; హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు.

ప్రశ్నించే గొంతును పార్లమెంట్‌కు పంపండి

ఆర్.ఎస్.ప్రవీణ్



చాంద్రాయణగుట్ట (హైదరాబాద్): కార్మిక, కర్షక పిల్లల భవిష్యత్తు కోసం ప్రశ్నించే గొంతును పార్లమెంట్‌కు పంపిస్తే తెలంగాణ ఆత్మ గౌరవం నిలబడుతుందని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్ని వర్గాల సమస్యలపై పోరాడుతానని చెప్పారు. బీఆర్‌టీయూ చాంద్రాయణగుట్టలోని ఉప్పుగూడలో ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన మే డే ఉత్సవాల్లో ప్రవీణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ మోసపూరిత హామీలు ఇచ్చి పబ్బం గడుపుకుంటుందన్నారు. మోసపూరిత కాంగ్రెస్‌ను, మతతత్వ బీజేపీ, ఎంఐఎంలను ఈ ఎన్నికల్లో మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. కేవలం నాలుగు నెలల్లోనే బంగారు తెలంగాణను ఆగం చేసిన కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కోరారు.

ఓటేసిన 106 ఏళ్ల వృద్ధురాలు

ఇంటి నుంచే ఓటుహక్కు సదుపాయం




దుబ్బాక: 106 ఏళ్ల వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకుంది. సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన అరుదైన సందర్భమిది. 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటినుంచే ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం ఎన్నికల కమిషన్ కల్పించడం తెలిసిందే. ఈ క్రమంలో సోమన్నగారి గండవ్వ అనే వృద్ధురాలు తన ఓటు హక్కును వినియోగించుకుంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆమె ఇంటినుంచే ఓటు వేసింది.



ఓట్ల కోసం క్షవరం

ఎంపీ పోతుగంటి రాములు గురువారం ఉప్పునుంతలలో తన కుమారుడు, బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను అనే నాయీ బ్రాహ్మణుడి ఇంటికి వెళ్లి ఇలా ఓ వ్యక్తికి క్షవరం చేసి ఓట్లు అభ్యర్థించారు.
- ఉప్పునుంతల

ఓటు హక్కుకు 'అభిషేకం'



ఖమ్మం అర్బన్: ఓటు హక్కు వినియోగించుకున్న వారికి ఆలయంలో మూడు నెలల పాటు ఉచితంగా అభిషేకం చేయడమే కాక జాతకం చెబుతానని ఓ అర్చకుడు ప్రకటించారు. ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా అధికారులు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇందుకు తన వంతు సహకారం అందించేందుకు ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో గాయత్రీమాత ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశాస్త్రి ముందుకొచ్చారు. ఈమేరకు ఓటు వేసిన వారికి.. మూడు నెలల పాటు ఆలయంలో టికెట్ లేకుండానే అభిషేకం చేయడంతో పాటు జాతకం, శాంతులు చెబుతానంటూ ఆయన పలు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది.



మహాలక్ష్మి.. ముచ్చట

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్టీసీ బస్సులో గురువారం ప్రయాణికులతో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.

'బీజేపీ గ్యారంటీలపై నమ్మకం లేదు'

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన గ్యారంటీలపై దేశ ప్రజలకు అనుమానాలున్నాయని, ఈ గ్యారంటీలు వ్యక్తిగతమా?.. పార్టీ పరంగానా? అని టీపీసీసీ మేధావుల ఫోరం చైర్మన్ అనంతుల శ్యాం మోహన్ ప్రశ్నించారు. వ్యక్తిగతమైతే మోదీనే ప్రధాని అవుతారన్న గ్యారంటీ ఏమిటని, ఆయన కాకుండా మరెవరైనా ప్రధాని కావచ్చు కదా? అని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని గతంలో మోదీ ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని విమర్శించారు.

మహారాష్ట్రలో మూడో దశ లోక్‌సభ ఎన్నికల సమరం మహాయుతి, మహా వికాస్ అగాడీ రెండు కూటముల మధ్య నువ్వా నేనా అన్నట్టుగా సాగుతోంది. పశ్చిమ మహారాష్ట్రలో ఏడు స్థానాలు, కొంకణ్, మరాఠ్వాడా నుంచి రెండేసి చొప్పున మొత్తం 11 స్థానాలకు ఈ నెల 7న పోలింగ్ జరగనుంది. బీజేపీ, ఎన్సీపీ, శివసేనతో కూడిన అధికార మహాయుతి కూటమి ఒకవైపు.. కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్సీపీలతో కూడిన ఎంవీఏ మరోవైపు మోహరించాయి. పలుచోట్ల రెబెల్ అభ్యర్థులూ వాటికి సవాలు విసురుతున్నారు. ఉద్ధవ్, శరద్ వర్గాలకు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్

మూడో దశలో మహా ఫైట్

ఉద్ధవ్, శరద్ ఇద్దరికీ ప్రతిష్టాత్మకం

మహాయుతి కూటమికి గట్టి పోటీ

అజిత్‌కూ ప్రతిష్టాత్మకమే

ఎన్సీపీ చీఫ్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు కూడా ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. బాబాయి శరద్ పవార్‌తో విభేదించి పార్టీని చీల్చి తన వర్గానికే అసలు ఎన్సీపీగా అధికారిక గుర్తింపు సాధించుకోవడం తెలిసిందే. రాయగఢ్, ఉస్మానాబాద్‌తో పాటు బారామతిలో విజయం ఆయనకు సవాలుగా మారింది. బారామతిలో అజిత్ భార్య సునేత్ర బరిలో ఉన్నారు. తన మరదలు, శరద్ పవార్ కూతురైన సిట్టింగ్ ఎంపీ సుప్రియా సులేతో ఆమె తలపడుతుండటం విశేషం.



లాలూ వర్సెస్ రోహిణి!

పట్నా: ఆర్జేడీ దిగ్గజం లాలు ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణీ ఆచార్య తొలిసారి లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతుండటం తెలిసిందే. బిహార్‌లోని సరన్ నియోజకవర్గం ఆమె పోటీ చేస్తున్నారు. అయితే లాలూ ప్రసాద్ యాదవ్ కూడా అక్కడి నుంచే ఆమెపై పోటీ పడుతున్నారు! తండ్రీ కూతుళ్లు ఒకరిపై ఒకరు పోటీ పడటం ఏమిటా అని అవాక్కవుతున్నారా? వాళ్లిద్దరూ సరన్ నుంచి పోటీ చేస్తున్నది నిజమే గానీ సదరు లాలు ప్రసాద్ యాదవ్ ఆమె తండ్రి కాదు. ఆ పేరుతోనే ఉన్న ఓ రైతు! రాష్ట్రీయ జన సంభావనా పార్టీ (ఆర్జేపీ) అభ్యర్థిగా నామినేషన్ వేశారాయన. ఈ లాలు ప్రసాద్ యాదవ్‌కు గతంలో పంచాయతీ మొదలుకుని ప్రెసిడెంట్ ఎన్నికల దాకా పోటీ చేసిన అనుభవముంది. అంతే కాదు, 2017, 2022ల్లో రెండుసార్లు రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా పోటీ పడ్డారు. రెండుసార్లూ ఆయన నామినేషన్ తిరస్కరణకు గురవడం వేరే సంగతి! సరన్ లోక్‌సభ స్థానం నుంచి కూడా ఆయన పోటీ చేయడం ఇది తొలిసారేమీ కాదు. చాలాకాలంగా బరిలో నిలుస్తూనే వస్తున్నారు. లాలు భార్య, బిహార్ మాజీ సీఎం రబ్రీ దేవిపై కూడా పోటీ చేశారు. ఇప్పుడు వారి కుమార్తెపై బరిలో దిగారు. గత ఎన్నికల విషయం ఎలా ఉన్నా ఈసారి మాత్రం భారీ మెజారిటీతో గెలుస్తానని ఈ లాలు అంటుండటం విశేషం! ''జీవనోపాధి కోసం వ్యవసాయం చేసుకుంటున్నా, నిత్యం సామాజిక సేవలో నిమగ్నమయ్యే ఉన్నా. కనుక ఈసారి సరన్ ప్రజలు నా వెంట ఉన్నారు'' అంటున్నారు. రోహిణి ఓట్లను చీల్చేందుకే ఆయన బరిలో ఉన్నారని ఆరోపణలున్నాయి. పట్టించుకోనంటున్నాడు. అఫిడవిట్ ప్రకారం ఈ లాలు దగ్గర రూ.5 లక్షల నగదు, భార్య వద్ద 2 లక్షల నగదు, ఆయన పేరిట రూ.17.6 లక్షలు, భార్య పేరిట రూ.5.20 లక్షల చరాస్తులున్నాయి.

ఉస్మానాబాద్



• అర్చనా పాటిల్

మరాఠ్వాడా ప్రాంతంలో ప్రముఖ పట్టణం. దీని పేరును సర్కారు ఇటీవలే దారాశివ్‌గా మార్చింది. సిట్టింగ్ ఎంపీ ఓం ప్రకాశ్ రాజే నింబాల్కర్ శివసేన (ఉద్ధవ్) తరఫున పోటీలో ఉన్నారు. తుల్జాపూర్ బీజేపీ ఎమ్మెల్యే రాణా జగ్‌జీత్ సిన్హా భార్య అర్చనా పాటిల్‌ను మహాయుతి కూటమి బరిలో దింపింది. ఆమె ఇటీవలే ఎన్సీపీ (అజిత్) పార్టీలో చేరి లోక్‌సభ టికెట్ సంపాదించారు. అర్చన మామ పదమ్‌సిన్హా పాటిల్ సీనియర్ మోస్ట్ రాజకీయ నాయకుడు. అజిత్ పవార్ భార్య సునేత్రకు సోదరుడు కూడా. నింబాల్కర్ కుటుంబంతోనూ వీరికి దగ్గరి బంధుత్వముంది. కానీ వీరి కుటుంబాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. నింబాల్కర్ తండ్రిని చంపించినట్టు పదమ్‌సిన్హాపై ఆరోపణలున్నాయి! 2019 లోక్‌సభ ఎన్నికల్లో నింబాల్కర్ ఈ స్థానంలో రాణా జగ్‌జీత్ సిన్హాను ఓడించడం విశేషం. ఈసారి మహిళల ఓట్లు తనను గెలిపిస్తాయని అర్చన నమ్మకం పెట్టుకున్నారు.

సాంగ్లి



• సంజయ్ పాటిల్

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంజయ్ కాక పాటిల్ మళ్లీ బరిలో ఉన్నారు. విపక్ష మహా వికాస్ అగాడీ తరఫున కాంగ్రెస్ నేత విశాల్ పాటిల్ టికెట్ ఆశించగా పొత్తులో భాగంగా ఈ స్థానం శివసేన (ఉద్ధవ్)కు వెళ్లింది. దాంతో ఆయన రెబెల్‌గా పోటీకి దిగారు. శివసేన (ఉద్ధవ్) నుంచి రెజ్లర్ చంద్రహార్ పాటిల్ బరిలో ఉన్నారు. దాంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ ఓట్లను విశాల్ చీలుస్తారని, అది బీజేపీకి కలిసొస్తుందని భావిస్తున్నారు.

సోలాపూర్



• ప్రణతీ షిండే

2014, 2019ల్లో ఇక్కడ వరుసగా బీజేపీయే నెగ్గింది. ఈసారి మాత్రం కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే కుమార్తె ప్రణతీ షిండే బరిలో ఉండటమే అందుకు కారణం. నిజానికి ఆమెను పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ చివరిదాకా ప్రయత్నించి విఫలమైంది. బీజేపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే రామ్ సాత్పుతే రంగంలోకి దిగారు. ప్రణతి కూడా సోలాపూర్ సెంట్రల్ సిట్టింగ్ ఎమ్మెల్యేనే కావడం విశేషం! ఆమె తొలిసారి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. ఇక్కడ అభ్యర్థిని మార్చే ఆనవాయితీని ఈసారి కూడా బీజేపీ కొనసాగించింది. 2014లో శరద్ బాన్సోడ్, 2019లో జైసిద్ధేశ్వర్ స్వామి బీజేపీ తరఫున గెలిచారు. ఆ రెండుసార్లూ ఓటమి చవిచూసింది సుశీల్‌కుమార్ షిండేనే! ఈసారి మజ్లిస్ ఇక్కడ అభ్యర్థిని ఉపసంహరించుకోవడం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. సోలాపూర్, మాధా స్థానాల్లో విజయం కోసం చెమటోడ్చాల్సిందేనని బీజేపీ నేతలే అంగీకరిస్తుండటం విశేషం!



• ఉదయన్ భోసాలే

సతారా


మహాయుతి కూటమి తరఫున ఎన్సీపీ (శరద్ పవార్) నేత, కార్మిక నాయకుడు, ఎమ్మెల్సీ శశికాంత్ షిండే బరిలో ఉన్నారు. దాంతో కొల్హాపూర్ మాదిరిగానే ఇక్కడ కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ఛత్రపతి శివాజీ వంశీయుడు, రాజ్యసభ ఎంపీ ఉదయన్‌రాజే భోసాలేకు టికెటిచ్చింది. మహాయుతి కూటమి నుంచి ఈ స్థానంలో పోటీ చేయాలని తొలుత ఎన్సీపీ (అజిత్) భావించింది. ఉదయన్‌రాజే భోసాలే పోటీకి ఆసక్తి చూపడంతో ఈ స్థానాన్ని బీజేపీ తీసుకుంది.



• నారాయణ్ రాణే

రత్నగిరి-సింధుదుర్గ్

సిట్టింగ్ ఎంపీ, శివసేన (ఉద్ధవ్) నేత వినాయక్ రౌత్ మళ్లీ బరిలో ఉన్నారు. ఆయనపై కేంద్ర మంత్రి నారాయణ్ రాణేను బీజేపీ పోటీకి దింపింది. శివసేన రెండుగా చీలిన తర్వాత జరుగుతున్న ఎన్నిక కావడంతో రెండుసార్లుగా గెలుస్తూ వస్తున్న రౌత్‌కు ఈసారి విజయం తేలిక కాదంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ వర్గానికి చెందిన స్థానిక నేతలు, శ్రేణుల ఐక్యతకు ఈ ఎన్నిక పరీక్షగా మారింది.



• అనంత్ గీతే

రాయగఢ్

ఇక్కడ పోటీ ప్రధానంగా సిట్టింగ్ ఎంపీ, ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తత్కారే, శివసేన (ఉద్ధవ్) అభ్యర్థి అనంత్ గీతే మధ్యే ఉంది. 2019 ఎన్నికల్లో అనంత్ గీతేపైనే తత్కారే 30 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతకు ముందు రెండు పర్యాయాలు వరుసగా అనంత్ గీతేనే ఇక్కడ గెలిచారు.



• రంజిత్ నింబాల్కర్

మాధా

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్ సిన్హా నాయక్ నింబాల్కర్ మళ్లీ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఎన్సీపీ అభ్యర్థి సంజయ్‌మామ విఠల్‌రావు షిండేపై 86 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. కానీ మళ్లీ నింబాల్కర్‌కు టికెటివ్వడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ జిల్లా కార్యదర్శి ధైర్యశీల్ మోహిత్ పాటిల్ ఇటీవలే శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీలో చేరారు. ఆ పార్టీ నుంచి రంగంలోకి దిగి బీజేపీకి గట్టి సవాలు విసురుతున్నారు. మోహిత్‌కు స్థానికంగా బాగా పట్టుండటంతో ఇక్కడ బీజేపీ ఎదురీదుతోందని చెబుతున్నారు.

మూడో విడతలో... మహిళలు 9 శాతమే

- ఐదో వంతు అభ్యర్థులపై కేసులు
- ఆస్తుల్లో పల్లవి డెంపో టాప్



తొలి రెండు విడతల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల మూడో విడతలోనూ మహిళలకు సముచిత స్థానం దక్కలేదు. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 లోక్‌సభ స్థానాలకు మే 7న పోలింగ్ జరగనుంది. 1,352 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో మహిళలు 123 మందే (9 శాతం) ఉన్నారు. ఇక ప్రతి పది మంది అభ్యర్థుల్లో ఇద్దరు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నట్టు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) డేటా వెల్లడించింది. వీరిలో 13 శాతం మందిపై మహిళలపై అత్యాచారం వంటి తీవ్ర కేసులున్నాయి. మొత్తం 38 మంది అభ్యర్థులు మహిళలకు సంబంధించిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. శివసేన (ఉద్ధవ్) అభ్యర్థుల్లో ఏకంగా 80 శాతం, ఎన్సీపీ (శరద్ పవార్) అభ్యర్థుల్లో 67 శాతం, ఎస్పీ అభ్యర్థుల్లో 50 శాతం, జేడీ(యూ)లో 33 శాతం, తృణమూల్ కాంగ్రెస్‌లో మందిపై క్రిమినల్ కేసులుండటం విశేషం! బీజేపీ నుంచి 22 మంది, కాంగ్రెస్ నుంచి 26, ఆర్జేడీ నుంచి ముగ్గురిపై కేసులున్నాయి. అభ్యర్థుల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ మందిపై క్రిమినల్ కేసులున్నప్పుడు ప్రకటించే రెడ్ అలర్ట్‌ను 43 నియోజకవర్గాల్లో జారీ చేశారు.

మూడో వంతు కోటీశ్వరులే

మొత్తం అభ్యర్థుల్లో 392 మంది కోటీశ్వరులేనని వారు దాఖలు చేసిన అఫిడవిట్లు తెలియజేస్తున్నాయి. దక్షిణ గోవా బీజేపీ అభ్యర్థి పల్లవీ శ్రీనివాస్ డెంపో రూ.1,361 కోట్ల ఆస్తులతో టాప్‌లో ఉన్నారు. తర్వాత మధ్యప్రదేశ్ గుణ బీజేపీ అభ్యర్థి జ్యోతిరాదిత్య సింధియా రూ.424 కోట్లు, మహారాష్ట్రలో కొల్హాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఛత్రపతి సాహు మహారాజ్ రూ.342 కోట్లతో రెండు, మూడో స్థానాల్లో ఉన్నారు. మూడో దశలో 82 మంది బీజేపీ అభ్యర్థుల్లో 77 మంది; 68 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లోనూ ఏకంగా 60 మంది కోటీశ్వరులే. జేడీ(యూ), శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ, ఆర్జేడీ, శివసేన, ఎన్సీపీ (శరద్ పవార్) అభ్యర్థులంతా కోటీశ్వరులే. ఐదుగురు అభ్యర్థులు తమకెలాంటి ఆస్తులూ లేవని పేర్కొనడం విశేషం.

సగం మంది ఇంటర్ లోపే

అభ్యర్థుల్లో 639 మంది విద్యార్హత ఆరో తరగతి నుంచి ఇంటర్ లోపే! 19 మందైతే ఏమీ చదువుకోలేదు. 56 మంది ఐదో తరగతి లోపే చదివారు. 591 మందికి డిగ్రీ, అంతకంటే ఉన్నత విద్యార్హతలు ఉన్నాయి. 44 మంది డిప్లొమా చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



పేరులో మంచు ఉన్నా హిమాచల్‌ప్రదేశ్‌లో రాజకీయాలు మాత్రం ఎప్పుడూ సెగలు కక్కుతుంటాయి. రాష్ట్రంలో అధికార పార్టీ ఓడిపోయే ఆనవాయితీ 1985 నుంచీ కొనసాగుతోంది. రాష్ట్ర కాంగ్రెస్ సర్కారుపై ఎమ్మెల్యేల తిరుగుబాటు తాజాగా రాజకీయ ప్రకంపనలు పుట్టిస్తోంది. రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్, బీజేపీ మధ్య మారుతున్నా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 2009 నుంచీ బీజేపీదే పైచేయి. గత రెండు ఎన్నికల్లో 4 సీట్లూ ఆ పార్టీయే క్లీన్‌స్వీప్ చేసింది. ఈసారి హ్యాట్రిక్‌పై కన్నేసింది. పదేళ్లుగా ఒక్క ఎంపీ సీటూ గెలవలేని పేలవమైన రికార్డును ఎలాగైనా మెరుగు పరుచుకోవాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

స్టేట్ స్కాన్

పర్యాటక స్వర్గధామమైన హిమాచల్‌లో ఓటర్ల మూడ్ ఒక్కో ఎన్నికల్లో ఒక్కోలా మారుతుంటుంది. కాంగ్రెస్, బీజేపీలే ఇక్కడ నువ్వా నేనా అంటూ తలపడుతున్నాయి. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీ 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ పూర్తి మెజారిటీతో అధికారాన్ని దక్కించుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ మరోసారి క్లీన్‌స్వీప్ చేసింది. కానీ 2022 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. 68 అసెంబ్లీ స్థానాల్లో 40 చోట్ల నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని 4 లోక్‌సభ స్థానాల్లో సిమ్లాను ఎస్సీలకు కేటాయించారు.

హిమజ్వాల!

హిమాచల్‌లో బీజేపీదే హవా ● అడ్డుకునే యత్నాల్లో కాంగ్రెస్

6 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు ● కాంగ్రెస్ సర్కారుకు విషమ పరీక్షే!

ఆపరేషన్ కమలం...

సుఖ్విందర్ సింగ్ సుఖు సీఎంగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే రాష్ట్ర కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు మొదలయ్యాయి. బీజేపీ దీన్ని యథాశక్తి ఎగదోస్తూ ఆపరేషన్ కమలానికి తెర తీసింది. ఇటీవలి రాజ్యసభ ఎన్నికలు దీనికి మరింత ఆజ్యం పోశాయి. కాంగ్రెస్ నుంచి జంప్ చేసిన హర్ష్ మహాజన్‌ను బలం లేకపోయినా బీజేపీ రాజ్యసభ పోటీలో నిలిపింది. ముగ్గురు స్వతంత్రులతో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలూ అనూహ్యంగా బీజేపీకి ఓటేయడంతో హర్ష్‌కు, కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వికి 34 ఓట్లు వచ్చాయి. లాటరీలో హర్షే విజయం వరించింది. స్వతంత్ర ఎమ్మెల్యేలు ముగ్గురూ ఇప్పటికే బీజేపీలో చేరారు. ఆరుగురు కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలు కూడా తాజాగా కాషాయ కండువా కప్పుకున్నారు. దాంతో ప్రస్తుతం కాంగ్రెస్ బలం 34కు పడిపోయి సర్కారు సంక్షోభంలో పడింది. బీజేపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ప్రభుత్వం కూలిపోయేలా ఉంది. ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తామని ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేసిన ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. దాంతో ఆ ఆరు అసెంబ్లీ స్థానాల్లోనూ లోక్‌సభతో పాటే జూన్ 1న ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.





కాంగ్రెస్‌కు ప్రాణసంకటం...!

తాజా రాజకీయ సంక్షోభం నేపథ్యంలో లోక్‌సభ, 6 అసెంబ్లీ సీట్ల ఉప ఎన్నికలు కాంగ్రెస్‌కు విషమపరీక్షగా మారాయి. ఎమ్మెల్యే సీట్లు బీజేపీ పరమైతే రాష్ట్రంలో ప్రభుత్వం కమలనాథుల పరమవుతుంది. రామ మందిరం, హిందుత్వ, అభివృద్ధి నినాదాలతో బీజేపీ హోరెత్తిస్తోంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్పొరేట్లతో మోదీ కుమ్మక్కు, సామాజిక న్యాయం, సంక్షేమం తదితరాలను కాంగ్రెస్ నమ్ముకుంది. హమీర్పూర్ నుంచి రాజ్‌పుత్ సామాజిక వర్గానికి చెందిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఐదోసారి ఎంపీగా విన్నింగ్ షాట్ కొట్టేందుకు బరిలోకి దిగుతున్నారు. ఆయన హిమాచల్‌కు రెండుసార్లు సీఎంగా చేసిన ప్రేమ్‌కుమార్ ధుమాల్ తనయుడు. మండి స్థానంలో బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్, 'క్వీన్' కంగనా రనౌత్ బీజేపీ తరఫున రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి రాజ వంశీయుడు, మాజీ సీఎం వీరభద్రసింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్ పోటీలో ఉన్నారు. బీజేపీ ఎంపీ రామ్ స్వరూప్ శర్మ ఆత్మహత్య చేసుకోవడంతో 2021లో మండికి ఉప ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ తరఫున విక్రమాదిత్య సింగ్ తల్లి ప్రతిభా సింగ్ విజయం సాధించడంతో బీజేపీ బలం మూడుకు తగ్గింది.



పోలింగ్ తేదీ: జూన్ 1

సర్వేల మాటేంటి?

దాదాపు అన్ని సర్వేలూ బీజేపీ హ్యాట్రిక్ క్లీన్‌స్వీప్ ఖాయమని అంచనా వేస్తున్నాయి.

వావ్! గెనీబెన్!!

గెనీబెన్ నాగాజీ ఠాకోర్. ఉత్తర గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రముఖ నేతల్లో ఒకరు. అసెంబ్లీలో పార్టీకి బలమైన గొంతుక. సభలో ధాటైన ప్రసంగాలతో ఆకట్టుకుంటారు. క్షేత్రస్థాయిలో బలమైన పునాది కలిగిన ప్రజాప్రతినిధి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హవా నడుమ కూడా వావ్ స్థానం నుంచి విజయం సాధించారు. తన నియోజకవర్గంలో అందరినీ పేరుపేరునా పలకరించే నాయకురాలు. ఎవరింట్లో ఎలాంటి కార్యక్రమమైనా తప్పనిసరిగా హాజరవుతారు. బనస్కాంత లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో దిగి బీజేపీకి గట్టి సవాలే విసురుతున్నారు... - సాక్షి, నేషనల్ డెస్క్

పరిచయం

పంచాయతీ నుంచి...

2017 అసెంబ్లీ ఎన్నికలు గెనీబెన్ రాజకీయ జీవితంలో కీలక మలుపు. వావ్ నుంచి బీజేపీ సీనియర్ నేత, మంత్రి శంకర్ చౌదరీని ఓడించడంతో ఆమె పేరు రాష్ట్రమంతటా మారుమోగిపోయింది. ఆమెకు కేవలం రెండో ఎన్నికలవి. జైన్ విశ్వభారతి ఇన్‌స్టిట్యూట్ నుంచి పొలిటికల్ సైన్స్ చదువుతూ గ్రాడ్యుయేషన్ మధ్యలోనే వదిలేశారు. పంచాయతీ సభ్యురాలిగా చేశారు. 2012లో కాంగ్రెస్ వావ్ నుంచి టికెటిచ్చింది. అప్పుడు 12వేల ఓట్లతో ఓడినా 2017లో విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన ముగ్గురు మహిళల్లో ఒకరు.

వివాదాస్పద వ్యాఖ్యలు...

కులాంతర, మతాంత వివాహాలను నిషేధిస్తు ఠాకోర్ సామాజికవర్గం తీసుకున్న నిర్ణయాన్ని గెనీబెన్ సమర్థించడం వివాదం రేపింది. యువతులకు మొబైల్‌ఫోన్లను నిషేధించడాన్ని కూడా ఆమె సమర్థించారు. ''బాలికలకు మొబైల్‌ఫోన్లను నిషేధించడంలో తప్పు లేదు. మొబైల్స్‌కు దూరంగా ఉండి బాగా చదువుకోవాలి'' అని సూచించడంపై చాలా విమర్శలే వచ్చాయి.


క్రౌడ్ ఫండింగ్‌తో నిధుల సేకరణ...

బనస్కాంత జిల్లాలో అన్ని సామాజికవర్గాల వారూ తనను సోదరిగా భావిస్తారంటారు గెనీబెన్. ఎన్నికల ఖర్చు కోసం నియోజకవర్గంలో క్యూ ఆర్ కోడ్‌ను క్రియేట్ చేసి మరీ క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరిస్తున్నారు. ''బీజేపీకి బలమైన ఆర్థిక వనరులున్నాయి. నాకున్నది విలువలు, సామాజిక సూత్రాలే. అయినా బలమైన సిద్ధాంతంతో పోరాడేవారిని ఎవరూ ఓడించలేరు. కనుక దేశంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఫరిడవిల్లడానికి తోచిన సాయం చేయండి'' అని ప్రజలను కోరుతున్నారు. రాజస్తాన్, పాకిస్తాన్‌తో సరిహద్దులో ఉన్న లోక్‌సభ స్థానం బనస్కాంత. 'సీమ దర్శన్' పేరుతో ఇక్కడ సరిహద్దు పర్యాటక స్థలం కూడా ఉంది. ఇక్కడ ఠాకోర్ ఓటర్లు 18 శాతం, చౌదరి ఓటర్లు 13 శాతం ఉన్నారు.



గుసగుస

సిగ్గెరుగని జన్మ



ఔ నమ్మా.. చక్కగా. సిగ్గులేకుండా. చనువుగా ఉన్నావు.. మాయాబజార్ సినిమాలో మాయా శశిరేఖ (సావిత్రి)తో శకుని పాత్రధారి(సీఎస్సార్) డైలాగ్ ఇది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, టీవీ చానళ్లలో టీడీపీ ఎన్నికల ప్రచార వీడియోలు, చిత్రాలు చూసి బీజేపీ, జనసేన నాయకులు చంద్రబాబు గురించి ఇలాగే అనుకుంటున్నారట. కడుపులో కత్తులుంచుకుని మరీ పొత్తు పెట్టుకునే చంద్రబాబు తన నైజం వదులుకోలేదని బాహాటంగానే ఆరోపిస్తున్నారు. బీజేపీ, జనసేన బలాలను వాడుకుని, తన పార్టీ అభ్యర్థులకు లబ్ధి చేకూర్చాలన్న ఆలోచన తప్ప, ఆ రెండు పార్టీల నుంచి ఒక్కర్ని కూడా గెలిపించడం చంద్రబాబుకు ససేమిరా ఇష్టం లేదని చెప్పకుంటున్నారు. టీడీపీ ప్రచార చిత్రాలు, వీడియోల్లో ఎక్కడా బీజేపీ, జనసేన ప్రస్తావన లేకపోవడమే ఇందుకు కారణం.

'గుండ'పోటు



శనగలు తింటూ ఉలవలని చెప్పి పత్తి విత్తనాలు చేతిలో పెట్టిన చందంగా ఉంది.. చిక్కోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పట్ల గుండ అప్పల సూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతుల తీరు. తాజా పర్యటనలో అధినేత చంద్రబాబు చొరవతో అసంతృప్తి వీడినట్లు బయటికి కనిపిస్తున్నా.. అది నిజం కాదట. గుండ కుటుంబానికి బలమైన అనుచరులుగా ఉన్న కొందరు నాయకులు తమ ప్రాంతాల్లో రహస్య భేటీలు నిర్వహించి మరీ, గొండుకు గుండె పోటు తెప్పించే పని చేస్తున్నారట. అరసవెల్లి, శ్రీకాకుళం టౌన్ తదితర తమకు బాగా పట్టున్న చోట్ల వీరి చర్యలతో శంకర్‌కు చెమటలు పడుతున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్న కుటిల రాజకీయాలకు తాము బలికావాల్సి వస్తోందని గొండు అనుచరులు లబోదిబోమంటున్నారు.

• బాబు మార్కు దందా

బినామీలకే సంపద

ఎన్నికల ప్రచారంలో చాటి చెబుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

- → తన హయాంలో అమరావతిలో భూముల ధర పెరిగిందని బీరాలు
- → ఇప్పుడు పడిపోయాయంటూ గగ్గోలు
- → అమరావతి నిర్మాణాన్ని చేపట్టి సంపద సృష్టిస్తానంటూ ఇప్పుడు గొప్పలు
- → దీనివల్ల సంపద సృష్టించేది రాష్ట్రానికి కాదు.. చంద్రబాబు, బినామీలు, వందిమాగధులకే
- → గతంలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ పేరుతోనూ ఇదే దందా
- → 2014లో ఓత్ ఆఫ్ సీక్రసీని తుంగలో తొక్కి ఇన్‌సైడర్ ట్రేడింగ్
- → తన గ్యాంగ్‌తో కలిసి వేలాది ఎకరాల భూములు కాజేసిన బాబు
- → ఆ తర్వాత రాజధానిగా అమరావతి ప్రకటన.. దాంతో భూముల ధరలకు రెక్కలు
- → సింగపూర్ ప్రైవేటు కన్సార్షియం చేతికి రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు
- → 1,691 ఎకరాలు కట్టబెట్టి.. రాష్ట్ర ఖజానా నుంచి రూ.5,500 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- → ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.లక్ష కోట్లు కాజేసేందుకు స్కెచ్
- → బాబు లెక్కల ప్రకారం మౌలిక సదుపాయాల కల్పనకే రూ.లక్ష కోట్లు అవసరం
- → ఆ స్థాయిలో ఖర్చు చేయడానికి సహకరించని ఆర్థిక పరిస్థితి
- → అందుకే సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానుల అభివృద్ధికి సీఎం జగన్ నిర్ణయం



రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతి

అమరావతి రాజధాని నిర్మాణాన్ని చేపడతానని 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన చంద్రబాబు.. సంపద సృష్టించి, సంక్షేమ పథకాలను అమలు చేస్తానని బీరాలు పలికారు. కానీ.. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకే చంద్రబాబు లెక్క ప్రకారం రూ.లక్ష కోట్లు అవసరం. జాప్యం జరిగితే ఆ వ్యయం మరింత అధికం కావచ్చు. రాష్ట్ర బడ్జెట్‌ను పరిగణనలోకి తీసుకుంటే మౌలిక సదుపాయాల కల్పనకే 20 ఏళ్లు పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. మిగతా ప్రాంతాల ప్రజల నోట్లో మట్టి కొట్టి, అమరావతిలో మౌలిక సదుపాయాలకు ఆ స్థాయిలో నిధులు ఖర్చు చేసినా రాష్ట్రానికి సంపద పెరగదు. చంద్రబాబు, బినామీలు, వందిమాగధుల భూముల ధరలే పెరుగుతాయి. వాటిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని రూ.లక్షల కోట్లు కొల్లగొట్టాలన్నదే చంద్రబాబు ఎత్తుగడ.

సాక్షి, అమరావతి : నోరు తెరిస్తే చాలు సంపద సృష్టిస్తానని బీరాలు పలుకుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. అది తన బినామీల కోసమేనని ఎన్నికల ప్రచారంలో పరోక్షంగా చాటిచెబుతున్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు అమరావతిలో భూముల ధరలు అమాంతం పెరిగితే.. ఇప్పుడు పడిపోయాయని గుంటూరులో బుధవారం నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేయడమే అందుకు నిదర్శనం. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును 185 కి.మీల పొడవున నిర్మించడానికి ప్రణాళిక రచించానని చెబుతూ రాజధాని నిర్మాణం కొనసాగి ఉంటే ఈపాటికి ప్రపంచ స్థాయి నగరం కళ్ల ముందుకు వచ్చేదని గ్రాఫిక్స్ కథలు వల్లె వేశారు. సీఎం జగన్ తన కలలను వమ్ము చేశారని.. అధికారంలోకి రాగానే అమరాతి నిర్మాణం చేపట్టడమే తన సంకల్పమని పునరుద్ఘాటించారు. అంటే.. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.లక్ష కోట్లను వెదజల్లి అమరావతిలో మౌలిక సదుపాయాలను కల్పించి ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా తాను, తన బినామీలు, వందిమాగధులు కాజేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టడానికి కట్టుబడి ఉన్నట్లుగా చంద్రబాబు తేటతెల్లం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ ముసుగులో మురళీమోహన్ వంటి బినామీలతో కలిసి కాజేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.వేలాది కోట్లు నొక్కేసిన తరహాలోనే ఇప్పుడూ అమరావతి పేరుతో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు.

అంతర్జాతీయ కుంభకోణం

రాజధాని లేకుండా విభజించి రాష్ట్రాన్ని కేంద్రం సంక్షోభంలోకి నెట్టిందని.. దాన్ని అవకాశంగా మల్చుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం మాటేమోగానీ ఆ ముసుగులో అంతర్జాతీయ కుంభకోణానికి పాల్పడ్డారు. 2014 జూన్ 8న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు.. ఓత్ ఆఫ్ సీక్రసీకి తూట్లు పొడిచి, రాజధాని ఏర్పాటు చేసే ప్రాంతంపై బినామీలు, వందిమాగధులకు లీకులు ఇచ్చారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా రైతుల నుంచి తక్కువ ధరలకే తన గ్యాంగ్ ద్వారా భారీ ఎత్తున భూములు కాజేశాక రాజధానిని ప్రకటించారు. ఆ ప్రాంతానికి కనీసం రహదారి సౌకర్యం కల్పించకుండానే.. భూముల ధరలు పెంచడం కోసం తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణం చేపట్టి కమీషన్లు దండుకున్నారు. స్విస్ ఛాలెంజ్ విధానానికి తూట్లు పొడుస్తూ 1691 ఎకరాల్లో రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు నిర్మాణ పనులను సింగపూర్ ప్రైవేటు సంస్థల కన్సార్షియంకు కట్టబెట్టి.. ఆ ప్రాజెక్టుకు ప్రభుత్వ ఖజానా నుంచి రూ.5,500 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అంగీకరించారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.లక్ష కోట్లు కాజేయడానికి స్కెచ్ వేశారు.

మూడు రాజధానులతో సమగ్రాభివృద్ధి

భూ సమీకరణలో రైతులు ఇచ్చిన 33 వేల ఎకరాలు, అటవీ భూములు సహా మొత్తం 50 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణాన్ని చేపట్టాలని గత టీడీపీ సర్కార్ నిర్ణయించింది. నల్లరేగడి భూములతో కూడిన ఆ ప్రాంతంలో రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించి, అభివృద్ధి చేయడానికి ఎకరాకు రూ.2 కోట్లు వ్యయం అవుతుందని అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. అంటే అమరావతిలో కేవలం కనీస మౌలిక సదుపాయాల కల్పనకే రూ.లక్ష కోట్లు అవసరం. కానీ.. రాష్ట్ర బడ్జెట్ నుంచి ఆ మేరకు కేటాయింపులు చేయడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో నిపుణుల కమిటీ సూచనల మేరకు రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మూడు ప్రాంతాల్లో మూడు రాజధానులను ఏర్పాటు చేయాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్నంను పరిపాలన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇదే అంశాన్ని 2024 ఎన్నికల మేనిఫెస్టోలోనూ సీఎం జగన్ పొందుపరిచారు.



సీడీని ఆవిష్కరిస్తున్న సాక్షి డైరెక్టర్లు ఏఎల్ఎన్ రెడ్డి, రాణిరెడ్డి. చిత్రంలో రచయిత ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు

'వస్తడు జగనన్నే' పాట ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రచయిత నల్ల ప్రవీణ్ ముదిరాజ్ రూపొందించిన 'వస్తడు జగనన్నే'పాటను గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సాక్షి డైరెక్టర్లు ఏఎల్ఎన్ రెడ్డి, రాణిరెడ్డి యూట్యూబ్‌లో విడుదల చేశారు. పాట రచయిత, గాయకుడు నల్ల ప్రవీణ్ ముదిరాజ్‌ను అభినందించారు.

రామోజీ శాసిస్తే...
టీటీడీ శిరసావహించాలట!

శ్రీవాణి ట్రస్టు ఆదాయంపైనా అబద్ధాల రాతలు

- సేవా టికెట్ల విక్రయంపైనా అవాకులు..చవాకులు
- వసతి సముదాయాల నిర్మాణాలపైనా తప్పుడు ఆరోపణలు
- జ్యుడీషియల్ కమిషన్ అనుమతితోనే నిర్మాణాలు
- ధర్మారెడ్డి డిప్యుటేషన్ కొనసాగింపుపై ఈనాడు వక్రభాష్యం
- బాబు హయాంలో ఇద్దరిని పదేళ్లు కొనసాగించినా పట్టదు
- తిరుమలలో అభివృద్ధి కనిపిస్తున్నా కబోదిలా వ్యతిరేక కథనాలు
- బాబు కళ్లలో ఆనందం కోసం ఈనాడు పడుతున్న తిప్పలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పేదల పక్షపాతి జగన్

'రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ వచ్చిన తరువాత ఈ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి చూశా. చాలా కాలంగా రాజకీయాలను గమనిస్తున్నాను. ఇప్పటివరకూ ఏనాడూ చూడని అభివృద్ధి జగన్ హయాంలోనే జరిగింది. చెప్పింది చేయడం... చేసేదే చెప్పడం ఆయన అభిమతం. మేనిఫెస్టోను ఓ భగవద్గీతలా, ఖురాన్‌లా, బైబిల్‌లా భావించి తు.చ. తప్పకుండా అమలు చేసిన ముఖ్యమంత్రి ఆయనే.' అని ప్రముఖ సినీనటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాను రాజకీయాల్లో క్రియాశీలకంగా లేకపోయినా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నానని సాక్షి నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఇంటర్వ్యూ

- ➤ చెప్పింది చేయడం... చేసేదే చెప్పడం ఆయన నైజం
- ➤ విద్య, వైద్యం విషయంలో బ్రహ్మాండమైన మార్పు
- ➤ కమిట్ అయిన ప్రతీదీ కంప్లీట్ చేశారు
- ➤ బీసీలకు పెద్దపీట వేసిన ఘనత ఆయనదే...
- ➤ కరోనా సంక్షోభంలో ఆపద్బాంధవుడయ్యారు
- ➤ హామీలు మేనిఫెస్టోలో పెడితే చాలదు, అమలు చేయడం ముఖ్యం
- ➤ సాక్షి ఇంటర్వ్యూలో సినీనటుడు సుమన్ విశ్లేషణ



జగన్‌ని బీసీలు ఎన్నటికీ మరచిపోరు

నేను కూడా బీసీ కమ్యూనిటీకి చెందిన వాడ్ని కాబట్టి ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో.. ఇప్పటిదాకా చూసిన దాన్ని బట్టి బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన నేత జగనే. అది నేను చెప్పడం కాదు స్పష్టంగా కనపడుతూనే ఉంది. ఆయన బీసీలకు 48 సీట్ల వరకూ ఇచ్చారు. అలాగే 11 ఎంపీ టికెట్లు ఇచ్చారు. గతంలో 4 రాజ్యసభ స్థానాలు కూడా ఇచ్చారు. బీసీలు ఎవ్వరూ జగన్‌ను మర్చిపోయే అవకాశం లేదు. అంత ప్రాధాన్యత మరెవ్వరూ ఇప్పటిదాకా బీసీలకు ఇవ్వలేదనేది వాస్తవం.

కాంగ్రెస్ పార్టీ కుటుంబం మాది

నేను పుట్టి పెరిగింది చెన్నైలో. మా అమ్మా నాన్నలది కర్ణాటకలోని మంగళూరు. చెన్నైలో అన్నాదురై కాలం నుంచీ ఎంజీఆర్, కామరాజ్ వరకూ తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీ రామారావు దగ్గర నుంచి కాంగ్రెస్... ఆ తర్వాత ప్రభుత్వాల వరకూ గమనిస్తున్నాను. పూర్వాశ్రమంలో మాది కాంగ్రెస్ పార్టీకి చెందిన కుటుంబం. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా చేసిన జనార్దన్ పూజారి మాకు దూరపు బంధువు. నా పూర్తి పేరు సుమన్ పూజారి(అయితే స్కూల్ రికార్డ్స్‌లో సుమన్ తల్వార్ అని ఉంటుంది) పూజారి అంటే గుడి పూజారి కాదు. ఆయుర్వేద వైద్యం చేసే బిల్లవ కమ్యూనిటీ అది.

ఏపీలో విద్య, వైద్యం అద్భుతం

డబ్బున్నవారు.. ఆ స్థాయిలో ఉన్నవారు ఎలాగైనా బతికేస్తారు. కానీ పేదల బతుకులు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. వాళ్లకు సరైన తిండి లేదు. ఉండడానికి గూడు లేదు. ఎదగడానికి చదువు లేదు. సరైన వైద్యం అందడం లేదు. ఇలాంటి సమస్యలన్నింటికీ జగన్ అద్భుతమైన పరిష్కారాలు చూపించారు. పేదల విద్య, వైద్యం విషయంలో ఆయన చేసిన సంస్కరణలు ప్రశంసనీయం. నేను చాలా గ్రామాల్లో ప్రభుత్వ స్కూళ్లకు స్వయంగా వెళ్లి చూశా. ఒకప్పుడు స్కూలా శ్మశానమా అన్నట్టు ఉండేది. ఇప్పుడు నీట్‌గా క్లాస్‌రూమ్స్, డిజిటల్ బోర్డ్స్, కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నిరుపేదల పిల్లలు స్వచ్ఛమైన ఇంగ్లిష్‌లో గుడ్‌మార్నింగ్, థాంక్యూ సార్ అంటూ మాట్లాడుతూ ఉంటే ముచ్చటగా అనిపిస్తోంది. వైద్యం విషయంలోనూ చాలా మంచి మార్పు కనబడుతోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, విలేజ్ క్లినిక్స్ వంటివి పేదలకు బాగా ఉపయోగపడేవే. పెద్ద సంఖ్యలో ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చారు. రేపటి వైద్యుల కోసం దాదాపుగా జిల్లాలో ఒక మెడికల్ కాలేజ్ వస్తోందంటే గొప్ప విషయమనే చెప్పాలి.

అభివృద్ధి అంటే ఒక వ్యక్తికో, ఒక కులానికో కాదు

ఇప్పుడు చాలా మంది అభివృద్ధి గురించి మాట్లా డుతున్నారు. అభివృద్ధి అంటే ఒక వ్యక్తికా... ఒక కులానిదా... లేక రాష్ట్ర అభివృద్ధా... అనేది ప్రజలు ఆలోచించాలి. అంతకు ముందు పాలించిన వారు ఏ మేరకు అభివృద్ధి చేశారు. ఇంకా ఏం చేయలేదు... అన్నది విశ్లేషించుకోవాలి. ఎంత గొప్ప పాలన అయినా చిన్న చిన్న లోపాలు తప్పవు. అన్నీ అద్భుతాలే చేయాలంటే అసాధ్యం. ఐదేళ్ల పాలనలో రెండేళ్ల పాటు కరోనా గ్యాప్ రాకుంటే ఇంకా గొప్పగా అభివృద్ధి జరిగి ఉండేదని నా అభిప్రాయం.

కరోనాను సమర్థంగా ఎదుర్కొన్నారు

జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలానికే ఊహించని ఉత్పాతంలా వచ్చిపడిన కరోనాని ఆయన అద్భుతంగా హ్యాండిల్ చేయగలిగారు. ఆ సమయంలో నేను ప్రత్యక్షంగా గమనించాను. అత్యాధిక వైద్య పరీక్షలు చేయడం... ప్రభుత్వం తరపున ప్రజలకు అందించిన మెడికల్ సర్వీసెస్, జనం ఎప్పటికీ మర్చిపోకూడదు.

వృద్ధుల విషయంలో ఆయన తీరే వేరు

ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం ఒకటి ఉంది. ఇప్పటిదాకా వృద్ధుల గురించి ఏ సీఎం కూడా ఇంతగా ఆలోచించలేదు. నెలకోసారి ఇచ్చే పింఛన్ల కోసం వృద్ధులు చాలా కష్టపడేవారు. ఎండల్లో, వర్షాల్లో... గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. అలాంటి వారు ప్రస్తుతం ఇంటి దగ్గరే కూర్చుని దర్జాగా పింఛన్ తీసుకునేలా చేసింది తొలుత జగనే. ఇప్పటిదాకా దేశంలో ఎవరూ ఆ పని చేయలేదు. ఇప్పుడు ఎవరు అమలు చేసినా అది కచ్చితంగా కాపీ కొట్టినట్టే.

చెప్పిందే చేశారు చేసిందే చెబుతున్నారు

నిరుపేదల కోసం జగన్ సీఎం అయ్యాక చాలా వరకూ మంచి పనులు చేశారు. తాను పదవిలోకి రాక ముందు ఏదైతే చెప్పారో అందుకు తగ్గట్టు కమిట్ అయిన ప్రతీదీ చేశారు. ఇప్పుడు తాను చేసిందే చెపుతున్నారు. నిజం చెప్పాలంటే కొందరైతే ఆయన చెప్పిందానికన్నా ఎక్కువే చేశారంటున్నారు కూడా.

మేనిఫెస్టో... బాగుంటే చాలదు

టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో జగన్ మేనిఫెస్టో కన్నా హామీలు ఎక్కువగా ఉన్నాయని కొందరు చెప్పారు. అయితే అందులోని హామీలు ఏ మేరకు అమలవుతాయి? ఎంత వరకూ అమలు కావు? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి. ప్రస్తుత పాలనను కూడా ఒక్కసారి పోల్చుకోవాలి.

–సత్యార్థ్

నియోజకవర్గాన్ని పట్టించుకోని 'లెజెండ్'రీ పొరపాటున ప్రశ్నించారా..? దబిడి దిబిడే

కన్నెత్తి చూడని 'పురం'లో పీఏలే పెత్తందార్లు

నియోజకవర్గంలో 'అఖండ'గా వెలిగిపోతున్న అక్రమాలు, అవినీతి

హామీలు విస్మరించడంలో 'బావ'ను మించిపోయారనే విమర్శలు

ఎన్నికల సమయంలో ప్రచార రంగంలోకి మళ్లీ భార్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: సినిమాల్లో వీర లెవల్ డైలాగులు పలికే ఆ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో మాత్రం ఫెయి ల్యూర్ నేతగా మిగిలిపోయారు. అభివృద్ధి, ప్రతిపక్షంపైనా భారీ సంభాషణలు పలికే ఆయన ప్రజల సమస్యలు తీర్చడంలో జీరోగా మారారు. సెల్యూలాయిడ్‌పై తన నటనతో ఈలలు, చప్పట్లు కొట్టించుకునే ఆయన ప్రజా జీవితంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించి అభినందనలు పొందలేకపోయారు. గడిచిన పదేళ్లలో ఆయన నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టకపోవడం, కనీసం స్థానికంగా ఉండే లోటు పాట్లు, సమస్యలపై పదిశాతం కూడా అవగాహన లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగుతున్న ఆయన తీరుపై అక్కడి ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కనీసం నెలకోసారి కూడా నియోజకవర్గంలో పర్యటించని నేత తమకెందుకని, తమ సమస్యలు తీర్చి అక్కున చేర్చుకునే స్థానిక నేతలే తమక కావాలని వారు ముక్త కంఠంతో చెబుతున్నారు. ఈ పదేళ్లలో చాలా హామీలిచ్చినా వాటిని తీర్చలేకపోయారు. రాష్ట్రంలో ఆ నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజలు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కుటుంబాన్ని ఆదరిస్తున్నారు. వెండి తెరపై మన్ననలు పొందిన మాజీ సీఎంతో పాటు ఆ కుటుంబానికి చెందిన మరో ఇద్దరిని ఎమ్మెల్యేలుగా గెలిపించారు. అయితే మరీ ముఖ్యంగా గడిచిన దశాబ్ద కాలంగా ఎమ్మెల్యే ఉన్న ఆయన ఆ ప్రాంతాన్ని గాలికొదిలేశారు. సినిమా షూటింగులు, కుటుంబ వ్యవహారాలు, హైదరాబాద్‌లో స్థిరనివాసం వెరసి ఆయన ఏడాదికి ఒకట్రెండుసార్లు పర్యటనకు మాత్రమే పరిమితమయ్యారు.

మరిన్ని పేజీల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'అన్యాయం జరిగితే అరగంట లేటుగా వస్తానేమో.. కానీ ఆడపిల్లకు ఆపద వస్తే అర నిమిషం కూడా ఆలస్యం చేయను'

- ఇది వెండితెరపై వీర లెవల్ డైలాగ్

కట్ చేస్తే..


ఆడది కనిపిస్తే 'ముద్దు' అయినా పెట్టాలి లేదా కడుపైనా చేయాలి

- ఇది రియల్ లైఫ్‌లో ముసుగు తొలగించిన మన నాయకుడి ముతక డైలాగ్

'నీకు బీపీ వస్తే నీ పీఏ వణుకుతాడేమో.. నాకు బీపీ వస్తే ఏపీ వణుకుద్ది'

రాజకీయాల్లో మాత్రం తనదాకా ఎందుకనుకున్నారేమో.. ప్రజలను వణికించడానికి నియోజకవర్గంలో పీఏలకే పెత్తనాన్ని అప్పగించేశారు.

తొడలు కొట్టే నేత.. ప్రజాసేవలో తొండాట



పీఏలదే పెత్తనం

ఎమ్మెల్యే స్థానికంగా ఉండాలనేది అక్కడి ప్రజల మనోగతం. కానీ అరిచి గీపెట్టినా ఆయన అక్కడికి వెళ్లరు. దీంతో ఆయన నియమించుకున్న ప్రైవేటు పీఏలదే పెత్తనం. అంతేకాదు షాడో ఎమ్మెల్యేగా కూడా వీళ్లే వ్యవహరిస్తుంటారు. ఆయనకు పీఏగా ఉన్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి పేరు కలిగిన వ్యక్తి గతంలో కర్ణాటకలో పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కారు. అనంతరం రిమాండుకు వెళ్లారు. అయినా సరే మళ్లీ ఆయన్నే పీఏగా కొనసాగిస్తున్నారు. ఆ పీఏతోపాటు మరో ఇద్దరు కూడా పీఏలుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో పీఏలు అంతులేని అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా పంచాయతీలు తీర్చడం, సెటిల్‌మెంట్‌లు చేయడంలో వారు ఆరితేరారు. నియోజకవర్గంలో భూ కబ్జాలకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయి. ఈ పదేళ్లలో వారు ఎలాంటి సమస్యను తీర్చడానికి కూడా ఆసక్తి కనబరచలేదు. కేవలం అయ్యగారు చెప్పిందే వేదంగా పనిచేశారు. పచ్చ నేతలకే అందుబాటులో ఉండేవారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తాము ఎదుర్కొనే సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక అక్కడి ప్రజలు గందరగోళానికి లోనవుతున్నారు.

ప్రచార రంగంలోకి మళ్లీ ఫ్యామిలీ

మరో పది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ 'పురం'లో ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఎమ్మెల్యే ఆయన భార్య కలిసి ప్రచారం చేస్తున్నారు. ఇటీవలే భార్య అక్కడికి వచ్చి చీరలు పంచినట్టు తెలిసింది. నియోజకవర్గంలో చుట్టిముట్టేలా ప్రచారం ముమ్మరం చేసి కొత్త హామీలు ఇస్తున్నారు. త్వరలోనే కుమారుడు, కూతుళ్లను కూడా ప్రచారానికి దించబోతున్నట్టు టీడీపీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారు. కానీ అవి ఒట్టి మాటలుగానే మిగిలిపోయాయని పురం ప్రజలు వాపోతున్నారు. భూగర్భ డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తానని, రోడ్ల విస్తరణ చేపడతానని ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ అలాగే ఉంది. హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకపోవడంలో బావను మించిపోయారనే విమర్శలున్నాయి. వాటిని అమలుపరచకపోగా మళ్లీ ఇప్పుడు కొత్త హామీలు గుప్పిస్తున్నారు.

సెంటిమెంటును గౌరవించని తీరు

1985లో నటుడు, మాజీ సీఎం ఇక్కడ మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. అప్పటి నుంచి ఆ కుటుంబమంటే ఇక్కడి ప్రజలకు గౌరవం. ఆ గౌరవంతోనే ఆయన కుమారులను ఎమ్మెల్యేలుగా చేశారు. ఆ కుటుంబమంటే ప్రత్యేకమైన సెంటిమెంట్ ఉండటమే ఇక్కడి ప్రజలకు శాపమైంది. దీన్ని ప్రజల బలహీనతగా భావించిన ప్రస్తుత ఎమ్మెల్యే ఇక్కడకు రావడమే మానేశారు. 2014లోనూ, 2019లోనూ ఇక్కడి నుంచి ఆయన్ను అసెంబ్లీకి పంపించారు. కానీ ఆయన ఇక్కడి సమస్యలను మాత్రం 'పురం' పొలిమేర దాటించలేకపోయారన్న విమర్శలున్నాయి. ఎప్పుడూ అక్కడి సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన పాపాన పోలేదు. వేసవి వచ్చిందంటే తాగునీటితో అల్లాడే ఇక్కడి ప్రజలు తమ కష్టాలు తామే తీర్చుకోవాలన్నట్టు చెబుతుంటారు. ఇదే విషయమై ఇటీవల ఓ టీడీపీ నేత ఆయన వద్ద ప్రస్తావించగా.. ''నాకు ఓటు వేయడం వాళ్ల అదృష్టం.ఆ అవకాశం అందరికీ రాదు . మీరు నోరు మూసుకుని చెప్పింది చేయండి'' అని గర్జించారట.

కూటమి కక్కిన విషం

విలవిల్లాడిన జనం.. బ్యాంకుల ముందు క్యూ లైన్లలో నరకయాతన

ఐదేళ్ల తర్వాత అవ్వాతాతలకు చంద్రబాబు మార్కు దురవస్థ

బ్యాంకుల వద్ద చాంతాడంత క్యూలైన్లలో పింఛన్ డబ్బుల కోసం యాతన

ఈ కష్టాల పాపం బాబు బృందానిదే



పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో పింఛన్ కోసం మండుటెండలో బ్యాంకు ముందు వృద్ధుల పడిగాపులు

సాక్షి, అమరావతి: బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసి ఐదేళ్లుగా ప్రతి నెలా ఠంచన్‌గా ఇంటివద్దే చేతికి ఇస్తున్న పెన్షన్లకు అడ్డుపడి రచ్చ చేసిన పచ్చ బృందం సచివాలయాల్లో అందిస్తున్నా శాంతించలేదు! మండుటెండల్లో తిరగలేక పండుటాకుల ప్రాణాలు విలవిల్లాడే పరిస్థితికి తెచ్చింది. అవ్వాతాతల ఉసురు మూటగట్టుకుంటూ పెద్ద ప్రాణాలు బ్యాంకుల వద్ద పడిగాపులు కాసేలా వికృత రాజకీయాలకు బాబు బృందం తెర తీసింది! అవ్వాతాతల ఫించన్ల కష్టాలకు చంద్రబాబు, ఆయన సన్నిహితులు, మిత్ర పార్టీల నిర్వాకాలే కారణం. చంద్రబాబు కనుసన్నల్లో నడుచుకుంటూ ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, దగ్గుబాటి పురందేశ్వరి, కొందరు ఏపీ బీజేపీ నాయకులు ఖాతాలున్న వారికి బ్యాంకుల్లోనే పింఛను డబ్బులు జమ చేయాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఫించనుదారులకు ఇళ్ల వద్ద కాకుండా బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఈసీకి తానే చెప్పానంటూ ఫిర్యాదు చేసి బయటకు వచ్చిన అనంతరం నిమ్మగడ్డ ఈటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్వయంగా వెల్లడించారు. ఇలా ఈసీకి వరుస ఫిర్యాదులతోపాటు ఉన్నతాధికారులను బెదిరించేలా ఎల్లో మీడియాలో కథనాలు వెలువరించేలా చంద్రబాబు పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. మరోవైపు ఇంటి వద్దే ఇవ్వాలంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు.

ఐదేళ్ల తరువాత మళ్లీ అవే అవస్థలు..

ఐదేళ్ల తర్వాత మళ్లీ అవ్వాతాతలు పింఛన్ల కోసం అవస్థ పడుతూ ఊరు దాటారు! తెల్లవారుజామునే బ్యాంకుల వద్దకు చేరుకుని చాంతాడంత క్యూలో నిలబడి నానా అగచాట్లు పడ్డారు. గత 58 నెలలుగా ప్రతి నెలా ఏ కష్టం లేకుండా కరోనాలో సైతం ఠంఛన్‌గా ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా పింఛన్ మొత్తాన్ని అందుకున్న లక్షలాది మంది పింఛన్‌దారులు ఈసారి కొత్తగా బ్యాంకు ఖాతాలో జమ అయిన డబ్బులను తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తం 65.49 లక్షల మంది పింఛనుదారుల్లో ఎక్కువ మంది ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా అందే ఆ డబ్బులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఖాతాల్లో జమ అయిన డబ్బులను తీసుకునేందుకు ఒక్కసారిగా బ్యాంకుల వద్దకు చేరుకోవడంతో గురువారం రాష్ట్రంలో దాదాపు అన్ని చోట్ల బ్యాంకులు పింఛన్ లబ్ధిదారులతో నిండిపోయాయి. ఎండ తీవ్రత కారణంగా ఎక్కువ మంది అవ్వాతాతలు బ్యాంకులు తెరవక ముందే ఉదయం 9 గంటల నుంచే చేరుకుని ఎదురు చూస్తూ ఉండిపోయారు. బ్యాంకు అందుబాటులో లేని గ్రామాలకు చెందిన వారు పనులు మానుకుని 10 కి.మీ. దూరంలోని ప్రాంతాలకు తరలి వచ్చారు. పలుచోట్ల ఊళ్లకు ఊళ్లే తరలిరాగా పింఛను డబ్బులు పడ్డ బ్యాంకు ఖాతాలు చాలా కాలంగా వినియోగంలో లేని కారణంగా ఇన్ యాక్టివ్‌లో ఉన్నట్లు తెలుసుకుని ఉసూరుమన్నారు. బ్యాంకు అకౌంట్ తిరిగి యాక్టివేట్ చేసుకునేందుకు ఒకేసారి వందల మంది రావడంతో బ్యాంకు సిబ్బంది సైతం సమాధానం చెప్పలేక ఇబ్బంది పడ్డారు.

బాబు సేవలో వీర విధేయులు..

పింఛను డబ్బులు బ్యాంకుల్లో జమ చేయాలంటూ ఈసీని కలిసి ఫిర్యాదు చేసిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎవరో అందరికీ తెలుసు. చంద్రబాబు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన నిమ్మగడ్డ రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారు. 2020లో మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలకు నోటిఫికేషన్లు జారీ చేయగా ఆ ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు ఏకగ్రీవంగా గెలుస్తున్న పరిస్థితి ఉండడంతో చంద్రబాబు ప్రయోజనాల కోసం ఎన్నికల ప్రక్రియను అర్ధాంతరంగా నిలిపివేశారు. చంద్రబాబు కుటుంబ బంధువైన పురందేశ్వరి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా కొనసాగుతూ పొత్తులో దక్కిన సీట్లను 20–30 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్న వారికి కాకుండా చంద్రబాబు వీర విధేయులుగా ముద్ర పడ్డ బీజేపీలో ఉన్న టీడీపీ నేతలకు ఇచ్చారు. దీనికిపై సొంత పార్టీ నుంచే ఆమె తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. పింఛన్ల పంపిణీపై ఈసీకి ఫిర్యాదు చేయడంలోనూ నిమ్మగడ్డ, పురందేశ్వరి లాంటి వారిని ముందు పెట్టి చంద్రబాబు రాజకీయ డ్రామాలకు తెర తీశారు.



తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో బ్యాంకు వద్ద పింఛనర్ల పడిగాపులు

విలన్ నంబర్-1



పింఛను లబ్ధిదారుల్లో బ్యాంకు అకౌంట్ ఉన్నవారికి నేరుగా ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాలి. దివ్యాంగులకు మాత్రం మినహాయింపు ఇవ్వొచ్చు. వారికి ఇంటి వద్ద పింఛను డబ్బులు ఇవ్వడానికి సిటిజన్ ఫర్ డెమోక్రసీకి అభ్యంతరం లేదు. బ్యాంకు అకౌంట్లు లేని వారికి సచివాలయం వద్ద పింఛను డబ్బులు తీసుకునే అవకాశం కల్పించాలని ఈసీ అధికారులకు చెప్పాం.

– 20 రోజుల క్రితం సచివాలయంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసిన అనంతరం మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ వ్యాఖ్యలివీ.

విలన్ నంబర్ 2



కేంద్ర ప్రభుత్వం అన్ని పథకాల లబ్ధిని డీబీటీ(నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ) రూపంలో అందజేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పింఛన్ డబ్బులను అలా ఎందుకు పంపిణీ చేయదు?

– 10-15 రోజుల క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి డిమాండ్

సహాయ పాత్రధారులు

బ్యాంకు అకౌంట్లు ఉన్న వారికి ఖాతాల్లోనే పెన్షన్ వేయాలి. మిగిలిన వారికి ఇళ్లకే వెళ్లి ఇస్తే సిబ్బందికి శ్రమ తగ్గుతుంది.

ఏప్రిల్ 28న ఏపీ బీజేపీ నేతల సూచన

వరుసబెట్టి పదేపదే ఫిర్యాదులతో..

- 'మేం 2024 మార్చి 30న ఇచ్చిన ఆదేశాల ప్రకారం బ్యాంకు ఖాతాలున్న లబ్ధిదారులకు డీబీటీ (నగదు రూపంలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ) విధానంలో ఫించన్ల పంపిణీకే ప్రాధాన్యం ఇవ్వండి. లేదంటేనే శాశ్వత ఉద్యోగుల ద్వారా పంపిణీ చేపట్టండి'

ఏప్రిల్ 26న సీఎస్‌కు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల సారాంశం.

(ఏప్రిల్‌లో దివ్యాంగులకు ఇళ్ల వద్ద, మిగిలిన వారికి సచివాలయాల వద్ద పెన్షన్ల పంపిణీపై టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గత 20 రోజులుగా ఫిర్యాదులు చేయడంతో ఈసీ తమ ఆదేశాలను పాటించాలంటూ మరోసారి ఉత్తర్వులిచ్చింది)

మొదలు పెట్టిందే టీడీపీ

రాష్ట్రంలో నాలుగున్నరేళ్లకు పైగా వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఠంచన్‌గా లబ్ధిదారుల ఇంటి వద్దే చిన్న అవాంతరం కూడా లేకుండా పింఛన్ల పంపిణీ కొనసాగగా ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే దీన్ని అడ్డుకుంటూ చంద్రబాబు సన్నిహితులంతా వరుసపెట్టి ఈసీకి ఫిర్యాదులు చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘానికి స్వయంగా ఫిర్యాదు చేశారు. చంద్రబాబుకు సామాజికవర్గం పరంగా, రాజకీయ ప్రయోజనాల పరంగా వివిధ సందర్భాల్లో అనుకూలంగా వ్యవహరించిన మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ పేరుతో ఫించన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 23, 25వ తేదీల్లో రెండు విడతలుగా ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి వరకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే వలంటీర్ల ద్వారా జరిగిన పింఛన్ల పంపిణీకి బ్రేక్‌లు వేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. టీడీపీ నేతలు, చంద్రబాబు సన్నిహితుల ఫిర్యాదుల మేరకే వలంటీర్లు పింఛన్ల పంపిణీ తదితర కార్యక్రమాలకు వినియోగించే మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. ఫలితంగా ఏప్రిల్‌లో పింఛను డబ్బుల పంపిణీ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అధికారులు చేపట్టారు. దివ్యాంగులు, కదలలేని స్థితిలో ఉన్న అవ్వాతాతలకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసి మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద అందించేలా నిర్ణయం తీసుకున్నారు. దాదాపు ఐదేళ్ల పాటు ఏ కష్టం లేకుండా పింఛను తీసుకున్న వారికి ఈ నిర్ణయం కాస్త కష్టంగా అనిపించినా కేవలం ఐదు రోజుల్లోనే అందరికీ సజావుగా డబ్బులు చేతికి అందాయి. అయినా సరే ఆగకుండా టీడీపీ – జనసేన – బీజేపీ నాయకులు ఉమ్మడిగా గత నెల రోజులుగా దాదాపు రోజు మార్చి రోజు పింఛన్ల పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. మరోపక్క తమ అనుకూల మీడియాలో రాష్ట్ర ఉన్నతాధికారులను బ్లాక్‌మెయిల్ చేసేలా నిత్యం కథనాలు వెలువరించి ఒత్తిడి తెచ్చి ఇప్పుడు బ్యాంకుల ద్వారా పింఛన్లు పంపిణీ చేసేదాకా పరిస్థితి తీసుకొచ్చారు. తిరిగి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులపై నెపం వేస్తూ చంద్రబాబు, టీడీపీ నాయకులు బురద చల్లుతున్నారు.



దొరుకుతున్నవన్నీ 'పచ్చ' నోట్లే..!

కదిరి టీడీపీ అభ్యర్థి వాహనంలో రూ.2 కోట్ల సీజ్

తూర్పు గోదావరిలో దొరికిన కట్టల మూలాలూ టీడీపీలోనే..

- లెక్కలు చెప్పలేని డబ్బుతో దొరికిపోయిన మార్గదర్శి
- బాపట్ల దేశం అభ్యర్థి కంటైనర్లలో భారీగా నగదు పట్టివేత
- ఈ ఎన్నికల కోసం రూ.13 వేల కోట్లతో భారీ స్కెచ్.. అసెంబ్లీ సెగ్మెంట్‌కు రూ.75 కోట్ల చొప్పున పంచాలని వ్యూహం..
- మార్గదర్శి, నారాయణ, టీడీపీ నేతల కంపెనీల ద్వారా క్షేత్ర స్థాయికి..
- ఓటుకు రూ.5 వేలు ఇవ్వటానికైనా వెనకాడొద్దని నేతలకు హుకుం

సాక్షి, అమరావతి: నిన్నటికి నిన్న... ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్న రూ.2.04 కోట్లను పోలీసులు సీజ్ చేశారు. తరవాత ఇవి తెలుగుదేశం నాయకులు తరలిస్తున్నట్లుగా తేలింది. దానికి ఒక్కరోజు ముందు... కదిరిలో ఓ ప్రయివేటు వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.2 కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అది సాక్షాత్తూ అక్కడి టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ వాహనం. ఇక విశాఖలో ఈ మధ్యనే మార్గదర్శి సిబ్బంది బేషరమ్‌గా తీసుకెళుతున్న రూ.కోటికి ఇప్పటికీ లెక్కలు చెప్పలేదు. రెండు రోజుల కిందట తిరుపతిలో డ్వాక్రా మహిళలకు ఎర వేయటానికి అక్కడి టీడీపీ నాయకులు ఏకంగా ప్యాకెట్లలో రూ.3వేల నగదు, చీరలు పెట్టి పంపిణీ చేస్తూ దొరికిపోయారు. అక్కడ పంచిన మొత్తమే రూ.కోటి వరకూ ఉండొచ్చని అంచనా. బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యగ్నేశ నరేంద్రవర్మకు చెందిన రాయల్ మెరైన్ కంపెనీ కంటైనర్లలో భారీ మొత్తంలో నగదు దొరికినా... నోవా అగ్రిటెక్ కంపెనీ ముసుగులో పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు నిస్సిగ్గుగా ఓట్ల కొనుగోళ్లకు తెగబడినా... ఇవన్నీ జస్ట్ శాంపిల్స్ మాత్రమే. ఈ ఎన్నికల్లో గెలవకపోతే తాను, తన పార్టీ ఏవీ మిగలవన్న భయంతో చంద్రబాబు ఏకంగా డబ్బుల డ్యామ్‌కు కట్టలు తెంచేసి... ప్రవాహాన్ని వదిలిపెట్టేశాడు. ఇన్నేళ్ల అవినీతి సొమ్ములో కొంత ఖర్చు చేయక తప్పదని తాను కొంత పెడుతూ... తన వర్గీయులనందరినీ బరిలోకి దింపేశాడు. విదేశాలతో పాటు దేశంలోని పలు చోట్ల నుంచి బాబు వర్గానికి చెందిన వారంతా సామాజికవేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తల ముసుగులో ఎక్కడికక్కడ తిష్ట వేసి డబ్బులు వెదజల్లుతున్నారు. పోలీసులు ముమ్మరంగా సోదాలు జరుపుతుండటంతో ఒకటీ అరా చోట్ల ఇలా దొరికిపోతున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు... తన వర్గాన్ని, ఎన్నారై మద్దతుదారులను రంగంలోకి దించిన చంద్రబాబు వివిధ మార్గాల్లో రూ.13 వేల కోట్ల వరకూ సమీకరించి వెదజల్లుతున్నారు. పచ్చ ముఠా సభ్యులైన మార్గదర్శి చిట్‌ఫండ్స్, నారాయణ విద్యా సంస్థలు, టీడీపీ పెద్దలకు చెందిన రియల్ ఎస్టేట్, ఇతర సంస్థలు, తీరప్రాంతంలోని షిప్పింగ్ కంపెనీలను వీటి స్టోరేజీ కోసం ఉపయోగిస్తున్నట్లుగా టీడీపీ వర్గాలే చెబుతున్నాయి. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు నియోజకవర్గానికి రూ.75 కోట్లు చొప్పున మొత్తం రూ.13 వేల కోట్లకుపైగా వెదజల్లేందుకు సిద్ధపడటం చంద్రబాబు బరితెగింపు రాజకీయాలకు నిదర్శనం. 'పచ్చ' కామెర్లు సోకిన ఈనాడు రామోజీకి పచ్చ దందా కానరావటం లేదు. నేరుగా టీడీపీ అభ్యర్థి వాహనంలో పోలీసులు రూ.2 కోట్లు పట్టుకున్నా.. రామోజీ మాత్రం తన పత్రికలో ఒక్క అక్షరం కూడా రాయలేదంటేనే ఆయన కళ్లు ఏ స్థాయిలో కామెర్లతో మూసుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే ఇది 'ఈనాడు' చెబితేనే లోకానికి తెలిసే కాలం కాదు కదా!!.

'మార్గదర్శి' 'నారాయణ', ఇతర కంపెనీలదే కీలక పాత్ర

టీడీపీ అధికారంలో ఉండగా యథేచ్ఛగా భూదోపిడీలు, ఆర్థిక అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు భాగస్వాములు అందరూ రంగంలోకి దిగారు. మరోసారి చంద్రబాబుకు పీఠం దక్కితే గతంలో కొల్లగొట్టిన దానికంటే పది రెట్లు అధికంగా దోపిడీకి పాల్పడవచ్చన్న ఉద్దేశంతో అక్రమాలకు తెగబడ్డారు. రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్, పొంగూరు నారాయణకు చెందిన నారాయణ విద్యా సంస్థలు, పలువురు టీడీపీ నేతలకు చెందిన ఆక్వా కంపెనీలు, షిప్పింగ్ కంపెనీలు... ఇలా చంద్రబాబు ముఠాకు చెందిన వ్యాపార సంస్థలన్నీ నల్లధనం గిడ్డంగులుగా మారిపోయాయి. కొద్ది రోజుల క్రితం విశాఖలోని మార్గదర్శి బ్రాంచి నుంచి అక్రమంగా తరలిస్తున్న డబ్బులను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం విదితమే. 2022 డిసెంబర్ నుంచి రాష్ట్రంలో మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. అయినా సరే రాష్ట్రంలోని 37 బ్రాంచీల ద్వారా నెలకు దాదాపు రూ.200 కోట్ల నగదు టర్నోవర్‌ను లెక్కల్లో చూపిస్తుండటం గమనార్హం. ఆ టర్నోవర్ ముసుగులో టీడీపీ కోసం భారీగా నల్లధనాన్ని తరలిస్తున్నట్లు స్పష్టమవుతోంది. టీడీపీ సీనియర్ నేత పొంగూరు నారాయణకు చెందిన విద్యా సంస్థలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా అనే కంపెనీ ముసుగులో భారీగా నల్లధనాన్ని తరలించడం అధికారుల సోదాల్లో బట్టబయలైంది. చంద్రబాబు బీజేపీ తరపున అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిపిన సీఎం రమేశ్ ద్వారా భారీగా నల్లధనాన్ని డంప్ చేశారు.

అక్రమాలకు ప్రత్యేక జట్టు

ఎన్నికల అక్రమాల కోసం చంద్రబాబు ఏకంగా ఓ జట్టును ఏర్పాటు చేసుకున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా నల్లధనాన్ని తెప్పించడం.. ప్రతి జిల్లాలో ప్రత్యేక డంపింగ్ కేంద్రాల్లో భద్రపరచడం.. అక్కడ నుంచి నియోజకవర్గాలకు పంపిణీ.. క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నేతలకు నోట్ల మూటలు ఇచ్చి లోబరచుకోవడం.. ఓటర్లకు భారీగా డబ్బులు పంపిణీ చేయడం.. ఈ మొత్తం ప్రక్రియను ఈ జట్టు పర్యవేక్షిస్తుంది. ఎస్వీయూలో తన సహ విద్యార్థిగా ఉన్న ఓ రిటైర్డ్ ప్రొఫెసర్, రాష్ట్ర విభజన అనంతరం పోలీస్ బాస్‌గా తాను నియమించిన అనంతపురం జిల్లాకు చెందిన ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి, ఓ రిటైర్డ్ డీజీ, టీడీపీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించిన ఓ సలహాదారు తదితరులు ఈ జట్టులో సభ్యులుగా ఉన్నారు.

ఏదైనా చేయండి.. డీల్ సెట్ చేయండి!

టీడీపీ హయాంలో కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన నిధులను చంద్రబాబు విదేశాల్లోని వివిధ కంపెనీల్లో పెట్టుబడులుగా మళ్లించారు. ఎన్నికల అక్రమాల కోసం ఆ నిధులను షెల్ కంపెనీల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్, నారాయణ విద్యా సంస్థలు, ఇతర టీడీపీ పెద్దల కంపెనీలకు తరలించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.75 కోట్ల వరకు వెదజల్లేందుకు చంద్రబాబు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యారు. అభ్యర్థులకు రూ.25 కోట్ల వరకు, రాష్ట్ర పార్టీ కార్యాలయ బృందాల ద్వారా రూ.50 కోట్ల వరకు ఎన్నికల అక్రమాల కోసం వెదజల్లాలన్నది చంద్రబాబు స్కెచ్. 'పంచాయతీ స్థాయి నేతకు రూ.50 లక్షలు, మండల స్థాయి నేతకు రూ.కోటి, నియోజకవర్గ స్థాయి నేతకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఇచ్చేయండి..! ఏదైనా చేయండి.. డీల్ సెట్ చేయండి' అని నిర్దేశించినట్లు సమాచారం. ఇక ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ఓటుకు రూ.5 వేలు చొప్పున ఇవ్వడానికి వెనకాడొద్దని ఆదేశించారు.

ఉద్యోగుల ఫ్రెండ్లీ సీఎం

ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వంగా సీఎం జగన్ సర్కారు

ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- హామీ మేరకు తొలి కేబినెట్‌లోనే 27% మధ్యంతర భృతి.. ఇందుకోసం రూ.17,918 కోట్లు చెల్లింపు
- వేతన సవరణతో రూ.11,707 కోట్లు అదనపు వ్యయం.. అడగకుండానే 12వ పీఆర్సీ
- ఉమ్మడి ఏపీలో పెన్షనర్లకు డీఏ రద్దు చేసిన బాబు.. ఉద్యోగులను లంచగొండులుగా చిత్రీకరించిన బాబు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ స్నేహపూర్వకంగానే ఉంటారు. ప్రజలంటే ఎంత ప్రేమ చూపిస్తారో ఉద్యోగులతోనూ అంతే అభిమానంతో ఉంటారు. అందుకే సీఎం వైఎస్ జగన్ ఉద్యోగులకు మంచి మిత్రుడని, ఆయన ఐదేళ్ల పాలన ఉద్యోగుల పట్ల స్నేహపూర్వకంగా సాగిందని, పలువిధాలుగా మేలు కూడా చేకూర్చారని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. రెండేళ్లు కోవిడ్ కష్టాల్లోనూ ఉద్యోగులకు క్రమం తప్పకుండా జీతాలివ్వడం, గత చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎగ్గొట్టిన రెండు డీఏలను కూడా వైఎస్ జగన్ సర్కారు చెల్లించడం ఇందుకు చిన్న ఉదాహరణలని చెబుతున్నారు.

చంద్రబాబుది కపట ప్రేమ

బాబు ప్రతి ఎన్నికలకు ముందు ఉద్యోగులపై కపట ప్రేమ చూపిస్తారని, అధికారంలోకి వస్తే నరకం చూపిస్తారని, ఈసారీ ఇదే ఎత్తుగడ వేశారని రాష్ట్ర సచివాలయ ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వంలో ఉద్యోగులు వేళాపాళా లేకుండా పనిచేయాల్సి వచ్చేదని, వారి పట్ల చంద్రబాబుకు, టీడీపీ నేతలకు కనీస గౌరవం కూడా ఉండేదికాదని, తరచూ బెదిరింపులు, ఛీత్కారింపులతో అవమానాలు ఎదురయ్యేవని వివరించారు. ఉమ్మడి ఏపీలో పెన్షనర్లకు డీఏనే రద్దు చేసిన చరిత్ర చంద్రబాబుదని, 2019 ఎన్నికలకు ముందు డీఏలు ఎగ్గొట్టారని తెలిపారు. గతంలో చిరుద్యోగులు జీతాలు పెంచాలని ఎన్నిమార్లు కోరినప్పటికీ నాలుగున్నరేళ్లు పట్టించుకోని చంద్రబాబు.. గత ఎన్నికలకు ఆరు నెలల ముందు ఎన్నికల స్టంట్‌లో భాగంగా జీతాలు పెంచుతున్నట్లు ఉత్తర్వులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారనే విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో ఏ సమస్యా లేదు

గత ఐదేళ్లలో వైఎస్ జగన్ పాలనలో ఉద్యోగులకు అలాంటివి ఎప్పుడూ ఎదురు కాలేదని తెలిపారు. సీఎం సహా మంత్రులు, అధికారులు ఉద్యోగులను సమయం దాటి పనిచేయాలని ఎప్పుడూ కోరలేదు. పైగా, సీఎం జగన్ ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేలాది యువతకు ఉద్యోగాలు రావడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులపై పని ఒత్తిడి కూడా చాలా వరకు తగ్గిందని తెలిపారు. ఇప్పుడు ఉద్యోగులంతా ఉత్సాహంగా, ఆనందంగా పనిచేస్తున్నారని చెబుతున్నారు. వేతనాలు, పెన్షన్ల చెల్లింపులు కూడా ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీలోగా చెల్లించారని ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల డీఏలు, ఎర్న్‌డ్ లీవ్‌ల మంజూరులో కొంత జాప్యం అయింది తప్ప ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంటున్నాయి. సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మేరకు తొలి కేబినెట్ సమావేశంలోనే ఉద్యోగులు, పెన్షనర్లకు 27 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసి, రూ.17,918 కోట్లు చెల్లించారని వివరిస్తున్నారు. 11వ వేతన సవరణ అమలు చేసి రూ.11,707 కోట్ల అదనపు వ్యయాన్ని ఈ ప్రభుత్వం భరించిందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. ఉద్యోగ సంఘాలు అడగకుండానే సీఎం జగన్ 12వ పీఆర్సీని ఏర్పాటు చేశారు.

ఉద్యోగుల మేలు కోసమే జీపీఎస్

చంద్రబాబు సీఎంగా ఉండగా సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ తేవాలన్న ఉద్యోగులు కోరగా, ఆయన ససేమిరా అన్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్ ఉద్యోగుల రిటైర్మెంట్ తరువాత చాలా తక్కువగా పెన్షన్ వస్తోందని గుర్తించి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తెస్తామని మాట ఇచ్చారు. అయితే కొన్ని రాష్ట్రాలు సీపీఎస్ రద్దు చేస్తామని ప్రకటించడమే కానీ, చేయలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీపీఎస్ ఉద్యోగులకు మేలు చేయాలనే తపనతో జగన్ సర్కారు సుదీర్ఘ కసరత్తు చేసింది.



రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేలా జీపీఎస్‌ను రూపొందించింది. బేసిక్ జీతంలో 50 శాతం అంటే రూ.1 లక్ష జీతం ఉంటే రూ. 50 వేలు రిటైర్ అయిన తర్వాత పెన్షన్‌గా వస్తుంది. 82 ఏళ్ల వయస్సులో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండేలా ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్‌లు ఇచ్చేలా జీపీఎస్ రూపొందించారు. దీనిని ఉద్యోగ సంఘాలు స్వాగతించాయి. సీపీఎస్ కంటే జీపీఎస్ మేలన్నాయి. సీఎం జగన్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును కూడా 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగించారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని ఆర్టీసీ కారుణ్య నియామకాలనూ సీఎం జగన్ చేపట్టారు. ఇచ్చిన మాట మేరకు ఆర్టీసీలోని 55 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారు. 10 వేలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకున్నారు.

ప్రభుత్వ రంగాన్ని మూసివేయడంలో ఘనుడు చంద్రబాబు

ప్రభుత్వ రంగాన్ని మూసివేయడం, వీఆర్ఎస్ కూడా ఇవ్వకుండా గోల్డెన్ హ్యాండ్ షేక్ అంటూ ఉద్యోగులను ఇంటికి పంపేయడంలో చంద్రబాబుకు ఘనమైన చరిత్ర ఉంది. 2014–19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు శాశ్వత ఉద్యోగుల నియామకాలను ఉద్దేశపూర్వకంగా తగ్గించేశారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసే ఆలోచన చేశారు. బాబు ఐదేళ్ల పాలనలో కేవలం 34 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులనే నియమించారు. ఉమ్మడి రాష్ట్రంలో 1999 నుంచి 2004 మధ్య సీఎంగా ఉండగా ఆల్విన్, నిజాం షుగర్స్, రిపబ్లిక్ ఫోర్జ్, చిత్తూరు డెయిరీ, ప్రకాశం డెయిరీ వంటి 54 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి, అతి తక్కువ ధరకు తన వాళ్లకు కట్టబెట్టారు. ఉద్యోగులను నడిరోడ్డుపై వదిలేశారు. మనసులో మాట పుస్తకంలో చంద్రబాబు చెప్పిన విషయాలను ఉద్యోగులు ఇంకా మరిచిపోలేదు. కొత్త నియామకాలు చేపట్టకూడదని, కాంట్రాక్టు ప్రాతిపదికనే ఇవ్వాలని, సిబ్బందిని తగ్గించడానికి ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఇంతేకాదు.. బాబు ఉద్యోగులను లంచగొండులుగా చిత్రీకరిస్తుంటారు. విద్యుత్ సంస్థ ఉద్యోగుల్లో 66 శాతం, పౌర సరఫరాల సంస్థలో 65 శాతం, రెవెన్యూలో 64 శాతం, పోలీసు శాఖలో 62 శాతం, స్థానిక సంస్థల్లో 52 శాతం అవినీతిపరులేనని తన పుస్తకంలో రాశారు. ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధికి, మరోసారి మోసం చేయడానికి ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారు.

చిరుద్యోగులకూ మేలు చేసిన సీఎం జగన్

చిరుద్యోగులకూ సీఎం జగన్ మేలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి రాగానే దాదాపు అన్ని రంగాల్లో చిరుద్యోగుల జీతాలు పెంచారు. వారికి మరింత మేలు చేకూరుస్తూ మేనిఫెస్టో రూపొందించారు. నెలకు రూ.25 వేల వరకు జీతం పొందే ఆప్కాస్, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు విద్య, వైద్యానికి, ఇళ్లకు సంబంధించిన అన్ని నవరత్నాల పథకాలను వర్తింపజేస్తామని తాజా మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.

ఆర్థిక ప్రయోజనాలిలా..

సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చారు. వారి వేతనాల వ్యయం భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనం. చంద్రబాబు హయాంలోకన్నా ఉద్యోగుల వేతనాల వ్యయం ఇప్పుడు రూ.11 వేల కోట్లకు పైగా పెరిగింది. పెన్షనర్ల వ్యయం రూ.6 వేల కోట్లకు పెరిగింది.

చంద్రబాబు హయాంలో	
ఉద్యోగుల వేతనాల వ్యయం	రూ.38,995.33 కోట్లు
పెన్షనర్ల వ్యయం	రూ.15,220.97 కోట్లు
సీఎం వైఎస్ జగన్ హయాంలో	
ఉద్యోగుల వేతనాల వ్యయం	రూ.50,882.58 కోట్లు
పెన్షనర్ల వ్యయం	రూ.21,183.88 కోట్లు

ఇంటింటికీ 'జగన్ కోసం సిద్ధం'

రాష్ట్ర వ్యాప్తంగా బూత్ స్థాయి కమిటీల విస్తృత ప్రచారం



ఐదేళ్లలో సీఎం జగన్ చేసిన మేలు మరోసారి ప్రజల ముందుకు

పేదలే వైఎస్సార్‌సీపీ స్టార్ క్యాంపెయినర్లు.. సినీ హీరోలు కాదు

వారితో కలిసే ఇంటింటికీ మేనిఫెస్టో తీసుకెళ్తున్నాం: సజ్జల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఫ్యాషన్

వేసవి వేడిమిని తట్టుకోవాలి,
కంఫర్ట్‌గా ఉండాలి
అదే టైమ్‌లో స్టైలిష్‌గానూ కనిపించాలి.
కాటన్ కుర్తీ పైకి బాందినీ,
చందేరీ, ఇకత్, సిల్క్ ఓవర్ కోట్లు
ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా ఉంటున్నాయి.
బోహోస్టైల్‌ని తలపిస్తూ, సమ్మర్ స్పెషల్‌గా ఉండే
ఈ స్టైల్ ఏ సందర్భానికైనా బాగా నప్పుతుంది.

కలర్‌ఫుల్‌గా.. కంఫర్టబుల్‌గా..



సంప్రదాయ వేడుకల్లో షిమ్మరీ లుక్ ఉండే లాంగ్ ఫ్రాక్ట్, వాటి మీదకు సిల్క్ డిజైనర్ లాంగ్ ఓవర్ కోట్స్ ప్రత్యేకతను చూపుతాయి.



లాంగ్ ఫ్రాక్ లేదా లాంగ్ కుర్తీ ఈ స్టైల్‌కి ఎంచుకోవచ్చు. సౌకర్యాన్ని బట్టి స్లీవ్స్ లేదా స్లీవ్‌లెస్ టాప్స్‌ని సెలక్ట్ చేసుకోవాలి. కాటన్ కుర్తీ ఏ ఫ్యాబ్రిక్ అయినా ఫ్లోరల్స్‌లో లేదా భిన్నమైన ప్రింట్లు ఉన్న ఓవర్ కోట్స్ బాగా నప్పుతాయి. ఈ స్టైల్ డ్రెస్సింగ్ బోహో లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా ఫ్యాషన్ జ్యువెలరీ దీనికి సరైన ఎంపిక అవుతుంది.



ప్లెయిన్ డ్రెస్ ధరించినప్పుడు పూర్తి కాంట్రాస్ట్ ఓవర్ కోట్ వేసుకుంటే ఎక్కడ ఉన్నా స్పెషల్‌గా కనిపిస్తారు.

కాటన్ కుర్తీ–పైజామా మీదకు ఫ్లోరల్ ప్రింట్ ఉన్న కాటన్ ఓవర్‌కోట్‌ను ధరించవచ్చు. దుపట్టా అవసరం లేని ఈ స్టైల్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ సెట్ అవుతుంది.



లాంగ్ ఫ్రాక్‌కి అటాచ్ చేసినట్టుగా ఉండే ఫ్రాక్ స్టైల్ ఓవర్ కోట్ పార్టీలో స్టైలిష్ లుక్‌తో వెలిగిపోతుంది.



కాటన్ లాంగ్ కుర్తీకి ఇక్కత్ లాంగ్ ఓవర్ కోట్ ధరిస్తే ఉక్కపోతను, స్టైల్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చు.



సింపుల్ అండ్ గ్రేస్‌గా కనిపించే లుక్ టాప్ అండ్ బాటమ్‌కి ఫ్లోరల్ ఓవర్ లాంగ్ కోట్ సూపర్ స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది.



సిల్క్ టాప్స్ అయినా ఈవెనింగ్ టైమ్‌కి ఓకే అనుకున్నవారు అదే కాంబినేషన్‌లో వచ్చే సిల్క్ ఓవర్ కోట్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.



ఓవర్‌కోట్‌లా అనిపించే లాంగ్ ఫ్రాక్ డ్రెస్‌ను కూడా ఈ స్టైల్‌కి ఎంపిక చేసుకోవచ్చు. సమ్మర్‌లో ఈవెనింగ్ పార్టీకి స్పెషల్ అట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు.

ఎక్స్‌పర్ట్

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది.
ఎన్నికల సమయంలోనే కాదు
సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు
ప్రముఖులకు పెద్ద సవాలు.
ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి.
వీటి గుట్టుమట్లు ఏమిటో
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నీడలో
ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది
ఆ రంగంలో నిపుణురాలు మధుమితా ముర్గియా.

డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు



మధుమితా ముర్గియా

‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపాలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పార్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి ‘ఇమేజ్ క్రియేటింగ్’. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పోర్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపొచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది’ అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్.

బ్రిటిష్ ఇండియన్

ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యూనాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం ‘కోడ్ డిపెండెంట్’కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది.

ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. ‘ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాసూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యా రంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే’ అంటుందామె.

చెడు ఎంతో ఉంది:

‘ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే’ అంటోంది మధుమిత.

వంటిల్లు

చల్ల కూరలు

మే నెల వచ్చేసింది... ఎండలు మండుతున్నాయి.
భోజనం చేయాలంటే చెమటలు పడుతున్నాయి.
కూరలను చూస్తేనే ఆకలి పోయి దాహం వేస్తోంది.
నేరుగా మజ్జిగలోకి వెళ్లాలనిపించేంత దాహం అది.
అందుకే పెరుగుతోనే కూరలు చేసుకుందాం.
ఇవన్నీ నాలుకకు హితవుగా ఉంటాయి.
తిన్న తర్వాత పొట్టను చల్లగా ఉంచుతాయి.

దహీ బైంగాన్



కావలసినవి: వంకాయ – 1 (మీడియం సైజు); నూనె – టేబుల్ స్పూన్ (వంటకు ఉపయోగించే నూనె ఏదైనా) ; ఆవనూనె – టేబుల్ స్పూన్ (పోపు కోసం) ; యాలకులు – 2 ; లవంగాలు – 2 ; పెరుగు – పావు లీటరు (చిలకాలి).

గ్రేవీ కోసం: మెంతిపిండి – టేబుల్ స్పూన్ ;అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; కశ్మీర్ మిర్చిపొడర్ – టేబుల్ స్పూన్ ; నీరు – కప్పు (పై వన్నీ కలపడానికి) ; ఇంగువ– చిటికెడు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు – టీ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో మెంతిపిండి, మిర్చిపొడర్, అల్లం పేస్టు వేసి కలపాలి ● వంకాయను మందపాటి చక్రాల్లా తరిగి ఉప్పు రాయాలి ● నూనె వేడి చేసి వంకాయ ముక్కలను వేయించి పక్కన పెట్టాలి(ఎయిర్ ఫ్రయర్ ఉంటే నూనె లేకుండా ఫ్రై చేసుకోవచ్చు) ● అదే బాణలిలో మిగిలిన నూనెలో ఆవ నూనె వేసి వేడెక్కిన తర్వాత లవంగాలు, యాలకులు, ఇంగువ వేయాలి. ఇందులో మెంతిపిండి, అల్లం, మిరప్పొడి కలిపిన మిశ్రమం, పసుపు వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి ● ఆ మిశ్రమం వేడెక్కిన తర్వాత పెరుగు వేసి గరిటెతో కలుపుతూ ఐదారు నిమిషాల పాటు మరిగించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మరో కప్పు నీటిని పోసి కలిపితే చిక్కటి గ్రేవీ తయారవుతుంది. ఇప్పుడు ఉప్పు కలిపి గ్రేవీ చిక్కదనాన్ని సరిచూసుకుని అవసరమైతే మరికొన్ని నీటిని పోసి మరగనివ్వాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వంకాయ ముక్కలను వేసి కలిపి వడ్డించాలి. ఇది అన్నంలోకి రోటీకి కూడా మంచి కాంబినేషన్.

పులిస్సెరి



కావలసినవి: పెరుగు – పావు లీటరు ; పసుపు – పావు టీ స్పూన్ ; నీరు – పావు లీటరు.

కొబ్బరి పేస్టు కోసం: పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు ; పచ్చిమిర్చి– 3 ; జీలకర్ర– టీ స్పూన్; నీరు – కప్పు లేదా కొబ్బరి పేస్టు చేయడానికి తగినంత.

పోపు కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్‌లు (వంటకు ఉపయోగించే కొబ్బరి నూనె లేదా ఇతర వంట నూనె) ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; మెంతులు– పావు టీ స్పూన్ ; ఎండుమిర్చి– 2 ; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు ; అల్లం – అర అంగుళం ముక్క (సన్నగా తరగాలి) ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర మిక్సీలో గ్రైండ్ చేయాలి. తగినంత నీటిని వేస్తూ మెత్తగా చేసుకోవాలి ● ఒక పాత్రలో పెరుగు, పసుపు, నీరు కలిపి చిలికి అందులో ఉప్పు, కొబ్బరి పేస్టు వేసి కలపాలి ● ఈ పాత్రను స్టవ్ మీద పెట్టి మీడియం మంటమీద మధ్యలో గరిటెతో కలుపుతూ వేడిచేయాలి. దీనిని ఎక్కువసేపు ఉడికించాల్సిన అవసరం లేదు. మరగడం మొదలైన వెంటనే దించేయాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మెంతులు, ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తర్వాత పోపును ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన పెరుగు– కొబ్బరి పేస్టు మిశ్రమంలో కలిపి, కొత్తిమీర చల్లి మూత పెట్టాలి. ఈ కేరళ వంట అన్నంలోకి రుచిగా ఉంటుంది.

గుజరాతీ కడీ

కావలసినవి: శనగపిండి– 4 టేబుల్ స్పూన్‌లు; అల్లం పచ్చిమిర్చి పేస్ట్– అర టేబుల్ స్పూన్ (అల్లం అంగుళం ముక్క, రెండు పచ్చిమిర్చి కలిపి గ్రైండ్ చేయాలి); తాజా పెరుగు – కప్పు ; బెల్లం లేదా చక్కెర – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నీరు – రెండున్నర కప్పులు.

పోపు కోసం: నూనె – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర– అర టీ స్పూన్ ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; కరివేపాకు – ఒక రెమ్మ ; ఎండు మిర్చి – 2; మెంతులు – పావు టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, అల్లం–పచ్చిమిర్చి పేస్ట్, పెరుగు, బెల్లం, ఉప్పు వేసి బాగా చిలకాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి పేలిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, కరివేపాకు, ఎండు మిర్చి (విరిచి వేయాలి), మెంతులు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత స్టవ్ ఆపేయాలి. ఈ పోపును ముందుగా చిలికి పెట్టుకున్న పెరుగు – శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● ఇప్పుడు ఆ పాత్రను మీడియం మంట మీద ఉంచి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి కలుపుతూ మాడకుండా చూసుకోవాలి. శనగపిండి పచ్చి వాసన పోయిన తర్వాత మిశ్రమం మంచి రుచికరమైన వాసన వస్తుంటుంది. అప్పుడు కొత్తిమీర చల్లి దించేయాలి ● గుజరాతీ కడీని సూప్‌లాగ భోజనానికి ముందు తాగవచ్చు. అన్నంలో కలుపుకోవచ్చు, రోటీలోకి కూడా తినవచ్చు. ఇది వేసవి, శీతాకాలాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం.



కుకురార్



కావలసినవి: చికెన్ – అర కేజీ ; చిక్కటి పెరుగు – 5 టేబుల్ స్పూన్‌లు ; బంగాళ దుంప – 2 (ముక్కలుగా తరగాలి) ; అల్లం వెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉల్లిపాయలు – 3 (తరగాలి) ; ఆవ నూనె లేదా సాధారణ వంటనూనె – 5 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – చిటికెడు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి ; ఎండు మిర్చి– 5 ; పచ్చిమిర్చి– 3 (నిలువుగా చీరాలి) ; పసుపు – టీ స్పూన్ ; మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; గరం మసాలా పొడి – టీ స్పూన్ ; చికెన్ మసాలా పొడి– టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేయాలి. అందులో పసుపు, చికెన్ మసాలా పొడి, మిరప్పొడి వేసి మసాలా పొడులు చికెన్ ముక్కలకు బాగా పట్టేటట్లు కలిపి 20 నిమిషాల పాటు పక్కన ఉంచాలి ● ఈ లోపు ఒక బాణలిలో నూనె వేడి చేసి అందులో ఇంగువ, చక్కెర, ఎండు మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇవి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి సమంగా కలిసేటట్లు ఒకసారి తిప్పి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన పెట్టాలి ● ఉల్లిపాయలు వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో బంగాళాదుంప ముక్కలు వేయించి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి. అదే బాణలిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేయించి తీసి పెట్టుకోవాలి ● ఇప్పుడు మిగిలిన నూనెలో మారినేట్ చేసిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ముక్కలు ఎర్రగా వచ్చేవరకు వేయించి అప్పుడు ఉప్పు వేసి ముక్కలకు పట్టేటట్లు కలపాలి. చికెన్ ముక్కల నుంచి నూనె వేరవుతున్న సమయంలో బంగాళాదుంప ముక్కలను వేయాలి. ఈ రెండింటినీ కలిపి పది నిమిషాల పాటు వేయించిన తర్వాత అందులో రెండు కప్పుల నీరు పోసి కలిపి మంట పెంచి ఉడకనివ్వాలి ● చికెన్ ఉడికేటప్పుడు అందులో ముందుగా వేయించి పెట్టుకున్న అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి తోపాటు గరం మసాలా పొడి, చిలికిన పెరుగు మిశ్రమాన్ని వేయాలి. ఇవన్నీ కలిసి ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర వేసి కలిపి దించేయాలి. ఈ కుకురార్ అస్సాం వాళ్ల వంట. అన్నం, రోటీల్లోకి రుచిగా ఉంటుంది.

యువర్స్

క్లైమెట్ యాక్షన్



హరి ప్రసాద్

పచ్చటి అడుగు

సోషల్ ఎంటర్ ప్రెన్యూర్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకున్నాడు తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన హరి ప్రసాద్. ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్) మేనేజ్‌మెంట్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు, కార్పోరేషన్‌లకు సహాయపడడానికి 'బియాండ్ సస్టైయినబిలిటీ' అనే స్టార్టప్‌ను ప్రారంభించాడు.

పది మందికి మేలు చేసే వ్యక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి విన్నప్పుడు, చదివినప్పుడు హరి ప్రసాద్ భావోద్వేగంతో కదిలిపోయేవాడు. ఫ్రీడమ్ ఫైటర్స్‌కు సంబంధించిన సినిమాలను చూసినప్పుడల్లా 'నా వంతుగా సమాజానికి ఏదైనా చేయాలి' అనుకునేవాడు.

జీవితానికి పరమార్థం ఉండాలనే భావన చిన్న వయసులోనే హరి ప్రసాద్‌లో మొలకెత్తింది.

కాలేజీ సెకండ్ ఇయర్‌లో వాతావరణ మార్పులపై వచ్చిన ఎన్నో డాక్యుమెంటరీలను చూశాడు.

'ఇలా చూస్తూ బాధ పడాల్సిందేనా! నా వంతుగా ఏమీ చేయలేనా' అనుకుంటూ 'తప్పకుండా ఏదైనా చేయాలి' అనే పట్టుదలతో క్లైమెట్ యాక్షన్ వైపు అడుగులు వేశాడు.

ఆ పచ్చటి అడుగులు 'బియాండ్ సస్టైయినబిలిటీ' అనే స్టార్టప్ మొదలు పెట్టేలా చేశాయి. ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్) ప్రకారం పర్యావరణానికి సంబంధించి ఉన్నతస్థాయి ప్రమాణాలను సాధించడానికి మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు, పెద్ద సంస్థలకు ఈ స్టార్టప్ తోడ్పడుతోంది.

'ఆర్గనైజేషన్స్‌కు నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌గా వ్యవహరిస్తాం' అంటున్నాడు హరి ప్రసాద్.

సస్టైయినబిలిటీ, బాటమ్-లైన్ చాలెంజెస్‌కు సంబంధించి సంస్థల విజన్‌ని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా కార్బన్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెడుతోంది బియాండ్ సస్టైయినబిలిటీ. కంపెనీల పర్యావరణ ప్రమాణాలకు సంబంధించి బేస్‌లైన్ స్టడీని నిర్వహిస్తోంది. కర్బన ఉద్గారాలు, వ్యర్థాల ఉత్పత్తి, మెటీరియల్ వినియోగం, కంపెనీ ఉద్యోగులలో వైవిధ్యం... మొదలైన అంశాలు ఇందులో ఉంటాయి.

రకరకాల విషయాను దృష్టిలో పెట్టుకొని యాక్షన్ ప్లాన్‌ను రూపొందిస్తారు. కంపెనీలకు సంబంధించి షార్ట్ టర్మ్, మిడ్-టర్మ్, లాంగ్-టర్మ్ టార్గెట్‌లను సెట్ చేస్తారు. కెపాసిటీ డెవలప్‌మెంట్, కార్బన్ మేనేజ్‌మెంట్, ఈఎస్‌జీ మేనేజ్‌మెంట్, క్లైమేట్ చేంజ్....మొదలైన వాటిపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించింది బియాండ్ సస్టేనబిలిటీ.

అవగాహన సదస్సుల ద్వారా 65కు పైగా కంపెనీలకు, వందలాది మంది ప్రజలకు దగ్గరైంది. తయారీ ప్రక్రియలో వాతావరణ ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి ఈ సదస్సులు కంపెనీలకు ఉపయోగపడుతున్నాయి.

'బియాండ్ సస్టైయినబిలిటీ వోఎస్' పేరుతో టెక్ ప్లాట్‌ఫామ్ కూడా బిల్ట్ చేశారు. కంపెనీల పాస్ట్ పర్‌ఫార్‌మెన్స్‌తో పోల్చుతూ విశ్లేషణ చేయడమే కాదు సస్టైయినబిలిటీ పర్‌ఫార్‌మెన్స్‌ను మెరుగుపరుచుకోవడానికి ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుంది.

స్థూలంగా చెప్పాలంటే... కంపెనీల మైండ్‌సెట్ మార్చడంలో, పర్యావరణ స్పృహ వైపు నడిపించడానికి 'బియాండ్ సస్టేనబిలిటీ' కీలక పాత్ర పోషిస్తోంది.

స్టార్టప్‌కు ముందు...

డిగ్రీ పూర్తి చేసిన తరువాత వాతావరణ మార్పుల గురించి లోతుగా తెలుసుకోవడానికి నెదర్‌ల్యాండ్స్‌లోని 'యూనివర్శిటీ ఆఫ్ ట్వంటే'లో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ చేశాడు హరి ప్రసాద్. కర్బన ఉద్గారాలు తగ్గించడానికి సంబంధించిన ఎన్నో ప్రయోగాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. తన స్టార్టప్ మొదలు పెట్టడానికి ముందు 'ఎస్బీ ఎడ్జ్' అనే సోషల్ స్టార్టప్‌లో పనిచేసి ఎంతో అనుభవాన్ని సొంతం చేసుకున్నాడు.

● మ్యూజిక్ వరల్డ్





రికార్డుల సునామీ

'బిల్‌బోర్డ్ హాట్ 100 చాట్‌లో 14 స్పాట్‌లలో టాప్‌లో నిలిచిన తొలి ఆర్టిస్ట్‌గా చరిత్ర సృష్టించింది పాప్ సెన్సేషన్ టేలర్ స్విఫ్ట్. టేలర్ లేటెస్ట్ ఆల్బమ్ 'ది టార్చర్డ్ పోయెట్స్ డిపార్ట్‌మెంట్'లోని 14 ట్రాక్స్ 'బిల్‌బోర్డ్'లోని 14 స్పాట్స్‌లో టాప్‌లో నిలిచాయి. 'ఫోర్ట్‌నైట్' 'మై బాయ్ వోన్లీ బ్రేక్స్' 'సో లాంగ్, లండన్, ఫ్రెష్ ఔట్ ది స్లమ్మర్, ది టార్చర్డ్ పోయేట్స్ డి, డౌన్ బ్యాడ్, బట్ డ్యాడీ ఐ లవ్ హిమ్, ఫ్లోరిడాలాంటి సాంగ్స్ ఇందులో ఉన్నాయి. ఈ నెల 19న విడుదల అయిన 'ది టార్చర్డ్ పోయెట్స్ డిపార్ట్‌మెంట్' అమ్మకాలల్లో రికార్డ్ సృష్టించింది. స్పాటిఫైలో హైయెస్ట్ సింగిల్-డే గ్లోబల్ స్ట్రీమ్స్ ఆల్బమ్‌గా నిలిచింది. యాపిల్ మ్యూజిక్, అమెజాన్ మ్యూజిక్‌లోనూ ఈ ఆల్బమ్ హవా కొనసాగింది.

సముద్ర గర్భంలో సాహస యాత్ర

● గేమింగ్



సముద్ర గర్భంలోకి వెళ్లడం అంటే మరో ప్రపంచంలోకి వెళ్లినట్లే. పరిచిత, అపరిచిత, వింత, క్రూర....రకరకాల జీవులు మనకు సవాలు విసురుతాయి. సాహసం ఏమాత్రం నీరు కారిపోయినా జీవితం నీటిపాలు కావాల్సిందే. అందుకే సముద్ర గర్భంలో ప్రతి క్షణం...విలువైన సాహసమే. సముద్ర గర్భంలో సాహస యాత్ర చేయాలని ఉందా? అయితే ఈ గేమ్ మీ కోసమే. అడ్వెంచర్ సిమ్యూలెషన్ గేమ్ 'ఎండ్‌లెస్ ఓషియన్ లుమినస్' విడుదలైంది. జపాన్ గేమింగ్ కంపెనీ 'అరిక' డెవలప్ చేసిన గేమ్ ఇది. 'ఎండ్‌లెస్ ఓషన్' సిరీస్‌లో వస్తున్న థర్డ్ గేమ్. సముద్రగర్భ ప్రపంచాన్ని రికార్డ్ చేయడానికి ఈ గేమ్‌లో ప్లేయర్ స్కూబా డైవర్ పాత్ర పోషించాల్సి ఉంటుంది.

ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్ జానర్స్: అడ్వెంచర్, సిమ్యులేషన్ మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీ ప్లేయర్

● టెక్.. టాక్

నథింగ్ ఫోన్ (2ఏ)



సైజ్: 6.7 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
కలర్: డార్క్ బ్లూ
ర్యామ్: 8జీబి
స్టోరేజ్: 128జీబి
ఏఐ ఫీచర్స్: వాల్‌పేపర్ జెనరేటర్, చాట్‌జీపీటీ ఇంటిగ్రేషన్



విండోస్ 11లో ఏఐ ఎక్స్‌ప్లోరర్

విండోస్ 11లో 'ఏఐ ఎక్స్‌ప్లోరర్' అనే కొత్త ఫీచర్‌ను తీసుకురానున్నారు. కన్వర్‌సెషన్స్, వెబ్‌పేజీలు, ఈమెయిల్స్‌ను సమరైజ్ చేయడం నుంచి ఇమేజ్ బ్యాక్‌గ్రౌండ్‌ను రిమూవ్ చేయడంలాంటి కాంప్లెక్స్ టాస్క్‌ల వరకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇది స్క్రీన్ టాప్‌పై కనిపిస్తుంది. 'ఏఐ ఎక్స్‌ప్లోరర్' అనేది సెర్చ్ ఇంజిన్‌లాగే కాదు స్క్రీన్‌కు సంబంధించిన విషయాలను అనలైజ్ చేయడానికి, సూచనలు ఇవ్వడానికి ఉపకరిస్తుంది. ఇక మరో ఫీచర్ 'స్క్రీన్ అండర్‌స్టాండింగ్' ఇమెయిల్ రిప్లై జెనరేట్ చేయడానికి యూజర్‌లకు ఉపయోగపడుతుంది.

స్పీకింగ్ ప్రాక్టీస్



గూగుల్ సెర్చ్ 'స్పీకింగ్ ప్రాక్టిస్' అనే కొత్త ఫీచర్‌ను తీసుకు వస్తోంది. ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడానికి ఉపకరించే ఈ ఫీచర్ ప్రస్తుతం ఇండియా, అర్జెంటీనా, కొలంబియా, ఇండోనేషియా, మెక్సికో, వెనిజులాలలో అందుబాటులో ఉంది. యూజర్‌లు ఏఐ-పవర్డ్ ఇంటర్‌యాక్టివ్ లాంగ్వేజ్ లెర్నింగ్ ఎక్సర్‌సైజ్‌లలో పార్టిసిపేట్ చేయవచ్చు.

ఇంపార్టెంట్, అర్జంట్ లేబుల్స్ క్రియేట్ చేయడానికి..



- జీమెయిల్.కామ్‌లోకి వెళ్లి కంపోజ్ మెయిల్ ఆప్షన్‌ను ఓపెన్ చేయాలి.
- 3-డాట్ మెనూ ఐకాన్ (బాటమ్ రైట్ కార్నర్ మెయిల్ కంపోజ్ విండో) క్లిక్ చేయాలి.
- లేబుల్ ఆప్షను సెలెక్ట్ చేయాలి.
- న్యూ కస్టమ్ లేబుల్ క్రియేట్ చేయడానికి 'క్రియేట్ న్యూ' ఆప్షన్ క్లిక్ చేసి నేమ్ ఆఫ్ ది లేబుల్(అర్జంట్, ఇంపార్టెంట్)లోకి వెళ్లాలి.
- లేబుల్ క్రియేట్ అయిన తరువాత...ఇమెయిల్ రైట్ క్లిక్ చేయాలి. ఇంపార్టెంట్, అర్జంట్‌కు సంబంధించి మార్క్ చేయాలి. నెక్స్ట్ జీమెయిల్ ఓపెన్ చేసినప్పుడు స్పెసిఫిక్ లేబుల్ హైలెట్ అవుతుంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



అరైవ్ ఇన్ ఏ బాడీ

ఒక గుంపుగా వెళ్లే సందర్భంలో వాడే మాట... అరైవ్ ఇన్ ఏ బాడీ **ఉదా:** ది ఆఫీస్ బికేమ్ టూ నాయిస్ వెన్ ఆల్ ది ఎంప్లాయిస్ అరైవ్‌డ్ ఇన్ ఏ బాడీ

బర్న్ ది మిడ్‌నైట్ ఆయిల్

'రాత్రి బాగా ఆలస్యం అయింది' అని చెప్పే సందర్భంలో వాటే మాట...బర్న్ ది మిడ్‌నైట్ ఆయిల్. **ఉదా:** ది టీమ్ బర్న్‌డ్ ది మిడ్‌నైట్ ఆయిల్ టు ఫినిష్ ది ప్రాజెక్ట్ బిఫోర్ ది క్లయింట్స్ డెడ్‌లైన్

సినిమా



● నాగార్జున

నోటు కథేంటి?

ధనుష్, నాగార్జున అక్కినేని లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రష్మికా మందన్న కథానాయిక. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి నాగార్జున ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. వర్షం కురుస్తుండగా గొడుగు పట్టుకుని నిల్చున్నారు నాగార్జున. ఆయన వెనక వైపు డబ్బు నోట్ల కట్టలు ఉన్న కంటైనర్ కనిపిస్తోంది. కాగా.. ఓ ఐదువందల రూపాయల నోటు కింద పడి ఉండటాన్ని చూసిన నాగార్జున తన పర్సులోంచి ఓ నోటుని తీసి, ఆ కంటైనర్‌లో పెడతారు. మరి.. ఆ నోటు వెనక కథేంటి అనేది సినిమాలో చూడాల్సిందే. ''వైవిధ్యమైన కథాంశంతో 'కుబేర' రూపొందుతోంది. ఈ చిత్రం కోసం బ్యాంకాక్‌లో నాగార్జున, ఇతర నటీనటులపై కొంత టాకీ, యాక్షన్ పార్ట్ చిత్రీకరించాం. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ జరుగుతోంది'' అని యూనిట్ పేర్కొంది.



● ప్రభాస్

ఆల్ సెట్... గో

'సలార్' సెట్స్‌లోకి తిరిగి జాయిన్ అయ్యేందుకు ప్రభాస్ సై అన్నారట. హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'సలార్'. ఈ చిత్రంలోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' గత ఏడాది క్రిస్మస్ సందర్భంగా విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో 'సలార్'లోని మలి భాగం 'సలార్: శౌర్యాంగపర్వం' చిత్రీకరణను వెంటనే మొదలు పెట్టాలని ప్రభాస్, ప్రశాంత్ నీల్ భావించారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను ప్రశాంత్ నీల్ పూర్తి చేశారట. ఇక ఆల్ సెట్... గో అంటూ షూటింగ్‌ను ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో మొదలు పెట్టనున్నారని సమాచారం. ఓ పది రోజుల పాటు షూటింగ్ జరిపి, ఆ తర్వాత బెంగళూరులో చిత్రీకరణను ప్లాన్ చేశారట, వీలైనంత త్వరగా చిత్రీకరణను పూర్తి చేసి, కుదిరితే ఈ ఏడాది చివర్లోనే క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, బాబీ సింహా, శ్రుతీహాసన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమాను విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం జపాన్‌లో జూలైలో విడుదల కానుంది. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' సినిమాలు జపాన్ బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగ్గ వసూళ్లను రాబట్టాయి. ఈ నేపథ్యంలో 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాను కూడా జపాన్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది.

ఆ ఒక్కటీ అడక్కు చూసి నవ్వుకుందాం - అడివి శేష్




● ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేశ్, అడివి శేష్

''నా తొలి సినిమా ఆడియో లాంచ్‌కి నరేశ్‌గారు ముఖ్య అతిథిగా వచ్చారు. ఇప్పుడు ఆయన నటించిన 'ఆ ఒక్కటీ అడక్కు' మూవీ ప్రీ రిలీజ్ వేడుకకి నేను రావడం హ్యాపీగా ఉంది. 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాని మనమంతా థియేటర్లో చూసి హాయిగా నవ్వుకుందాం'' అని హీరో అడివి శేష్ అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక నిర్మించిన ఈ సినిమా నేడు విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– 'నేను ఇన్నేళ్ల పాటు పరిశ్రమలో ఉండటానికి, ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం మా నాన్న ఈవీవీ సత్యనారాయణగారు. 'ఆ ఒక్కటీ అడక్కు' డైరెక్టర్ మల్లి అంకంతో కలిపి ఇప్పటివరకూ దాదాపు 30 మంది కొత్త దర్శకులని పరిచయం చేశాను. ఈ మండు వేసవిలో మీ బాధలు మర్చిపోయి రెండు గంటలు హాయిగా మా సినిమాతో ఎంజాయ్ చేయండి' అన్నారు. ''మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీ ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు మల్లి అంకం. ''ఆ ఒక్కటీ అడక్కు' లాంటి మంచి మూవీ చేయడం మా అదృష్టం'' అన్నారు రాజీవ్ చిలక. ఈ వేడుకలో సహ నిర్మాత భరత్, దర్శకులు విజయ్ కనకమేడల, విజయ్ బిన్నీ, దేవా కట్టా, రచయితలు బీవీఎస్ రవి, అబ్బూరి రవి, నటి జామి లివర్ మాట్లాడారు.

జాలీ రైడ్



● అర్షద్



● అక్షయ్

బాలీవుడ్ హిట్ మూవీ ఫ్రాంచైజీలో 'జాలీ ఎల్ఎల్‌బీ' ఒకటి. ఈ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటికే విడుదలైన 'జాలీ ఎల్ఎల్‌బీ', 'జాలీ ఎల్ఎల్‌బీ 2' సినిమాలకు మంచి ప్రేక్షకాదరణ లభించింది. తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి థర్డ్ పార్ట్ 'జాలీ ఎల్ఎల్‌బీ 3' సినిమా రానుంది. 'జాలీ ఎల్ఎల్‌బీ' ఫ్రాంచైజీలోని తొలి రెండు భాగాలకు దర్శకత్వం వహించిన సుభాష్ కపూరే మూడో భాగాన్నీ తెరకెక్కిస్తున్నారు. అక్షయ్ కుమార్, అర్షద్ వార్సి లీడ్ రోల్స్ చేస్తున్న ఈ సినిమాలో సౌరభ్ శుక్లా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు అక్షయ్ కుమార్. ''ఒరిజినల్ ఎవరో, డూప్లికేట్ ఎవరో తెలియడం లేదు. కానీ ఈ సినిమా మాత్రం ఓ జాలీ రైడ్‌గా ఉండబోతోంది'' అంటూ 'జాలీ ఎల్ఎల్‌బీ 3' సినిమా షూటింగ్‌లో తాను పాల్గొంటున్నట్లుగా వీడియోను షేర్ చేశారు అక్షయ్ కుమార్. నకిలీ లాయర్ల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందనే టాక్ వినిపిస్తోంది.

ఆనందంతో డైరెక్టర్‌ని హత్తుకున్నాను - సుహాస్

''ప్రసన్న వదనం' మూవీ ఫేస్ బ్లైండ్‌నెస్ (ముఖాలను గుర్తు పట్టడంలో ఇబ్బంది) కాన్సెప్ట్‌తో రూపొందింది. డైరెక్టర్ అర్జున్‌గారు సినిమా తీసిన విధానం, స్క్రీన్ ప్లే అదిరిపోయాయి. ఈ సినిమా తొలి కాపీ చూశాక భావోద్వేగం, ఆనందంతో డైరెక్టర్‌ని హత్తుకున్నాను. ఇంత అద్భుతంగా వచ్చిన మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని సుహాస్ అన్నారు. అర్జున్ వైకే దర్శకత్వంలో సుహాస్ హీరోగా, పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రసన్న వదనం'. జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో రేడియో జాకీ పాత్ర చేశాను. అతను తనకున్న ఫేస్ బ్లైండ్‌నెస్ కారణంగా ఎలాంటి సమస్యల్లో ఇరుక్కున్నాడు? దాన్ని ఎలా పరిష్కరించుకున్నాడు అనేది ఈ చిత్ర కథ. ఇందులో కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. అవి చేయడం కాస్త సవాల్‌గా అనిపించింది. ఎక్కడా రాజీపడకుండా ఈ సినిమాని నిర్మించారు నిర్మాతలు. ప్రస్తుతానికి నా చేతిలో ఎనిమిది సినిమాలున్నాయి'' అన్నారు.





● ఆలియా, శార్వరి



● ఆలియా భట్

స్పైకి సై

సిల్వర్ స్క్రీన్ స్పైగా ఆలియా భట్ సూపర్ హిట్. స్పై పాత్రలో ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటించిన 'రాజీ' చిత్రం మంచి విజయం సాధించింది. తాజాగా ఆలియా భట్ మరో స్పై బ్యాక్‌డ్రాప్ చిత్రానికి సై అన్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ శార్వరీ వాఘ్ కూడా మరో లీడ్ రోల్‌లో నటించనున్నారు. పూర్తి స్థాయి యాక్షన్ స్పై డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాకు శివ్ రావైల్ దర్శకత్వం వహిస్తారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం ఆలియా, శార్వరి ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఆ శిక్షణకు సంబంధించిన ఓ ఫొటో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్ పాత్రలో నటిస్తారని టాక్. 'వైఆర్ఎఫ్' (యశ్ రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మించనున్నారు.

మంచి దెయ్యం



● నందితా శ్వేత

నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, రఘుబాబు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఓఎమ్‌జీ' (ఓ మంచి ఘోస్ట్). శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. డా. అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ మూవీ నుంచి గ్లింప్స్, కాన్సెప్ట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్ని వర్గాల ప్రేక్షకులు దెయ్యం సినిమాలను, హారర్ మూవీస్‌ని ఇష్టపడుతుంటారు. హారర్ సినిమాల్లో వైవిధ్యం చూపిస్తే ఆ మూవీ సూపర్ హిట్ సాధించినట్లే. సరిగ్గా అదే ఫార్ములాతో మా సినిమా రూపొందింది. హారర్‌కు హాస్యం జోడించి నేటి తరం ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమాను రూపొందించాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

మనతో ముగిసిపోతుంది!



● జస్టిన్, బ్లేక్ లైవ్లీ

జస్టిన్ బాల్డోని లీడ్ రోల్‌లో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న హాలీవుడ్ చిత్రం 'ఇట్ ఎండ్స్ విత్ అజ్' (అది మనతో ముగిసిపోతుంది). ఈ సినిమాలో బ్లేక్ లైవ్లీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కొలిన్ హూవర్ రాసిన ప్రముఖ నవల 'ఇట్ ఎండ్స్ విత్ అజ్' ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, ఈ సినిమాను ఈ ఏడాది ఆగస్టు 9న విడుదల చేయనున్నట్లుగా యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రంలో లిల్లీ బ్లూమ్ పాత్రలో బ్లేక్ లైవ్లీ, రైట్ కిన్ కయిడ్ పాత్రలో జస్టిన్ కనిపిస్తారు. కథ రీత్యా... ఓ అమ్మాయికి ఇంట్లోనే వేధింపులు ఉంటాయి. ఆ అమ్మాయి తండ్రే ఆమెను అభ్యంతరకరమైన మాటలతో వేధిస్తుంటాడు. మరోవైపు తన ప్రియుడి నుంచి కూడా ఆమెకు ఇబ్బందులు ఎదురవుతాయి. దీంతో ఆ అమ్మాయి అతన్నుంచి దూరం అవుతుంది. ఇదే సమయంలో ఆ అమ్మాయి జీవితంలోకి ఓ న్యూరోసర్జన్ డాక్టర్ వస్తాడు. వీరి పరిచయం ప్రేమగా మారుతుంది. కానీ సడన్‌గా ఆ అమ్మాయి జీవితంలోకి ఆమె మాజీ ప్రియుడు తిరిగి వస్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అనే అంశాల నేపథ్యంలో 'ఇట్ ఎండ్స్ విత్ అజ్' సినిమా సాగుతుందని హాలీవుడ్ సమాచారం.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	128	74,611
నిఫ్టీ ▲	43	22,648

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,780	▲	175
డోజోన్స్	38,130	▲	227
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,172	▲	51
డాక్స్	17,896	▲	36
షాంఘై (బుధవారం ముగింపు)	3,105	▽	8
నికాయ్	38,236	▽	38

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,327
బంగారం (99.5 స్వచ్ఛత)	71,041
వెండి (కేజీ)	79,719

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	81.84	85.13
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	102.36	106.93
€	యూరో	ధామస్‌కుక్	87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)	ధామస్‌కుక్	43.00	64.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	52.71	56.97
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	59.29	63.53
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.85	23.62
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.39	12.39

బిజినెస్ రీల్

తయారీ రంగం నెమ్మది

ఏప్రిల్‌లో 58.8 వద్ద సూచీ



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం ఏప్రిల్‌లో మార్చితో పోల్చితే నెమ్మదించింది. మార్చిలో 59.1 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఏప్రిల్‌లో 58.8కి తగ్గింది. అయితే గడచిన మూడేళ్లలో గరిష్ట స్థాయిలో చక్కటి ఫలితాన్ని నమోదుచేసుకున్న రెండవ నెల ఏప్రిల్ కావడం గమనార్హం. కాగా, సూచీ 50పైన ఉంటే వృద్ధిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణించడం మరో కీలకాంశం.

జీఆర్‌టీ జ్యువెలర్స్ అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఒక గ్రాము బంగారు కొనుగోలుపై రూ.60 తగ్గింపుతో పాటు పాత బంగారు ఆభరణాలు మార్చుకున్నప్పుడు ఒక గ్రాముపై రూ.60 అదనంగా పొందవచ్చు. బంగారు నాణేలపై వేస్టేజీ ఉండదు. వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10% తగ్గింపు, వెండి వస్తువుల తయారీ చార్జీలపై 25%, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10% తగ్గింపు అందిస్తుంది. ముందస్తుగా బుకింగ్ సౌకర్యం కల్పిస్తుంది. కస్టమర్లకు అద్భుతమైన పండుగ షాపింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-5-2024	
విశాఖ	450-00
చిత్తూరు	494-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	48.00
2-5-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

సెలబ్రిటీలతో ఎయిర్‌బీఎన్‌బీ జట్టు..

లిస్టులో జాన్వీ కపూర్ చెన్నై ఇల్లు



న్యూఢిల్లీ: భారత్‌లో కార్యకలాపాలు విస్తరించే దిశగా ఆతిథ్య సేవల ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఎయిర్‌బీఎన్‌బీ మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా సినిమా, స్పోర్ట్స్, మ్యూజిక్ తదితర రంగాల సెలబ్రిటీలతో జట్టు కడుతోంది. తాజాగా బాలీవుడ్ నటి జాన్వీ కపూర్‌తో చేతులు కలిపింది. 'భారత్‌లో బాలీవుడ్ స్టార్ జాన్వీ కపూర్‌లా జీవించండి' స్లోగన్‌తో ఆమె బాల్యంలో నివసించిన చెన్నై ఇంటిని బస కోసం ప్రమోట్ చేస్తోంది. తమ కార్యకలాపాలకు సంబంధించి భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటని, టాప్ 10 మార్కెట్ల జాబితాలోకి చేరే అవకాశాలు ఉన్నాయని ఎయిర్‌బీఎన్‌బీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ డేవ్ స్టీఫెన్సన్ తెలిపారు. 2022తో పోలిస్తే 2023లో బుకింగ్స్ 30 శాతం పెరిగాయని ఆయన పేర్కొన్నారు. విదేశాలు వెళ్లేవారితో పాటు దేశీయంగా కూడా పర్యటించే టూరిస్టులను ఆకట్టుకునేందుకు భారత్‌లో గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు స్టీఫెన్సన్ వివరించారు. తమ కార్యకలాపాల ద్వారా భారత్‌లో 85,000 పైచిలుకు ఉద్యోగాలకు, జీడీపీ వృద్ధికి 920 మిలియన్ డాలర్ల మేర తోడ్పాటు అందించినట్లు పేర్కొన్నారు.

పరిమిత శ్రేణి ట్రేడింగ్

సూచీలకు స్వల్పలాభాల ముగింపు



ముంబై: పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఏప్రిల్‌లో రికార్డు స్థాయి జీఎస్‌టీ వసూళ్లు, ప్రోత్సాహకర తయారీ రంగ పీఎంఐ డేటా, విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఇంట్రాడేలో 415 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 128 పాయింట్లు లాభపడి 74,611 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 74,361 వద్ద కనిష్టాన్ని 74,812 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ రోజంతా 22,568 – 22,711 పాయింట్ల మధ్య ట్రేడైంది. ఆఖరికి 43 పాయింట్లు పెరిగి 22,648 వద్ద నిలిచింది. యుటిలిటి, విద్యుత్ సర్వీసెస్, ఆటో, మెటల్, కన్జూమర్, ఇంధన, ఫార్మా రంగాల చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

కోఫోర్జ్ చేతికి సిగ్నిటీ వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజిటల్ ఐటీ సొల్యూషన్స్, టెక్నాలజీ కన్సల్టింగ్ సర్వీసులు అందిస్తున్న కోఫోర్జ్ తాజాగా ఐటీ కంపెనీ సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వాటా కైవసం చేసుకుంటోంది. ఇందుకోసం ఒక్కో షేరుకు రూ.1,415 చెల్లించనున్నట్టు కోఫోర్జ్ ప్రకటించింది. బీఎస్‌ఈలో సిగ్నిటీ షేరు ధర గురువారం రూ.1,372.65 వద్ద స్థిరపడింది. దీనితో పోలిస్తే కోఫోర్జ్ చెల్లిస్తున్న ధర 3 శాతం ప్రీమియం కావడం గమనార్హం. కాగా, మార్చి త్రైమాసికంలో కోఫోర్జ్ నికరలాభం 95 శాతం ఎగసి రూ.224 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 8.6 శాతం అధికమై రూ.2,358 కోట్లు సాధించింది. నాల్గవ మధ్యంతర డివిడెండ్ కింద ఒక్కో షేరుకు రూ.19 చెల్లించనున్నట్టు బోర్డు ప్రకటించింది.

కోల్ ఇండియా లాభం జూమ్

క్యూ4లో రూ. 8,682 కోట్లు ● షేరుకి రూ. 5 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కోల్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 8,682 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 6,875 కోట్లు మాత్రమే ఆర్జించింది. వ్యయ నియంత్రణా సామర్థ్యాలు, ఓపెన్ క్యాస్ట్ మైనింగ్‌కు చెందిన స్ట్రిప్పింగ్ కార్యకలాపాల అకౌంటింగ్‌లో మార్పులు లాభాల్లో వృద్ధికి దోహదం చేశాయి. వాటాదారులకు షేరుకి రూ.5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 40,372 కోట్ల నుంచి రూ. 39,655 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 30,873 కోట్ల నుంచి రూ. 28,298 కోట్లకు తగ్గాయి. బొగ్గు ఉత్పత్తి 224.16 మిలియన్ టన్నుల నుంచి 241.75 ఎంటీకి పుంజుకుంది. సరఫరాలు 8 శాతం మెరుగుపడి 201.6 ఎంటీని తాకాయి. కాగా.. పూర్తి ఏడాదికి మహారత్న కంపెనీ కోల్ ఇండియా నికర లాభం 18 శాతం ఎగసి రూ. 37,369 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 31,723 కోట్లు ఆర్జించింది. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా 80 శాతానికిపైగా వాటాను ఆక్రమిస్తున్న సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో కోల్ ఇండియా షేరు గురువారం ఎన్‌ఎస్‌ఈలో 0.5 శాతం తగ్గి రూ. 452 వద్ద ముగిసింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ వీక్..

క్యూ4లో రూ. 451 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37 శాతం క్షీణించి రూ. 451 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 722 కోట్లు ఆర్జించింది. ఇందుకు గతంలోని విమానాశ్రయ సంబంధ వన్‌టైమ్ బకాయిలు, వాణిజ్య మైనింగ్ నష్టాలు ప్రభావం చూపాయి. ఇక నిర్వహణ లాభం(ఇబిటా) 8 శాతం నీరసించి రూ. 3,646 కోట్లను తాకింది. కమర్షియల్ మైనింగ్ వల్ల రూ. 202 కోట్ల నష్టం వాటిల్లగా.. ముంబై ఎయిర్‌పోర్ట్(ఎంఐఏఎల్) రూ. 627 కోట్ల వన్‌టైమ్ వ్యయాలను నమోదు చేసింది. న్యూ ఎనర్జీ బిజినెస్.. అదానీ న్యూ ఇండస్ట్రీస్ రూ. 641 కోట్ల ఇబిటాను సాధించింది. విమానాశ్రయాల విభాగం ఇబిటా రెట్టింపై రూ. 662 కోట్లకు చేరింది. క్యూ4లో మొత్తం ఆదాయం రూ. 28,944 కోట్ల నుంచి రూ. 29,180 కోట్లకు బలపడింది. పూర్తి ఏడాదికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ నికర లాభం 31 శాతం జంప్‌చేసి రూ. 3,241 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,27,540 కోట్ల నుంచి రూ. 96,421 కోట్లకు క్షీణించింది. అయితే కన్సాలిడేటెడ్ ఇబిటా 32 శాతం ఎగసి రూ. 13,237 కోట్లకు చేరింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1 శాతం బలహీనపడి రూ. 3,029 వద్ద ముగిసింది.

అదానీ పోర్ట్స్ హైజంప్..

క్యూ4లో రూ. 2,015 కోట్లు ● షేరుకి రూ. 6 డివిడెండ్



న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రా రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ మార్చి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం 77 శాతం దూసుకెళ్లి రూ. 2,015 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,178 కోట్ల నుంచి రూ. 7,200 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,995 కోట్ల నుంచి రూ. 4,451 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం 50 శాతం జంప్‌చేసి రూ. 8,104 కోట్లకు చేరింది. ఈ కాలంలో రూ. 5,584 కోట్ల రుణాలను తిరిగి చెల్లించింది. రూ. 7,416 కోట్ల పెట్టుబడి వ్యయాల నేపథ్యంలోనూ రుణభారాన్ని తగ్గించుకోగలిగినట్లు కంపెనీ తెలియజేసింది. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. 2025లో అదానీ పోర్ట్స్ 500 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) కార్గో పరిమాణాన్ని అందుకోగలదని కంపెనీ సీఈవో అశ్వనీ గుప్తా తెలియజేశారు. ఇందుకు ఇటీవల సొంతం చేసుకున్న గోపాల్‌పూర్ పోర్ట్‌తోపాటు ఈ ఏడాది ప్రారంభంకానున్న కేరళలోని విజింజమ్ పోర్ట్ తదితరాలు సహకరించగలవని పేర్కొన్నారు. కొత్తగా జత చేసుకున్న హైఫా, కరైకల్ పోర్టులను మినహాయించినప్పటికీ కార్గో పరిమాణంలో 18 శాతం వార్షిక వృద్ధిని సాధించినట్లు వెల్లడించారు. అదానీ పోర్ట్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.25 శాతం బలపడి రూ. 1,342 వద్ద ముగిసింది.

ఫెడరల్ బ్యాంక్ ఫ్లాట్

క్యూ4లో రూ. 906 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 906 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 903 కోట్లు ఆర్జించింది. ఇందుకు పెన్షన్ ప్రొవిజన్లు కారణమయ్యాయి. నికర వడ్డీ ఆదాయం 15 శాతం ఎగసి రూ. 2,195 కోట్లను తాకింది. 20 శాతం రుణ వృద్ధి ఇందుకు సహకరించగా.. నికర వడ్డీ మార్జిన్లు 3.36 శాతం నుంచి 3.21 శాతానికి నీరసించాయి. పెన్షన్లకు రూ. 162 కోట్ల ప్రొవిజన్లు చేపట్టింది. ఇక పూర్తి ఏడాదికి బ్యాంక్ రూ. 3,720 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022–23లో రూ. 3,010 కోట్లు మాత్రమే నమోదైంది. ఈ ఏడాది(2024–25) 18 శాతం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. తాజా స్లిప్పేజీలు రూ. 436 కోట్ల నుంచి రూ. 352 కోట్లకు తగ్గాయి. స్థూల మొండి బకాయిలు 2.13 శాతానికి చేరగా.. కనీస మూలధన నిష్పత్తి 16.13 శాతంగా నమోదైంది. ఎండీ, సీఈవో శ్యామ్ శ్రీనివాసన్ సెప్టెంబర్‌లో బాధ్యతల నుంచి తప్పుకోనున్న నేపథ్యంలో కొత్త చీఫ్ ఎంపికకు బోర్డు కసరత్తు చేస్తున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. అభ్యర్థుల జాబితాలను కొద్ది వారాలలో సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది.

ఫెడరల్ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3.2 శాతం బలపడి రూ. 168 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



భారత మహిళల హాకీ జట్టు కొత్త కెప్టెన్‌గా సలీమా... వైస్ కెప్టెన్‌గా నవ్‌నీత్

ఈ నెలలో బెల్జియం, ఇంగ్లండ్‌లలో జరిగే మహిళల ప్రొ హాకీ లీగ్‌లో బరిలోకి దిగే భారత జట్టును ప్రకటించారు. ఇన్నాళ్లూ కెప్టెన్‌గా వ్యవహరించిన గోల్‌కీపర్ సవితా పూనియాను సారథ్య బాధ్యతల నుంచి తప్పించారు. సవిత స్థానంలో కొత్త కెప్టెన్‌గా జార్ఖండ్‌కు చెందిన 22 ఏళ్ల సలీమా టెటెను నియమించారు. కొత్త వైస్ కెప్టెన్‌గా ఫార్వర్డ్ నవ్‌నీత్ కౌర్‌ను ఎంపిక చేశారు. చీఫ్ కోచ్‌గా హరేంద్ర సింగ్ వ్యవహరిస్తారు.

భారత హాకీ జట్టు: సలీమా టెటె (కెప్టెన్), నవ్‌నీత్ కౌర్ (వైస్ కెప్టెన్), సవితా పూనియా, బిచ్చూదేవి (గోల్‌కీపర్లు), నిక్కీ ప్రధాన్, ఉదిత, ఇషిక, మోనిక, జ్యోతి ఛత్రి, మహిమ, వైష్ణవి ఫాల్కే, నేహా, జ్యోతి, బల్జీత్ కౌర్, మనీషా చౌహాన్, లాల్‌రెమ్‌సియామి, ముంతాజ్ ఖాన్, సంగీత, దీపిక, షర్మిలా దేవి, ప్రీతి దూబే, వందన కటారియా, సునెలితా టొప్పో, దీపిక సోరెంగ్.



అవును... నలుగురు స్పిన్నర్లు ఉండాల్సిందే

టి20 ప్రపంచకప్ జట్టుపై కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్య



ముంబై: వచ్చే నెలలో జరిగే టి20 ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో నలుగురు స్పిన్నర్లు ఉండాలని జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయించిందని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. ఎంపికలో ఐపీఎల్ ప్రదర్శన చాలా పరిమితమని చెప్పాడు. ఇటీవల ప్రకటించిన భారత జట్టులో మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చహల్‌లతో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లకు చోటు దక్కింది. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్ మాట్లాడుతూ 'నలుగురు స్పిన్నర్లు ఎందుకు అవసరమనేది ఇప్పుడే వెల్లడించలేను. కానీ కచ్చితంగా ఉండాలనే అనుకున్నాం. ఇందులో ఇద్దరు ఆల్‌రౌండర్లు (జడేజా, అక్షర్) అవసరమైనపుడు బ్యాటింగ్‌లో ఎదురుదాడికి దిగుతారు. పిచ్, ప్రత్యర్థి జట్లను బట్టి మా 'నలుగురి' ప్రణాళిక జట్టును సమతూకంగా ఉంచుతుంది. మిడిల్ ఓవర్లను సమర్థంగా ఎదుర్కొనేందుకే శివమ్ దూబేలాంటి హిట్టర్‌ను ఎంపిక చేశాం. ఈ ఐపీఎల్‌తో పాటు గతంలో టీమిండియా తరఫున దూబే బాగా ఆడాడు. ఐపీఎల్ కంటే ముందే 70, 80 శాతం జట్టు ఎంపిక కూర్పు జరిగిపోయింది. ఎందుకంటే ఐపీఎల్ ప్రదర్శన ఏరోజుకు ఆరోజు మారిపోతూనే ఉంటుంది. దానినే ప్రామాణికంగా తీసుకోలేం. కేవలం కొన్ని స్థానాల కోసమే లీగ్‌ను పరిగణనలోకి తీసుకున్నాం' అని వివరించాడు. జూన్ 2 నుంచి 29 వరకు అమెరికా, వెస్టిండీస్‌లలో టి20 ప్రపంచకప్ జరుగుతుంది. లీగ్ దశ మ్యాచ్‌లన్నీ భారత్... అమెరికాలోనే ఆడుతుంది. ఆ తర్వాత సూపర్–8 దశ మ్యాచ్‌ల కోసం కరీబియన్ దీవులకు టీమిండియా వెళుతుంది.

మెరిసిన షఫాలీ: భారత్‌దే టి20 సిరీస్



షఫాలీ

సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా మూడో విజయంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే టి20 సిరీస్‌ను 3–0తో సొంతం చేసుకుంది. గురువారం జరిగిన మూడో టి20 మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. తొలుత బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. ఓపెనర్ దిలారా అక్తర్ (27 బంతుల్లో 39; 5 ఫోర్లు), కెప్టెన్ నిగర్ సుల్తానా (36 బంతుల్లో 28; 1 ఫోర్) మెరుగ్గా ఆడారు. భారత బౌలర్లలో రాధా యాదవ్ (2/22), శ్రేయాంక (1/25), రేణుక (1/25), పూజ (1/26) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు 18.3 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షఫాలీ వర్మ (38 బంతుల్లో 51; 8 ఫోర్లు), స్మృతి మంధాన (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 91 పరుగులు జోడించడంతో విజయం మరింత సులువైంది. ఈ నెల 6న నాలుగో టి20 కూడా ఇదే వేదికపై జరుగనుంది.

క్వార్టర్ ఫైనల్స్‌లో ముగిసిన భారత్ పోరు



లక్ష్య సేన్

చెంగ్డూ: థామస్ కప్ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 1–3తో 10 సార్లు చాంపియన్ చైనా చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 21–15, 11–21, 14–21తో షి యుకి చేతిలో... రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి 15–21, 21–11, 12–21తో లియాంగ్ వె కెంగ్–వాంగ్ చాంగ్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 13–21, 21–8, 21–14తో లి షి ఫెంగ్‌పై గెలుపొందాడు. నాలుగో మ్యాచ్‌లో సాయిప్రతీక్–ధ్రువ్ కపిల 10–21, 10–21తో హి జి టింగ్–రెన్ జియాంగ్ యు చేతిలో ఓటమి పాలవ్వడంతో భారత పరాజయం ఖరారైంది. ఉబెర్ కప్ మహిళల టీమ్ క్వార్టర్ ఫైనల్లో ద్వితీయ శ్రేణి క్రీడాకారిణులతో బరిలోకి దిగిన భారత జట్టు 0–3తో జపాన్ చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో అష్మిత 10–21, 22–20, 15–21తో అయా ఒహోరి చేతిలో... ప్రియ–శ్రుతి మిశ్రా 8–21, 9–21తో నామి మత్సుయామ–చిహారు షిదా చేతిలో... ఇషారాణి 15–21, 12–21తో ఒకుహారా చేతిలో ఓడిపోయారు.

ఓటమి అంచుల నుంచి... ఒక పరుగు విజయం వరకు...

- సన్‌రైజర్స్ హైదరాబాద్ అనూహ్య గెలుపు
- పరుగు తేడాతో ఓడిన రాజస్తాన్ రాయల్స్
- నితీశ్ కుమార్ రెడ్డి మెరుపులు ● రాణించిన భువనేశ్వర్

సన్‌రైజర్స్‌పై 202 పరుగుల లక్ష్యఛేదనలో చివరి 3 ఓవర్లలో రాజస్తాన్ రాయల్స్‌కు 27 పరుగులు కావాలి. చేతిలో 6 వికెట్లు ఉన్నాయి. ఎలా చూసినా ఇది సులువుగా అందుకోగలిగేదే. కానీ ఇక్కడే హైదరాబాద్ బౌలింగ్ అనూహ్యంగా పుంజుకుంది. ప్రత్యర్థి బ్యాటర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టింది. 18వ ఓవర్లో నటరాజన్ 7 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీయగా, 19వ ఓవర్లో కమిన్స్ 7 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం కాగా, 5 బంతుల్లో 11 పరుగులు వచ్చాయి. ఆఖరి బంతికి 2 పరుగులు చేయాల్సి ఉండగా, భువనేశ్వర్ వేసిన చివరి బంతిని ఆడలేక పావెల్ వికెట్ల ముందు దొరికిపోయాడు. దాంతో ఉప్పల్ మైదానం హోరెత్తింది. గెలిచే మ్యాచ్‌ను చేజేతులా రాయల్స్ కోల్పోగా, ఓటమి అంచుల నుంచి హైదరాబాద్ ఒక పరుగుతో గట్టెక్కింది.



నితీశ్ కుమార్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉత్కంఠభరిత పోరులో చివరకు హైదరాబాద్ పైచేయి సాధించింది. ఉప్పల్ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఒక పరుగు తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి (42 బంతుల్లో 76 నాటౌట్; 3 ఫోర్లు, 8 సిక్సర్లు), ట్రావిస్ హెడ్ (44 బంతుల్లో 58; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా... హెన్రిచ్ క్లాసెన్ (19 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం రాజస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 200 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (49 బంతుల్లో 77; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (40 బంతుల్లో 67; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. భువనేశ్వర్‌కు (3/41) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

నితీశ్ ధమాకా...

పవర్‌ప్లే ముగిసేసరికి 2 వికెట్లకు 37 పరుగులు... ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ చేసిన అత్యల్ప పరుగులివి. దీనిని చూస్తే రైజర్స్ 200 పరుగులకు చేరగలదని ఎవరూ ఊహించలేదు. అభిషేక్ శర్మ (12), అన్‌మోల్‌ప్రీత్ (5) విఫలం కాగా... హెడ్ అప్పటికి 17 బంతుల్లో 18 పరుగులే చేసి ఇబ్బంది పడుతున్నాడు. అయితే ఆ తర్వాత పరిస్థితి మారింది. చహల్ ఓవర్లో వరుసగా 6, 6, 4 బాది హెడ్ జోరు ప్రదర్శించగా... నితీశ్ తన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. 10 ఓవర్ల తర్వాత స్కోరు 75 పరుగులకు చేరింది. 37 బంతుల్లో హెడ్ హాఫ్ సెంచరీ పూర్తయింది. చహల్ వేసిన 13వ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లతో నితీశ్ చెలరేగిపోయాడు. ఎట్టకేలకు హెడ్‌ను బౌల్డ్ చేసి ఆవేశ్ ఈ జోడీని విడదీయగా, కొద్ది సేపటికి 30 బంతుల్లో నితీశ్ అర్ధసెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఆఖరి 5 ఓవర్లలో రైజర్స్ బ్యాటర్లు నితీశ్, క్లాసెన్ మరింత చెలరేగడంతో 70 పరుగులు వచ్చాయి. అశ్విన్ ఓవర్లో వరుసగా 2 సిక్స్‌లు కొట్టిన నితీశ్... ఆవేశ్ ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టాడు. మరోవైపు చహల్ ఓవర్లో వరుసగా 2 సిక్స్‌లు బాదిన క్లాసెన్... చివరి నాలుగు బంతుల్లో 14 పరుగులు రాబట్టి స్కోరును 200 పరుగులు దాటించాడు.

కీలక భాగస్వామ్యం...

భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లోనే రెండో బంతికి బట్లర్ (0), ఐదో బంతికి సామ్సన్ (0) అవుట్... రైజర్స్ పైచేయి! కానీ 7 పరుగుల వద్ద యశస్వి ఇచ్చిన క్యాచ్‌ను వదిలేసిన కమిన్స్... 24 పరుగుల వద్ద పరాగ్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేసిన అభిషేక్... అంతే... ఆట రాజస్తాన్ వైపు మొగ్గింది. 1 పరుగు వద్దే 2 వికెట్లు కోల్పోయిన తర్వాత యశస్వి, పరాగ్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. వికెట్లు పడినా వీరిద్దరు ధాటిగా ఆడి పరుగులు రాబట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 60 పరుగులకు చేరింది. ఇద్దరూ బ్యాటర్లు రైజర్స్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా దూసుకుపోయారు. ఒకే ఓవర్లో యశస్వి 30 బంతుల్లో, ఆ తర్వాత 31 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే విజయం వైపు దూసుకుపోతున్న దశలో వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగడంతో ఉత్కంఠ పెరిగింది. ఆ తర్వాత కీలక సమయాల్లో మరో మూడు వికెట్లు చేజార్చుకున్న రాయల్స్ ఓటమిని ఆహ్వానించింది.



భువనేశ్వర్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) ఆవేశ్ 58; అభిషేక్ (సి) జురేల్ (బి) ఆవేశ్ 12; అన్‌మోల్‌ప్రీత్ (సి) యశస్వి (బి) సందీప్ 5; నితీశ్ కుమార్ రెడ్డి (నాటౌట్) 76; క్లాసెన్ (నాటౌట్) 42; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 201.

వికెట్ల పతనం: 1–25, 2–35, 3–131. బౌలింగ్: బౌల్ట్ 4–0–33–0, అశ్విన్ 4–0–36–0, ఆవేశ్ 4–0–39–2, సందీప్ శర్మ 4–0–31–1, చహల్ 4–0–62–0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (బి) నటరాజన్ 67; బట్లర్ (సి) జాన్సెన్ (బి) భువనేశ్వర్ 0; సామ్సన్ (బి) భువనేశ్వర్ 0; పరాగ్ (సి) జాన్సెన్ (బి) కమిన్స్ 77; హెట్‌మైర్ (సి) జాన్సెన్ (బి) నటరాజన్ 13; పావెల్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 27; జురేల్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 1; అశ్విన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 200. వికెట్ల పతనం: 1–1, 2–1, 3–135, 4–159, 5–181, 6–182, 7–200. బౌలింగ్: భువనేశ్వర్ 4–0–41–3, జాన్సెన్ 4–0–44–0, కమిన్స్ 4–0–34–2, నటరాజన్ 4–0–35–2, ఉనాద్కట్ 2–0–23–0, నితీశ్ కుమార్ రెడ్డి 1–0–12–0, షహబాజ్ 1–0–11–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	10	8	2	16	0.622
కోల్‌కతా	9	6	3	12	1.096
లక్నో	10	6	4	12	0.094
హైదరాబాద్	10	6	4	12	0.072
చెన్నై	10	5	5	10	0.627
ఢిల్లీ	11	5	6	10	-0.442
పంజాబ్	10	4	6	8	-0.062
గుజరాత్	10	4	6	8	-1.113
ముంబై	10	3	7	6	-0.272
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × కోల్‌కతా
వేదిక: ముంబై
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంట వేయకున్నా పరిహారం!



- కరువు, వరదలతో సాగు చేయకపోయినా బీమా వర్తింపు
- రైతుకు ప్రయోజనం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం
- ఇకపై రైతు యూనిట్‌గా పీఎంఎఫ్‌బీవై అమలు
- మార్గదర్శకాల ఖరారులో వ్యవసాయ శాఖ నిమగ్నం
- ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని ఇప్పటికే నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: కరువు, వరదలు తదితర కారణాలలో పంటలు సాగు చేయని రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్‌ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను వచ్చే వానాకాలం సీజన్‌ నుంచి పునరుద్ధరించనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే పంట నష్టం జరిగిన సింగిల్‌ రైతుకు కూడా పరిహారం ఇవ్వనున్నారు. అంటే రైతు యూనిట్‌గా రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేస్తారు. వ్యవసాయాధికారులు ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

అరెకరా రైతుకు కూడా పరిహారం

తెలంగాణలో పీఎంఎఫ్‌బీవైని పునఃప్రారంభించాలని కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ పథకంలో ఉన్న వెసులుబాట్లను వినియోగించుకోవాలని నిర్ణయించింది. పథకం అమలు, మార్గదర్శకాలపై ఇప్పటికే కంపెనీలతో చర్చించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్‌ గోపి ఈ పథకాని సంబంధించిన అధికారులతో భేటీ అయ్యారు. వాస్తవానికి గతంలో ఆనాటి వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కూడా రైతు యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని పలుమార్లు ప్రతిపాదించారు. కానీ పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాల్లో ఆ మేరకు వెసులుబాటు లేకపోవడంతో అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు పథకంలో మార్పులు జరగడంతో వాటిని వినియోగించుకు నే క్రమంలో రైతు యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో గ్రామం లేదా మండలం యూనిట్‌గా పంటలను బట్టి పథకం ఉండేది. అంతేగాక సంబంధిత యూనిట్‌లో ఉన్న పంటల్లో 33 శాతం దెబ్బతింటేనే బీమా వర్తించేది. అంటే యూనిట్‌లో వందెకరాలుంటే..33 ఎకరాలు దెబ్బతింటేనే రైతులకు పరిహారం అందజేసేవారన్నమాట. తాజా నిర్ణయంతో ఒక ఎకరా, అరెకరా ఉన్న ఒక్క రైతుకు కూడా నష్టపరిహారం అందనుంది. అయితే ఇందుకు బీమా కంపెనీలు ఎక్కువ ప్రీమియం వసూలు చేస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

బీమా పరిధిలోకి 50 లక్షల మంది రైతులు!

రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులు ఉన్నారు. గతంలో పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నప్పుడు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది మాత్రమే బీమా చేయించేవారు. నేరుగా పంటల బీమా చేసుకోవడానికి రైతులు ముందుకు రాకపోవడంతో.. బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకునే రైతులతో తప్పనిసరిగా పంటల బీమా చేయించేవారు. అంటే పంట రుణం ఇచ్చేటప్పుడే బీమా ప్రీమియాన్ని మినహాయించుకొని మిగతా డబ్బులు రైతులకు ఇచ్చేవారన్నమాట. తర్వాత 2016 వానాకాలం సీజన్‌ నుంచి దేశ వ్యాప్తంగా పీఎంఎఫ్‌బీవై అమలులోకి వచ్చింది. 2016–17లో 8.87 లక్షల మంది మంది రైతులు 7.33 ఎకరాలకు ఫసల్‌ బీమా యోజన కింద బీమా చేయించగా, 1.34 లక్షల మంది రైతులు రూ.111.33 కోట్ల పరిహారం పొందారు. తదనంతర కాలంలో ఈ పథకం వల్ల రైతులకు జరిగే లాభం కంటే బీమా కంపెనీలకే ఎక్కువ ప్రయోజనం జరుగుతోందని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భావించింది. రైతుల్లో కూడా కొంత వ్యతిరేకత ఏర్పడింది. ఈ పథకంతో భారీగా లాభాలు గడిస్తున్నప్పటికీ ప్రీమియం ధరలను పెంచుకుంటూ పోవడమే ఇందుకు కారణం. ఉదాహరణకు 2018లో పెసరకు ఆదిలాబాద్‌, ఆసిఫాబాద్‌ జిల్లాల్లో హెక్టారుకు రూ.24,165 ప్రీమియం, మిరపకు అత్యధికంగా రూ.38,715 ప్రీమియం ఖరారు చేశారు. మరోవైపు జిల్లా జిల్లాకు ప్రీమియం ధరలు మారుతుండేవి. ఈ పరిస్థితుల్లోనే రైతుల్లో ఆసక్తి కొరవడింది. ఇప్పుడు బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించారు. దీనివల్ల బీమా పరిధిలోకి వచ్చే రైతుల సంఖ్య 50 లక్షలు ఉంటుందని వ్యవసాయ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మేరకు ప్రీమియం రూ.2,500 కోట్ల మేరకు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. పంటల బీమాపై ఇప్పటికే రాష్ట్ర స్థాయి కోఆర్డినేషన్‌ కమిటీ ఏర్పాటైంది.

విత్తడం నుంచి కోత వరకు..

ఈ పథకం అమలైతే పంట విత్తడం నుంచి కోత వరకు, దిగుబడి కోల్పోయి నష్టం జరిగే పరిస్థితుల్లోనూ బీమా వర్తిస్తుంది. కరువు, తుపాన్లు, వరదలు, తెగుళ్ల దాడి, కొండచరియలు విరిగిపడటం, పిడుగుపాటుతో అగ్నిప్రమాదం, వడగళ్లు తదితర కారణాలతో నష్టపోయిన పంటలకు కూడా పరిహారం ఇస్తారు. లోటు వర్షపాతం లేదా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా విత్తనాలు నాటినా మొలకెత్తకుంటే పరిహారం చెల్లిస్తారు. సాధారణ దిగుబడిలో 50 శాతం కంటే తక్కువగా ఉన్నా బీమా వర్తిస్తుంది. పంట కోత అనంతరం గరిష్టంగా రెండు వారాల వరకు వడగళ్ల వాన, తుపాను, అకాల వర్షాల కారణంగా పంటకు నష్టం జరిగినా పరిహారం అందుతుంది. అడవి జంతువుల దాడి కారణంగా జరిగిన పంట నష్టానికి కూడా పరిహారం ఇస్తారు.



మరమ్మతుల అనంతరం బోరు నుంచి వస్తున్న నీళ్లు

హడావుడిగా బోరుకు మరమ్మతులు

- సరసనపల్లిని సందర్శించిన అధికారులు

కొత్తగూడ(మహబూబాబాద్‌): తాగునీటి సమస్య పరిష్కరించేవరకు పార్లమెంట్‌ ఎన్నికల్లో ఓటు వేయబోమని తీర్మానించిన సరసనపల్లి గ్రామంపై సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మహబూబాబాద్‌ జిల్లా కొత్తగూడ మండలం సరసనపల్లి గ్రామాన్ని గురువారం పంచాయతీరాజ్‌, మిషన్‌ భగీరథ అధికారులు సందర్శించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న బోరుకు వెంటనే మరమ్మతులు చేసి నీరు అందించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.